TIGHT BINDING BOOK

UNIVERSAL
LIBRARY
OU_204835
UNIVERSAL
LIBRARY

సేవాశ్రమము

ద్వితీయ భాగము

శ్రీమతి దామెర్లభ్రమరాంబ
శ్రీమతి కొండ విజయలక్ష్మీబాయి

సరస్వతీగ్రంథమండలి
రాజమహేంద్రవరము

సర్వస్వామ్యములు
ప్రకాశకునివి

Saraswathi Power Press, Rajahmundry
Printed and Published by
A. Lakshmanaswamy Naidu.
1st Edition :—1933

ద్వితీయభాగము

నిజామురాష్ట్రిమం దుండు ఆంధ్రసోదరుల సౌకర్యార్థమై దక్షిణ హైద్రా
బాదు నెం 544/566 రు గృహమందు నామపల్లి గౌరీశంకరవర్మ ఆండుకో, ఆంధ్ర
బుక్కు-డిపోవారిని మా ప్రతినిధులుగా ఏర్పరచినాము. కావున నిజామురాష్ట్రి
వాసులు కావలసిన పుస్తకములను వారికి వ్రాసి తెప్పించుకొనవచ్చును.

ప్ర కా శ కు డు.

విజ్ఞప్తి

"సేవాశ్రమము" అను నీనవల, సుప్రసిద్ధ హిందీనవలాకారకులగు శ్రీయుత ప్రేమచంద్‌గారి "సేవాసదనము" అను నవల కనువాదము.

సేవాసదనమును తెనుగులో అనువదించుటకు దయతో మా కనుమతి నిచ్చిన శ్రీ ప్రేమచంద్‌గారికి మా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.

మరియు నీనవల ననువదించుటలో మాకు ప్రోత్సాహ మొసర్చిన శ్రీయుత మరువాడ ఆంజనేయులుగారికిని, కల్లికోట కళాశాల ఆంధ్రోపాధ్యాయులగు కావ్యతీర్థ శ్రీ నేమాని నరసింహ శాస్త్రిగారికిని, మా కృతజ్ఞతాపూర్వకవందనములు.

ఇట్లు

విధేయురాండ్రు,

వామెర్ల భ్రమరాంబ

కొండ విజయలక్ష్మీబాయి

పీఠిక

శ్రీమతి దామెర్ల భ్రమరాంబగారును, శ్రీమతి కొండ విజయ లక్ష్మీబాయిగారును హిందీభాషనుండి తా మాంధ్రీకరించిన 'సేవా శ్రమ' మను నవలకుఁ బీఠిక వ్రాయుమని నన్నుఁ గోరిరి. ఇట్లు కోరుట నన్ను మిక్కిలి గౌరవించుట యని నేను భావించెదను. ఏలయన, నిట్టి గ్రంథములకుఁ బీఠికలు వ్రాయువా రాంధ్రదేశమున నసేకులు గలరు. స్వల్పప్రయత్నముతో నసేకులు లభించుచుండఁగా దూరమున నున్న న న్నిపనియందు నియోగించుట నాభాగ్య మని చెప్పక తప్పదు. ఇట్లు వారు కోరుటకుఁ నాయందుఁ గల గుణవిశేషము కారణము గాదు. వారికి నాయందుఁ గల పక్షపాతమే ముఖ్యకారణము. ఈ పక్షపాతమునకు హేతువు లేకపోలేదు. రాజమహేంద్రవరములో దామెర్లవారి కుటుంబమునకును, నాకును రమారమి 45 సంవత్సరము ల నుండి యత్యంతస్నేహ మొకటి గలదు. వారికుటుంబమునకుఁ జిరపరిచితుఁడ నగుటచేత శ్రీయుత భ్రమరాంబగారును, నామెతోఁడి సఖ్యసంబంధ ములచేత విజయలక్ష్మీబాయిగారును నా కీగౌరవము గలిగించిరి. ఇది వఱకు నేను గొంపఱమిత్రుల గ్రంథములకుఁ బీఠికలు వ్రాసి యిచ్చితిఁ గాని, యీపీఠిక వ్రాయునప్పుడు గలిగిన యానందము నా కీవఱ కెన్నఁడుఁ గలుగలేదు. తత్కారణ మిది. ఆంధ్రదేశనారీమణులు పురుషులవలెనే నవీనపద్ధతులమీఁద నాంధ్రభాష నభ్యసించి, పాండి త్యము సంపాదించి, దేశోపకారకములై భావోన్నత్యము గలిగించు నట్టి సద్గ్రంథముల వ్రాయునట్టి మహాపర్వదినము లెప్పుడు వచ్చునా యని యాసుదినముల నిమిత్తమై నే నెదురుచూచుచుంటిని. ఈ ఈకోరికతోడనే నా గురువు లగు శ్రీ కందుకూరి వీరేశలింగము

పంతులుగారు గూడ స్త్రీవిద్యకు నమితప్రోత్సాహ మొసఁగిరి. ఆంధ్ర దేశమాత కడుపు చల్లఁగాఁ గొంతకాలమునుండి కవనమునందు, వచన రచనమునందుఁ బ్రౌఢతనముఁ జూపెడి నాఁడుబిడ్డలను గడుపు చల్లఁగాఁ గనుచున్నది. ఆయువతీమణుల గ్రంథము లాంధ్రజనమనో రంజకములై, వీనుల విందులై, కనుల పండువులై, హస్తాలంకారము లై గృహభూషణములై విరాజిల్లుచుండుట దేశమునొక్క యదృష్టము. ఈగ్రంథము స్త్రీరత్నములు రచియించిన దగుటచేతను, నా స్త్రీరత్నములు నాకుటుంబములోనివంటివారే యగుటచేతను, నా చిర కాల మనోరథమును సిద్ధి నొందించినవారిలో వీరుగుఁ జేరుటచేతను, నే నీపీఠిక సంతోషపూర్వకముగా వ్రాసితిని.

ఈనవల యాంధ్రీకరణ మైనను రసపుష్టి గలిగి, స్వకపోల కల్పితమైన గ్రంథమువలెనే హృదయంగమమై యున్నది. శైలియు మనోహరముగా నున్నది. 'పురంధ్రీణాం చేతః కుసుమసుకుమారం హి భవతి' అని భవభూతి చెప్పియున్నాఁడు. స్త్రీల మనస్సులు పూవులు వలె మెత్తని వని దీనియర్థము. వారి హృదయములువలెనే వారి మాటలును దేనిలోఁ తేటలవలెఁ దియ్యనై యుండు టాశ్చర్యముగాదు. ఈ నవలయందలి మాటల పొందికలు మిక్కిలి యందములై మధుర ములై పాఠకమహాశయులకు నానందము గలిగించు ననుట యతిశయోక్తి గాదు. వీరు గ్రంథ మంతయు గ్రాంథికశైలినే వ్రాసిరి గాని, పలుతావుల సంభాషణలసినచోటఁ గలుపక, వాక్యమధ్యములం దచ్చు లచ్చులల్లె యుంచుట కేమికారణమో తెలియదు. రెండవ కూర్పునం దైన వారు సవరించిన మిక్కిలి భాగుండును. రసపూరితమై భావగర్భితమైన యీగ్రంథ మాంధ్రలోక మందలి పాఠకమహాశయు లకు సర్వవిధముల నానందకరమై యుండు నని తలంచెదను. ఈ కాంతామణు లిరువురు నింక నిట్టి గ్రంథము లనేకములు రచియించి

మాతృభాషాసేవయుఁ దన్మూలమున నాంధ్రభాషాసేవయుఁ జేసి, తోడి పడంతులకు మార్గదర్శినులై కృతకృత్యు లగుదురు గాక యనియు సర్వశ్రేయోదాయకుఁ డగు పరమేశ్వరుఁడు వీరి యుద్యమమును గొన సాగించుగాక యనియుఁ గోరుచున్నాను.

రాజమహేంద్రవరము,
29—2—33.

ఇట్లు,
చిలకమర్తి లక్ష్మీనరసింహము.

కళ్యాణపురపు మ్యునిసిపాలిటీయందు పదునెనమండ్రు సభ్యులుకలరు. వీరిలో చదువుకొన్న వారి సంఖ్య ఎక్కువగా నుండుటవలన వేశ్యలను ఊరిబైటకు పంపివేయు తీర్మానము నెగ్గునని శర్మకు చాల నమ్మిక ముగా నుండెను. ఆయన ఇదివరకే సభ్యుల నందరను కలసుకొని వారికి తీర్మానము విషయమై నచ్చచెప్పి వారి సంశయముల నన్నిటిని దీర్చెను. కాని ఈ సభ్యులయందు తనకు వ్యతిరిక్తులు గలరని ఆతడు భయపడుచుండెను. ఈ వ్యతిరేకులు గొప్ప వ్యాపారస్థులు, ధనవంతులు పలుకుబడి కలవారు. అందువలన వారు మిగిలిన సభ్యులను కూడ తమవైపున కెక్కడ త్రిప్పుకొందురో యని శర్మ భీతిల్లు చుండెను హిందూసభ్యులయందీ విరోధిపక్షమునకు బలభద్రరావు నాయుడు నాయకుడు. మ్యున్సిపాలిటీయందు నలుగురు మహామ్మదీయ సభ్యులు కూడ కలరు. వీరికి హాజీసాహేబు నాయకుడు. ఈ విషయమై నారాయణదాసు పనిచేయుచున్నంతవరకు వీ రెవ్వరును ధకలు పుచ్చుకొనలేదు. కాని శర్మయు మరికొందరు మ్యున్సిపల్ సభ్యులును ఈ యుద్యమమునందు చేరగనె ఉద్యమము విరోధులకు కంటకముగా నుండెను. ఈ విషయమైన తీర్మానము త్వరగానే వచ్చునని తలచి ప్రతి పక్షులు తమ పక్షమును బలపరుచుకొను ప్రయత్నములో నుండిరి. ఒకనాడు హాజీసాహేబు ఈ విషయమై మాట్లాడుటకు మిగిలిన ముగ్గురు సభ్యులను కలసుకొనెను. హాజీ సాహేబునకు చాల పలుకుబడి కలదు. ఆతడు వారి సంఘమునకు నాయకుడు. మౌలానా తేగాలి పెద్దమసీదునకు ధర్మకర్త. న్యాయ ధర్మములు కలవాడు. మున్షీ అబ్దుల్ వహా ధాన్యపుమరలకు నూని

మరలకు యజమాని. పెద్దపెద్ద పాపులు కూడ కలవు. హాకీమ్ శహరత్ ఖాను సుప్రసిద్ధవైద్యుడు. ఈతని మనస్సు చాల ఉదారమై నది. మంచి ఆలోచనకలవాడు.

హాజీ—మ్యునిసిపాలిటీలో నొక క్రొత్త తీర్మానమును పెట్టబోవు చున్నారు. విన్నారా? వీరికి మంచి విషయమే దొరకినది. పిచుక పైని బ్రహ్మాస్త్రము వేసిన ట్లున్నది. ఈ విషయమై మనము చాల పనిచేయవలెను. హిందువులు వారి వేదములందు వేశ్యల కనుకూల ముగ అనేక ఉదాహరణలను జూపగలరు. కనుక అటువంటివారిని జేరదీసిన మన పక్షము బలమగును!

అబ్దు. వ—చెడ్డవారిని శిక్షించుటకు మంచివారిని రక్షించుటకు మన మెవ్వరము? అది అల్లాపని. ఈ తీర్మానము చాల అన్యాయ ముగ నున్నది. మనము ప్రయత్నముచేసి వీరిని ఏలాగైనను ఓడించి వేయవలెను.

హా. శ—ఈ తీర్మానము నాకు చాల సమ్మతముగ నున్నది. నిజముగ నాకే అధికారమున్న ఈ వేశ్యలను హిందూదేశమునుండే తగిలివేయుదును. నిశ్చయముగ వీరు సంఘమునకు వేరుపురుగు వంటివారు. కలరామనుష్యులను రెండుగంటలలో జంపును. ప్లేగు రెండు రోజులలో జంపును. కాని వీరు మనుష్యులను పీల్చి, పీల్చి పిప్పిచేసి మరీ చంపుదురు. ముస్లీంలబ్దుల్ వహాగారు, వేశ్యలు సంఘ మునకు అలంకారమువంటివారని తలచుచున్నారు. కాని నిజముగ వీరు కాలసర్పములవంటివారని నా యుద్దేశము. వారి చూపుల యందును, మాటలయందును కూడ విష మున్నది. ఎంతమంది కుల స్త్రీలు వీరివలన నాశనమగుచున్నారు? ఎంతమంది జమీందా రులు వీరివలన ఫకీరు లగుచున్నారు! ఈ వేశ్యలలో నొందరు మన వారు కూడ నున్నారని చెప్పుటకు చాల విచారముగా నున్నది.

మూ-లే—ఆ వేశ్యలు తాము ముసల్మానులమని చెప్పుకొనుట తప్పు కాదుకాని ఇస్లామువారిని మంచిమార్గములోనికి దెచ్చుటకు ప్రయత్నించకపోవుట విచారకరము. ఏ కారణము వలననైనను నొక స్త్రీ చెడువాడుక పడిన ఇస్లామువారిని ఎన్నటికిని ఉపేక్షించదు. మనలో మహానుభావులు కొందరు వారిని చేరదీసి డబ్బు పెట్టుమంటుటవలన వారు మత్తెక్కి తమంతవారు లేరని విఱ్ఱివీగుచున్నారు. వీరు డబ్బిచ్చి అట్టివారిని చేరదీయునియెడల వారికి మత్తుదిగి, తమదుర్దశకు తాము చేసిన పాపములకు దుఃఖింపకమానరు. కాని ఎంత పశ్చాత్తాపపడిన ఏమి లాభము? తిరిగి వారిపిల్లలను వేశ్యలనుజేసి వారివలన తమజీవనోపాధిని కల్పించుకొనుట తప్ప వారికి వేరుమార్గములేదు. ఈ విధముగ అంతులేకుండ ఎప్పటికినీ ఆ లాగున జరుగుచునే యుండును. కాని ఆ పిల్లలకే సంసారులకువలె పెండ్లిండ్లుచేసిన ఈ చెడువృత్తి అక్కడితో నశించి దేశము బాగుపడగలదు. ఇతరప్రయత్నము లెన్ని చేసినను ఏమియు, లాభములేదు.

హాజీ—దయచేసి బాగుగ నాలోచించి మాట్లాడండి. అది ఎన్నటికిని జరుగని పని.

ఈ విధముగ ఎవరికి తోచినట్లు వారు మాట్లాడిరి. అప్పటికప్పుడే అర్ధరాత్రి యయ్యెను. అక్కడితో ఎవరియిండ్లకు వారు వెళ్ళిపోయిరి. ఈ చర్చవలన విశేషలాభమేమియు కలుగలేదు. వారు తమమనస్సునందే పట్టుమును ఆ మోదించుటకు స్థిరపరచుకొని వచ్చిరో ఆ పట్టుమునే అవలంబించి మాట్లాడిరి. ఇదివరకు హాజీసాహేబునకు వారందరు తనపట్టుమునే చేరెదరని నమ్మకముగా నుండెను కాని ఇప్పుడా విశ్వాసము పోయెను.

ఈ ప్రస్తావనకు విరోధులైన హిందూసభ్యులు ముసల్మానులీ విషయమై చర్చించుచున్నారని విని మరి పర్యవసానమును వినుటకు

చెవులు నిక్కపొడుచుకొని నిరీక్షించుచుండిరి. కాని వారికి ముసల్మానుల యాశ ఒక్కసారి నిరాశయయ్యెను. మిగిలిన సభ్యులందరు పదునలుగురు. భలభద్రరావు నాయుడు చైర్మెన్, డాక్టర్ శ్యామలరావు వైస్‌చైర్మెన్, సుబ్బయ్యసెట్టి, నరసింహం శ్రేష్టి వ్యాపారస్థులలో పెద్దలు. కృష్ణశర్మ, బారిష్టర్ సివరామ్, సూర్యారావు, రామారావు వకీళ్లు. ప్రొఫెసర్ శంఖరరావు కాలేజీప్రిన్సిపాలు. భగవంతరావు కంట్రాక్టరు. రాజారామదేవు జమీందారుడు. ప్రభాకరరావు "దేశసేవ" పత్రికాసంపాదకుడు. వెంకటాచారి ఆయుర్వేదవైద్యుడు. జేమ్సు వెంకటరావు ఇంగ్లీషు కంపెనీల ఏజెంటు. బలభద్రరావు నాయుడు రిటైర్డు డిప్యూటీకలక్టరు. ఆతనికి చాల భూవసతియు, వడ్డీవ్యాపారమును కలవు. సుబ్బయ్యసెట్టి కాపట్టణమునందు చాల బట్టలకొట్లును, వేరుశెనగ వ్యాపారమును కలవు. నరసింహం శ్రేష్టికి పెద్దబజారులో చాలమేడలును, వడ్డీవ్యాపారమును కలవు. ఈ ముగ్గురు మహానుభావులును, సూర్యారావును కృష్ణశర్మ తీర్మానమునకు వ్యతిరేకులు. ప్రభాకరరావు, శంఖరరావు, శివరామ్, రామారావు ఈ తీర్మానమునకు అనుకూలురు. శ్యామలరావు, రామదేవు, జేమ్సు వెంకటరావు ఏ పక్షమున చేరెదరో నిశ్చయములేదు. ఇరుపక్షముల వారును కూడ వీరిసహాయమును ఆశించుచుండిరి. ఇరుపక్షముల జయాపజయములును వీరియందే ఆధారపడియుండెను. వెంకటాచారి తాను ఏ పక్షమునను జేరనని స్పష్టముగా జెప్పివేసెను. భగవంతరావు సుబ్బయ్యసెట్టి ధనసహాయముపైని ఆధారపడియుండెను. గనుక ఆతడు వారిపక్షములోని వాడే.

కృష్ణశర్మ పెండ్లినుండి ఇంకను తిరిగి రాలేదు. బలభద్రరావు నాయుడు తనపక్షమును బలపరచుకొనుట కిదియే మంచిసమయమని తలచి నీసభ్యుల నందర నొకనాడు తనఇంటికి ఆహ్వానించెను. దీని

ముఖ్యోద్దేశ్యము డాక్టర్, దేవుప్రభృతులను తనవైపునకు త్రిప్పుకొనుటకే.

ప్రభాకరరావునకు ముసల్మానులన్న బద్ధవిరోధము. కనుక సీతీర్మానమునందు హిందూముసల్మానుల వివాహాలకు సంబంధముకలదని చెప్పి, ఆతనిని తమవైపునకు త్రిప్పుకొనుటకు నాయుడు పక్షమువారు ప్రయత్నించుచుండిరి.

నర-శే—మన ముసల్మాను సోదరులీ విషయమ్మై చాల ఉదారతను జూపించుచున్నారు. కాని దీనియందొక గూఢమైన రహస్యమున్నది. "ఒక దెబ్బతో రెండుపనులు" అనుమార్గమును వారవలంబించి యున్నారు.

సు-సె—నాకు పొలిటిక్సు (రాజకీయవిషయములు) అన్న నిష్టము లేదు. అందువలననే నే నటువైపునకు వెళ్ళను. మ్యూనిసిపాలిటీలో వడ్డీవ్యాపారము విషయమై ప్రస్తావన వచ్చినప్పుడు ప్రభాకరరావు దానికి వ్యతిరేకముగ పనిచేసెను. సూర్యారావు దాని గురించి వివరించి చెప్పుచు, ప్రస్తుత తీర్మానమునకును, ఆర్థిక విషయమునకును సంబంధము జూపుచు ప్రభాకరరావును తమ పక్షమునకు త్రిప్పుకొనుటకు ప్రయత్నించుచుండెను. ప్రభాకరరావు విగతాసుడై, "వీరునన్ను గండరగోళ స్థితిలో బెట్టుచున్నారు. నన్నుద్ధరించు భారము మీది" యని చెప్పుచున్నట్లు బారిష్టర్ శివరామ్‌వైపు జూచెను. శివరామ్ నిర్భయుడు. ఖరాఖండీ మనిషి. అతడు సుబ్బయ్యశెట్టి, సూర్యారావులవైపు జూచుచు మీరొక సంఘ విషయమును హిందూ ముసల్మానుల వివాదములలోనికి మార్చ జూచుట చాల విచారముగా నున్నది. వడ్డీ తీర్మానము వచ్చినప్పుడు కూడ నిటువంటి విభేదమునే కల్పించినారు. ఇటువంటి మతవిషయమును వివాదములలోనికి దింపుటవలన హిందూ సాహుకారులకు లాభకరండ

వచ్చునేమో కాని ఇందువలన జాతికెంత హానికలుగునో చెప్పనలవి కాదు. ఈ తీర్మాన మామోదింపబడినచో హిందూసాహుకారుల కధిక నష్టము కలుగవచ్చును. కాని ముసల్మానులకు కూడ దీని డక్కా తగులకమానదు. పెద్దబజారులోను హైకోర్టులోను కూడ ముసల్మానులకు చాల పోట్లున్నవి. విరోధమును ప్రతివాదముల వంకబెట్టి ముసల్మాను సోదరుల సందేహించుట చాల పొరబాటు. వారి విషయమై చేసికొన్న నిశ్చింతము నిజముగ సంఘలాభము కొరకే. కాని దీనివలన హిందువ్యాపారులకు ఎక్కువ హానికలిగిన అది వేరు సంగతి. ఇందువలన ముసల్మానుల కెక్కువ నష్టము కలిగినను వారి నిశ్చితాభిప్రాయమును మార్చుకొనరని నేను నమ్మెదను. ఈ తీర్మానము సాంఘిక దురాచారములను తొలగించుటకే పెట్టబడినదని మీరు ఉదార హృదయముతో ఆలోచించిన ఎడల దీని నామోదించుటయందు మీ కేమియు అభ్యంతర ముండకూడదు. ఎంత ధన నష్టమైనను వప్పుకొనవలెను. సదాచరణకంటె ధన మెక్కువ కాదు.

ప్రభా—(ధైర్యము తెచ్చుకొని) నేనును ఈవిషయమునే చెప్పదలచుచున్నాను. కొద్ది ధననష్టముతో నొక దురాచారము తొలగిన ఆ నష్టమును మనము సంతోషముతో భరింపవలసినదే. దేశ పరిస్థితుల బాగుటకు ఎందరు దేశాభిమానులు తమ సౌఖ్యములను, ధనార్జనను విడిచిపెట్టి దేశసేవకు లగుటలేదు?

రా-దే—(ప్రభాకరరావువైపు జూచుచు) రావుగారు! మీరు మీ పత్రికా సంపాదకత్వములోనే మునిగిపోవుచున్నారు. మీరు మీ జీవితమును ఆనందముగా గడపుటకు సమయమెక్కడ? కాని మావంటి వారికి ఊబునుపోవుటకు ఏదైనను ఒకమార్గ ముండవద్దా? సాయంత్రము రెండున్నర ఆటతో గడచి పోవును. ఎండవేళ పండుకొనుట యందును, ప్రొద్దుట ఆఫీసరులను కలసుకొనుట యందును

గుట్టుపుస్వారీ చేయుటయందును కాలయాపన మగును. కాని రాత్రి వది గంటలవరకు కాలము గడుపుట యెట్లు? మీరిప్పుడు వేశ్యలను పట్టణమునుండి వెలుపలకు వంపివేయ వలసినదని తీర్మానమును పెట్ట బోవుచున్నారు. రేపు మ్యూన్సిపాలిటీ సరిహద్దులలో, వారి యను మతి లేనిదే మీళములు, పాటకచ్చేరీలు జరిపించ కూడదని తీర్మా నము పెట్టిన మావంటివారి జీవితమే దుర్భర మైపోవుగ.

ప్రభా—(నవ్వుచు) చెప్పినను, సంగీత నృత్యములు నాట్యములు తప్ప, కాలక్షేపమగుటకు మీకు మరియొక యుపాయములేదా? కొంత సేపు గ్రంథపఠనయందు కాలము గడుప కూడదా?

డా. దే—చదువు మావంటివారికి నచ్చదు. పుస్తకములలోని పురుగు లగుటకు మాకిష్టములేదు. జీవితసాఫల్యమున కేవిషయ ములు జరుగునో వాటిగురించి మేమప్పుడే తెలిసికొన్నాము. ఫ్రాన్స్, స్పెయిను దేశములయొక్క నాట్యములు మేమెరుగుదుము. మీరు వాటిపేరులన్నైనను వినియుండరు. నేను పియానాపూర్వ రాగాలాపన చేసిన దొరలుకూడ సిగ్గుపడవలసినదే. ఇంగ్లీషు పద్ధతులు నాగరికతలు గురించి మాకు బాగుగ తెలియును. సోలాహ్యాట్ ఎప్పుడు పెట్టు కొనవలెనో, చప్లూ నెప్పుడు చుట్టుకొనవలెనో మాకు బాగుగ తెలి యును. మేము పుస్తకములనుకూడ అప్పుడప్పుడు చదువుదుము. మాగదియందు ఎన్ని బీరువాలతో పుస్తకములున్నవో మీరు జూచిన తెలియగలదు. కాని మేము పుస్తకముల కంటుకొనిపోము. ఈప్రస్తావనల యధ్యే మాప్రాణములు పోవుచున్నవి.

దేవుయొక్క హాస్యమరోక్కటిను, ఇరుపక్షముల వారును కుతూ హలముతో వినుచుండిరి.

డా. శ్యా—(దేవువైపు జూచుచు) నేనీ విషయమై లెజిస్లేటివు కౌన్సిలునందు ప్రశ్నలను వేయబోవుచున్నాను. నానికి గవర్నమెంటు

తగిన సమాధాన మిచ్చువరకు నాయుద్దేశమును ప్రకటింప జాలను.

ప్రొ. శే—మీ ప్రశ్నలకు గనర్మ మెంటు జవాబు చెప్పకపోయిన?

డా. శ్యా—జవాబుల నిచ్చినను, ఇవ్వకపోయినను ప్రశ్నలు వేయుట మనవిధి. ఇంతకన్న మనమేమి చేయగలము?

బలభద్రరావునాయుడి కిప్పుడు తనపక్షము గెలుపొందునను నమ్మకము బాగుగ నుండెను. డాక్టరుకాక మిగిలిన పరిహాసుగురు సభ్యులలో తొమ్మండుగురు తమపక్షమునకే ఓటు చేయునట్లుండెను. అందువలన తాను ఛైర్మెన్ విధిప్రకారము తటస్థముగా నుండవచ్చునని ఆతడు తలచెను. ఆతడీ ప్రస్తావనను తర్కించుచు ఇట్లు గంభీరోపన్యాసము గావించెను.

"సాంఘిక విప్లవమునందు నాకు విశ్వాసములేదు. సంఘమునందవసరములైన మార్పులను మనయంతట మనము జేసికొనుటయే యుత్తమమని నాఅభిప్రాయము. విదేశయాత్ర, జాతిభేధము, భోజనపానాదుల యందనవసరపు కట్టుబాట్లు మొదలగు నివియన్నియు సమయానుసారముగా మారుచునే యుండును. ఈవిషయమై సమాజమును స్వేచ్ఛగా వదలిపెట్టవలెనని నాఅభిప్రాయము. ప్రజలందరు ఏకగ్రీవముతో వేశ్యలు నగరమధ్యమున నుండుట కొప్పుకొనని యెడల ప్రపంచమునందేవ్యక్తి దానినడ్డుపెట్టగలడు?"

(నాయుడు భావపూర్ణమైన స్వరముతో) "మనకు త్తమ సంగీత శాస్త్రమున్నదని గర్వము కలదు. ఇటలీ, ఫ్రాన్సుదేశములయొక్క సంగీతశాస్త్రమునందు ప్రవీణత గలవారుకూడ భారతీయగానమునందే ఎక్కువ భావము, రసము, ఆనందము, శాంతి మొదలైనవి కలవని స్థిరపరచినారు. కాని కాలగతి ఎట్లున్నది? దేనిమూలమును త్రవ్విన సంఘమునందు కొద్దిగా సంస్కరణ జరుగునని తలంచుచున్నారో అట్టి సంగీత సంస్థ, పవిత్ర స్వర్గీయధనమునకు అగ్రస్థా

నము వహించియున్నది. ఏమీ? మీరీసంస్థను నాశమొనరించి మీపూర్వులార్జించిన యీ అమూల్యధనమును నేలపాలొనర్చెదరా? నేను మనయందు నిలచియున్న జాతీయ, ధార్మిక భావములయొక్కకీర్తి ఈసంగీతమునుండియే కలుగుచున్నదని మీరెరుగరా? అట్లు కానియెడల నేడు రామకృష్ణ శివులయొక్క నామముల నైనను మీరెవ్వరికిని యుండదే. మనహృదయములనుండి జాతీయ భావములను తొలగించుటకు మనపరమ శత్రువు సహితము ఇంతకన్న మంచిసాధనమును ఉపయోగించ జాలడు. వేశ్యలవలన సంఘమునకు హాని కలుగుటలేదని నేను చెప్పను. ఏమాత్రము తెలిసినవాడైనను ఇట్లుచెప్పుటకు సాహసింపడు. రోగనివారణ మందువలన యగును గాని చావు వలనకాదు. దురాచారములు ఉపేక్షాసిద్ధయల వలన తొలగ జాలవు. దయాజ్ఞాన ప్రబోధముల వలన అవినశించును. స్వర్గమును జేరుటకు తిన్ననైన మార్గములేదు. మధ్య వైతరిణీ నదిని దాటకతప్పదు. మహాత్ముల ఆశీర్వాదముల వలన స్వర్గమున కెగిరి పోవచ్చుననుట ఎంత హాస్యాస్పదమో, వేశ్యలను పట్టణములనుండి తొలగించుటవలన భారతదేశముయొక్క దుఃఖదరిద్రములు తొలగి అది స్వర్గతుల్యమగు ననుటయు నంతహాస్యాస్పదమే.''

౨

గట్టిగా తట్టి లేపుటవలన, సోమరి నిద్రనుండి మేల్కొని ఇటు పటు జూచి ఎట్లు నిద్రపోవునో ఆప్రకారమే కోపవిచారములు చల్లారగనే నరసింహారావు తన కర్తవ్యమును మరచిపోయెను. ఆతడు తనలో, ''నే నిక్కడ నుండుటవలన రామనాధమున కేమంత ఎక్కువకష్టము?

నేను తినున దద్ధనేరు బియ్యమే కదా.'' యని అనుకొనెను. కాని ఆరోజునుండియు అతడు నీచసహవాసమును మాత్రము మానుకొనెను. ఈపాటి మాటకు నూరు విడచిపోవుట నవసరమని అతడు తలచెను. ఇప్పు డాత డెల్లప్పుడును వీధియరుగుపైని కూర్చుని దారివెంట వచ్చి పోవు స్త్రీలను పరికించి చూచుచుండును. రామనాథముయొక్క ప్రతి వాక్యమునకును తల నూపుచుండును. భోజనము చేయునప్పు డొంక వడ్డించిన నంతయొ తినును గాని మా రడుగుటలేదు.

సుశీలయొక్క వివాహవిషయమై రామనాథ మేసలహా నడిగినను అతడు సరళభావముతో, ''మాకు మీరే సర్వమును. మీ కెట్లు తోచిన నట్లే చేయండి.'' యని జవాబు చెప్పుచుండును. డబ్బు తెచ్చువా డతడే గనుక అంతయు అతని ఇష్టానుసారమే జరుగవలెనని నరసింహారావు తన మనస్సును సమాధానపరచుకొనుచుండెను.

కాని రామనాథము తన భావమరదియొక్క కఠినపుమాటలను మరచిపోలేదు. గాయముమీద వెన్న వేసిన అప్పటికి బాధ శాంతించి నను తిరిగి కొంతసేపటికే బాధ ప్రారంభమగును. నరసింహారావు యొక్క పశ్చాత్తాపవచనములు రామనాథమునకు వెంటనే మరపునకు వచ్చెను గాని ఆతని కృతఘ్నపుమాట లాతని చెవులయందు ప్రతి ధ్వనించుచునే యుండెను. ఆతడు నిద్రింప బోవుచుండగా కామేశ్వరమ్మ ఆతనితో, ''నరసింహారావుగారు ఇందాక మీతో ఎందుకు దెబ్బలాడుచున్నారు.'' అని అడిగెను.

రాము—(విచారముతో ఊచుచు) నా కీర్తిని కొనియాడుచున్నారు. 'నీవే నా నాశనమునకు కారకుడవనియు, నాభార్యను బలవంతముగ చంపివేసితివనియు, ఒక పిల్లను నూతిలో ద్రోసితివనియు, రెండవపిల్లను బాధించుచున్నావనియు' నానామాటలు నాడినాడు.

కామే—ఏమిూ! మిూనోట్లో నాలుక లేదా? ఇంటింటికి పోయి ముష్టి అడుక్కోకుండా వారిని చేరదీసి, నానాబాధలు పడి పోషించుచున్నందు కిదా ఫలము? ఇన్నిరోజులు ఇనిస్పెక్టరీ జేసినప్పటికి మా వదిన వకకుంకుమభరిణ మైెనను నాకు పంపలేదు. నాకగ్గరే యీ మాటలంటె నోరుపెగలకుండ జబాబు చెప్పియుండును. చెట్టంతేసి పిల్లలను మిూది కూర్చోపెట్టి ఇంకా సిగ్గులేక మాట్లాడడంకూడాను. వీళ్ళవల్లే, నుభ్రముగా ఫకీరులమైపోయినాము. ఇప్పుడు మా కొచ్చిన కీర్తియిది. ఇప్పుడేనా ఎక్కడకైనను పోకూడదా? ఇక్కడ డెందుకు పీఠం వేసుకొని కూర్చోడం?

రా-నా—ఇప్పుడు వెళ్ళిపోతాననే అంటున్నాడు. అందుకొరకే కమల పైవిలాసము నడిగినాడు.

కామే—ఐతే ఈ వకకూతురి నెత్తిమిూద కూర్చుంటాడు కాబోలు! అయ్యో చేతకానివాడా!

రా-నా—లేదు. ఎందుకలా చేస్తాడు? నాలుగైదురోజు లుంటాడు.

కామే—అవెక్కడి మాటలు? ఇప్పుడతడేమని చెయ్యలేడు. వెళ్ళి వాళ్ళ నెత్తిమిూద సవారీ జేస్తాడు. కాని వక్కరోజేనా అక్కడ నిర్వహింపగలడేమో చూదాం ఇప్పటివరకు రామనాథము ఆమెతో కమల సంగతి జెప్పలేదు. స్త్రీలవద్ద వీసంగతియు దాగదనియు, నీసంగతి నామెతో చెప్పిన తప్పక నలుగురికీ తెలిసిపోవుననియు ఆతని భయము. కామేశ్వరమ్మ ప్రేమతో మాట్లాడినప్పుడు ప్రపన్నుడై అన్నికష్టసుఖములతోపాటు కమల సంగతిని గూడ చెప్పుటకు సిద్ధపడుచుండును. కాని పర్యవసానమును తలచి వెనుకకు తగ్గుచుండును. కాని ఈరోజున నరసింహారావుయొక్క కృతఘ్నత, కామేశ్వరమ్మయొక్క స్నేహవచనములు, రామనాథము శంకలను తీర్చివేసెను.

మనస్సునందు మరి, రహస్యము దాగినది కాదు. కాలువయందు నిలచిన వస్తువు నీటిప్రవాహమువలన పై కెట్లు కొట్టుకొని వచ్చునో అవిధముగ నతడు కమల సంగ తంతయు కామేశ్వరమ్మతో జెప్పి వేసెను. అతనికి అర్ధరాత్రప్పుడు మెళకువ రాగానె తాను జేసిన తప్పు స్ఫురించెను. కాని నోరు జారిపోయినది. కామేశ్వరమ్మ ఈ సంగతి నెవ్వరితోను జెప్పనని ఖరారుజేసెను. కాని ఆమె గుండెలలో పెద్దబరువువలె నుండెను. ఏవని చేయుటకు ఆమెకు తోచుటలేదు. ఇంతవరకు సంగతి తనతో జెప్పక దాచెనని మగనిపై మనస్సులో చికాకుపడుచుండెను. ఆమెకు కమలపై అసహ్యముగాని, కోపము గాని, సానుభూతిగాని, లేదు కాని కేవల మొక వింతసంగతిని జెప్పుటకు మానవహృదయముయొక్క దుర్బలతను జర్చించుటకు సమయము దొరకినది. విద్యవలన స్త్రీ చెడిపోయినదని చెప్పుట కింత మంచి ప్రమాణము దొరకినది? ఆమె ఈ సంతోషమును తన మనస్సునందు ఎక్కువరోజులు ఇముడ్చుకొనలేకపోయినది. ఇది అసంభవము. ఐనప్పటికి ఎట్లో ఆమె మనస్సును బిగపట్టుకొనెను. ఒకరోజున పాపయ్యసిద్ధాంతి భార్య కనకమ్మ వీ రింటికి వచ్చి కామేశ్వరమ్మతో, "అక్కా! ఈరోజున ఏకాదసికదా? గోదావరిస్నానమునకు వచ్చెదవా?" యని అడిగెను. కామేశ్వరమ్మకు కనకమ్మకు చాల స్నేహము.

కామే—రావలెననే ఉన్నది. మా గుమ్మములో ఒక ఎమదూత దాపరించినాడు. అతనినుండి ఎక్కడకు వెళ్లడానికి వీలులేకుండా యున్నది.

కన—అక్కా! ఇతని సంగతి నీతో ఏం చెప్పను. చెప్పుకోడానికి సిగ్గు. మా మొగవాళ్లే వింటే బుట్టి బద్దలకొట్టేవాళ్ళే. నిన్న మా పెద్దపిల్లవద్ద ఏం కూనిరాగాలు తీశాడో ఈవాళ ప్రొద్దుటే వాళ్ళిద్దరు

నవ్వుతూ మాట్లాడుతూ ఉండగా చూశాను. అక్కా! నీదగ్గర దాపరిక మెందుకు? ఏమైనా కొంచమునుగు తే గంగలో దిగవలసినదే. ఇతని కొచ్చిన ఏ శ్లోకానికి వచ్చాయి? కొంచమైనా సిగ్గు లజ్జా లేదు. మాపిల్ల మీ కమలకన్న ఒకటి రెండేండ్లేకదా పెద్ద. తన కూతురి లాంటిదానితో ఆలా హాస్యా లాడవచ్చునా? ఆతని కామాత్రమేనా బుద్ధి ఉండవద్దూ? సిద్ధాంతిగారు విన్నచో ఆతని నెత్తురు కళ్ళచూడందే విడిచిపెట్టరు. నీతో కనక చెప్పుతున్నాను. అతనిని చాటుగా పిలచి నాలుగు చీవాట్లు పెట్టి బోధపరచి చెప్పు.

ఇక కామేశ్వరమ్మ నిలువలేకపోయినది. ఆమె కమల సంగతంతయు వన్నెలు చిన్నెలు పెట్టి కనకమ్మతో చెప్పివేసెను. ఇతరులు మనతో తమ రహస్యములను చెప్పినప్పుడు మనము కూడ వారిపద్ద ఏరహస్యమును దాపజాలము.

మరునాడు పాపయ్యసిద్ధాంతి తన కొమార్తెను అత్తవారింటికి పంపివేసి, నరసింహారావుపై తన కసిని ఏలాగైనను తీర్చుకొనుటకు నిశ్చయించెను.

3

మోహనుని వివాహమూ మరునాడే. విష్ణువర్ధనమునుండి పెండ్లివారు వైభవముతో రామవరమునకు తరలివెళ్ళిరి. విష్ణువర్ధనమునుండి రామవరమునకు పదిక్రోసుల దూరము కలదు. మధ్య గోదావరి దాట వలెను. పెండ్లివారందరును పడవలపై నెక్కిరి. కాని పడవవారితో బేర మెంతకును కుదిరినదికాదు. గోపాలశాస్త్రి వారిమీద చికాకు పడుచు కేకలు వేయసాగెను. కృష్ణశర్మ ఆ దరిద్రపు పడవవారిని

జూచి జాలివడి వారికి లాభముగా నుండునట్లు బేరమును కుదిర్చి అన్నగారిని సమాధానపరచెను. ఈ పెండ్లివా రందరును రామవరము చేరుసరికి మధ్యాహ్నమైనది. శాస్త్రిగారి గుమాస్తా లందరికి వెళ్ళి విడిదిలో నన్ని సదుపాయములుచేసి పందిళ్ళు పాకలు వేయించి సిద్ధముగా నుండిరి. ఈ సరంజామంతయు జూచి పెండ్లివారు మేళములు మొదలైనవాటితో గొప్పగా తరలివచ్చుచున్నారని యూరిలో పెద్ద పుకారుగా నుండెను. ఆ రాత్రియే లగ్నము. పెండ్లివారు బ్యాండుమేళముతోను గ్యాసులైట్లుతోను చిత్రవిచిత్రములైన బాణా సంచాలతోను గొప్పగా ఊరేగి లగ్నమునకు వచ్చిరి. లాంఛనము లన్నియు జరిగిన తర్వాత వధూవరులకు మంగళస్నానములు చేయించి పీటలమీద కూర్చుండబెట్టిరి. రామనాథము నడుమునకు అంగవస్త్రము బిగించుకొని యూరిలో తరగకుండ తిరుగుచు, పెండ్లి వారిని, పెండ్లికి వచ్చిన యితర పెద్దమనుష్యులను మర్యాదచేసి వందిరిలో కూర్చుండబెట్టుచుండెను. స్త్రీలు మంగళగీతములను పాడుచుండిరి పెండ్లిలో నొందరు యువకులు ఆ స్త్రీలలో నెవరు సౌందర్యవతులో యని ఓరజూపుల చూడసాగిరి. స్త్రీలు వారిలో వారు నవ్వుకొనుచు వచ్చిన వారిలో పెండ్లికొడుకున కెన రెటునంటి చుట్టములో వారిలో వారు చెప్పుకొనుచు గుసగుసలాడుచుండిరి. వీధిలో బ్యాండుమేళము వాగుచుండెను. పురోహితులు గొంతుకలు బొంగురు పోవునట్లు మంత్రములు చదువుచుండిరి. చిన్నపిల్లలు తమ యీడు వారితో నాడుకొనుచు చేసిన పిండివంటలను తెచ్చుకొని తినుచు, పెద్దవాళ్ళ కాళ్ళలో పడుచు అల్లరి చేయుచుండిరి. నిద్రవేళయగుట వలన చంటిపిల్లలు తల్లులకొర కేడ్చుచుండిరి. ఈ విధముగా నొకరి మాట యొకరికి వినపడకుండ పెండ్లివా రిల్లు అతి సందడిగా నుండెను.

కామేశ్వరమ్మ మాత్రము చిన్నబోయి విచారముగా నుండెను.

ఆమె తనలో "ఈ సంబంధము మా శాంతానికైన నెంత భాగుండును?" అని యనుకొనుచుండెను. వారిలో విషయంకు డెవ్వడో తెలిసికొనుటకు కనకమ్మ ఆసక్తపడుచుండెను. నరసింహారావు అల్లునకు కాళ్ళు కడుగుచుండెను. పళ్ళెములో యెన్ని రూపాయలున్నవో యని గోపలశాస్త్రి పరికించి చూచుచుండెను. పెరటిపందిరిలో బ్రాహ్మణులు గాడీలమీద వండుచుండిరి. పిల్లలు నౌకర్లు భోజనములు చేయుచుండిరి. గోపాలశాస్త్రి పెండ్లిపీట కెదురుగా తీవిగా కూర్చుని యుండెను. ఒకవైపు కుప్పయ్యశాస్త్రిగారు వీణమీద కళ్యాణిరాగ మాలాపన జేయుచుండిరి. పెండ్లిపందిరియందు మనుష్యులు క్రిక్కిరిసి యుండిరి. సానిమేళ మింకను రాలేదేమని వారిలో వారు గుసగుసలాడుచుండిరి. ప్రతివారును వారి రాకకై అతృతపడుచుండిరి. చివరకు వారు నిరాశులై, "ఏమి దరిద్రపు పెళ్ళివారు? సానిమేళమైనను తీసికొనివచ్చుటకు గతిలేకపోయినదికాబోలు? వట్టి పిసినిగొట్టువాళ్ళలాగు కనబడుచున్నారు. ఇంత పంది రెందుకు వేసినట్లు? పేరు గొప్ప వూరు దిబ్బ అన్నట్లుంది వీరి సంగతి." అని ఆక్షేపణగా ఎవరికి తోచినట్లు వా రనసాగిరి. క్రమముగా నీమాటలు శాస్త్రి చెవులలో కూడ పడెను. ఆతడీ నిందను భరింపలేక తమ్ముని పై చిరాకుపడుచుండెను. శర్మ యీ నిందావాక్యములు విని అన్నగారి యెదుటపడుటకు భయపడుచుండెను.

ఇంతలో కొందరు పోకిరీవాళ్లు పందిరిపై రాళ్ళు రువ్వుటకు ప్రారంభించిరి. వైద్యనాథము నలుగురను తీసుకొని ఆ తుంటరులను బెదరించుటకు పరుగెత్తెను. ఆ పందిరిలో కొందరా తుంటగులను తిట్టసాగిరి. ఆటు పరుగెత్తువారు, ఇటు పరుగెత్తువారు కొట్టువారు తిట్టువారు కలిసి పందిరిలోనంతయు అతి గడబిడగా నుండెను.

ఇంతలో నకస్మాత్తుగా నొక దీర్ఘకాయుడు తలనిండ జడలతోను,

ఒంటినిండ భస్మముతోను, చేతియందు త్రిశూలముతోను సాక్షాత్ శివునివలె నక్కడ ప్రత్యక్షమయ్యెను. అతని కండ్లు మంటలవలె ప్రజ్వరిల్లుచుండెను. ముఖ మొక విధమైన తేజస్సుతో ప్రకాశించుచుండెను. ఈతని రాకవలన వందిరియంతయు నొక్కసారి నిశ్శబ్దమై పోయెను. అక్కడ నున్న వా రందరు నీమహాత్ముడెవ్వడో, ఎక్కడి నుండి వచ్చునో యని విస్మయపడసాగిరి.

సాధువుత్రిశూలమును పైకెత్తి తిరస్కారస్వరముతో "ఆహా! ఎంతవిచారకరము? సానిమేళము లేకపోవుటవలన నీమహానుభావులం దరకు నిరుత్సాహముగా నున్నది కాబోలు? ఏమీ? కల్యాణిరాగము మీకు రుచించుట లేదా? ఒకరికిని చెవులున్నట్లు కనపడదు. అంద రూకూడ వేశ్యలకొరకే ఆతృతపడుచున్నారు. వేశ్యను చూపెదవా? బుఱ్ఱపగుల కొట్టుకొనెదవా? యన్నట్లున్నది మీ వైఖరి? పదండి. నేను నాట్యమును చూపెదను. దేవతానాట్యమును జూపెదరా! చూడండి చెట్లయాకులపై చంద్రకిరణము లెంతసొగసుగా నాట్యము చేయుచున్నవో? ఇటుచూడండి. చెరువులోని కమలములయందు నీటి బిందువు లెట్లు నాట్యము చేయుచున్నవో? అటుచూడండి. అడ వులయందు నెమళ్లు తమసొగసైన పింఛములను విప్పి యెంతఅంద ముగా నాట్యముచేయు జేయుచున్నవో? ఏమీ! ఈ దేవతానాట్య ము మీ కింపుగా లేదా? సరే. నడవండి. పిశాచములయొక్క నా ట్యము జూపెదను. మీ పొరుగున నున్న దరిద్రులగు రహితులు జమీందారులచేత చెప్పుదెబ్బలు తిని యెట్లు నాట్యమాడుచున్నారో? మీ దరిద్ర సోదరులయొక్క అనాథబాలులు ఆకలికి తాళజాలక ఎట్లు నాట్యమాడుచున్నారో? మీ యింటియందు చూడండి. మీ వితంతు సోదరీలయొక్క కండ్లయందు శోకముతో కూడిన నీటిబిం దువు లెట్లు నాట్యమాడుచున్నవో? ఈ నాట్యము జూచుటకు కూడ

మీ కిష్టములేదా? ఐతే మీ మనస్సు నొక్కసారి పరికించి చూడండి. కపటము, మోసము, దౌర్జన్యము యెట్లు నాట్యమాడుచున్నవో?

ఈ ప్రపంచమంతయు నృత్యశాలయే. దీనియందు మనుష్యులు వారి వారిస్థితికి తగిన నాట్యమాడుచున్నారు. ఏమీ, ఈ నాట్యము జూచుటకు మీకు కండ్లులేవా? రండి శంకరునియొక్క తాండవనృత్యము జూపెదను. కాని, అయ్యో! ఆ నృత్యము జూచుటకు మీకు యోగ్యతలేదే. మీ వంటి కామాతురుల కటువంటి నాట్యముజూచియా నందించుట కదృష్టమెక్కడ? హా! మూర్తీభవించిన యజ్ఞానులారా! నాట్యము పేరెత్తుటకు మీకు సిగ్గులేదా? మీరు బాగుపడ దలచిన యీ దురాచారములను రూపు మాపుడు. విషయవాంఛలను విడిచిపెట్టుడు. వేశ్యాప్రేమనుత్యజింపుడు. అని ఘోషించెను. అక్కడి వారందరు నిశ్చాంతపోయి మహాత్మునియొక్క ఉన్మత్తవాక్యములను శ్రద్ధతో వినుచుండిరి. ఇంతలో ఆయోగి యదృశ్యుడయ్యెను. ఎదురుగా నున్న మామిడి తోపునుండి యింకను ఆ మధురగానము వినబడుచునే యుండెను. రాత్రియందు చింతారూపమైన నాక నిద్రా సాగరము నందెట్లు విలీనమై పోవునో ఆ విధముగానె క్రమక్రమముగా అంధకారమునందు ఆ గానము కూడ విలీనమై పోయెను. ఆ సాధువు యొక్క ఆ కస్మికాగమనము, ఆ తని తేజస్వరూపము, ఆయలౌకికోపదేశము ప్రజలలో నొకవిధమైన భయాందోళనలను కలిగించెను. పెండ్లికి వచ్చినవారిలో కొందరు నిష్కారణముగా నిక్కడకు వచ్చితిమని పశ్చాత్తాపపడుచు తమ తమయిండ్ల దారినిబట్టిరి. కొందరు సత్పురుషులామహాత్ముని వెనుక పరుగెత్తిరి. కాని యా తడు వారికెక్కడను కనుబడలేదు.

౪

గోపాలశాస్త్రి పందిరిలో మధ్యను పెళ్ళి దగ్గర పెట్టుకొని కూర్చుండెను. గుమాస్తాలు లగ్నమునకు కావలసిన మధుపర్కములు, పసుపు కుంకుమ పండ్లు మొదలైనవి పళ్ళెములలో సర్దుచుండిరి. శర్మ అన్న ప్రక్కనే కూర్చుండి ఆయన పురమాయించు పనుల గుమాస్తాలచే చేయించుచుండెను. శాస్త్రి పెండ్లికుమార్తెకు పెట్టు నగలను, దక్షిణల కివ్వవలసిన సొమ్మును లెక్క జూచుచుండెను. ఇంతలో వైద్యనాథము గోపాలశాస్త్రివద్ద కొగుర్చుకొనుచు పరుగెత్తుకొని వచ్చి "అయ్యా! చాలా అనర్థము వచ్చినది. మనము తిన్నగా మంచిచెడ్డలు తెలుసు కొనకుండ యీ సంబంధమును కుదుర్చుకొంటిమి."

గోపా—(ఆశ్చర్యముతో) ఏమి? ఏమి వచ్చినది? ఏమి టాఅనర్థము?

వైద్య—ఇప్పుడే ఈ గ్రామనివాసి యొకడు నన్ను కలుసుకొని వీరి గుట్టంతయు బయలుపెట్టినాడు. దానితో నామీది ప్రాణములు మీది కెగిరిపోయినవి.

గో-శా—ఏమీ? వీరిది మర్యాదావంశం కాదా?

వైద్య—వంశము నుంచిదే. కాని వీరి సంగతంతయు చాల అనర్థముగా నున్నది. పెండ్లికుమార్తె తండ్రి మొన్ననే జెయిలునుండి వచ్చినాడట. ఆమె అక్క వేశ్యయై కళ్యాణపురపు బజారువీధిలో మేడ పుచ్చుకొనియున్నదట. పేరువడ్డ వేశ్య కమలాబాయి, ఈపెండ్లికుమార్తెకు ఖాసా అక్కేనట!

ఈమాటలు వినగానే గోపాలశాస్త్రికి మిన్ను విరిగి మీద పడినట్లయ్యెను. ఆతడు తేరిపార జూచుచు, "ఈ సంగతులు చెప్పినవాడు వీరి విరోధి కాడుకద? కార్యములకు విఘాతములు కలిగించుట కిటు

వంటి అబద్ధములు, అపవాదములు కిట్టనివారు పుట్టించుచుండుట మామూలు సుమండీ!"

శర్మ—ఔను. ఆలాగే ఐవుంటుంది.

వైద్య—ఈ చెప్పిన యాతడు వీరి ముఖముముందే యీ సంగతులన్నీ నిర్భయముగా చెప్పగలనని యుంటున్నాడు.

గో-శా—మొదట నేను యీపిల్ల రామనాధం కూతురనుకున్నాను.

వైద్య—కాదు. యీపిల్ల యాతని మేనకోడలు మీకు జ్ఞాపకమున్నదో, లేదో, ఇదివరకొక పోలీసు యినస్పెక్టరుమీద పెద్ద కేసైంది. ఆ యినస్పెక్టరే యీపిల్ల తండ్రి. ఈతడు జెయిలునుండి విడుదలై రెండుమూడు నెలలు మాత్రమే ఐంది.

గోపాలశాస్త్రి తలపట్టుకొని మతిలేనట్లు "అయ్యో దేవుడా! మమ్మలి నెక్కడినుండి యెక్కడకు తీసుకునివచ్చి చిక్కులలో పెట్టినావు?"

శర్మ—ఐతే, యిప్పుడు రామనాధంగారిని పిలిపించి కనుక్కుందాం.

ఇంతలో రామనాధమే యేదో సంగతి మాటలాడుటకు వీరి వద్దకు వచ్చెను. ఆతనిని జూచి శాస్త్రి మండిపడుచు "ఏమయ్యా! మహానుభావుడా! మీ కొచ్చిన కళంకమును మా నెత్తిని పులుముటకు మాకంటె నీవిపంచములో మీకెవ్వరూ కనబడలేదా?"

పిల్లికి పట్టుబడ్డ యెలుకవలె రామనాధము వణకుచు దీన భావముతో, చేతులు జోడించి, "శాస్త్రిగారు! మావల్ల యే మపరాధము వచ్చినది?"

గో-శా—నువ్వు చేసిన పనికి బుజ్జి బద్దలుకొట్టినా పాపములేదు. గుడిశేటిదాని చెల్లెలను మాకంటగట్టి మా వంశమును నాశనము

చేయ దలచితివా? ఇంకా సిగ్గులేక తెలియని వానివలె యీ మపరా ధము చేసితినని యడుగుచున్నావు?

రామ—(డగ్గుత్తికతో) శత్రువులు, మిత్రులు అంగరకు ఉంటారు. ఎవరైనను కిట్టనివా రపవాదలు పుట్టించిన మీవంటివారు నమ్మ వచ్చునా? ఈ సంగతు లెవరు చెప్పితిరో వారిని నా ముఖముముందు చెప్పమనండి.

శర్మ—ఔను. అది భాగుంది. అయ్యా వైద్యనాధంగారు! ఆ చెప్పిన మనిషెవరో వేగిరం పిలిపించండి.

గో-శా—(తమ్మునివైపు కోపముతో జూచుచు) నువ్వెందుకు మధ్య నడ్డంగా వస్తావు? (రామనాధంతో) మీ శత్రువే యీసంగతి చెప్పి యుండవచ్చును. ఏనా యీ సంగతి నిజమో? అబద్ధమో? ముందు మీరు చెప్పండి.

రామ—ఏసంగతి?

గో-శా—ఇదేను. కళ్యాణపురపు వేశ్య కమలాభాయి పెండ్లి కుమార్తెకు ఖాసా అక్క అవునా? కాదా? అన్నసంగతేను.

రామనాధము ముఖము వెలవెల బారెను. ఆతడు సిగ్గుచే తల వంచుకొని కళ్ళు తేలవేయుచు, "శాస్త్రిగారు.....అనిమాత్రమే యనెను. కాని మరి యాతని నోటమాట వచ్చినదికాదు.

గో. శా—(గర్జించుచు) స్పష్టముగా నెందుకు చెప్పరు? ఈసంగ తినిజమా? లేక అబద్ధమా?

రామనాధ మెంతప్రయత్నించినను, "అయ్యా!" అనుట తప్ప మరి ఒకమాట ఆతనినోటినుండి వచ్చుటలేదు.

ఇప్పుడు గోపాలశాస్త్రి సందేహమంతయు పూర్తిగా తీరిపోయి నది. క్రోధాగ్ని రగిలిపోవుచుండెను. కండ్లవెంట నిప్పులు రాలు చుండెను. ఒడలు గడగడ వడక సాగెను. ఆతడు రామనాధము వైపు

తీక్షణముగా జూచుచు, "నీకు బ్రతుకమీద ఆశయున్న యెడల నాకళ్ళయెదుటినుండి లేచిపో, ఛీ! నీచుడా! దగుల్బాజీ! ఇంత మోసమూ? నలుగురిలో తగుదునని తలయెత్తుకుని యేలాగు తిరుగుచున్నావు? ఛీ చండాలుడా! నీయిట్లో పచ్చిమంచినీళ్ళయినను త్రాగను. నీపిల్లను నీమెడకే కట్టుకో."

ఇట్లు కేకలు వేయుచు పీటలమీద కూర్చున్న మోహనుని రెక్క పట్టుకుని లేవనెత్తి విడిదెకు తీసుకొనిపోయెను. అతని వెనుకే తక్కిన మొగపెండ్లివారు స్త్రీపురుషులందరు వెళ్ళిపోయిరి. వాళ్లు వెళ్ళిన తర్వాత రామనాథము శర్మ చెయ్యి పట్టుకొని "బాబు గారు! ఏలాగైనను అన్నగారిని మీరే సమాధానపెట్టాలి, లేకపోతే యిక నేను నలుగురిలో తలయెత్తుకొని తిరగలేను. కమల సంగతి మీరెరిగే యుందురు. ఆదొర్భాగ్యురాలే మాకుటుంబము నకు కళంకము తెచ్చిపెట్టినది. దైవేచ్ఛ ఆలాగున్నది. ఆకవ్వబడ్డ వన్నియు త్రవ్విన నేమిలాభము? నేనిసంగతి దాచక యేలాగుబయలు పెట్టగలనో తమరే శలవియ్యండి. ఇప్పుడీ పిల్లకు పెళ్ళిచెయ్యక తప్పదు. అందువలన సంగతి దాచకపోతే యేలాగౌతుంది. మీతో నిజము చెప్పుచున్నాను. మీసంబంధము నిశ్చయమైన తర్వాతే నాకీసంగతి తెలసినది.

శర్మ—(విచారముతో) ఈసంగతి అన్నగారి చెవులపడకపోయిన ఏయల్లరి యాటంకము లేకుండ వివాహము జరిగిపోయి యుండును. ఐనా మీశలవు ప్రకార మిప్పుడేపోయి ఆయనను సమాధానపర చుటకు ప్రయత్నించెదను. కాని ఆయన ఒప్పుకుంటారని మాత్రము నాకు నమ్మకంలేదు.

గోపాలశాస్త్రి విడిదిలో నాళ్ళర్లను గుమాస్తాలను సామానంతయు సర్ది ప్రయాణమునకు త్వరగా సిద్ధము కమ్మని పెద్దగొంతుకతో

కేకలు వేయుచుండెను. మోహనునితో నీసంగతంతయు జెప్పుటవ
లన ఆతడుకూడ తనబట్టలను సర్దుకొనుచుండెను. జానికమ్మ ఒక
మూల పెండ్లివారిని తిట్టుచు కండ్లు తుడుచుకొనుచు, నోఖర్లమీద
కేకలు వేయుచు నానాగడబిడ చేయుచుండెను. సుభద్రమ్మ మొగ
మింత చేసుకొని మతిపోయినట్లొక మూలనిలువ బడెను.

ఇంతలో కృష్ణశర్మవచ్చి వినయముతో, "అన్నయ్యా! తొందర
పడకండి కొంచెము ముందువెనుక లాలోచించి మరి పనిచెయ్యవలెను.
మోసమే జరిగిపోయినది కాని యావిధముగా తిరిగి వెళ్ళిపో తే నలు
గురిలో మరింత నగుబాట్లు కావా?

మోహనుడు పినతండ్రివైపు హేళనగాను, గోపాలశాస్త్రి హేళన
గానుచూడసాగిరి.

శర్మ—మరి ముగ్గురు నలుగురిని కనుక్కొని వారేమంటారో
చూద్దాం.

గో. శా—ఏమంటున్నావు? ఎగిరిగి క్రొచుపామును మెడకు
చుట్టుకోమన్నావా?

శర్మ—దీనివలన నగుబాట్లేనా తగ్గుతాయి.

గో. శా—నువ్వింకా కుఱ్ఱవాడివి. నీకీకష్టసుఖాలు మంచిచెడ్డలు
ఏం తెలుస్తాయి? వెళ్ళి ప్రయాణం సరంజాం చేయించు. ఎల్లకాలం
వంశానికి కళంకమవచ్చేకంటె యీనగుబాట్లే నయం.

శర్మ—ఆపిల్ల గతేమౌతుందో కొంచెం ఆలోచించండి ఇందులో
ఆపిల్ల తప్పేమున్నది?

గో. శా—(మండిపడుచు) నువ్వు వట్టిమూర్ఖుడిలాగున్నావు. మరి
మాట్లాడక సామాను సర్దించు రేపేదేనా చెడ్డపేరువస్తే కట్నాని
కాశపడ్డానని నువ్వే అంటావు. ఇటువంటి వ్యవహారములలో నిప్పీడరీ
యుక్తులు పనికిరావు.

శర్మ—(దీనముగా జూచుచు) నేను మీయాజ్ఞను ధిక్కరింప జాలను. కాని ఆపిల్ల గతేమగునో యని విచారముగాయున్నది.

గో. శా—నువ్వు నిష్కారణముగా నాకు కోపము తెప్పించుచున్నావు ఆపిల్లకు నేనేకళంకము తెచ్చిపెట్టానా? ఆపిల్ల అదృష్టం యేలాగుంటే ఆలాగు జరుగుతుంది. దానితో నాకేమీ ప్రసక్తి లేదు.

శర్మ—(నిరాశతో) వీరింటికి కమల గాకపోకలేమియు లేవుట. వీరామెను బహిష్కరించినారట.

గో. శా—నాకు కోపం తెప్పించవద్దని యిదివరకే చెప్పినాను. నాతో నీలాటి మాటలు చెప్పటకు సిగ్గులేదా? గొప్పసంస్కర్తవు బయలుదేరావు. సానిదాని చెల్లెలిని నాకొడుక్కి చేసుకోమంటావా? ఛీ ఛీ, నీబుద్ధి బుగ్గైనట్లున్నది. నీకు మతిలేదా?

కృష్ణశర్మ సిగ్గుతో తలవంచుకొనెను. ఆతడు తనలో, "అన్నయ్య చెప్పినట్లు చేయక తప్పదు." అని యనుకొన్నను ఆపిల్లసంగతి తల చుకొన్న మనస్సుండబట్టినదికాదు. మరియొకసారి ప్రయత్నించి చూచెదనని సాహసముతో, "కమలాభాయి యిప్పుడావృత్తినిమాని విధవాశ్రమములో చేరినది."

కృష్ణశర్మ తలవంచుకొనియే యీ మాటలను జెప్పుచుండెను. అన్నవైపు కన్నెత్తి జూచుట కాతనికి సాహసము లేకుండెను. ఈ మాటలాతని నోటినుండి వచ్చీ రాగనే గోపాలశాస్త్రి మరి కోపము పట్టజాలక తమ్ముని ఒక్కదెబ్బవేసి వెనుకకు తోసివేసెను. కృష్ణశర్మ వళ్ళు దులుపుకొనుచు నెమ్మదిగా లేచి చూడగా గోపాలశాస్త్రి కోపమున గడగడ వణకుచుండెను. శర్మకు తన అన్నచేత యిటు వంటి దెబ్బలు తినుటకిదియే మొదటి పర్యాయము. భాల్యావస్థయం దెంత పెంకితనము చేసినను శాస్త్రి తమ్ముని పల్లెత్తు మాటయైనను

అనలేదు. శర్మ చిన్న పిల్లవానివలె కళ్ళవెంట నీళ్ళు కార్చసాగెను. ఆతని మనస్సునందు క్రోధము లేదు. కాని తననంత పేరిమించు అన్నగారికింత కోపము తెప్పించితినికదా! యని ఆతనికి దుఃఖముగా నుండెను. ఇది నిజముగా హృదయమునందు మండుచున్న అగ్నిజ్వాల. ఇది లజ్జావమానముల యొక్కయు, ఆత్మ విచారము యొక్కయు ప్రత్యక్షస్వరూపము. హృదయమునందు మండుచున్న శోక సాగరము యొక్క కెరటము. మోహాను డొక్కడాటున పినతండ్రిని లేవనెత్తి తండ్రివైపు జూచుచు, "మీకు వెఱ్ఱెత్తినదా యేమిటి!" యని కోపముతో ననెను.

ఇంతలో నలుగురు అక్కడచేరి "సంగతేమిటి? ఎందుకు తిరిగి వెళ్ళిపోవుటకు ప్రయాణమగుచున్నారు? రెండు వంశముల మర్యాదా నిలువబడేటట్లు మరీ ఆలోచించండి. ఇప్పుడిద్దరి మర్యాదా ఒక్కటే! ఇచ్చి పుచ్చుకొనుటలో యేమైన పొరబాట్లున్న మీరు సహించవలెను. దేవుని దయవల్ల మీకేమీ కొదువ లేదుకదా! వీరిచ్చునదే పాటి? అది మీకొక లక్ష్యమా?" ఈ మాటలకు గోపాలశాస్త్రి యేమియు జవాబు చెప్పలేదు.

విడిదెలో అతి గడబిడగా నుండెను. సంగతేమిటని ఒకరినొకరు ప్రశ్నించుకొనుచుండిరి. గుమ్మములో మనుష్యులగుం పంతకంత కెక్కువ కాసాగెను. ఆడ పెండ్లి తాలూకు వారందరును విడిదెలోనికి వచ్చివేసిరి. వారిలో కొందరు రామనాధముతో, "అయ్యా! పెండ్లి వాళ్ళు తిరిగి వెళ్ళిపోవుటకు కారణమేమి?" అని అడుగసాగిరి. రామనాధము వారికి తగినజవాబు చెప్పక పోవుటవలన వారందరు శాస్త్రి వద్దకు వెళ్ళి వినయముతో, "అయ్యా! మావల్ల యే మపరాధము వచ్చినది? మీ శేషము విధించినను వప్పుకొనెదము. కాని మీరిట్లు తిరిగి వెళ్లిపోవుట న్యాయముకాదు. మాకు బంధువులలోను, స్నేహి

తులలోను చాల తలవంపు లైపోవును" అని ప్రార్థింపసాగిరి.

గో-శా—మీ రామనాథమునే అడగండి అతడే మీకు తగిన జవాబు చెప్పును. అని మాత్రమే వారికి జవాబు చెప్పుచుండెను.

నరసింహారావు పెండ్లికుమారుని జూచినప్పటినుండియు సంతోషముతో పొంగిపోవుచుండెను. ముహూర్తము దగ్గర పడుచున్నదనియు, పెండ్లివా రెందు కలిగి వెళ్ళిపోయిరో యనియు అతడనుకొనుచుండగా నింతలో కొందరు పరిగెత్తుకొని వచ్చి ఆయన కీసంగ తంతయు జెప్పిరి. అతడు వారిని, "పెండ్లివా రెందుకు తిరిగి వెళ్ళిపోవుచున్నారు? రామనాథ మేమైనను జగడము తెచ్చిపెట్టినాడా?" అని యాతృతతో నడిగెను. "రామనాథముగారు కూడ నక్కడనే యున్నారు. ఆయన పెండ్లివారిని బ్రతిమాలుచున్నారు. అంతకన్న మా కేమియు తెలియదు." అని వారు బదులు చెప్పిరి.

నరసింహారావు చగర్చుకొనుచు విడిదెకు వరుగెత్తెను. త్రోవలో నాతడు తన సహచరులతో, "ఇది పిల్లల బొమ్మలాట అనుకొన్నారు కాబోలు! ఇది బొమ్మలపెండ్లి కాదు. సంబంధమిష్టము లేకపోయిన పెండ్లికెందుకు తరిలి రావలెను? చూస్తాను వీరేలాగున తిరిగి వెళ్ళిపోతారో? నెత్తురు పరివహింప జేసెదను. నాకురిశిక్ష యైననుసరే. కాని నామజా వీరికి చూపనిదే విడిచిపెట్టను." అనిచెప్పుచు విడిదిచేరి, గర్జిత స్వరముతో, "గోపాలశాస్త్రిగారెక్కడ నున్నారు! అయ్యా! తమరొక్కసారి పైకి దయచేయించండి." అని గట్టిగా పిలచెను.

గోపాలశాస్త్రి యీ గర్జనను విని బైటకువచ్చి ధృఢత్వముతో "అయ్యా! యేమి చెప్పదలచుకొన్నారో చెప్పండి"అని ప్రశ్నించెను.

నర—తమరెందుకు తిరిగి వెళ్ళిపోవుచున్నారు?

గో-శా—మా యిష్టం. మేము వెళ్ళిపోవుచున్నాము. మా కీసంబంధం ఇష్టంలేదు.

నర—ఈ వివాహం జరుగక తప్పదు. మీరు తరలివచ్చి వివాహం పూర్తికాకుండా ఏలాగు తిరిగి వెళ్ళిపోగలరు?

గో-శా—మీరేమిచేస్తే చెయ్యండి. కాని మేమీ సంబంధం చేసుకోము.

నర—ఐతే, దీనికి కారణ మేమిటి?

గో-శా—కారణ మేమిటో మీకు తెలియదా?

నర—తెలసిన్నట్లైన మిమ్మ్మల నెందుకడుగుతాను?

గో-శా—ఐతే, రామనాథంగారి నడగండి తెలుస్తుంది.

నర—నేను మిమ్మ్మలినే యడుగుచున్నాను కనుక మీరే చెప్పండి.

గో-శా—ఎందుకు గుట్టు బయలు పెట్టమనెదరు? మిమ్మ్మలను సిగ్గుపరచుట నాకిష్టములేదు.

నర—సరే. బోధపడినది. నేను జైలునుండి వచ్చినానని కాబోలు. దానికిమీరు శిక్ష? మీన్యాయము చాలా బాగున్నది.

గో-శా—ఈయొక్క కారణమువల్ల మేము తిరిగివెళ్ళిపోవడంలేదు.

నర—ఐతే, రామనాథం కట్నమిచ్చుటలో మీకేమైన లోపము చేసినాడా?

గో-శా—మేమంత సీచులము కాము.

నర—ఐతే, ఇంకా యేమిటి కారణం?

గో-శా—నన్నడుగవద్దని చెప్పుచున్నాను కానా?

నర—మీరు చెప్పక తప్పదు. పెండ్లికి తరలివచ్చి తిరిగి వెళ్ళిపోవడం చిన్నపిల్లలాట అనుకున్నారా? మీరు ధైర్యముగా నున్నారు కాని ఇక్కడ నెత్తురునది పారక మానదు.

గో-శా—మాకాభయం లేదు. మేమిక్కడ చచ్చిపోయినా సరే కాని మీ పిల్లనుమాత్రం చేసుకోం. మామర్యాద పోగొట్టుకొనుటకు మేమిక్కడకు రాలేదు.

నర—ఐతే, మేము మీకంటె నీచులమా?

గో-శా—ఔను. మాకంటె నీచులే.

నర—దీనికేమైన ప్రమాణ మున్నదా?

గో-శా—ఆహా, యున్నది.

నర—ఐతే దానిని చెప్పుటకు మీరెందుకు సందేహించుచున్నారు?

గో-శా—సరే, వినండి. తర్వాత నన్నుమాత్రం దూషించకండి. మీ పెద్దకూతురు కమలాభాయి అనగా యీపిల్ల స్వంతఅక్క చెడిపోయినది. మీ కిష్టమైన కళ్యాణపురపు సానివీధికి పోయి చూడండి.

నరసింహారావు అవనమ్మ్రకముతో, "ఇది పట్టి యబద్ధము" అని అనెను. కాని ఒక్క క్షణములో తాను రామనాథమును కమల చిరునామా యడుగగా ఆతడు చెప్పకుండ తప్పించు కొనుటయు, క్షణక్షణమునకు కామేశ్వరమ్మ మర్మభేదకములైన మాటలతో తన్ను దెప్పచుండుటయు, ఆతనికి జ్ఞాపకమునకు వచ్చి, యీసంగతి నిజమేయని తోచెను. అప్పుడు సిగ్గుచేత ఆతనితల వంగిపోయెను. ఈ అవమానమును భరింపలేక ఆతడు తెలివితప్పి క్రింద పడిపోయెను. ఇరువర్తములవారు వందలకొలది అక్కడ చేరిరి. వారందరుకూడ ప్రాణాన్నడి అట్లే నిలువబడిపోయిరి. కాని ఒక్కరైనను యీవిషయమై నోరు మెదపుటకు సాహసింపలేక పోయిరి.

అర్ధరాత్రి కాగానే మొగపెండ్లివారందరు తిరిగి వెళ్ళిపోయిరి. ప్రొద్దుటినుండియు కడు సందడిగానున్న విడిది అంధకార బంధురమై నిశ్శబ్దముగా నుండెను.

నారాయణదాసు కమలను వితంతుశరణాలయమునందు ప్రచ్ఛన్న ముగా నుంచెను. కార్యనిర్వాహక సభ్యుల కొక్కరికైనను, ఈసంగతిని తెలియనివ్వలేదు. ఆశ్రమవాసులతో నీమె కూడ వితంతువనియే జెప్పెను. కాని సూర్యారావువంటి రసికులవద్ద నీ రహస్య మెన్ని రోజులో దాగలేదు. అతడు ప్రయత్నముచేసి కమల దాసీని పిలిపించి, ఆమెవద్ద కమల ఆచోకీని కొంతవరకు లాగెను. ఈసంగతిని తన మిత్రుల కందరకును కూడ తెలియజేసెను.

ఆ మరునాటినుండియు వారి కృపాదృష్టులు ఆశ్రమముపైపు ప్రసరింపసాగెను. బలభద్రరావునాయుడు, సుబ్బయ్యశెట్టి, సూర్యారావు మొదలైనవారు తరచుగ వచ్చుచుండిరి. ఈ మహానుభావుల కిప్పుడు ఆశ్రమముయొక్క సుభ్రతను గురించియు, సామానుల సౌకర్యమును గురించియు ఆర్థికస్థితిని గురించియు, ఆశ్రమనిర్వహణమును గురించియు, ఆదుర్దాతమైన శ్రద్ధ కలిగెను. వీరందరు రాత్రింబవళ్లు శరణాలయాభివృద్ధిని గురించియే ఆలోచించుచుండిరి.

నారాయణదాసిప్పుడు పెద్ద సందిగ్ధావస్థలో పడిపోయెను. ఒకప్పుడాతడు తనలో, "ఈఆశ్రమముయొక్క కార్యనిర్వాహకమునకు రాజీనామా ఇచ్చివేయుదునా? ఈఆశ్రమమంతా నాతోనేయున్నదా ఏమిటి? కమిటీయం దీవనిని నిర్వహింపగలిగినవా రెందరో యున్నారు. వారి కెట్లుచితముగ దోచిన నట్లే ఈ యాశ్రమమును నడిపించెదరు. నేను నాకండ్లతో నీ అత్యాచారములను జూడ నవసర ముండదు."

మరియొక్కప్పుడు, "ఈ దురాచారులను గట్టిగా చీవాట్లు పెట్టెదను. తరువాత సంగతిమాట ఆలోచింపవచ్చు." అని ఊహించుకొనుచుండును.

కాని మనస్సు స్థిమితపరుచుకొని ఆలోచించి, వీరి సంగరను మంచి మాటలాడి పనులు చేయించుకొనుటయే యుత్తమమని ఆతనికి దోచెను. అవసరము వచ్చినప్పు డతడు విధిలేక వారితో మాట్లాడు చుండును. వారి ప్రస్తావనను ఉపేక్ష చేయుచు, మీ రిక్కడకు తరచుగ వచ్చుచుండుట అమర్యాదగా నున్నదను భావమును సూచాయగ వారి కతడు తెలియజేయుచుండెను. కాని తమ అవసర మున్నప్పు డితరుల మందలింపుల నిట్టివారు లక్ష్యపెట్టరు. వా రతిమర్యాదగ నటించుచు, ఆశ్రమాభివృద్ధిని కోరుచుండువారివలె పనిచేయుచుండుట వలన, ఆ కపటమూర్తులవద్ద నారాయణదాసు బుద్ధి ఏమియు పనికి రాకుండెను. ఒకనా డుదయము నారాయణదా సీవిషయమై ఆలో చించుచు, ఆశ్రమమునందలి తన కచ్చేరీగదియందు కూర్చొని యుం డగా, ఆశ్రమగుమ్మమువద్ద నొక గుఱ్ఱపుబండి వచ్చి ఆగెను. సూర్యా రావు, రామశాస్త్రి దానినుండి దిగిరి. నారాయణదాసు వారిని జూచి ఆశ్చర్యాంతపోయెను. ఇదివరకు వచ్చువారితోనే తంటాలు పడు చుండగా వీరు కూడ వచ్చి పడిరి. వీరిని గట్టిగా చీవాట్లు పెట్టి వెను కకు తగిలివేయవలెనని అనుకొనెను, గాని తొందరపడుట మంచిది కాదని తలచి వెనుకకు తగ్గెను.

సూర్యా—అయ్యా! నారాయణదాసుగారు! నమస్కారము. మీరు సుస్థిగానున్నట్లు కనబడుచున్నారే?

రా. మ—పాపం పనితో నొక్కలాగు కొట్టుకొనిపోవుచున్నారు. మీముఖం సుభ్రముగా వాడిపోయినది. ధర్మకార్యంకదా! మాకు కూడా మీపుణ్యం కొంచం పంచండి. మీ రేపనిపురమాయించిన ఆపనిని చేతులు కట్టుకొని చేయుటకు సిద్ధముగా నున్నాము. మాస్నేహితు డొకడు కొన్ని రకముల లేసుల నమూనాలు పంప మని వ్రాసినాడు. పాపులలో నట్టివి దొరకినను, నిక్కడ కొన్న

యెడల ఆశ్రమమునకే ఆలాభము కలుగునని తలచి, వచ్చినాను. దయచేసి ఇక్కడ తయారగుచున్న రకములను నాకు చూపించండి.

నారా—ఇక్కడివారు లేసుపనులు చేయడంలేదు.

సూర్యా—దయచేసి యొక్కసారి లోపలకువెళ్ళి కనుక్కోండి. ఇక్కడివారట్టి పనులు చేయగలరని నానమ్మకము. ఇప్పుడు మీరు పని తొందరలో నున్నారు. కాబోలు! ఫరవాలేదు. మరియొకసారి వచ్చెదము. మీరు మీజీవితమును సేవాకార్యములకొరకు ధార పోయుచుండగా మరియొకసారి రావడమునకేనా మాకు కష్టం?

నారా—మీదయకు చాల సంతోషముగా ఉన్నది. కాని ఇటు వంటి పనులిక్కడ చేయకూడదని కమిటీవారు నిశ్చయపరిచినారు. కనుక మీరు కోరిన వస్తువులను సమకూర్చ జాలనని చెప్పుటకు విచారముగా ఉన్నది.

ఇట్లుచెప్పిన నారాయణదాసు లేచి నిలబడెను. ఇప్పుడీ యిద్దరు పెద్దమనుష్యులకు తిరిగి వెళ్ళిపోవుటతప్ప మరియొక యుపాయము కనబడలేదు. వారిద్దరు తమలో నారాయణదాసును తిట్టుచు బండి నెక్కిరి.

ఇంకనూ వారి బండిచప్పుడు వినబడుచునే యుండెను. ఇంతలో సుబ్బయ్యసెట్టి మోటారువచ్చి ఆగెను. సెట్టి శీఘ్రతో బండీనిదిగి, నారాయణదాసుతో షేక్‌హేండుచేసి, "దాసుగారు! నాటకం విషయమై మీరేం ఉద్దేశించారు? శకుంతల నాటక మన్నిటికన్నా బాగా ఉంటుంది. దీనిని ఇంగ్లీషువారు తప్పక ఇష్టపడెదరు. తప్పకుండా ఇదే వేయించండి."

ఒక్కొక్కప్పుడు సంధిగ్ధావస్థలో ఎంత ఆలోచించినను సరియైన సమాధానము తోచదు. "ఈసెట్టివీడ యేలాగున వదలించుకొనుట" యని ఎంత ఆలోచించినను నారాయణదాసున కుపాయము తోచ

కుండెను. ఇట్లు తంటాలు పడుచుండగా ఆకస్మాత్తుగా ఆతని కొక యుపాయము తోచెను.

నారా—అయ్యా! సెట్టిగారు! ఈనాటక మాడుటకు స్థిరపరుచు కొనలేదు. నేనీవిషయమై పెద్దకలక్టరు సలహాను దీసికొంటిని. ఆతడీ నాటకమాడుటకు శలవియ్యలేదు. రాజకీయములన్న మీరేమిఅర్థము చేసికొనుచున్నారో నాకేమియు బోధపడడంలేదు. మాటల సందర్భ ములో ఈరోజున దొరగారిని ఆశ్రమమునకు వార్షిక సహాయము చేయుమని అడుగగా నేను రాజకీయ విషయములయందు సహాయము చేయ జాలనని ఆతడు చెప్పివేసెను. నేనాతని మాటలు, విని ఆశ్చర్య పడి, మీరు ఆశ్రమమును ఏ యుద్దేశముచేత రాజకీయ సంస్థగా తలచుచున్నారని ప్రశ్నించితిని. నేను దీనికేమియు జవాబు చెప్ప జాలనని మాత్రమే ఆయన జవాబు చెప్పెను.

ఈ మాటలను వినినతోడనే సుబ్బయ్యసెట్టి ముఖము వెలవెల బారెను.

సు-సె—ఐతే దొరగారు ఈ యాశ్రమమును గూడ రాజకీయము గనె తలచుచున్నారా?

నారా—ఔనండీ! ఆయన ఈమాటను స్పష్టముగానే జెప్పి వేసెను.

సు-సె—ఆతని యుద్దేశమాలా యున్నప్పు డిక్కడకు వచ్చి పోవు వారిని తప్పక కనిపెట్టుచుండవచ్చును.

నారా—ఔనండి. కాక మరేమిటి? కాని దీనివల్ల మనకొచ్చిన భయమేమిటి? సంఘమునందు అభిమానము గలవారిట్టి మాటలకు భయపడెదరా?

సు. సె—లేదండీ. నేనా సంఘాభిమానులలోనివాడగాను. రామ లీలోత్సవమును కూడ వీరు రాజకీయసంస్థగా దలచిన, దానిని కూడ

ఆపుచేయించివేసెదను. రాజకీయమన్న పేరు వినిన నావళ్లు గడగడ వణకును. మీరు మా ఇంటికి వచ్చి యొకసారి చూడండి. ఒక్క భగవద్గీత పుస్తకమైనను లేదు. బజారునుండి ఏవస్తువు దెచ్చినను ఆకు పొట్లములలోనే తెమ్మని నౌఖర్లకు కఠినముగా ఆజ్ఞాపించినాను. ప్రాతవార్తాపత్రికలను కూడ పొట్లములతోనైనను మా యింటికి తేనివ్వను. శివాజీయొక్క పురాతనపట మొకటి మా గదియం దుండెను. దానిని కూడ తీసి పెట్టిలో దాచివేసితిని. అయ్యా! దయచేసి నాకు సెల వియ్యండి.

ఇట్లు చెప్పి సుబ్బయ్యసెట్టి మోటారువైపు తొందరగాపోయెను. నారాయణదాసు తనలో, నవ్వుకొనుచుండెను. అతనికి మంచి యుపాయమె దోచినది. కాని దీనివలన ఎన్ని అబద్ధము లాడవలసి వచ్చెనో అను సంగతియే ఆతడు ఆలోచించలేదు. ఈ సేవాపరాయణుడు తన స్వంత విషయమే అబద్ధమాడుటయన్న క్రోశెడుదూరము పరుగెత్తును. కాని జాతీయకార్యమునందు అవసరము వచ్చినవ్వాడు దీని సహాయమును పొందుటకు కొంచమైనను సంకోచింపడు.

సుబ్బయ్యసెట్టి వెళ్ళిపోవగనె చందారిజిస్టరు దీసి చందాను వసూలుచేయు నిమిత్తమై బయలుదేరుటకు ఆతడు లేచెను. కాని అత డింకను గదిలో నుండగనె బలభద్రరావునాయుడు మోటారు బైసికిల్ మీద వచ్చుచుండుట ఆతడు జూచెను. కోపముచే నారాయణ దాసు వడలు నుండిపోవుచుండెను చేతిలోని రిజిష్టరును బల్లమీదకు విసరివేసి దెబ్బలాడుటకు సిద్ధమయ్యెను.

బలభద్రరావునాయుడు సైకిల్ దిగి నారాయణదాసుతో, అయ్యా! నేను నిన్నను పంపిన మొక్కలు నాటించినారా? అవి ఏలాగున్నవో జూచుటకు వచ్చాను. మామాలీని పంపమంటె పంపుతాను. వాడు బాగా నాట గలడు.

నారా—(విచారముతో) లేదండి, మీమాలీని బంప నవసరము లేదు. వాడా మొక్కల నిక్కడ నాటలేడు.

బ. నా—ఏమి? ఎందుకు నాటలేడు? మాయమాలీవచ్చి తప్పకుండ అంతా సరిచెయ్యగలడు. ఈరోజునే నాటించండి. లేకపోతే మొక్కలుఎండిపోతాయి.

నారా—ఎండినా సరే. పచ్చగా నున్నసరె. వాడుమాత్రం వాటినిక్కడ నాటజాలడు.

బనా—నాటడానికివీలు లేకపోతే ముందే ఎందుకు చెప్పివేసినారు కారు? నేనెంతో ప్రయత్నంచేసి కలకత్తానుండి తెప్పించాను.

నారా—అవిగో వరండాలోనే పడియున్నాయి. మీతో పట్టించుకు వెళ్ళండి.

బలభద్రరావునాయుడు శౌర్యముగల మనిషి. మామూలుగా చాల వినయ విధేయతగ నుండునుగాని ఎవ్వరైనను కించెము నిర్లక్ష్యముగ మాట్లాడిన కోపముతో మండిపోవును. అతడు నిర్భయుడు. వ్యవహారస్థుడు. ఈకారణములవలన అతడన్న ప్రజలకు చాల గౌరవము. చాల విస్వాసము. న్యాయము విషయమై ఆత డెన్నడును వెనుకంజవేయడు. తన స్వార్థముకొరకు, సన్మానము కొరకు ప్రజలను హింసింపడు. డాక్టర్ శ్యామలరావు ఎడల ప్రజలకింత విస్వాసములేదు.

నారాయణదాసుయొక్క ఈ నిర్లక్ష్యపు మాటలవలన ఆతనికి చాల కోపమువచ్చెను. కాని దానిని పైకి కనబడనీయక అణచుకొని నారాయణదాసుతో, "ఈ రోజున మీరెందు కింత చీదరగనున్నారు?"

నారా—నాకు తియ్యనిమాటలు చేతకావు.

బ. నా—తియ్యనిమాటలాడడం చేతకాకపోయిన ఫరవాలేదు. కట్టిమాత్రం ఎత్తకండి.

నారా—నాకు నీతులు బోధపరచనక్కరలేదు.

బ. నా—నేను కూడ కార్యనిర్వాహకసభ్యులలో నొకడనని మీరు తెరుగరా ?

నారా—ఆహా తెలుసును.

బ. నా—నేను తలచిన అధ్యక్షుడను కూడ కాగలను.

నారా—ఆఁ. సందేహ మేమి ?

బ. నా—నేను దేశానికి కూడ సహాయంలోప మెప్పుడు చెయ్యలేదు.

నారా—ఈ పాతసంగతులన్నీ జ్ఞాపకము చేయుట కవసర మేమిటి ?

బ-నా—నేను తలచిన ఈ యాశ్రమము ఒక్క నిమిషములో పడిపోవును.

నారా—అది మాత్రము అసంభవము.

బ-నా—కార్యనిర్వాహక సభ్యు లంతరు నా కనుసన్నలపై మెలగెదరు.

నారా—నిజమే కావచ్చు.

బ-నా—ఒక రోజులో దీని పేరుప్రతిష్టలు లేకుండ చేసి వేస్తాను.

నారా—అదిమాత్రం మీ తరంకాదు.

బ-నా—మీరు ఏయసరా జూచుకొని ఇంత గర్వపడుచున్నారు?

నారా—దేవుని ఆసరా జూచుకొని.

నాయుడు ఆశ్రమముపైపు కోపముతో జూచుచు సైకిలునెక్కి వెళ్ళిపోయెను గాని అతని బెదరింపులను నారాయణదాను కొంచమైనను లక్ష్యము చెయ్యలేదు. ఆశ్రమ విషయమై నాయుడు తక్కిన సభ్యులతో నేమియు జెప్పడని అతని నమ్మకము. వారితో నీ సంగతి జెప్పిన తన మర్యాదయే పోవునని అతని భయము. ఇంకను తన గొప్పను నిలువబెట్టుకొనుటకు మెంబరులవద్ద ఆశ్రమమును పొగడును.

కాని ఈ కోపాగ్ని మాత్రము ఎన్నటికైనను రగులక మానదు. అభిమానము, అవమానము నెన్నటికిని మరువదు. ఈ సంశయముల తోచినప్పటికి నారాయణదాసు మనస్సు కొంచమైనను చలించలేదు. సరికదా తన కర్తవ్యమును సరిగా నెరవేర్చ గలిగితినను సంతోషమును, ఈ విషయమై తా నెంతకింత విళంబము చేసితి ననుపశ్చాత్తాపమును కలిగెను. ఈ సంతోషమును పట్టజాలక అతడు ఉపాసగ పాట పాడసాగెను.

ఇంతలో కృష్ణశర్మ వచ్చుచుండుట అతడు చూచెను. అప్పుడే ఏడ్చిఏడ్చి కండ్లు తుడుచుకున్నట్లతని ముఖమునందు విచారమును, నిరాశయు ప్రకటితము లగుచుండెను. నారాయణదాసు ముందునకు వచ్చి, శర్మను కౌగలించుకొని, "జబ్బుపడినారా? పోలిక పట్టలేకుండా ఐ పోయినారు.

కృ-శ—నుస్తీ ఏమీలేదు. కాని మనస్సేమీ స్థిమితంగా లేదు.

నారా—వివాహ మనుకూలముగా జరిగినదా?

కృ-శ—(నేలవైపు చూచుచు) ఒక అమాయకపు బాలిక యొక్క జీవితమును నాశనము జేసి వచ్చితిమి. ఆ పిల్ల కమలా బాయి చెల్లెలే. ఈసంగతి తెలిసీ తెలియడంతోనే మాఅన్నయ్య ఎవరు చెప్పినా వినకుండా పీటలమీది పెండ్లికొడుకును లేవదీసికొనివచ్చారు. వారు కన్యాదానము చేయుటకు సిద్ధపడుచుండగా ఈఅవాంతరము వచ్చినది.

నారా—(దీర్ఘనిశ్వాసము విడిచి) చాలా అన్యాయ మైపోయినది. మీరు మీ అన్నయ్యగారిని సమాధాన పరచలేక పోయినారా?

కృ-శ—నా చేతనైనంత తంటాలు పడ్డాను. కాని ఏమీ లాభము లేకపోయింది.

నారా—పాపమా పిల్లగతి యేమగునో, కమల ఈసంగతి విన్న చాల దుఃఖపడును.

కృ-శ—ఇక్కడి విశేషములేమిటి? కమల వచ్చినతర్వాత ఆశ్రమములో ఏమి గడబిడ పుట్టలేదుకదా? ఇక్కడి వారందరు ఆమెను నీచముగ జూచుచున్నారు కాబోలు?

నా రా—ఆ సంగతి బయలుపడిన ఆశ్రమము మీరోజుననే ఖాళీ యగును.

కృ-శ—ఐతే కమల ఇప్పుడక్కడ ఏవిధముగా నున్నది?

నా రా—ఆశ్రమములో ఎన్నాళ్ళబట్టో యున్నట్లుగ అతి జాగ్రత్తగా మెలగుచున్నది. తన మంచి నడవడికలను పూర్వపు అపఖ్యాతిని పోగొట్టుకొన వలెనని ఆమె నిశ్చయించుకొనునట్లు తోచుచున్నది. ప్రసన్న వదనముతో అన్నిపనులను జేయుటకు తయారగుచుండెను. మిగిలిన స్త్రీలింకా సద్రించుచుండగనే తాను ముందుగా లేచి అన్నిగదులు శుభ్రపరచును. కొందరు విత్తంతువులకు కుట్టువని నేర్పుచున్నది. కొందరకు భగవత్కీర్తనలు నేర్పుచున్నది. అక్కడి వారందరును కూడ ప్రతి విషయమునను ఆమె సలహానే పుచ్చుకొనుచుందురు. ఆశ్రమములో ఇప్పుడామెదే రాజ్యముగా నున్నది. ఇట్లామె ప్రవర్తించునని నే నెన్నడును అనుకొనలేదు. ఇప్పుడామె పురాణకాలక్షేపము కూడ ప్రారంభించినది. ఆమె మనస్థితి ఎట్లున్నదో దేవునికే ఎరుక. కాని పైకి జూచుటకు మాత్రము ఆమె ఇప్పుడు పూర్తిగా మారిపోయినట్లగపడుచున్నది.

కృ-శ—లేదండీ. దానుగారు! ఆమె స్వభావముచేత చెడ్డస్త్రీ కాదు. ఆమె పూర్వము మా యింటికి తరుచుగా వచ్చుచుండేది? మా వాళ్ళిప్పుడును ఆమె తెలివితేటలకు, మంచితనమునకు మెచ్చుకొనుచుండెడివారు. చెడు సహవాసము, ఆనాదరణ మొదలైన పరిస్థితులామె నీస్థితికి దెచ్చినవి. నిజమాలోచించిన మన పాపఫలమే ఆమె అనుభవింపవలసి వచ్చినది. ఐతే న్యూసెన్సిఫల్ వ్యవహారము

లెల్లున్నవి! బలభద్రనాయుడు నుదేదైన క్రొత్తయెత్తు యెత్తినాడా ఏమిటి?

నారా—ఆతను గడబిడ చేయకుండ ఊరుకొనే రకమా? ఒక్కలాగ ఈవిషయమ్మీద తీరిగి పనిచేస్తూయున్నాడు. రెండుమూడు రోజుల క్రిందట సభ్యుల నందరను తన ఇంటికి ఆహ్వానించాడు. నన్ను కూడ పిలిచినాడు కాని నేను వెళ్ళలేదు. వాళ్ళనైపే బలముగా నున్నట్లు కనబడుచున్నది. ఇప్పుడిమట్టుకు వారికి మనకు ఓట్లు సమానముగానే వచ్చేటట్లు అగపడుచున్నది. అదికాక వారికి చైర్‌మెన్ ఓటు ఎక్కువ!

కృ-శే—ఐతే పనము అధమం మరి రెండుఓట్లేనా ఎక్కువ సంపాదించాలి. సంపాదించగలమని మీకేమైనా ఆశఉన్నదా?

నారా—నాకేమీ ఆశగాలేదు.

కృ-శే—మీ కవకాశ మున్నయెడల నాతో నొక్కసారి దయచెయ్యండి. డాక్టరుగారిని, భగవంతరావును ఒక్కసారి చూచివద్దాం.

నారా—నరే బయలుదేరండి. నేను సిద్ధముగానే యున్నాను.

౬

డాక్టరుగారి బంగాళా అక్కడకు దగ్గరగానేయున్నను వారు మోటారుమీదనే బయలుదేరిరి. వారి బంగాళాకు కాలినడకను వెళ్లుట క్షేమమనుకాదు. త్రోవలో నారాయణదాసు కృష్ణశర్మ ఊరిలో లేనప్పుడు జరిగిన సంభాషణమంతయు పూసగ్రుచ్చినట్లు చెప్పి తన చాతుర్యమును వెల్లడించెను. శర్మ యీసంగతులన్నియు విని విచారస్వరముతో, "ఐతే మనమిప్పుడు మరీ జాగ్రత్తగా మెలగాలి. లేని

యెడల ఆశ్రమ నిర్వహణమును వారేపహించుటకు ప్రయిత్నించి దరు. నాయు డివ్వటి కూరుకొన్నను, ఎవ్వటికైన నీరహస్యమును బయలు దీయుక మానడు."

నారా—ఏం చెయ్యను. మరిసహీయ త్యాచారమును చూచి సహించ లేక పోయాను నాఒళిలు మండిపోయినది. పైకి జూచుటకు వీరు విద్వాంసులు, బుద్ధిమంతులు, సన్మార్తనులే కాని లోపల అంతా విరుద్ధమే. నాదగ్గర సొమ్ముతో పనులు చేయించుకొను సామర్థ్యమే యున్న యెడల నాయు తో నీదెబ్బలాట రాకపోయే యుండును.

కృ-శ—ఇది యెప్పుడో యొకప్పుడు రాసలసేయున్నది. ఇదికూడ నాకర్మఫలమే. ఇంకా ఏమేము చక్కిలు రానున్నవో? ఎండ్లను డి తిరుగ వచ్చినప్పటినుండియు నామనస్సు చాలా అందోళనగా నున్నది. ఆకలివేయదు. దాహమువేయదు. రాత్రి ఒక్క సారైనను నిద్ర పట్టదు. ఎల్లప్పుడు ఆబాలికి గతియేమగునా? యన్న విచారమే మనస్సును బాధించుచుండును. ఆశ్రమ భారము కొంతమీద పెట్టి కొన్ని నిసంగతి మరపునకు వచ్చునేమో? ఎంత తలయెత్తుకొని తిరుగుదామన్న అంతకంతకు క్రిందకే అణగి పోవుచున్నాను.

ఇట్లు వీరు మాట్లాడుకొనుచుండగా బండి డాక్టరుగారి బంగాళా వద్దనాగెను. అప్పుడు పగలు పదిగంటలయ్యెను. డాక్టరుముందు సోఫా డిలో కూర్చొని తనపెద్దకుమార్తె మిస్. కాంతం శ్యామలరావుతో చతురంగము నాడుచుండెను. మేజాపైని రెండు జాతికుక్కలు కూర్చుని ధ్యానముతో నాటను జూచుచుండెను. వాటికి వినువు పుట్టినప్పుడు పంజాతో ఆబలగమును యిటునటు త్రోసివేయుచుం డెను. మిస్. కాంతం, వాటి పెంకితనమును జూచి నవ్వుచు ఇంగ్లీషు భాషలో "యు-నాటీ!" అని తట్టుచుండెను. మేజా కెడమవైపున ఐడక కుర్చీలో కూర్చుని రామారావు మధ్యమధ్య మిస్. కాంత

మున కాటలో సలహా నిచ్చుచుండెను.

ఇంతలో మన మిత్రులిద్దరును అక్కడకు వచ్చిరి. డాక్టరు లేచి వారిద్దరితోను "షేకు హేండు" చేసి సత్కరించెను. కాంతంవారి వైపొరకంటితో జూచి, మేజాపై నున్న వార్తాపత్రికను దీసి చదువ సాగెను.

డా. శ్యా—(ఇంగ్లీషులో) మిమ్మలిని కలుసుకోవడం నాకు చాలా సంతోషంగా నున్నది. వయచే శ్యాంకి మీకు మిస్. కాంతంతో పరిచయం చేస్తాను.

పరిచయమైన తర్వాత మిస్. కాంతం వారిద్దరితోను "షేక్ హేండు" చేసి నవ్వుచు, "నాన్నగారి వప్పుడే మీ సంగతి చెప్పుచున్నారు. మీ పరిచయం కావడం నాకు చాలా సంతోషముగా నున్నది." అని పలికెను.

డా. శ్యా—చూ కాంతం యీమధ్యనే ఊటీనుండి వచ్చినది. వీళ్ళ స్కూలు చలికాలంలో మూసివేస్తారు. అక్కడి స్కూలు యేర్పాట్లు చాలా బాగున్నవి. ఈమె ఇంగ్లీషు బాలికలతో బోర్డింగులోనే ఉన్నది. లేడీస్సిన్సిపాలు ఈమె తెలివితేటలు మెచ్చుకొనుచు నిప్పుడే యుత్తరం వ్రాసినది. కాంతం! మీ లేడీస్సిన్సిపాలు వ్రాసిన యుత్తరము వీరి కొకసారి చూపించు. మిస్టర్. శర్మ! మీరు మా కాంతం యింగ్లీషు మాట్లాడడం చూస్తే నిజంగా ఆశ్చర్యపోతారు. (నవ్వుచు) ఈమె ఇంగ్లీషు ఉచ్చారణలో నాకు కూడ తప్పులు దిద్దుతూ ఉంటుంది.

కాంతం సిగ్గుపడుచు స్సిన్సిపల్ వ్రాసిన ఉత్తరమును శర్మకు జూపెను. ఆయన దానిని చదివి, కాంతంతో, "మీరు లాటిన్ కూడ చదువుచున్నారా?" యని ప్రశ్నించెను.

డా. శ్యా—(ఆ మాటనందుకొని) ఈసారి లాటిన్ పరీక్షయం

దీమెకు మెడలు (పతకము) కూడ వచ్చినది. నిన్న క్లబ్బులో నీమె టెన్నిస్ ఆటను జూచి ఇంగ్లీషు స్త్రీలు కూడ ఆశ్చర్యపోయారు. అన్నట్లు మీరు మొన్న నాయుడుగారింట్లో జరిగిన సమావేశమునకు వచ్చినట్టులేదే?

శర్మ—లేదు. అప్పుడు నేను మా గ్రామమునకు వెళ్ళియుంటిని.

డా. శ్యా—మీ తీర్మానమునుగురించే చర్చ జరిగినది. మీరీ తీర్మానమును వొంగరవడి కౌన్సిలులో పెట్టవద్దని నా అభిప్రాయము. ఇంకా అది నెగ్గుటకు తగిన బలము కనబడదు.

రామా—మునల్ మానుసభ్యులు మీకు సహాయము చేసెదరని నాకు నమ్మకముగా నున్నది.

శర్మ—(డాక్టరుతో) మీ సహాయమే నిజముగా నున్న యెడల నీతీర్మానము నెగ్గుటలో సందేహా మేమియులేదు.

డా. శా—నాకీ తీర్మానమునందు పూర్తియైన సానుభూతి యున్నది. కాని నేను గవర్నమెంటుచే నామినేటు చేయబడ్డ సభ్యుడ నని మీ రెరుగరా? గవర్నమెంటీ విషయముల నామోదించెదరో లేదో తెలుసుకొనేవరకు నే నిటువంటి సంఘ విషయములలో నెటు వైపు నా యుద్దేశమును వెలిబుచ్చజాలను.

నారా—(తీవ్రస్వరముతో) ఈ మొబరు పదవినలన మీరాజ్ స్వాతంత్ర్యమునకు విరోధము కలిగినప్పుడు వీరికి వెంటనే రాజీనామా యిచ్చుటయే మేలు.

వారు ముగ్గురు కూడ నారాయణదాసుదొక్క యీ అనవసరపు ప్రసంగము విని అతనివైపు తీక్షణముగా జూచిరి. రామారావు మర్మసూచకముగా, "రాజీనామా నిచ్చిన నీనతీర్మానమంతయు ఎట్లు వచ్చును? గవర్నరుజనరల్‌తో సమానముగా నెట్లు కూర్చొన గలరు? ఆనరబుల్ మెంబరని యెట్లసపించుకొనగలరు? గొప్పగొప్ప

దొరలతో "మేక్ హేండు" చేయు భాగ్య మెట్లు కలుగును ? గవర్న మెంటుడిన్నర్లకు ఆహ్వానింపబడు గౌరవ మెట్లబ్బును ? చెన్నపట్నం ఫిల్లీ షికార్లెట్లు కొట్టగలరు ? తమ వక్తృత్వచమత్కార మెట్లు ప్రదర్శింపగలరు ? ఈ సంగతులనన్నియుకూడ నాలోచించండి." అని నవ్వుచు పలికెను. ఈ మాటలు విని నారాయణదాసు సిగ్గుపడెను. దానును తీసుకొనివచ్చుట పొరపాటని శర్మ మనస్సులో చాల నొచ్చుకొనెను.

డా. శ్యా—(గంభీరస్వరముతో) ఇటువంటి గొప్పలకొరకే మెంబరు పదవుల కాశించెదరని సాధారణపు మనుష్యులనుకొనెదరు. కాని యిదెంత పూచీవనో వారెరుగరు. ఈ మెంబర్లెంత యాలో చింపవలసియున్నది ? దీనికొర కెంత పరిశ్రమ చేయవలెను ? ఎంత ధనము ఎంత సమయము వినియోగింపవలెను ? వీటి యన్నిటికి ప్రతిఫలము. "నేను దేశసేవ చేయగలుగుచున్నానుగదా !" యను సంతోషము తప్ప మరేమున్నది ? ఈ సంతోషము కూడ లేక పోయిన యీ మెంబరు పదవుల కెవరాశించెదరు ?

రామా—ఔను, ఇందులో సందేహ మేమున్నది ? డాక్టరు గారు బాగా శలవిచ్చినారు. ఎవరిమీద నీపూచీపనో వారికే యీ కష్టసుఖములన్నియు బాగా తెలియును.

ఇంతలో పదకొండు గంటలయ్యెను. డాక్టరు లేచుచు శర్మతో "నా భోజన సమయమైనది. నాకు శలవియ్యండి వెళ్ళుచున్నాను. సాయింత్రం మళ్ళీ కలుసుకుందాము."

శర్మ—తమరవశ్యము దయచేయవచ్చును. (తనలో) కొంచెము భోజన మాలస్యము కాగానే ఈకడితో తొందరపడిపోవుచున్నాడు. ఇటువంటివాడు దేశముకొర కేమిపని చేయగలడు ? దేశసేవకులమని చెప్పుకొనగలరు ; కాని కొంచెమైనను కష్టమున కోర్చలేరు.

అక్కడినుండి వీరు భగవంతరావు వింటికి వెళ్ళిరి. అత డొండలో వడకకుర్చీలో వండుకొని చుట్ట కాల్చుచుండెను. ఆతని చిన్నకుమార్తె వడిలో కూర్చుని ఆపొగను వట్టుకొనుటకు మాటి మాటికిని చేతిని జాపుచుండెను. ఆతని కెదురుగా నేలపైని చాలమంది మేస్త్రీలు, కూలీలు కూర్చుని ఉండిరి. భగవంతరావు శర్మను చూడగానే లేచి నమస్కరించెను.

భగ—నిన్న సాయంత్రమే తము గూరినుండి దయచేసినారని విన్నాను. ప్రొద్దుటే తము దర్శనమునకు రావలె ననుకున్నాను. కాని యీ వనితొందరలనుండి తీరుబడి యైనదికాదు. ఈ కంట్రాక్టరువని చాలా చీదర్తైన వని. ఇవ్వటి ఇంజనీయరు సాహేబు నావనిని వసందు చేయక ప్రతీ విషయంలోనూ చీదర వడుతూనే వుంటాడు. ఒక వంతె నను కంట్రాక్టుగు తీసుకున్నాను. ఇదిబాగులేదని అదిబాగులేదని అప్పుడే ఆరంతెనను మూడుసార్లు వడగొట్టించాడు. లాభమేమి టీలాగుచేస్తే మీదుమిక్కిలి నష్టమే వస్తుంది. అతి కఠోర్కుడు. ఆతని ననేవాళ్ళేనరు? అన్నట్టు మొన్న మనమెంబర్ల సమావేశ మైనట్లు తమరు వినే ఉంటారు.

కృ-శ—ఆఁ. విన్నాను. ఆ సంగతులు వినగానే చాలా విచార మైనది. ఇప్పుడు మీమీదే ఆశపెట్టుకుని యున్నాను. ఈ సంస్కరణ విషయమై మీ యుద్దేశమేమి?

భగ—ఇది కేవల ముపయోగమైనదని చెప్పుటయేగాక నాకు హృదయపూర్వకముగా మీకు సహాయము చేయవలెనని యున్నది. కాని నాయుద్దేశమునకు నేను స్వతంత్రుడను కాను. నేను స్వార్థమున కమ్ముడు పోయినాను. నన్ను గ్రామఫోను రికార్డే అనుకోండి. నన్ను వారు యేది చేయమన్న అది చేయుటతప్ప మరియొక విధముగ నడుచుకొన జాలను.

శర్మ—కాని స్వార్థముకన్న సంఘసేవయే ఉత్కృష్ట మైనదని మీరు ఒప్పుకొనరా?

భగ—ఆహా! దీనిని సిద్ధాంత రూపముగా ఒప్పుకొనుచున్నాను కాని ఆచరణలో పెట్టుటకు శక్తిలేదు. నా వ్యవహార మంతయు సుబ్బయ్యశెట్టి సహాయముమీదనే ఆధారపడి యున్నదని తమరెరిగే యుందురు. అతనికి కోపము తెప్పించి నష్టపరచిన నా వ్యవహారమంతయు నాశనమగును. నాకు సంఘములో జరుగుచున్న మర్యాద యంతయు నీ కంట్రాక్టు వలననేకదా! నేను విద్వాంసుడను కాను. వీరి సహాయమువలననే నా వ్యవహారము పుట్టుగా జరిగిపోవుచున్నది. నే నే మాత్రం నాయిష్టప్రకారం నడచినా వీరు నన్ను నేతిలోని ఈగను తీసి పారవేసినట్లు చేయుదురు. మీరే చెప్పండి ఈ పట్నంలో నన్ను నమ్మి వడ్డీలేకుండా వేలకొలది రూపాయలు బ్యాంకులెవరిస్తారు? పిల్లల గలవాడిని. కేవలము నా యింటిఖర్చులే నెలకు రెండువందల రూపాయిలగును. సంఘసేవయందు కష్టములను సహించుటకు నేను సిద్ధముగా నున్నాను గాని నాభార్యా పుత్రులు నెట్లు నిరాధారులను జేయుగలను.

మనము మన విధులను నెరవేర్చుట కిష్టములేనప్పుడు ఆదోషములనుండి తప్పించుకొనుట కెనుటివారు నోరెత్తలేకుండ అనేక యుక్తులను పన్నెదము. అటువంటి సమయమందు సంకోచము విడిచి మన రహస్యములను కూడ బయలుపెట్టకుందుము. భగవంతరావు హృదయమునం దీభావములే వనిచేయుచుండెను. శర్మ యీతని యాశలేదని తలచి, "ఇటువంటి స్థితిలో నిమ్మలి నెట్లు బలవంత పెట్టగలను! నాకింక ఒక్కవోటు మాత్రమే కావలసి యున్నది. అది సంపాదించుట కేమైన నుపాయము చెప్పగలరా!" అని యడిగెను.

భగ—రామదేవుగారింటికి వెళ్లండి. దేవుని దయవలన మీకా వోటు రావచ్చును. బలభద్రరావునాయుడు ఆయనమీద మూడు వేలకు దావా తెచ్చినాడు. అది నిన్ననే డిక్రీ కూడా అయినది. రాజుగారి కిప్పుడు నాయుడిమీద చాలా కోపముగా నున్నది. సందు దొరుకుతే కసి దీర్చుకొనుటకు చూస్తున్నాడు. ఆయనను లొబరచు కొనుట కింకొక ఉపాయము కూడ జెప్పెదను. ఆతని నిప్పుడే ఏదో యొక సభ కధ్యక్షునిగా చెయ్యండి. సరి ఇక నాతడు మీ చేతిలోని వాడే.

శర్మ—(నవ్వును) ఉపాయం చాలా బాగున్నది. ఇప్పుడే వారింటికి కూడా వెళ్లుచున్నాము.

రెండుఝాములైనప్పటికి శర్మ కాకలి, దాహము అనిపించలేదు. ఆతడు వెంటనే కాగుమీద బయలుదేరెను. రాజుగారి బంగాళా సదిగొడ్డున నుండెను. దానిని చేరుటకు పూర్తిగా నొకగంట పట్టినది. బంగాళాయని పేరే కాని శుభ్రత యేమియులేదు. సొగసులేదు. పేరునకు దానిచుట్టు తోటకలదు కాని దానిలో నొకపూలమొక్క యైననులేదు. పరిండామీద యెన్నోరకముల కుక్కలు కట్టబడి యుండెను. ఇంటికి దగ్గరగానే గుఱ్ఱపుసాల. అతనికి వేటకున్న మిక్కిలి సరదా. అందుచేత తరచుగా నాతడు వేటకుపోవుచుండును. ఇప్పుడాతడు తనగదిలో కూర్చుని వీణ వాయించుచుండెను. గోడల నిండ పులిచర్మములు దుప్పికొమ్ములు మొదలైనవి తగిలింపబడి యుండెను. ఒకవైపు పిస్తోళ్లు, బల్లెములు కత్తులు వేలాడుచుండెను. ఇంకొకవైపున బల్లమీద పెద్ద గడియారము "టిక్కు" "టిక్కు" మనుచుండెను. శర్మ గదిలోనికి రాగానే రాజాతని జూచి గతుక్కు మనెను. గదియంతయు అతి అసహ్యముగాను చిందరవందరగాను ఉండెను. రాజు వెంటనే లేచి శర్మకు ప్రేమతో స్వాగతమిచ్చుచు,

"శర్మగారు! దయచెయ్యండి. తమకర్నసమీ దూర్నభమై పోయినది. గాత్రమునుండి యెప్పుడు దయచేసినారు!"

శర్మ—నిన్ననే వచ్చినాను.

రా. దే—ముఖము చాలా వాడిపోయియున్నది. జబ్బు చేసినదా?

శర్మ—లేదు మీ దయవల్ల ఆరోగ్యముగానే యున్నాను.

రా. వి. దే—లోపలెం ఫలహారం పుచ్చుకోండి, తెప్పిస్తాను.

శర్మ—అయ్యా! తమిందుండి వెళ్ళిన పిమ్మట ఫలహారం చెయ్యవలసిన వీణమీది సాధకము చేయుచున్నారా?

రా. దే—ఆ దీను. నిన్న వీణంటే చాలాసరదా. హార్మోనియం మన్నా పియానా అన్నా నాకు తలనొప్పి. ఈ గ్లీషు వాయిద్యములువచ్చి మనసంగీతమును నాశనము జేసినవి. ప్రప్పుడి విమర్శమ్మయ్యే ప్రశ్నోటను చర్చలు జరుగుచున్నవి. ఈ కాలకాలు వచ్చినతర్వాతి ఉన్న శాస్త్రంకూడా చెడిపోయినది. ఎవరుబూచినా రాగాలాపన చేసేవారే. ఇంక కొన్నరోజులలో ధనుర్విద్యవలె పాటకూడ నశించి పోవునేమో యని భయముగా నున్నది. సంగీతమువలన హృదయము నందు పవిత్రోద్దేశ్యములు పుట్టును. ఈసంగీత విచారము తిగ్గిన కొలదీ మనము భావశూన్యుల మగుచున్నాము. దీనివలన సాహిత్యము కూడ చెడిపోవుచున్నది. ఏ దేశమునందు భారతి రామాయణాది మహాగ్రంథములు రచియింపబడినవో ఆదేశమునందిప్పుడు సాధారణ నవలలకుకూడ అనువాదమునే ఆశ్రయించవలసి వచ్చుచున్నది. త్యాగరాజువంటి మహాపురుషులు జన్మించిన మనయాంధ్రదేశమందు సంగీతము నశించుచుంట శోచనీయము! బుగాళా, ద్రావిడదేశము లందు సంగీతమింకను పూర్తిగ నశింపనందున అక్కడి భావోద్దేశము లంత నశింపలేదు. మనసాహిత్యములో అనువాదములు తప్ప స్వతంత్రగ్రంథములంతగా లేకపోవుటవలన నాకు చదువుట యందాసక్తి

కూడపోవుచున్నది. ప్రపంచమునందే సాహిత్యము నింతదరిద్రస్థితిలో నున్నదనుకోను. ఇంగ్లీషునుండిగాని, బంగాళీనుండిగాని రెండుమూడు పుస్తకముల కనువాదమును జేసి తమంత భాషాసేవకులు లేరని కొందరు గర్వపడుచుందురు. ఒక మహాశయుడు కాళిదాసునాటకము లను తర్జుమాచేసి తాను ఆంధ్రకాళిదాసునని తలచి యానందించును.

రాజుకు సాహిత్యమునం దింత పరిచయము కలదని తెలిసి శర్మ చాల చాల యాశ్చర్యపడెను. ఈతనికి "కొన్నిసు" ఆట, వేట తిప్ప నితర విషయములం దభిమానము లేదని శర్మ యిదివరకు తలచెను. తాను సాహిత్యమున కపరిచితుడైనను, తన లోపమును రాజుముందు ప్రకటింపలేదు. ఈ సంగతులన్నియు బోధపడీనట్లు చిరునవ్వు నవ్వుచు, "రెండువైపులాసబబులు కలిగినటువంటి విషయమును మీరు ప్రారంభించినారు. దీని విషయమై వాదించుట కిప్పుడు నాకు తీరికలేదు. నే నిప్పుడు మరియొక పనిమీద వచ్చితిని. మొన్నటి మ్యూనిసిపల్ మెంబర్ల సమావేశమందు మీరు నాయుడిపట్ల మన లంభించినట్లు తెలియవచ్చినది. నిజమేనా?"

రామదేవీమాటలు విని పకపక నవ్వసాగెను. అతని నవ్వు గది యంతయు ప్రతిధ్వనింపసాగెను.

రా-దే—ఈసంగతి మీరెవరివలన విన్నారు? నిజంగా చెప్పండి?

ఈ నవ్వుయొక్క అర్థము తెలియక కృష్ణశర్మ తెల తెల్లపోయెను. ఆతడు తన్ను హేళనచేయుటకట్లు నవ్వుచున్నాడని తలచి, కొంచెము విసువుతో, "అందరూ చెప్పుచున్నారు. ఎవరి పేరని చెప్పను."

రా. వి. దే—(ఇంకా గట్టిగా నవ్వుచు) ఐతే మీరీ మాటలు నమ్మివేశారా?

శర్మ—(మరింత చీదరతో) నమ్మకపోవుటకు నాకేమియు కార ణము కనపడలేదు.

రా. వి. దే—నాకు ఘోరాన్యాయముచేయుటయే కారణము మీ తీర్మానము బలపరచుటకు నా శాయశక్తులు వినియోగించితి ననియే నేను నమ్ముచున్నాను. ప్రతిపక్షులతో విరోధము వచ్చునని కూడ నేను వెనుదీయలేదు, ఇవ్వాడు మ్యూనిసిపాలిటీలో సాధారణోపన్యాసమునైనను అర్థము చేసుకోలేని మహానుభావులు మెంబర్లుగా జతపడినారు. ఇది యెంత విచారకరము ? ఇట్టివారు చేరకుండ మనము ప్రయత్నము చేయవలెను. శర్మగారు ! మీ కింతవరకు శ్రమ యిచ్చినందుకు క్షమించండి. మీ తీర్మానమును హృదయపూర్వకముగా నే నామోదించుచున్నాను.

కృష్ణశర్మ కిప్పుడు దేవు మాటలయందు విశ్వాసము కలిగెను.

శర్మ—(నవ్వుచు) ఈ చెప్పినవా రందరు మోసపోయినవా రిది తెలివితక్కువ ఆలోచనే కాని, ప్రభాకరరావుగారు మోసపోవడం మాత్రం నమ్మశక్యము కాకుండా యున్నది.

ఎల్లప్పుడు పత్రికగొడవలో కొట్టుకొనిపోవుచుండుటవలన యీతని బుద్ధికూడ మందగించిపోయినదేమో !

కృష్ణశర్మ కిప్పుడు గొప్ప జయము కలిగినంత సంతోషము కలిగెను. రాజు ప్రేమాదరములు మాటలనేర్పు ఆతనిని వశము జేసుకొనెను.

౮

చాల సంవత్సరములు కష్టపడి సంపాదించిన సొమ్ముతో నిల్లు భూములు కొనవలెనని ఉత్సాహపడుచు పెట్టి నెరచి చూడగా అందులో నొక్క దమ్మిడీయైనను కనబడకపోయిన మనసెట్లు వ్యాకుల

ముగా నుండునో ఆవిధముగనె ఇప్పుడు మోహానుని మనస్సుండెను. స్వతంత్రాలోచన, విద్య, సత్సహవాసము, అనుభవములపై నాధార పడి యున్నది. మోహానుసివద్ద నిటువంటి గుణము లేవియు లేవు. ఆతని ఉద్దేశములతి చంచలములు. ఆతడు కమల నెంత ప్రేమించి నను, తన జాతి పోవునను భయపువలన ఆమె ఎంత బలవంతపెట్టి నను అమె చేతి మంచినీళ్లైనను త్రాగలేదు. అట్టి స్థితిలో కమల చెల్లెలను పెండ్లియాడి, తన వంశమునకు కళంకము తెచ్చుకొనుట కెట్లు సమ్మతించును ?

మన సంప్రదాచారములయందు ధార్మిక విషయములయందు నొక విధమైన అభిమానము కలిగినప్పుడు మనస్థితి ఎట్లుండునో అట్లే ఇప్పుడు మోహానుని స్థితియుండెను. అట్టి సమయములో వాటియందు మనకేమియు లోపము కనబడదు. మన ఆచారములకు విరుద్ధముగా మంచి ప్రవర్తనములను విననెడల మన మనస్సునందు విశాల భావ ముండదుకదయింపవు; మునుపటివలె ఆడవాండ్రు నవిస్నాన మునకుగాని, ఇరుగు పొరిగిండ్లకుగాని వెళ్లుట మోహానున కిష్ట మిష్టము లేకుండెను. ఇంటిలో ఆడువాండ్రు గట్టిగా మాట్లాడిన ఆతడు లోపలకు వెళ్ళి తల్లిని మందలించు చుండును. సుభద్రమ్మకు తన అత్తగారి భాయిదాయైన నింత కఠిన మనిపించలేదు. ఇప్పుడతని బుద్ధి సంకుచితమై పోయెను. ఆగ్రామములో నొక బ్రాహ్మణుడొక స్త్రీని లేవదీసికొని వచ్చి ఇంటిలో పెట్టుకొనుటయు, గ్రామవాసు లందరు అతనిని వెలివేసి అనేక బాధలు పెట్టుటయు, ఆ బాధలు పడ లేక ఆబ్రాహ్మణుడా స్త్రీని ఇంటినుండి తగిలివేయుటయు, మోహాను డిదివరకు చూచియుండెను. ఆతడు నిశ్చయముగా కమలను ప్రేమించు చుండెను. కమలను ప్రేమించవచ్చునుగాని ఆమె నీడయైనను ఇంటి వైపు రాకూడదని అతని లౌకికశాస్త్ర సిద్ధాంతము. ఇప్పటినరకతడు

కమల ఇంట్లో మంచినీళ్లైనను త్రాగలేదు. తన వంశమర్యాదను, సంభూచారములను, తానెంత కష్టపడియైనను నిలువబెట్టవలెనని అతని సిద్ధాంతము. ఒక కులట బంధుత్వమువలన తన వంశమునకుకళంకము, నింద వచ్చునని తలచుకొనుటకు కూడ అతనికి అసహ్యముగ నుండెను. విడిదియందు కృష్ణశర్మ మాటలను విని, మోహనుడు అధీరుడగుచుండెను. తన తండ్రి అతనిమాటల కెక్కడ లొంగిపోవునోయని అతడు భయపడుచుండెను. తన పినతండ్రీ విషయమై ఎందుకింత పట్టుదలగా నున్నాడో అతనికి బోధపడకుండెను. తన పినతండ్రి యనిన మాటలే మరియొక రనిన, మోహనుడు వారికి తగినట్లు జవాబు చెప్పియుండును. కాని అతనిమీద ఉన్న గౌరవమువలన నేమియు అనలేక పోయెను. సమయము దొరికినప్పుడు తన పినతండ్రితో వాదించవలెనని మోహనునికి చాల కోరికగా నుండెను. ఆతని తార్కికశక్తి ఎప్పుడు నింత ఉత్తేజితము కాలేదు. ఈ తర్కవితర్కములు జరిగిన, అతడు తన పినతండ్రితో తప్పక దెబ్బలాడియే యుండును. కాని సోపాలశాస్త్రియొక్క కఠినత్వము అతని యొక్క ప్రతివాదవుత్సాహమును సానుభూతిలోనికి మార్చివేసెను.

ఈ ఆశలన్నియు నిరాశ లగుటవలన మోహనుని ఆశాపూరిత హృదయము తిరిగి కమలవైపు పరుగెత్తెను. విషయ వాసనను రుచి చూచిన హృదయమిప్పుడు అంధకారములో నుండుట కిచ్చగింపదు. అతడు పల్లెటూరిలో నుండలేక తిరిగి కళ్యాణపురము వచ్చివేసెను. కాని ఇక్కడకు వచ్చినతర్వాత నతడు పెద్ద సందిగ్ధావస్థలో పడిపోయెను. జరిగిన సంగతంతయు కమలకు తెలిసిపోయిన దేమోయని అతనికి సంశయముగా నుండెను. అతడు తనలో "కమల పెండ్లివారింటికి వచ్చియుండదు. తప్పకుండ వారామెకు బహిష్కరించి యుండును. కాని ఈ వివాహముయొక్క సమాచార మంతయు ఆమెకు

తెలిపియుండురు. అంతువలన ఆమె నాతో సరిగా మాటలాడ దేమో? ఒకవేళ తిరస్కారముకూడ చేయుచున్నను." అని అనుకొనెను.

కాని సాయంత్రము పడగనే అతడు బట్టలు మార్చుకొని గుర్రము మీద బజారువైపునకు బయలు దేరెను. ప్రేమసంఘటన యొక్క ఆనంద పూర్ణకల్పనలలోనుండు నీసంశయము లన్నియు మాయమై పోయెను." కమలముండుగా ఏమిమాట్లాడును? నేనామెకేమి జవాబు చెప్పుదును? ఒకవేళామె కీసంగతులేమియు తెలియక, నేను వెళ్లగనే ప్రేమతో ఆలింగనము చేసికొని, నీవుచాల కఠినాత్ముడవు అని అనునేమో?"

ఈ కల్పనలాతని ప్రేమాగ్నిని మరింత రగుల్కొలిపెను. అతడు గుఱ్ఱమును పరుగెత్తించి యొక్కనిమిషములో బజారువీధిని చేరెను. ఆటలాడు పిల్లవాడు పాఠశాల గుమ్మములోనికి వచ్చి కూడ లోపలకు పోవుటకు భయపడునట్లు మోహనుడు సానివీధికివచ్చి కూడ నొక్కసారి వెనుకకు తగ్గెను. అతని ప్రేమాకాంక్ష మందగించెను. అతడు నింపాదిగ కమల మేడ అగుపడునట్లొక వైపునకు పోయి అక్కడనుండి ధ్యానముతో ఆ మేడవైపు జూచెను. ఆ యింటితలుపు మూసి తాళము వేయబడి యుండెను. అది చూడగనే ఆతని హృదయమునందు పెద్ద బరువు దిగినట్లయ్యెను. డబ్బు తనవద్ద లేకపోయినను పిల్లలపోరు పడలేక బొమ్మలు కొనుటకు బజారునకు వెళ్ళి, దుకాణము మూసియుండుట జూచి అతడెంత సంతోషించెనో అట్లే మోహనుడు కూడ సంతోషించెను.

కాని అతడిల్లు చేరగనే ఈ యుదాసీనతకు చాల పశ్చాత్తాప పడెను. వియోగబాధతో కూడ నతనికి నిరాశ యొక్కువగుచుండెను. ధైర్యమేమియు నిలువకుండెను. రాత్రి అందరుభోజనములై

నిద్రించిన తర్వాత ఆతడు నెమ్మదిగా లేచి సానివీధివైపు బయలు దేరెను. చలికాలమగుటవలన చలి బాగుగ వేయుచుండెను. చంద్రుడు మేఘముల చాటునుండి తొంగిచూచుచు గాఢరాపడు మనుష్యులవలె వేగముగా పరుగెత్తుచుండెను. మోహనుడు సానివీధి నకు తొందరగా పోయెను. కాని అక్కడ చేరగనే అతని కాళ్ళకు నంకెళ్లు తగిలించినట్లయ్యెను. కాళ్లుచేతులువలె అతని ఉత్సాహము కూడ చల్లబడిపోయెను. "ఇటువంటి సమయమున నందు నేనిక్కడకు వచ్చుట చాల హాస్యాస్పదము. ఇప్పుడు కమల ఇంటికివెళ్ళిన ఆమె ఏమనుకొనును! ఆమె నౌకరులు కూడి నిద్రించి యుందురు. నాపి లుపునకై పలుకుమారెవ్వరు. నేనిత తేలివతక్కువగ ఇప్పుడిక్కడ కెందుకు వచ్చితినో నాకే ఆశ్చర్యముగా నున్నది. నాబుద్ధి ఏమైనది ఆని విచారించుచు ఆతడింటికి బయలు దేరెను.

మరునటి సాయంత్రమతడు తిరిగి కమల ఇంటివైపు బయలు దేరెను. కమల చూచి పిలచిన వెళ్ళవలెనుగాని, లేకయెడల ఇంటికి పంచవేయవలెనని యతడు మనస్సులో నిశ్చయించుకొనెను. "ఆమె నన్ను పిలచుటయే ఆమెకు నాయెడల అనురాగము లేదనుకొనుటకు తార్కాణము. లేకపోయిన ఆమె నన్నెందుకు పిలచును!" కొంతదూరము నడచిన తర్వాత "ఆమె నన్ను పిలచుటకు, నేను వచ్చుచున్నానని ఆమె కల గన్నదా! అదికాదు. నేనే ఆమెవద్దకు వెళ్ళవలెను. ఆమి నన్నప్పుడూ కోపపడజాలదు. ఆమె కొకవేళ కోపమువచ్చిన నేను సమాధాన పరచజాలనా! చేతులు జోడించి, ఆమె కాళ్ళపై బడెదను. నాకన్నీళ్ళతో ఆమె మనోమాలిన్యమును కడిగివేసెదను. ఆమెకు నాపై నెంతకోపము వచ్చినను, నాప్రేము చిన్నాముని తన హృదయముసుండి పెరికివేయ జాలదు. ఆహా! ఆమి తన కమల నేత్రములను నీటితో నించి నావైపు జూచిన నేనామె

రక్షకేమిచేయ జాలకుందును? ఆమె హృదయము నందేమైన విచారమున్న యెడల దానిని తొలగించుటకు నాప్రాణమునైనను అర్పించుటకు సిద్ధముగా నున్నప్పుడు ఆమె నాఅపరాధమును క్షమింపదా!" కాని అతడు సానివీధి చేరగనే ఈకల్పనలన్నియు నిలచి పోయెను తిరిగి "ఆమె నన్నుజూచి తనలో, 'ఓహో! ఈయన పెద్ద జమీందారునివలె బయలుదేరినాడు? ఎంతకవటుడు? ఎంతధూర్తుడు? అని ఆనుకొనునేమో!" ఈసంగతులు స్ఫురించగనే కాళ్లు కట్టుబడినట్లయి మరి ముందుకు వెళ్ళలేకపోయెను.

ఈప్రకారము చాలరోజులు గడచిపోయెను. రాత్రింబగళ్లు ఈశ్రీమకల్పనలతో గట్టిన యినుక మేడలు సాయంసమయమందు సానివీధి ఎదుట, అవిశ్వాసమను గాలిచే పడిపోవుచుండెను.

ఒకనాడాతడు క్వీన్సుపార్కువైపు బయలుదేరెను. ఆపార్కునందు పెద్ద పందిరివేయబడి యుండెను. అనేకులు ఆపందిరిక్రింద కూర్చొని ప్రొఫెసర్ శంకరరావుగారియొక్క ఉద్రేకపూరితమైన ఉపన్యాసమును శ్రద్ధతో వినుచుండిరి. మోహనరావుకూడ గుఱ్ఱము దిగి శ్రద్ధతో వినసాగెను. "నిజముగ వేశ్యలవలన మనకు చాల హానికలుగుచున్నది. వారు సంఘమునకు వేరుపురుగులవంటివారు నేనింతవరకు నేలాగో రక్షింపబడితిని. లేనియెడల నాస్థితి ఏమై యుండునో? వీరిని తప్పక పట్టణమునుండి బయటకు పంపివేయవలసినదే. వీరు బజారునందు, పట్టణమధ్యయందు లేనిఎడల నేను కమలాబాయియొక్క మోహజాలమునందు చిక్కుకొనకపోయియే యుందును." అని మోహనుడు తన మనస్సునందు అనుకొనెను.

మరునటి దిన మాతడు తిరిగి పార్కువైపు వెళ్లెను. ఈ రోజున అబ్దుల్ వహాబ్‌సాహేబు భావపూర్ణమైన ఉపన్యాస మిచ్చుచుండెను. మోహనుడు దానిని కూడ శ్రద్ధతో వినెను. "నిస్సంశయముగ

వేశ్యలవలన మనము చాల సుఖకారమును పొందుచున్నాము. వీరు లేని ఎడల మన దేవతలను స్తుతించువారే లేకపోయియుందురు. ఈతడు చెప్పినమాటలు నిజమే. వేశ్యాగృహములే హిందూమహమ్మదీయులు సఖ్యముతో కలుసుకొనుటకు తగిన స్థలములు. ఇక్కడ ద్వేషమనుమాట ఉండదు. ఈ జీవనసంగ్రామమునుండి కొంతసేపు విశ్రాంతిపొందుటకును, మనస్సునందుండు కలతలను, దుఃఖములను, మరచిపోవుటకు నివియే తగిన స్థలములు. వీని పట్టణమునుండి తగిలివేయుట వీరికే కాక సంఘమునకింతకును అన్యాయము చేసినట్లగును.'' అని మోహనుడు అనుకొనెను.

కొన్ని దినములకీ యుద్దేశములు కూడ మారిపోయెను. వాటికి స్థిరత్వము లేకుండెను. స్వతంత్రముగ నాలోచించుటకు మోహనునికి శక్తిలేదు. ఆ విషయమందైనను మంచిచెడ్డలు నెంచుటకు, మంచిని స్థిరపరచుటకు ఆతనికి సామర్థ్యము లేకుండెను. అందువలన ఏవైపు ఎవరు యుక్తిగ జెప్పిన, ఆతని మనస్సావైపునకు తిరిగిపోవుచుండెను.

ఆ రోజున "కృష్ణశర్మగారు వన్యాసమిచ్చెదరని" నోటీసులో మోహనుడు చూచెను. మోహనుడు మూడుగంటలైనప్పటినుండియు ప్రయత్నపడి, నాలుగు కొట్టగనే తిలక్ మైదానమునకు వెళ్ళెను. అప్పటి కింకను చాలమంది ప్రేక్షకులు చేరలేదు. కొంద రింకను జంబుకానాలు పరచుచుండిరి, మోహనుడు గుఱ్ఱముదిగి వారికి సహాయము చేయుచుండెను. ఐదుగంటలు కొట్టునరికి ఆ స్థలమంతయు ప్రేక్షకులచే నిండిపోయెను. ఇంతలో కృష్ణశర్మ మోటారులో వచ్చుచుండుట జూచి, మోహనుని గుండె దడదడ లాడసాగెను. ముందటతేగాలీ రచించిన పద్యములను బారిష్టర్ శివరామ్ చదివెను. తర్వాత నారాయణదాను లేచి ఉపన్యాసమును ప్రారంభించెను. ఆతని వక్తృత్వము నందు ముఖ్యమైన సంగతులున్నను, మృదుత్వముగాని సొగసుగాని

లేదు. ఐనను ప్రజలారా ఈ ఉపన్యాసమును శ్రద్ధతో వినుచుండిరి. అతనియొక్క త్యాగమును దేశసేవయు వారి కాతనియందంత గౌరవమును కలిగించెను. దాహముగా నున్నప్పుడు కుండనీళ్ళింత అపూర్వమగ నుండునో ఆతని పోడిమాటలే వారికంతి ఆశ్చర్యముగ నుండెను. చివరకు కృష్ణశర్మ లేచెను. ఏదోయొక అసాధారణ ప్ర సంగతి జరుగుచున్నట్లు మోహనుని గుండెలు దడదడ కొట్టుకొనుచుండెను. శర్మ ఉపన్యాసము కరుణారస పూర్ణముగను, ఆకర్షణీయముగను, ఉండెను. భావసరళముగను, మృదువుగను ఉండి మనస్సులను మోహింపజేయుచుండెను. ఉపన్యాసము నందు మధ్యమధ్య చెప్పు భావపూరితములైన విషయములను విని మోహనుని ఒడలు గగుర్పొడుచు చుండెను. శర్మ ఇట్లు చెప్పుచుండెను. "వేశ్యలను అసహ్యించుకొనుటవలన వారిని ఊరి బైటకు పంపివేయుమని ఈతీర్మానమయొక్క ఉద్దేశము కాదు. వారి నసహ్యించుకొనుటకు మనకేమి అధికారమున్నది? అట్లసహ్యించుకొనుట ఘోర అన్యాయము. మన సాంఘిక దురాచారములే, మనచెడు ప్రవర్తనలే, మన చెడుకోరికలే ఈవేశ్యలను సృజింప జేసినవి. ఈసానివీధి మనకలుషిత జీవనము యొక్క ప్రతిబింబము. మన పైశాచికాచారములయొక్క సాక్ష్యాకారము. మనము ఏముఖముపెట్టుకొని వారి నసహ్యించుకొనెదము? వారి యవస్థలు సోచనీయముగ నున్నది. వారిని మంచి మార్గమునకు తీసుకొనివచ్చుటయే మన ముఖ్యకర్తవ్యము. వారీ దుర్వాసనలకు దూరముగా నూరిబైట నున్నప్పుడే బాగుపడగలరు. మనసాంఘిక దురాచారములు లగ్నివంటివి. ఈయభాగ్యురాండ్రు తృణముల వంటివారు. అగ్నిని శాంతింపజేయుటకు కోరినయెడల ఈతృణములను దానినుండి దూరముగా నుంచుటకు ప్రయత్నింపుడు. అప్పుడు అగ్ని దానంతటదియే చల్లారిపోవును." మోహనుడు తన్మయుడై

ఈయుపన్యాసమును వినుచుండెను. ప్రక్కనున్నవారీ యుపన్యాసము జరుగుచున్నప్పుడు కూడ నొక్కరొక్కరే లేచి వెళ్ళిపోవుటజూడ, అతనికి చాల నాశ్చర్యముగా నుండెను. వారియందు చాలవరకు, వేశ్యలను సందించుట, వేశ్యాపిల్లలను హోళన జేయుట, వినుటకు కుతూహలపడి వినుటకు వచ్చినవారే. వారికి కృష్ణశర్మయొక్క ఈయుదారత అసంగతముగ దోచుచుండెను.

౨

మోహనరావు ఉపన్యాసములు వినుటయం దిప్పుడు చాల నుత్సాహము పుట్టెను. ఎక్కడ ఉపన్యాసములు జరుగునని తెలిసినను, అతడు తప్పక అక్కడ హాజరగుచుండెను. రెండుపక్షముల వాదనలు నెలకొలుపబడిని విని, వాటిపై తర్కవితర్కములు జేయుచుండుట వలన అతని కిప్పుడు తన ఉద్దేశములను స్థిరపరచుకొను యోగ్యత కలుగసాగెను. ఎవరైనను ప్రోత్తసంగతులు చెప్పుటతోడనే అతడిప్పుడు లొంగిపోవుటలేదు. వాటి నిజానిజములు కనుగొనుటకు ప్రయత్నించుచుండును. సాధారణముగ నుపన్యాసములయందు మాటలయాడంబరమేగాని విషయము తక్కువే యనియు, చెప్పిన యుక్తులనే మార్చిమార్చి చెప్పుచుండురనియు, అనుభవమువలన అతనికి బోధపడెను. అతనియందు సమాలోచనదృష్టి ఉత్పన్నమయ్యెను. చివరకు మోహనరావు తన పినతండ్రి పక్షమునే అవలంబించెను. అత డెల్లప్పుడును తమ పక్షముయొక్క బలమును వృద్ధి పొందించుకొనుటకే ఆతృతపడుచుండెను. ప్రతిపక్షులయొక్క మంచి నడవడిని ఆమోదించునంతటి యుదారత అతనియందు లేకుండెను.

ఈ తీర్మానమునకు వ్యతిరేకముగ నున్నవారందరును కూడ విషయ లోలురని ఆతని యుద్దేశము. ఈ భావము లాతనిని సానివీధివైపై నను అడుగుపెట్టకుండ జేసెను. పార్కునందుగాని, బజారునందుగాని, వేశ్యను జూచిన, వారి నక్కడనుండి తగిలివేయవలెనన్నంతరోష మాతనికి కలుగుచుండెను. అతని ఇష్టమేయైన ఎడల ఈపాటి సానివీధిని భూమట్టము జేయుంచివేసి యుండును. మేళము లాడించువారు, జూచువారు కూడ ఆతని దృష్టికి నీచులుగ కనబడుచుండిరి. ఇటువంటివారిని కలుసుకొన్నప్పుడు నిరసనగ మాటలాడుచుండును. అతని మనస్సునం దింకను సంశయము లున్నను, ఈ తీర్మానమును మనస్సా మోదించెను. ఇందువలన అతడు తన సంశయములను అణచివేసుకొనుటయే యుచితమని తలచెను. సంశయములను పైకి ప్రకటించిన తన పక్షము ఎక్కడ దుర్బలమగునో యని అతని సందేహము. కమల ఇంకను అతని హృదయమునుండి తొలగిపోలేదు. ఆ ప్రేమకల్పనల వలన ఆతని హృదయ మిప్పటికిని చలించుచునే యుండెను. కమల యొక్క సౌందర్యమూర్తి ఆతని సృష్టివధమునుండి ఇంకను తొలగిపోలేదు. ఈ చింతలనుండి తప్పించుకొనుట కాతడు ఒంటరిగ కూర్చుండుట మానివేసెను. తెల్లవారుఝామునసే లేచి స్నానమునకు నదికి వెళ్లును. రాత్రి పదిి, పదకొండువరకు ఏదో యొక పుస్తకమును చదువుచునో, సభలకు వెళ్లుచునో, కాలము గడుపుచుండును. కాని ఇంత ప్రయత్నము చేయుచున్నప్పటికిని కమల మరపునకు రాకుండెను. ఆమె నానా వేషములు ధరించుచు ఆతని హృదయ నేత్రముల ఎదుట ప్రత్యక్షమగుచుండును. ఒక్కొక్కప్పుడాతనిపై కోపగించుకొనుచున్నట్లును, ఒక్కొక్కప్పుడు బ్రతిమాలుచున్నట్లును, ఒక్కొక్కప్పుడు ప్రేమతో ఆతని భుజముపై చెయ్యివేసి నవ్వుచున్నట్లును తోచి మోహనుడు తన్మయు డగుచుండును. కాని ఇంతలోనే అతడు

నిద్రనుండి మేల్కాంచినట్లు మనస్సును సముదాయించుకొని ఈ యాలోచనలనుండి తప్పించుకొనుచు "బాబయ్యగారి రిప్పు డెందు చేతనో చాల విచారముగ కనబడుచున్నారు. ఆయన ముఖమునం దొక్కసారియైనను నవ్వు కనబడుటలేదు. ఆయన కేమి నుస్తీగా నున్నదో కాని వెంకటస్వామి మందుకూడ తెచ్చుచున్నాడు". అని ఇట్లనుకొనుచుండగనె కమల ఆతని హృదయమునందు ప్రత్యక్షమయి కన్నీటిధారలతో "మోహనరావు! నీ విట్లు చేయుదువని నే నెన్న డును అనుకొనలేదు. నీవు నన్ను, నీచురాలనియు, వేశ్యననియు, అనుకొనుచున్నావేమో? కాని నే నెన్నడును నీ ఎడల వేశ్యగా ప్రవర్తింపలేదు. నీకు నా ప్రేమసంపత్తిని మాత్రమే అర్పించితిని. నీ దృష్టియందు దానికి కొంచమైనను విలువలేదా?" అని ప్రశ్నించు చున్నట్లుతోచును. వెంటనే మోహనుడు తిరిగి తెలివి తెచ్చుకొని ఆ సంగతులను మరచిపోవుటకు ప్రయత్నించుచుండును. ఆత డొక యువన్యాసమునందు మనుష్యుని జీవితము తన చేతియందే యున్న దనియు, దానిని తన ఇష్టము వచ్చినట్లు త్రిప్పుకొన గలడనియు, దీనికి సాధనము చెడుతలంపులు, అశ్లీలపు మాటలు, మనస్సునకు తెచ్చుకొనకుండుటయే యనియు, నొకవేళ అట్టివి తోచినను, వాటిని బలవంతముగ తొలగించుకొని, ఉత్కృష్టభావములతోను, మంచి ఆలోచనలతోను మనస్సును పవిత్రముగా నుంచుకొనుటయేయనియు, అని వినియుండెను. మోహను డా సిద్ధాంతముల నెల్లప్పుడును మనస్సునం దుంచుకొనుచుండెను. వీటి మననమువలన మోహనుని మనస్సునకు సంతోషము కలుగుచుండెను. ఇందువలననే ఆతడు తన భావములను పవిత్రముగా నుంచుకొనుటకు ప్రయత్నించుచుండెను. "మన చెడుతలంపులు మనల నీజన్మమునందే గాక పునర్జన్మమునందు కూడ అధఃపతితులనుజేయు" నని వేలకొలది ప్రజ లా యువన్యాస

మునందు విశియుండిరికాని చాలమంది ఆ మాటల నప్పుడే మరచి పోయిరి. దరిద్రునకు బంగారము దొరకిన ప్రాణప్రదముగ రక్షించు కొనునట్లు, సరళ హృదయుడగు మోహానుడీ అమూల్యములైన ఈ విషయములను మనస్సునందు పరిలముగ నుంచుకొనెను. మోహాను డీదినములలో ఆత్మపరివర్తనమను అలలలో నీదులాడుచుండెను. త్రోవలో ఏ స్త్రీవైపైనను తన దృష్టిపడిన అతడు తన్ను దాను తిర స్కరించుకొనుచు, "క్షణమాత్రపు నేత్రానందముకొరకు నీవు నీ జీవితమును సర్వనాశనము మొనరించుకొనెదవా?" యని తన మనస్సు నకు బోధించుకొనుచుండును.

ఒకనాడు మోహానుడు నదీస్నానమునకు వెళ్లుచుండగ బజారు నందు వేశ్యల సమూహము కనబడెను. వారు పాటకచేరీనుండి వచ్చు చుండిరి. మోహానుడీ దృశ్యమును జూచి చెకితుడయ్యెను. ఇటువంటి లావణ్యము, సౌందర్యము, శృంగారము, ఆ తడెన్నడును జూడలేదు. జరీ పట్టుబట్టలయొక్క ఇటువంటి అనుపమదృశ్యము, శృంగారము, మెరపులవలె నిటువంటి అద్భుతరూపములు అతనికి నూతనముగ నుం డెను. అతడు తనమనస్సును ఎంత నిరోధించినను ఆగినదికాదు. విద్యా ర్థినెలల తరంబడిని పరిశ్రమచేసి, వరీక్షనిచ్చిన తర్వాత ఆమోదప్ర మోదములలో మునుగునట్లు మోహానుడా సౌందర్యమూర్తులను నొక్కపారి తదివిదీర జూచెను. అతడొక్క పర్యాయము జూచుటవలన తనివి దీరలేదు. తాను స్నానమునకు వెళ్ళుచున్నానను మాటయే మరచిపోయి అదే విధముగ వారివైపు జూడసాగెను. వారు దృష్టి పథమునుండి తప్పిపోవగనే నిద్రనుండి మేల్కొనినట్లు తులుక్కుపడి తనమనస్సును తిరస్కరించుకొనుచు. "నీవు నెలల తరబడిని ఆర్జించిన దానిని నొక్క క్షణములో పోగొట్టుకొంటివి. ఆహా! నేను నా ఆత్మను ఎంతపతనము గావించుకొంటిని? నే నెంత చవలుడను!" అని విచా

రింపసాగెను. చివరకాతడు తనమనస్సును సమూధానపరుచుకొనుచు, "కేవలమీ చూపువలన పాపాత్ముడ నగుదునా? నేను వీరిని పాపపు దృష్టితో జూడలేదే? నా హృదయము, చెడుతలంపులు లేక పవిత్రముగనే యున్నది. పరమాత్ముని సౌందర్యసృష్టిని జూచి పవిత్రానందమును పొందుటయే మనకర్తవ్యము." అని అనుకొనెను.

ఇట్లాలోచించుకొనుచు ఆతడు ముందునకు నడచుచుండెను. కాని అతని మనస్సున కేమియు సంతుష్టి కలుగలేదు. తనలో "నన్ను నేనే మోసపుచ్చుకొన జూచుచున్నాను. నా వల్ల తప్పువచ్చినది. ఔను నేను అపరాధుడనే. కాని మనస్సుయొక్క ప్రస్తుతావస్థను బట్టి ఈ తప్పు క్షమార్హమని తలచెదను. నేను యోగినిగాను, సన్యాసినిగాను, ఒక బుద్ధిహీనుడ నగు మనుష్యమాత్రుడను. ఇంత పెద్ద ధర్మమును ముందుంచుకొని దానిని పాలింపలేక పోవుచున్నాను. ఆహా! సౌందర్య మెటువంటి వస్తువు? చెడువర్తనము వలన ముఖవర్చస్సు పోవునని పెద్దలనెదరు. కాని ఈ స్త్రీలయొక్క చెడువర్తనము వీరి సౌందర్యమును మరియు వృద్ధిచేయుచున్నది. ముఖము హృదయముయొక్క అద్దమని చెప్పెదరు. కాని ఈ వాక్కుకూడ మిథ్యగానే దోచుచున్నది." అని ఊహించుకొను చుండెను. మోహనుడు తిరిగి మనస్సును సముదాయించుకొని ఈ సంగతులనుండి విరక్తిని బొందుటకు మరియొక విధముగ తర్కించసాగెను. "ఔను స్త్రీలు మిక్కిలి సౌందర్యవంతులు. కోమలులు. కాని వారు తమపవిత్రగుణములను ఎట్లు దుర్వినియోగపరచుచున్నారు? వారు తమ ఆత్మలను ఎంత అధఃపతనములుగ జేసికొనుచున్నారు? కేవలమీ పట్టుబట్టల కొఱకు, మెరపు సగలకొఱకు వారు తమ ఆత్మలను అమ్ముకొనుచున్నారు. ప్రేమజ్యోతిచే పరికాశించు కండ్లు, క్రీగంటిచూపులు, కపటముతోను, మోసముతో గూడుకొని యున్నవి నిర్మలవిశుద్ధ ప్రేమ

చేవ్రవహింపవలసిన హృదయము లెంత దుర్గంధవిషయ కృభావము లచే నిండియున్నవి? ఆహా ఎంత అధోగతి?"

ఇట్లసహ్యించు కొనుటవలన మోహానునకు కొంత మనశ్శాంతి కలిగెను. ఆ తడిబ్లు తాపీగా నడచుచు నదియొడ్డు చేరెను. ఈ తర్క-వితర్కములవలన ఆ రోజున మా మూలుకంటె ప్రొద్దెక్కెను. అందు వలన ఆ తడు మా మూలుగ స్నానముచేయు రేవునకు వెళ్లలేకు. అక్కడ చాల జనసమ్మర్దముగ నుండునని వితంతు శరణాలయము వైపుననున్న రేవునకు వెళ్ళెను. అక్కడ నిర్మానుష్యముగ నుండును. ఊరునకు కొంచము దూరముగ నుండుటవలన ఆ రేవున కెవ్వరును రారు.

మోహానుకు నదియొడ్డున చేరగనె ఒకస్త్రీ ఆ వైపునకు వచ్చుచుండుట ఆ తడు జూచెను. మోహానుడామెను కమలయని వెంటనే పోలికపట్టెను. కాని ఆమె ఎంతమారి పోయినది! ఎంతచిక్కిపోయినది! ఇప్పుడా పొడుగైన జుట్టులేదు. ఆ కోమల శరీరమే కాదు. ఆ నవ్వుచున్నటువంటి గులాబీపెదవులే లేవు. చంచలజ్యోతులవలె ప్రకాశించు ఆ కండ్లేకావు. ఇప్పుడా శృంగారములేదు. ఆ మణిమయాలంకారములు లేవు. ఆమె యొక తెల్లనిబట్టను మాత్రమే ధరించి యుండెను. ఆమె ప్రవర్తన యందు గంభీరతయు, ఆమె ముఖమునందు నిరాశావైరాగ్య భావములు ప్రకాశించు చుండెను. ఆ మెను జూడగనె మోహానుడు సంతోషముతో వివ్వాలుడై తొందరగ ముందుకు కొన్ని అడుగులు వేసెను. కాని ఆమె రూపాంతరమును జూచి తాను పొరబడితినేమో? ఈమె కమలగాక కమలను పోలియుండు మరియొకస్త్రీ ఐయుండవచ్చునని అనుకొనునట్లు ఒక్కసారి వెనుకకు తగ్గెను. ఆ తని ప్రేమోత్సాహమంతయు నొక్కసారి భగ్నమయ్యెను. ఇంత మార్పెట్లు కలిగెనో ఆ తనికేమియు బోధపడకుండెను. అతడు

తిరిగి మరియొకసారి కమలవైపు జూచెను. కమలకూడ నా తనివైపు జూచెను. ఆమె దృష్టియందు ప్రేమకు బదులుగ నొకవిధమైన విచారముండెను. పూర్వపు సంగతులను మరచిపోవుటకు ప్రయత్నించుచున్నట్లును, హృదయమునందణగి యున్న అగ్నిరగుల్ కొలుపుట కిష్టములేనట్లును ఆ దృష్టులయందు గోచరించుచుండెను. మోహను నకు ఆమె తనను దగాకోరునిగను, నీచునిగను స్వార్థపరుసిగను తలచుచున్నదేమో యసి అనుమానము కలిగెను. తన అనుమానము భ్రమయో, నిజమో తెలిసికొనుటకు అతడు తిరిగి కమలవైపు జూచెను. తిరిగి ఇద్దరికండ్లు కలుసుకొనెను. కాని కలసీకలయుట తోడనె చెదరిపోయినవి. మోహనుని అనుమానము స్థిరపడిపోయెను. ఆనిశ్చయముతోనే అభిమానము కలిగినది. అతడు తన మనస్సును ధిక్కరించుకొనుచు, "ఇప్పు డిప్పుడేకదా నన్ను నేను సముదాయించుకొంటిని. తిరిగి ఇంతవేగమే చెడతలంపులలో పడిపోవుటనూ!"

అతడు మరి కమలవైపు జూడలేదు. ఆమె తలవంచుకొని అతని ముందునుండియే వెళ్ళిపోయెను. ఆమె కాళ్లు వణకుచుండుట అతడు కనిపెట్టెను. కాని అతడక్కడ నుండి యొక్క అడుగైనను కదలలేదు. ఒక్క సంజ్ఞయైనను జేయలేకు. మోహనుడు తన ఆలోచనలను స్థిరపరచుకొనుచు, "నీవు నా నుండి క్రోసుదూరము పరుగెత్తిన, నేను నూరుక్రోసులదూరము పరుగెత్తెదను." అని సగర్వముగా తలచుచుండెను గాని తాను నిర్భాంతపడి అక్కడ నుండి కదలలేక పోతిని గదా యనుధ్యానమే లేకుండెను.

కమల మూరుముగా వెళ్లిపోయిన తర్వాత ఆమె ఎటువైపు పోవుచున్నదో తెలిసికొనుటకు ఆమె వెనుక ఆతడు మెల్లమెల్లగా పోవుచుండెను. కోరికలముందు వివేకము తలవంచవలసి వచ్చెను.

పెండ్లివారు తిరిగి వెళ్ళిపోయినప్పటినుండియు సరసింహారావు ఇల్లు దాటి పైకి రాలేదు. ఇతరుల ఎదుటపడుటకు ముఖము చెల్లక ఎల్లప్పుడును గదిలోవలనే కూర్చుండి దుఃఖించుచుండెను. దుశ్చరిత్ర యగు కమల ప్రపంచ దృష్టియందు ఆతనిని మర్యాద విహీనునిగ జేసినందున అతడు తల నెత్తుకొన లేకుండెను. అతడీ అవమానమును భరింపలేకుండెను. అతడు నాల్గు సంవత్సరములు ఖైదుసందున్నను తానింత పతితుడ నైతినని అనుకొనలేదు. ఈ యనుభవ మంతయు తన పాపకర్మ ఫలమేయని అతడు తలచెను. ఈ కళంకమాతని ఆత్మ గౌరవమును కూడ సర్వనాశనము జేసివైచినది. అత డిప్పుడు పూర్వపు నీచ సహవాసుల దరికికూడ వెళ్లలేకుండెను. నారికంచె కూడ తాను నీచుడనని ఆతని యుద్దేశము. లోకులందరు తనను నిందించు చున్నారని తలచుచు "ఇతని కుమార్తెయే" అను సంగతిని తలచు కొనగనే లజ్జావిచార సాగరమున ములిగిపోవుచుండెను. "అయ్యో! ఈ దౌర్భాగ్యురాలు నా వంశమును తగులబెట్టునని ముందే తెలిసిన యెడల దీనిని బలవంతముగ గొంతుక నులిమివేసియుందును. ఇది చాల అభిమానస్థురాలనియు, సరదాలు కలదియు, భోగములం దాశక్తిగల దనియు, గొప్పయింటిలో వడిన బాగుండుననియు తలచితిని. కాని దీని మనస్సింత దుర్బల మైనదని నేనెన్నడును అనుకొనలేదు. ప్రపంచ మునందెవ్వరి దినములు సరిగా వెళ్ళుచున్నవి? అందరకును ఆపదలు వచ్చుచునే యున్నవి. గొప్పగొప్ప ఇంటి స్త్రీలు కూడ కర్మవశమున అన్నవస్త్రములకు వాచిపోవుచున్నారు. కాని వారు తమ దుఃఖములను మనస్సునందే ఇముడ్చుకొను చున్నారు. వారు ఏడ్చుచు దినములు

గడుపుచున్నను, ఇతరులవద్ద తమదుఃఖమును వెలిబుచ్చరు. తమ కష్టములు నితరులతో జెప్పుకొనగా. చచ్చిపోవుట కైనను వప్పుకొనె దరు కాని ఇతరులను యాచింపరు. అటువంటివారే నిజముగ సాధ్వీ మణులు. వారు వంశమర్యాదల కొరకు జీవించి దానికొరకే ప్రాణ ముల నర్పించెదరు కాని ఈ దుష్టురాలు, ఈ దౌర్భాగ్యురాలు... దాని భర్త ఎంత పిరికివాడు? లేనిచోట వెంటనే దాని గొంతుక నులిమివేసి యుండడా? అది ఇంటినుండి కాలు అవతల పెట్టిన తోడనె ఎందుకు గొంతుక నొక్కివేయలేదు? అతడు కూడ నీచుడు. వట్టి దురాచారి, పిరికివాడు అని తోచుచున్నది. అతనికి వంశ మర్యాదయందే అభిమానమున్న నీస్థితి రాకపోయిఉండును. ఈ యవమానము వలన నతనికి సిగ్గు లేకపోయిన పోవుగాక. నేను మాత్రము దీనిని భరింపజాలను. కమలకు తగినశిక్ష నేను జేసెదను. దానిని ఏ చేతులతో పెంచి పెద్దదానిని జేసితినో ఆ చేతులతోనే దానిమెడ నులిపివేసెదను. దాని ఆటలు, చేష్టలు జూచి సంతోషిం చిన కళ్ళివ్వాడు, దాని రక్తమును జూచినగాని తృప్తినొందజాలవు. పోయిన మర్యాద నుద్ధరించుట కింతకన్న మరియొక యుపాయము కనబడదు. వంశమర్యాదలకు ప్రాకులాడువారు, పాపకర్మల నెట్లు దండించుకొందురో దీనివలన ప్రపంచమునకు తెలియగలదు."

ఇట్లు నిశ్చయించుకొని నరసింహారావు తన యుద్దేశములను నెర వేర్చుకొనుట కుపాయ మాలోచించు చుండెను. ఖిదునం దున్నప్పు డాతడు మంత్రుల చరిత్రలను విసియుండెను. రాత్రింబవళ్ళు సాధా రణముగ వారిలో వారికి చర్చలే జరుగుచుండెను. కత్తితో ఆమెను పొడిచి చంపి తాను పోలీసువారి స్వాధీన మగుటయే యుత్తమమని ఆతడు తలచెను. "మేజస్ట్రీటు ఎదుట నే నిచ్చు వాగ్మూలమువలన ప్రజల కండ్లు విడగలవు." మనస్సునం దీతర్కవితర్కములవలన అతడు

పులకితుడై వాంఛ్నాలమెట్లిచ్చుటయో ఆలోచించసాగెను. మొదట నాగరికసమాజములయొక్క విలాసములను సూచించెదను. తర్వాత పోలీసువారియొక్క అత్యాచారములను వెలిబుచ్చెదను. దానితర్వాత వైవాహిక దురాచారములను వర్ణించెదను. కట్నములు, లాంచనములు, గురించి వినువారి మనస్సులకు నాటునట్లు వివరించెదను. మన వంశమర్యాదలను పోగొట్టకొనువారము మనమే యనియు, మన పిరికితనమువలనను, ప్రాణభీతివలనను, లోకనిందభయము వలనను, సంతానప్రేమవలనను, తెలివితక్కువలనను ఆత్మగౌరవము లేకపోవుటవలనను, ఇటువంటి పాపకార్యములను దాచుచున్నామనియు, అవి బయలుపడకుండ వాటిపై తెరను వేయుచున్నామనియు, దుర్బలాత్మలకు సాహస మొక్కువ యగుటయే దీని పరిణామమనియు, చివరకు విపులముగా వివరించి చెప్పెదను.''

నరసింహారావు వింతవరకు సంకల్పించినను, ముందు సుశీల సంగతి ఏమగునో యను సంగతిని ఆలోచించలేదు. ఈ యనమాన మితర చింతలకు చోటివ్వలేదు. కుమారుని మృత్యుశయ్యపై వదలిపెట్టి, శత్రువుపై కసిదీర్చుకొనుట కుద్యమించిన వానివలెను, పడవపై కూర్చొని తాను వంగుటవలన పడవ మునిగిపోవుటను ధ్యానమందు లేకయే తాను నీటియందు జూచిన పామును జంపుటకు ప్రయత్నించువానివలెను, ఇప్పు డాతని స్థితి యుండెను.

సాయంకాల మయ్యెను. ఆరోజుననే హత్య గావించుటకు నిశ్చయించుకొన్న దినము. ఇప్పు డాతని మనస్సు కొంచము విచారముగనుండెను. భయంకరకార్యము చేయుటకు ముందు మన స్సెట్లు ఆందోళనగా నుండునో ఆవిధముగనే అతని మనస్సుండెను. కొన్నిరోజుల వరకు క్రోధావేశముచే నుప్పొంగి ఉన్మత్తమైన తర్వాత, విస్తారముగా వీచుగాలి క్రమముగా శాంతించునట్లు, ఇప్పు డాతని మనస్సు కొం

చము సిథిలమయ్యెను. మనస్సుయొక్క ఇట్టి అవస్థయందు ఉదాసీనతయే మిక్కిలి యుపకారి. ఉదాసీనత వైరాగ్యముయొక్క సూక్ష్మ స్వరూపము. మనుష్యుడు తన జీవితమును గురించి ఆలోచించుకొనుట కది ఓర్పు నిచ్చును. ఆసమయమునందు పూర్వపువిషయములన్నియు మనస్సునకు గోచరించును. నరసింహారావునకు తన జీవితమును హాయిగా గడపినప్పటి సంగతులును తాను తన కొమార్తె లిద్దరి తోడను పికారు వెళ్లుచున్నప్పటి సంగతులును జ్ఞాపకమునకు వచ్చుచుండెను. తాను కమల నొకసారియు, సుశీల నొకసారియు నెత్తికొనుటయు, వారింటికి వచ్చినతోడనె జగదాంబ సంతోషముతో వారి కెదురుగా పరుగెత్తుకొని వచ్చి పిల్లల నెత్తుకొని ముద్దులాడుటయు అతని కండ్లకు కట్టినట్లుండెను. ఆనంద మనుభవించునప్పటికంటె దానిని జ్ఞాపకమునకు దెచ్చికొన్నప్పుడే ఎక్కువ సుఖప్రదముగ నుండును. మనము చూచునప్పుడు నిర్జనముగా నున్న పర్వతములు, అడవులు, నదీప్రదేశములు కొన్నిరోజుల పిమ్మట, మన స్మరణ నేత్రములకు శాంతిమయముగను, మనోహరముగను కనబడి తిరిగి ఆదృశ్యములను చూచుటకు కోరిక పుట్టించుచుండును. నరసింహారావు తన పూర్వజీవితమును తలచుకొని, తలచుకొని దుఃఖివశుడయ్యెను. అతనికండ్లనుండి నీరు ధారలుగా కారసాగెను. "అయ్యో ఆ యానందమయజీవిత మీ విధముగా ఎంత విషాదమయముగ అంతమగుచున్నది? ఈచేతులతో పెంచిన నా పిల్ల నీచేతులతోనే చంపుటకు సిద్ధపడుచున్నాను."

అతనికిప్పుడు కమలపై జాలికలుగ సాగెను. "పాపమది నూతిలో పడిపోయినది. దానిపై రాళ్ళురువ్వునంతటి నిర్దయుడనా నేను? నాకండ్లకు ఆనందము కలిగించునట్టి నాకమలకే ఇంత అన్యాయము? దానిని సుఖపెట్టుటకు నే నెంత తంటాలుపడితిని?" కాని ఆదయా భావము నరసింహారావు మనస్సునందెక్కువ కాలముండలేదు. కమల

వేశ్య యైనదనుమాట తలపునకు వచ్చినతోడనె ఆతని హృదయము లజ్జావిచారములతో నిండిపోయెను. ఇంతలో రామనాథము అతని వద్దకూర్చొని "నేను ప్లీడరువద్దకు వెళ్ళితిని, తప్పక దావా చెయ్యమని వారు సలహా నిచ్చినారు."

నర—(తులుక్కుపడి) ఏమి దావా?

రామ—పెండ్లిఅంతా అభాసుచేసి తిరిగివెళ్ళిపోయిన ఆపెండ్లి వారిపైనే.

నర—దీనివలన నేమిలాభము?

రామ—దీనివలన వారు తిరిగివచ్చి పిల్లను చేసికొనెదరు. లేక పోయిన నష్టపరిహారమునైన నిచ్చుకొందురు.

నర—కాని దీనివలన మరింత చెడ్డపేరు రాదా?

రామ—వచ్చిన చెడ్డపేరేదో రానేవచ్చినది. ఇంకదేనికిభయము? నేను కట్నము విషయమై వారికి వెయ్యి రూపాయలు నిచ్చితిని. భోజనములక్రింద నాలుగైదు వందలు ఖర్చైనది. ఈసొమ్మంతా ఎందుకు వదలుకొనెదను? దీనిని ఒక సంసారపక్షము వానికిచ్చిన, వాడు సంతోషముతో మనపిల్లను జేసికొనుటకు వప్పుకొనును. దీనితో నామహాను భావుల ప్రతాపముకూడ కొంత బయలుపడును.

నర—(పెద్దనిట్టూర్పువిడచి) ముందు నాకు విషమిచ్చి, తర్వాత దావా దాఖలు చెయ్యండి.

రామ—మీరెందుకింత భయపడుచున్నారు.

నర—ఐతే దావా చేయుటకే నిశ్చయించినారా?

రామ—ఆఁ చేయుటకే నిశ్చయించినాను. నిన్ను చాలమంది ఖారిష్టరులను, ప్లీడర్లను జూచినాను వారందరు ఈ సంగతంతయు విని దావాచేసిన కేను తప్పక గెలుచునని చెప్పినారు. అప్పుడే ఇద్దరు వకీళ్లకు బజానాకూడ నిచ్చినాను.

నర—(నిరాశుడై) సరే. బాగానే యున్నది. ఐతే దావా దాఖలు చెయ్యండి.

రామ—మీరీ విషయమై ఎందుకింత అసంతుష్టిగ నున్నారు?

నర—మీరు సమాధానపడనప్పుడు నేనేమి చెప్పగలను? ఇది వరకు రెండుమూడు గ్రామములకు తెలిసిన సంగతి ఇప్పుడు దేశమంతయు వెల్లడి కాగలదు. కమలను తప్పక సమసుజేసి కోర్టునకు పిలపించెదరు. అప్పుడు నా గురించి వీధి వీధిని జెప్పుకొందురు.

రామ—దీనిని గురించి ఎంతని భయపడను? నాకు కూడ నిద్దరు పెండ్లి కావలసిన పిల్లలున్నారు. ఈ కళంకమును నాతలను రుద్దుకొని వారి పెండ్లిండ్లకెందుకు ఆటంకమును కలిగించుకొందును?

నర—ఐతే. మీకేమి కళంకము రాకుండుటకే నీదావా చేయుచున్నారా?

రామ—(సగర్వముతో) మీరాలాగే అనుకోండి. పెండ్లివారు నా ఇంటినుండి తిరిగి వెళ్లిపోయినారు. కమల నాకొమార్తెయే యని లోకులు భ్రమపడవచ్చును. పట్టమంతటను నాపేరే జెప్పుకొనుచున్నారు. పదివేలకు దావా చేసెదను. ఐదువేలకైనను డిక్రీయైన, అసామ్మతో సుశీలకు గొప్ప సంబంధముచేస్తాను. మీరు ఎరుగరా? మంచి వస్తువుతో చెడువస్తువు కలసియున్నప్పుడు లోభత్వముచే దానిని తినివేయుట? ఈ సామాన్యశేజూపని ఎడల సుశీలకు వివాహమగుట ఎట్లు? ఒక విధముగ నాకు కూడ కళంకము వచ్చినది. పూర్వము నాతో సంతోషముగా సంబంధము చేయదలచిన వారిప్పుడు పెద్దమూట చూపనిదే నాతో తిన్నగా మాట్లాడనైనను మాట్లాడరు. ఇదే పెద్ద సమస్యగా నున్నది.

నర—సరే ఐతే దావా దాఖలు చెయ్యండి.

రామనాథము వెళ్ళిపోయిన తోడనె నరసింహారావు ఆకాశము

వైపు జూచుచు "దైవమా! ఇకనైనను నన్నుతీసికొనిపో. ఈయవమానమును నేను భరింపలేను." అని దుఃఖింప సాగెను. ఇప్పుడాతనికి అవమానముయొక్క నిజస్థితి గోచరమయ్యెను. పామును జంఫుట వలన దాని విషము పోనట్లు, కముల నిప్పుడు వధించినను, ఈకళంక ముపోజాలదని ఇప్పుడాతనికి విదితమయ్యెను. "ఇప్పుడామెను జంఫుట తెలివితక్కువయేగాని మరేమియు లాభములేదు. పోలీసును లెరస్టు చేయుట, నెలల తరుబడి కోర్టునకు త్రిప్పుట, ఈఅనుభవములన్నియు ఐనతర్వాత ఉరితీయుట. ఇంతకంటె ఎందులోనైనను పడిచచ్చుటయే మేలు. దేని ప్రకాశమువలన నీభయంకర దృశ్యములన్నియు కనబడు చున్నవో ఆదీపమును ఆర్పివేసెదను. అయ్యో! ఈదౌర్భాగ్య రాలు, నుశీలనుకూడ తనతో ముంచివేసినది. పరమాత్మా! నీవే ఆమెను రక్షింపగలవాడవు. యీఅనాథ బాలికకు నీవు తప్ప నురియొక ఆశ్రయములేదు. ఈకండ్లతో దాని దుర్దశను జూడజాలను. నన్ను నీప్రపంచమునుండి వేగముగా తీసికొనిపో."

కొంతసేపైన తర్వాత నరసింహారావును భోజనమునకు పిలచుటకు సుశీల వచ్చెను. వివాహదినము తర్వాత నేటివరకు అతడామెను జూడలేదు. అతడామెవైపు కరుణామయదృష్టితో నొక్కసారి జూచెను. ఆ మిణుకు మిణుకు మనుదీపపు వెలుతురు ఆమె ముఖము నందొక విధమైన వర్చస్సు ఆతనికి కనబడెను. ఆమె కండ్లు నిర్మలాత్మక జ్యోతులవలె ప్రకాశించు చుండెను. శోకముగాని, మాలిన్య ముగాని రవంతయు గనబడుటలేదు. మోహానుని జూచినప్పటినుండియు ఆమె హృదయము నందొకవిధమైన సంతోషానుభవము కలుగు చుండెను. ఆ హృదయమునందు నిర్మలభావములయొక్క తరంగములు పొర్లుచున్నట్లును, వాటియందు అద్భుతమైన ఆత్మబల ముదయించు చున్నట్లును ఆమెకు తోచుచుండెను. ఇది వరకామె తనమేనత్తతో

మనస్సువిప్పి మాటలాడుటలేదు. కాని ఇప్పుడు గంటల తరుబడిని ఆమెవద్ద కూర్చొని ఆమెకాళ్ళు పట్టుచు, ఆమెతో కష్టసుఖము చెప్పుచుండును. ఆమె యెడల మునుపటివలె నీర్ష్యాసహింపక ఆమెను తన తల్లివలె పేక్షించుచుండెను. ఇప్పుడు సుశీల నీళ్ళుతోడుట, పిండి విసరుట మొదలైన కఠినపు పనులను కూడ సంతోషముతో జేయుచుండెను. ఆమె జీవితమునందిప్పుడు ప్రేమోదయమయ్యెను. మోహమును ఆమె కలుసుకొనలేదు. కాని అంతకన్న నుత్తమమైన వస్తువామెకు లభించినది. అది మోహమునకు ప్రేమయే.

నరసింహారావు సుశీలయొక్క ప్రపుల్లవదనమును జూచి ఆశ్చర్యమునే గాక భయమును కూడ పొందెను. విచారముయొక్క విషమవేదన కన్నీటిద్వారా ప్రకటితముగాక, భయంకరోన్మాదరూపమును ధరించెనని అతడనుకొనెను. ఈ కరోంవేదనకు తానే మూలకారణుడని ఆమె యనుకొనుచున్నదేమో యని అతడనుకొనుచుండెను. నరసింహారావామెవైపు విచారదృష్టితో జూచుచు "సుశీలా!" యని పిలచెను. సుశీల "ఎందు" కను భావముతో అతనివైపు జూచెను.

నర—(కుంఠితస్వరముతో) ఇప్పటికి నాలుగు సంవత్సరములనుండి నా జీవితనౌక సుడిగుండములో పడి కొట్టుకొనుచున్నది. ఈ కష్టకాలము నా సర్వస్వమును నాశనపరచినది. నేనిక నా సంతానము యొక్క దుర్గతిని జూడజాలను. ఇదియంతయు నా పాపకర్మఫలమేయని నాకు తెలియును. మొదటనే, నేను జాగ్రత్తపడియుండిన మీకీ కష్టములు రాకపోయి యుండును. నేనిక చాలకాలము బ్రతుకను. నీవెప్పుడైనను నిర్భాగ్యురాలైన కమలను కలుసుకొన్న, ఆమెను నేను క్షమించితినని చెప్పుము. ఆమె యేమి చేసినను ఆదోషమంతయు నాదే. నేటికి రెండురోజులకు పూర్వముపరకు ఆమెను చంపుప్రయత్నములోనె యుంటిని. కాని దైవము నన్ను పాపమునుండి రక్షించెను.

నిర్భాగ్యులైన తన తలిదండ్రుల యాత్మలను దయదలచమని ఆమెతో జెప్పు.

ఇట్లు చెప్పుచు నరసింహారావు ఆగిపోయెను సుశీల మౌనముతో నిలువబడి యుండెను. తన తండ్రియం దామెకు మిక్కిలి జాలి కలుగు చుండెను. ఒక్కతుణమైన తర్వాత నరసింహారావు, "నేను నిన్నుకూడ నొకటి ప్రార్థించుచున్నాను."

సుశీ—ఆజ్ఞాపింపుడు.

నర—మరేమియు లేదు. సంతోషమును మాత్ర మెన్నడును విడిచిపెట్టకు. ఈ మంత్రమువలన ఎంత కష్టసమయమునం దైనను నీమనస్సు చలింపదు.

తన తండ్రి యొక్క సంగతి చెప్పదలచుకొని, సంకోచమువలన ఆ సంగతిని మార్చివేసెనని సుశీల కనిపెట్టెను. అతని మనస్సునందున్న సంగతి ఆమెవద్ద దాగలేదు. ఆమె గర్వముతో తలను పైకెత్తి స్వాభిమాన నేత్రములతో అతనివైపు జూచెను. ఆమెయొక్క ఈ విస్వాసపూర్ణమైన దృష్టి నోటితో చెప్పుదానికంటె ఎక్కువగ తెలియ జేసెను. పాతివ్రత్యమను సాధనము దొరకిన స్త్రీకి మరియొక సాధనముతో అవసరములేదు. దీనియందే సంతోషము, సుఖము, శాంతము నన్నియు ఇమిడియున్నవి. అని ఆమె మనస్సు ప్రబోధించు చుండెను.

౧౦

అర్ధరాత్రి యయ్యెను. అప్పుడు నరసింహారావు ఇంటినుండి బయలు దేరెను. ప్రకృతి సుందరి వృద్ధురాలివలె పొగమంచు అను మోటు

దుప్పటిని గప్పుకొని నిద్రావస్థయందుండెను. ఆకాశమునందు చందురుని ముఖమును చాచుకొని వేగముగా పరుగెత్తుచుండెను. ఎక్కడ కట్లు పోవుచున్నాడో తెలియదు.

నరసింహారావు మనస్సునందొక తీవ్రమైన కోరిక యుండెను. ఆతనికి సుశీల నొక్కసారి చూచి పోవలెనని బుద్ధిపుట్టెను. ప్రపంచమునందు తన ఆనందమయజీవితమునకు చిహ్నముగా మిగిలినదీ వక్కవస్తువే. నిరాశయను గాఢాంధకారమునందీయొక్క జ్యోతియే అతని మనస్సును తనవైపునకు ఆకర్షించుచుండెను. ఆత డొక్క నిముషము ద్వారమువద్ద నిశ్శబ్దముగా నిలువబడి, పెద్ద నిట్టూర్పు విడచి, ముందునకు బయలుదేరెను. జగదాంబ ఆకాశమునుండి తనను పిలచుచున్నట్లాతని కప్పుడు తోచెను.

నరసింహారావు మనస్సునం దిప్పుడు ఒక ఇచ్ఛగాని, అభిలాషగాని, విచారముగాని లేదు. ప్రపంచమునుండి అతని మనస్సు విరక్తిని పొందెను. ఎట్లైనను నదియొడ్డునకు వేగముగా పోయి, ఆ యగాధ జలములందు లీనమైపోవుట కాతడు తొంతరపడుచుండెను. తన సాహస మెక్కడ సమసి పోవునోయని అతనికి భయముగా నుండెను. తన సంకల్పము నుత్తేజపరచుకొనుట కాతడు పరుగెత్తసాగెను.

కాని కొంత దూరము పోయిన తర్వాత తిరిగి ఆగి ఇట్లాలోచింపసాగెను. "నీటియందు దుముకుట ఏమి కష్టము? కాళ్లు భూమి మీదనుండి తేలిపోవగనే కథ ముగిసిపోవును." ఇట్లనుకొనగనే ఆతని హృదయ మొక్కసారి కంపించిపోయెను. అకస్మాత్తుగ అతనికి "ఎక్కడకైనను ఫికరులేకుండ ఎందుకు వెళ్ళిపోవగూడదు?" అను ఆలోచన అతనికి తట్టెను. కాని ఈ మాటలను అతడు తన మనస్సును జేరనియ్యకుండెను. మోహా మాతనిని మోసపుచ్చలేకపోయినది. అతడు ధార్మిక ప్రకృతి గల మనుష్యుడు కాకపోయినప్పటికి

అదృశ్యమైన ఒక అన్యక్తభావ మాతని హృదయమును కంపింప జేయుచుండెను. అతడు తన సంకల్పమును దృఢపరుచుకొనుట కీశ్వరుడు దయాళుడనియు, కరుణాసముద్రుడనియు, తన మనస్సునకు విశ్వాసము కలిగించుకొనుచుండెను. ఆత్మ తన్ను తాను మరచిపోయినది. తన నవాచరుని ఆటవస్తువును విరచిన తర్వాత నింటికిపోవుటకు భయపడుచున్న పిల్లవానిలె అతని స్థితి యుండెను.

నరసింహారావు వీ ప్రకారము నాలుగుమైళ్లు ముందునకు నడచెను. గోదావరినది సమీపించుచున్నకొలదియు ఆతని హృదయావేగము హెచ్చుచు కాబోలెచ్చెను. భయముచే మన స్సస్థిరమగుచుండెను. కాని ఆతడు తన మనోదౌర్బల్యమును, ఆవేగమును, తిరస్కారముచే తొలగించుటకు ప్రయత్నించుచుండెను. "అయ్యో! నే నెంత సిగ్గుమాలిన వాడను? ఎంత ఆత్మనూన్యుడను? ఈ ఘోరమైన దుర్దశ ననుభవించుచు కూడ చావునకు భయపడుచున్నాను. ఛీ ఛీ"

ఇంతలో అకస్మాత్తుగ ఎవరో పాట పాడుచున్నట్లు వినబడెను. అతడు ముందునకు పోవుచున్నకొలదియు, ఆధ్వని స్పష్టరగా వినబడుచుండెను. ఆ పాడుచున్నాతడు అతనివైపే వచ్చుచుండెను. నిశ్శబ్దముగా నున్న ఆ రాత్రియందు నరసింహారావున కా గానము అత్యంత మధురముగ నుండెను. అతడు ఆ పాటను ధ్యానముతో వినసాగెను. ఆపాట అంత మధురముగ లేకపోయినను శాస్త్రోక్తముగను, భక్తిరసముగను, ఉండుటవలన నరసింహారావునకు మిక్కిలి ఆనందము కలిగెను. ఆతనికి శాస్త్రములందు మంచి జ్ఞానముకలదు. ఆగానము, దహించుకొని పోవుచున్న ఆతని హృదయమునకు కొంత శాంతిని కలిగించెను.

గాన మాగిపోయినది. క్షణమైన తర్వాత దీర్ఘకాయుడు, జటాధారియు నగు ఒక సాధువు తనవైపునకు వచ్చుచుండుటను నరసింహా

రావు జూచెను. ఆసాధు వాతనిని సమీపించి, అతని పేరును, నివాస స్థలమును అడిగెను. అతని మాటలవలన, నరసింహారావు ముందు నకు పోవుటకు ప్రయత్నించుచుండుటను జూచి సాధువు, "ఇటువంటి సమయమందు మీరు రెక్కడకు వెళ్లుచున్నారు?

నర—అటువంటి పని వచ్చినది.

సాధు—అర్ధరాత్రియందు నదియొడ్డున ఏమిపని యున్నది?

నర—(వినుగుకొనుచు) మీరు ఆత్మజ్ఞానులు కదా? మీకా మాత్రము తెలియదా?

సాధు—నా కాత్మజ్ఞానము లేదు. నేను కేవల మొక భిక్షుకుడను. ఇటువంటి సమయమందు మి మ్మెక్కడకు పోనివ్వను.

నర—మీరెవరిని మీరు పొండి. నాపని కాటంకము కలిగించు టకు మీకేమి అధికారమున్నది?

సాధు—నా కధికారము లేకపోయిన మిమ్ములను నెందుకు ఆపె దను? మీరు నన్ను ఎరుగకపోయి యుండవచ్చును. నేను మీ యల్లు డను. నాపేరు రామప్రసాదరావు.

నర—ఓహో, మీరు రామప్రసాదరావుగారా? ఎప్పటినుండి ఈ వేషమును ధరించినారు? మిమ్ములను కలుసుకొనవలెనని ఎన్ని రోజుల నుండియో ప్రయత్నించుచున్నాను. మీతో చాల సంగ తులు మాట్లాడవలసి యున్నది.

సాధు—ఈనదియొడ్డున నొక వృక్షముక్రిందే నానివాసము. అక్క డకు దయచేసి కొంతసేపు విశ్రాంతి తీసికొనుడు. సంగతులన్నియు అక్కడ మనవిచేసెదను. త్రోవలో వా రొకరితో నొకరు మాట్లాడు కొనలేదు. వేగముగా వారా వృక్షమును జేరిరి. ఒకమూల అగ్నిహో త్రము వెలుగుచుండెను. భూమిమీద నొక తుంగచాపపరచి యుండెను. దానిపై నొక మృగచర్మమును, కమండలమును, కొన్ని పుస్తకము

లును, ఉండెను.

నరసింహారావు అగ్నిహోత్రముపద్ద చలికాచుకొనుచు, రామప్రసాదుతో, "మీరు సాధువులుకదా? నిజము చెప్పండి. కమల ఈదుర్గతి కెట్లు పాల్పడినది?

రామప్రసాదు అగ్నిహోత్రపు వెలుతురులో నరసింహారావు ముఖమును పరిశీలించి చూచుచుండెను. అతనిముఖమునందు అతని హృదయమునందలి భావములన్నియు ప్రకటితము లగుచుండెను. రామప్రసాదు మునుపటి రామప్రసాదు కాడు. సత్సహవాసము, వైరాగ్యము, అతని జ్ఞానమును వికసింపజేసినవి. అతడు తనసంసార నాశనము గురించి ఆలోచించుకొలదియు అతనికి పశ్చాత్తాపమెక్కువగుచుండెను. అతని అనుతప్త హృదయము కమలయెడ నుదారమగుచుండెను. ఒకసారి వెళ్ళి కమల కాళ్ళపై పడవలెనని అతని కప్పుడప్పుడు బుద్ధి పుట్టుచుండెను.

రా. స్వా—ఆమె నాశనమునకు నేనే కారకుడను. ఇదియంతయు నానిర్దయ అమానుష వ్యవహారములయొక్క ఫలము. ఆమె సర్వ గుణసంపన్నురాలే. నిజముగా ఆమె ఒక గొప్పయింటి యజమానురాలు కావలసినది. నావంటి దుష్టుడు, దురాత్ముడు, కఠినుడు ఆమెకు తగినవాడు కాడు. అప్పుడు నాస్థూలదృష్టి ఆమె సద్గుణములను కని పెట్టలేక పోయినది. ఆమె నాపోరు మరి పడలేకపోయినది. కాని ఆమె మనస్సుమాత్రము చెడిపోలేదు. ఆమె నన్ను ఆదరముతో జూచుచుండెడిది. కాని ఆమెయొక్క నడవడి జూచి ఆమె నావద్ద నటించుచున్నదని నాకునుండేహాము కలుగసాగెను. ఆమెయొక్క సంతోషము భక్తిగాంభీర్యము నాకు దురోద్బోధకములుగ నుండెను. ఆమె నావద్ద వేషములు వేయుచున్నదని తలచితిని. ఆమె చిన్నచిన్న వస్తువుల కొరకు దెబ్బలాడి, ఏడ్చి, అలిగి నన్ను ఎత్తిపొడుపు మాటలాడిన

నాకు అనుమానము లేకపోయి యుండును. ఆమె యున్న తాధర్మము లేనాకు అనుమాన హేతువులయ్యెను. క్రమముగ నాకామె నడవడి పైనిగూడ అనుమానము కలుగ సాగెను. చివరకొక రోజు రాత్రి ఆమె తన స్నేహితురాలింటికి వెళ్లి కొంచము ఆలస్యముగా వచ్చుట వలన, నాసందేహమును నిశ్చయ పరచుకొని, నేనామె నింటినుండి తగిలివేసితిని.

నర—(మాటకడ్డమువచ్చి) అప్పుడు నీబుద్ధి ఏమైనది? నువ్వు నీమూర్ఖత్వముచేత ఎంతపెద్ద కుటుంబమును కళంకిత పరచినావో నీకు కొంచెమైన జ్ఞానము లేకపోయినదా?

రామ—అప్పుడు నాబుద్ధి ఏమైపోయినదో నేనేమి చెప్పగలను? అప్పుడు నాకాయాలోచన లేకుండెను. కాని ఆమె అంతఃకరణ మాత్రము చాల శుద్ధమైనది. పాపకార్యాచరణ యందామెకు చాల అసహ్యము. ఆమెఇప్పుడు వితంతుశరణాలయము నందున్నది. అక్కడి వారందరకు ఆమె యెడల మిక్కిలి గౌరవము. ఆమె నిష్టానియమ ములను జూచిన మిక్కిలి ఆశ్చర్యము కలుగును.

రామప్రసాదు చెప్పిన మాటలను వినిన, తర్వాత నరసింహారావు నకు కమలమీది కోపము కొంత తగ్గెను. కానిసాధారణ వేగముతో ప్రవహించుచున్న జలధారముందరి అడ్డువలన ఆగి, రెండవవైపునకు మరింత వడిగా ప్రవహించునట్లు, కమలపై ఆతని కోపము తగ్గుచున్న కొలదియు, రామప్రసాదుపై ఎక్కువగుచుండెను. ఆకలితోనున్న సింహము తన వేటజంతువు వైపెట్లు జూచునో ఆప్రకారము నరసింహా రావు రామప్రసాదువైపు కోపముతో జూచుచుండెను. ఈతడే తనకుటుంబమును కళంకితపరచెనని, కమల సర్వనాశనమునకు కారకుడనియు, తలచి, తనలో, "ఈతడిప్పుడు తనదుష్కర్మలకు సిగ్గుపడుచున్నంత మాత్రమున వదలిపెట్టుదునో? కాని ఇతడీ సంగ

తులన్నియు నాతో నెందుకు చెప్పుచున్నాడో ? బహుశా, నేనాతనిని వీఱియు చేయజాలనని అనుకొనుచున్నాడు కాబోలు ? ఇదేనిజమై యుండవచ్చు. కాని యెడల తనతప్పులన్నియు నాఎదుట ఎందుకింత నిర్భయముతో వప్పుకొనును ?'' నరసింహారావు రామప్రసాదుయొక్క మనోభావములను గ్రహింపలేక పోయెను. అతడొక్క తృణమట్లే అగ్ని వైపు జూచి, తిరిగి కఠోరస్వరముతో "రామప్రసాదూ! నువ్వు నావంశ మును నట్టేట గలపితివి. నాకుమార్తె ప్రాణములను దీసి దానిని సర్వ నాశము జేసితివి. ఇన్ని జేసి కూడ నాయెదుట గొప్పనుహాత్మ్యసివలె గూర్చున్నావు. ఎందులోనైనను పడి చావలేక పోయినావా ?''

రామప్రసాదు తల పైకెత్తలేదు. మౌనముతో నేలపై బొటన వ్రేలుతో రాయుచుండెను.

నర—(తిరిగి) నీవు దరిద్రుడవగుట నీతప్పుకాదు. నీవు నీభార్య నుచితరీతి పోషింపలేక పోయినను నేను నిన్ను నిందింపను. ఆమె మనోభావములను తెలిసికొనలేక పోతివి. ఆమె సద్విచారమును గ్రహింపలేకపోతివి. దీనికికూడ నిన్ను దూషింపను. నువ్వామె నుండి తగిలివేయుటయే గొప్పతప్పు. ఆమె నెందుకు చంపివేసినావు కావు ? నీకామె ప్రవర్తన విషయమై అనుమానముగా నున్నయెడల ఆమెను వెంటనే నరికివేయవలసినది. నీకంతసాహసము లేనియెడల నువ్వే ఎందుకు చచ్చిపోయినావు కవు ? విషమైనను తాళగలేక పోయినావా ? నీవామెను చంపివేసియుండిన ఆమెకీ దుర్దశయు, నావం శమునకీ కళంకమును, రాకిపోయి యుండునే. మొగవాడినని చెప్ప కొనుటకు నీకు సిగ్గు లేదా ? నీసిగ్గుమాలిన తనమును, పిరికితనమును జూచిన నాకు చాల సహ్యముగా నున్నది. తనభార్య వరపురు షునితో పోవుచున్నదని తెలిసికొని ఆమె రక్తమును కళ్ళజూడని వాడు పశువుకన్న అధముడు.

కమల నింటినుండి తగిలివేసితినని జెప్పి, అననసరపు చిక్కులలో తగులుకొంటినని ఇప్పుడాతనికి బోధపడెను. అతడు తన తెలివితక్కువ తనమునకు మనస్సులోనే పిసుగుకొను చుండెను. ఇంత తిరస్కరింప పడుదునని అతడనుకొనలేదు. ఆతడింత ఉగ్రుడై తనమనస్సు నింత గాయపరచునని కూడ నసుకొనలేదు. అనుతప్త హృదయము సాను భూతితో కూడుకొన్న తిరస్కారమును కోరును గాని, అవమాన సూచకమైన కృతఘ్నతను కోరదు. పండినకురుపు కత్తిగోతును సహించునుగాని, రాతిదెబ్బను సహించజాలదు. రామప్రసాదిప్పుడు తన పశ్చాత్తాపమునకు విచారమును పొందుచుండెను. తన పూర్వ పక్షమును సమర్థించుకొనుట కాతనికి ధైర్యము చాలకుండెను.

నర—(గర్జితస్వరముతో) నువ్వు దాని నెందుకు చంపివేసినావు? కావు?

రా-ప్ర—(గంభీరస్వరముతో) నా హృదయమంత కఠినమైనది కాదు.

నర—ఐతే ఇంటినుండి ఎందుకు తగిలివేసి నావు?

రా-ప్ర—ఆమె సమ్మతి వదలించుకొనుటకు నాకు మరియొక యుపాయము తోచినది కాదు.

నర—(ముఖమును చిట్లించుకొనుచు) విషమును త్రాగలేక పోయినావా?

రా-ప్ర—(ఈ మాటలను సహింపలేక) వ్యర్థముగా ప్రాణమును పోగొట్టుకొందునా?

నర—వ్యర్థముగా జీవించుటకంటె వ్యర్థముగా ప్రాణములను పోగొట్టుకొనుటే మేలు.

రా-ప్ర—నేను జీవించుట వ్యర్థమని మీరనజాలరు. బహుశః రామనాథముగారు మీతో జెప్పియుందురు. నేనీ యాచనావృత్తిచే

సంపాదించిన పదిహేనువందల రూపాయలు సుశీల వివాహవిషయమై నే నాతని కిచ్చితిని. మరియొక సంబంధము కుదుర్చుటకు మరియొక వెయ్యిరూపాయలు తిరిగి ఆ యనవద్దకు తీసుకొని వెళ్ళుచున్నాను.

ఇట్లు చెప్పుచు రామప్రసాదాగి పోయెను. "గొప్పగా నీ సంగతు లన్నియు ఎందుకు చెప్పుచున్నా"నను సంకోచముతో తలవంచు కొనెను.

శర—(సందిగ్ధస్వరముతో) ఆ తడీ విషయమై నాతో ఏ మియు జెప్పలేదు.

రా-ప్ర—ఇది, అతడు మీతో జెప్పవలసినంత గొప్పసంగతికాదు నే నిప్పుడు ప్రసంగవశమున జెప్పితిని. క్షమించండి. ఆత్మహత్యను జేసికొనిన ప్రపంచమున కే యుపకారమును జేయుజాలము. ఈ కళం కము నా జీవితమును ప్రజ్వలింప జేసుకొన బాధ్యునిగనన్ను జేసినది. నిద్రించుచున్న ఆ త్మను మేల్కొలుపుటకు మన తప్పులు ఒకవిధమైన దైవప్రేరితములే. అవియే మనకు తర్కశక్తి నిచ్చును. మనదోషముల వలన కలిగిన చెడుఫలములను అనుభవించిన తర్వాత, కలిగినంత ప్రబో ధము, విద్య, సత్సాంగత్యము, ఉపదేశము, మొదలైన వాటివల్ల కూడ కలుగనేరదు. దీనిని మీరు పిరికితనమే యనవచ్చును. కాని ఈ పిరికి తనమే నాకు శాంతిని, సత్కార్యములను జేయుశక్తిని, కలి గించినది. ఒకరి జీవితమును. నా శేషపరచిన తర్వాత నిప్పుడు నేను వందలకొలది అనాథబాలికల జీవితములను ఉద్ధరింప యోగ్యుడనై తిని. ఈ సత్ప్రేరణ కమలపై కూడ తనప్రభావమును ప్రసరింపజేయు చున్నదని తెలిసి నాకు చాల సంతోషమైనది. ఆమె నదీస్నానము నకు వెళ్ళుచుండగనే నెన్నియో సార్లు నా కుటీరమునుండి జూచితిని. ఆమెయొక్క శ్రద్ధాభక్తులు, ధర్మనిష్టలు జూచి, నా కెంతయో ఆశ్చ ర్యము కలిగినది. ఆమె ముఖమునందు శుద్ధాంతఃకరణయొక్క విమల

జ్యోతి ప్రకాశించు చుండెను. ఆమె పూర్వము నేర్పరియైన గృహస్థు రాలు కాదు ఇప్పుడామె విదుషీమణి. ఆమె స్త్రీసమాజమున కంతకును ఒకప్పుడు నాయకాగ్రణి కా గలదని నా నమ్మకము.

నరసింహారావు మొదట నీ మాటలన్నిటిని నిర్లక్ష్యముగా వినెను. కాని క్రమక్రమముగ ఆ మాటలయొక్క ప్రభావమాతనిని వశపరచుకొనెను. తన తప్పులకు హృదయపూర్వకముగ పశ్చాత్తాప మును పొందుచున్న వానిని నిష్కారణముగ కఠినవాక్యములచే నొప్పిం చితిననియు, ఆ తడింత ఉపకారము జేసెనని నే నెరుగక పోతిననియు, తాను కృతఘ్నుడననియు, ఆతడిప్పుడు తెలిసికొనగలిగెను. ఈనంగతు లను తెలిసికొనగానె ఆ తనికుఱ్ఱు నీళ్ళతో నిండిపోయెను. సరళస్వభా వముగల మనుష్యుని హృదయము మైనపువత్తివలె ఎంతవేగముగ కఠి నము వహించునో అంతవేగముగ కరగిపోవును.

రామప్రసాదాతని వైపు కరుణామయదృష్టితో జూచుచు "దయ చేసి ఈ రాత్రి ఇక్కడ అలసట దీర్చుకొనండి. ఈ కంబళీతో చలి ఆగును. తెల్లవారిన తర్వాత మీతో నేనుకూడ వచ్చెదను." అనెను.

నర—(నమ్రతతో) ఆ లాగె. ఇక్కడ పడుకొనెదను. కంబళీ అవ సరములేదు.

రా-ప్ర—నా కంబళీ కప్పుకొన్న మీరు అపవిత్రులగుదురని మీరు తలచు చున్నా రేమో ? నేను దీనిని వాడుటలేదు. ప్రత్యేకముగ అతి థులకొరకే దీని నుంచితిని.

నరసింహారావు మరి అడ్డు చెప్పలేదు. చలివేయుచున్నందున కం బళీ కప్పుకొని పడుండెను. ఆ తనికి వెంటనే నిద్రవచ్చెను. కాని ఆ నిద్రవలన ఆ తనికి శాంతికలుగలేదు. తాను జైలునందు మృత్యుశ య్యపై నున్నట్లును, జైలు అధికారాతని వైపు అసహ్యముగాజూ చుచు, నీ శిక్ష ఇంతటితో పూర్తి కా లేదని" చెప్పుచున్నట్లును,

ఇంతలో జగదాంబయు, ఆతనితండ్రియు వచ్చి మంచమువద్ద నిలువబడి నట్లును, వారిముఖములు కళంకముతో కూడుకొని వికృతముగ నున్న ట్లును, జగదాంబ ఏడ్చుచు నీ వలననే మాకీ దుర్దశకలిగినది. అని నిష్ఠు రములాడు చున్నట్లును, ఆ తని తండ్రి కోపముచే నెఱ్ఱబడిన కండ్లతో ఆ తనివైపు జూచుచు, "మాకు కళంకము దెచ్చిపెట్టుటయే నీ జన్మ ఫలమా? ఇందుకొరకే మేము నిన్ను కని పెంచితిమా? ఈ కళంక మిక మమ్ములను ఎప్పుడును, విడువదు. మేము కల్పాంతమువరకు నీ బాధలను అనుభవింపవలసినదే. నాలుగుదినములు సౌఖ్యము కొరకు మాకీ బాధను తెచ్చిపెట్టితివి. ఇప్పుడే నీ ప్రాణములను తీసెదము." అని చెప్పుచు నొకగొడ్డలి పట్టుకొని ఆ తనివైపు దుమికినట్లును, ఆ తడు కలగని తులుక్కుపడి నిద్రనుండి లేచెను. ఆ తని గుండెలు దడ దడ కొట్టుకొనసాగెను. తా నింటినుండి ఎందుకు బయలుదేరెనో ఆసంగతిని ఆతడు నిద్రపోవులకు ముందు మరచిపోయెను. ఇప్పుడా కల ఆతని కీవిషయమును జ్ఞప్తికి దెచ్చెను. ఆతడు తనను ధిక్కరించు కొనుచు, "నే నెంత కర్తవ్యహీనుడను! ఇది కలగాదు. నిజముగ ఆకాశ వాణియే" యని అతనికి దోచెను.

రామప్రసాదు చెప్పిన సంగతుల ప్రభావము క్రమక్రమముగ ఆతని హృదయమునుండి తొలగిపోవుచుండెను. "కమల పతివ్రత కావచ్చును. సాధ్వీమణి కావచ్చును. కాని దీనివలన ఆ కామె తెచ్చిపెట్టిన కళం కము పోజాలదు. పాపమునందు భాగుపరచు శక్తి కలదని ఈమహాను భావుడు చెప్పుచున్నాడు. కాని నేనుమాత్ర మాశక్తి నెక్కడను జూడలేదు. నేనుకూడ పాపమును జేసినాను. కాని ఆ శక్తి ఏ మియు కలుగలేదు. ఇది అంతయు ఆ తని మాటల చాతుర్యమే గాని మరి యొకటి కాదు. ఈ తడు తనపిరికి తనమును మాటలచాటున దాచు చున్నాడు. ఈ తడు చెప్పినదంతయు అబద్ధము. పాపమువలన

పాపము వృద్ధిపొందును. పాపమువలన పుణ్యమే వచ్చినయెడల ఈ ప్రపంచమునందు పాపాత్ములే యుండరు.”

ఇట్లనుకొనుచు నరసింహారావు లేచి కూర్చుండెను. రామప్రసాదు ఆ యగ్నిప్రక్కనే పడుకొని నిద్రించుచుండెను. నరసింహారావు చడి కాకుండ లేచి నదివైపు బయలుదేరెను. ఈ వేదనలను మరి సహింప లేక వీటిని అంతమొందించుకొనుట కాతడు నిశ్చయించుకొనెను.

అప్పుడే చంద్రుడస్తమించుచుండెను. మంచు తట్టముగా కురియు చుండెను. ఆ యంధకారమునందు చెట్లు, పుట్టలు, కొండలయొక్క తారతమ్య మేమియు కనబడుటలేదు. రాళ్ళనుండియు, ముండ్ల నుండియు, తప్పించుకొనుటయందు తత్పరుడై అతడు తన అవస్థనే మరచిపోయెను.

నదియొడ్డునకు రాగానే అతనికి చిన్న వెలుతురు కనబడెను. అతడు గట్టునుండి క్రిందకు దిగెను. నదీదేవి పొగమంచను మోటుదుప్పటిని కప్పుకొని నిట్టూర్పు విడుచుచుండెను. ఆ చుట్టుపట్లగల అంధకార మునకును, నదిలోని అంధకారమునకును ప్రవాహమే అంతరవు. అది ప్రవహించుచున్న అంధకారమువలె నుండెను. మృత్యువు తర్వాత నింటియందు విచారనిశ్శబ్దము లెట్లు వ్యాపించియుండునో అట్లప్పుడు నిశ్శబ్దముగ నుండెను.

నరసింహారావప్పుడు మొలలోతు నీళ్ళయందు నిలువబడి తనలో “అయ్యో! ఇప్పుడు నా అంత మెంత దగ్గరగా నున్నది? ఒక్క నిముషములో నీ ప్రాణ మెక్కడకు పోవునో, అక్కడ ఏమిగతి పట్టునో, తెలియదుకదా? ప్రపంచముతో నాకు సంబంధము వదలి పోవుచున్నది. పరమేశ్వరుడా! ఇప్పుడు నీ శరణు జొచ్చుచున్నాను. నన్ను దయచూడుము. నన్ను క్షమించి ఈ పాపములనుండి ఉద్ధరింపుము!” అని ప్రార్థించెను.

తర్వాత అత డొకతీరము ధైర్యమును పురికొల్పుకొని నీటి యందు గుభాలున పడెను. నీరు మంచువలె నుండుటవలన ఆతని శరీరము గడగడ వడకసాగెను. అత డట్లే కంఠమువరకు నీటిలోనికిపోయి, ఒక్కసారి అగాడాంధకారమునంతను కలయజూచెను. ఇది జీవనసంగ్రామముయొక్క అంతిమరంగము. మనోబలాత్మాభిమానములయొక్క చివరపరీక్ష. ఇప్పటివరకు ఆతడు చేసిన ప్రయత్నములన్నియు సీపరీక్షకొరకే. ఇచ్ఛామాయల కిదియే ఆఖరియుద్ధము. మాయసంపూర్ణశక్తితో తనవైపునకు లాగుచుండెను. కమల విదుమీవేషముతో కండ్ల ఎదుట గోచరమయ్యెను. సుశీల ప్రత్యక్షశోకదేవతవలె ముందునకు వచ్చెను. "ఇప్పుడు ఏమిచెడిపోయినది? నేను సాధువు నైపోకూడదా? ప్రపంచమునందు సామాన్యాదలవిషయమై చర్చించుటకు నేనంత పేరుపడ్డవాడనా? ఎంతమంది కన్యకలు ఈ పాపపంకిలమునందు చిక్కుకొనలేదు. ఈ ప్రపంచమునందు? కాని వీరి గురించి ఎవరికి కావలెను? ప్రపంచమునందునన్ను సద్గురు దూషించెదరనియు, పరిహసించెదరనియు అనుకొనుట ఎంత మూర్ఖత్వము?"

దీనికి ప్రతివాదము చేయవలెనని ఇచ్ఛాశక్తి ఎంతయో ప్రయత్నించెను గాని లాభము లేకపోయినది. ఒక్కమునగే తరువాయి. జీవనమృత్యువులకు ఒక్క అడుగే అంతరమున్నది. వెనుకకు ఒక్క అడుగెంత సులభము? ఎంత సరళము? ముందున కొక్క అడుగెంత కఠినము? ఎంత భయావహము?

నరసింహారావు వెనుకకు తిరిగి పోవుటకు కాలును దీసెను. మాయ తనశక్తియొక్క చమత్కారమును జూపించెను. నిజముగానిది ప్రపంచమునందు ప్రేమ కాదు. ఇదియొక అదృశ్యమైన భయము.

అప్పుడు నరసింహారావుకు తానిక వెనుకకు పోలేనని తోచెను. అతడు క్రమక్రమముగ ముందునకే త్రోసుకొని పోవుచుండెను. అత

డవ్వాడు సహాయముకొరకు గట్టిగా కేకలువేసెను. చలిచే కొయ్య బారిన తన కాళ్లను వెనుకకు ద్రిప్పుట కెంతయో ప్రయత్నించెను గాని అత డెంత ప్రయత్నించినను ముందునకే కొట్టుకొని పోవు చుండెను. కర్మగతి ఇట్లున్నది.

అకస్మాత్తుగ అతనికి రామప్రసాదు పిలచుచున్నట్లు వినబడెను నరసింహారావు పెద్దగొంతుకతో అతనికి జవాబు చెప్పెను. కాని నోటి నుండి మాట పూర్తిగ రాలేదు. గాలివలన ఆరిపోయి అంధకారము నందు లీనమైన దీపమువలె ఆధ్వని అలలలో కలసిపోయెను. లజ్జా, శోక, విచారములచే మండుచున్న హృదయముయొక్క మంట, ఆ చల్లనిసీటియందు శాంతిని పొందెను.

"నే నిక్కడ మునిగిపోవుచున్నాను." అను శబ్దములు మాత్రమే రామప్రసాదునకు వినబడెను. తర్వాత అలలయొక్క పై శాచికక్రీడా ధ్వనులు తప్ప మరియేమియు వినబడలేదు.

శోకాకులహృదయముతో రామప్రసాదు నుయొడ్డున చాలసేపు నిలువబడెను. ఆశబ్దములే ఆతనికి నాలుగువైపులనుండియు వినబడు చుండెను. దగ్గరనున్న కొండలు, ఎదుటి సీటి అలలు, నాల్గువైపుల వ్యాపించియున్న గాడాంధకారము, నీ శబ్దములతోనే ప్రతిధ్వనించు చుండెను.

౧౧

తెల్లవారగానే ఈ శోకసమాచారము రామవరమునందు వ్యాపించెను. రామనాధమును పరామర్శించుటకు నలుగురైదుగురు పెద్ద మనుష్యులు తప్ప మరి యెవ్వరును రాలేదు. స్వభావిక మరణమైన

యెడల శత్రువులు కూడవచ్చి నాలుగైదు కిన్నిటిబొట్లు విడ విడచు. కాని ఆత్మహత్య భయంకరమైనది. దీనియందు పోలీసుల యధికార ముండును గనుక మిత్రులు కూడ శత్రువులవలె దూరముగానుండిరి.

రామనాధము నూతివద్ద స్నానము చేయుచుండగ రాముప్రసాదు వచ్చి, ఈ సంగతిని జెప్పెను. ఈ సమాచారమువలన రామనాధ మునకు దుఃఖముగాని, సానుభూతిగాని కలుగలేదు. మీదు మిక్కి లి నరసింహారావుపై కోపము కూడ వచ్చెను. పోలీసువారి భయ మాతని విచారమును అణచివేసెను. ఆత డా రోజున స్నాన ధ్యాన ములందు చాల విలంబమయ్యెను. సందిగ్ధచిత్తునకు తన పరిస్థితిని గురించి విచారించుటకు అవకాశము దొరకలేదు. దానికి సమయ జ్ఞానము లేకుండెను.

కామేశ్వరమ్మ పెద్ద గొంతుకతో ఏడ్వసాగెను. ఆమె ఏడ్చు చుండుటను జూచి ఆమె కుమార్తెలిద్దరు కూడ ఏడ్చుచుండిరి. ఇరుగు పొరుగు స్త్రీలు వారిని ఓదార్చుటకు వచ్చిరి. వారికి పోలీసువారి భయము లేదు. ఆ యేడ్పులు త్వరలోనే ముగిసి, నరసింహారావు యొక్క గుణదోషముల చర్చ ప్రారంభమయ్యెను. ఆతనియందు దుర్గుణములకంటె సద్గుణములే ఎక్కువ యున్నవని అక్కడనున్న వా రందరు స్థిరపరచిరి. మధ్యాహ్నము రామనాధము దాపాము తీసి కొనుట కింటిలోనికి వచ్చి, మాటల సందర్భమున తన భార్యవద్ద నర సింహారావును నిందించెను. కామేశ్వరమ్మ కోపముతో, "చచ్చిన వాని నెందుకు నిందించెదరు?" అని మందలించెను.

రామనాధము సిగ్గుపడెను. కామేశ్వరమ్మ పైకి దుఃఖమును నటించుచున్నను, ఆతని చావునకు మనస్సులో సంతోషించుచునే యుండెను. నిజమైన దుఃఖము సుశీలకు తప్ప మరి యెవ్వరికిని లేదు. తన తండ్రి సామర్థ్యహీనుడని ఆమెకు తెలియునుగాని, ఈ ప్రపంచ

ముసం దామెకు 'నా' అను మాడాత డొక్కడేకదా? ఆతని దురవస్థయే ఆమెను మరింత పితృభక్తురాలిగా జేసెను. ఎటు జూచిన నిప్పు డామె నిరాధారురాలే. కాని ఈ నిరాశ ఆమె జీవితమును ఉద్దేశహీనముగ జేయలేదు. ఆమె హృదయము మరింత కోమల మయ్యెను. నరసింహారావు చివరకు జేసిన ఉపదేశ మామెకు నూతన శక్తిని కలిగించెను. అమెయం దప్పుడు ఓర్పు మూర్తీభవించినట్లుం డెను. వర్షఋతువుయొక్క ఆఖరి చినుకులనలెనే మనుష్యునియొక్క తుదిమాట లెన్నడును నిష్ఫలములుకావు.

తండ్రి ఆత్మకు దుఃఖము కలిగించు మాటలను సుశీల తన నోటి నుండి రానిచ్చుటలేదు. తండ్రి జీవించియున్నప్పు డామె ఆతని చెడు ప్రవర్తనను అప్పుడప్పుడు సిరసించుచుండెడిది. కాని ఇప్పుడా విషయములనైనను తన మనస్సున రానిచ్చుటలేదు. భౌతిక శరీరమునుండి విముక్తిపొందిన ఆత్మకు బాహ్యాంతర భేదము లుండవని ఆమె నమ్మకము. ఆమె కామేశ్వరమ్మను సంతోషపెట్టుటకు తన శక్తికొలది ప్రయత్నించుచుండెనుగాని ఆమె సుశీల నెప్పుడును నిష్ఠురము లాడుచునే యుండును. ఆమెకు కోపమువచ్చినను దానిని విషమువలె దిగ మ్రింగుచుండును. ఆమె యేకాంతమునందైనను దుఃఖించుట లేదు. తాను ఏడ్చిన తన తండ్రియొక్క ఆత్మ దుఃఖపడునని ఆమె భయము. సంక్రాంతికి రామనాధము తన కుమార్తె లిద్దరకు క్రొత్తచీరలను కొని తెచ్చెను. కామేశ్వరమ్మ కూడ, పెట్టిలోనుండి, పట్టుచీరను దీసి కట్టుకొనెనుగాని సుశీల మాత్రము తను మాసిన చీరతోనే యుండెను. ఆమె మనస్సు దుఃఖముతో కుములిపోవుచుండెను. కాని ఆమె తన విచారమును ముఖమునందు కొంచమైనను కనబడ నివ్వకుండెను. అక్కచెల్లెండ్రిద్దరు చీటల అంచులు బాగులేవని మూతులు ముడుచుకొని ఒకమూల కూర్చుండిరి. సుశీల ప్రసన్నవదనముతో నింటిపని

లన్నియు చక్కబెట్టుచుండెను. అది చూచి కామేశ్వరమ్మ కామెయందు జాలికలిగి తన పాతపట్టుచీరను దీసి ఆమెకు కట్టనిచ్చెను. సుశీల కొంచమైనను అడ్డుచెప్పక దానిని కట్టుకొని పిండివంట జేయుచుండెను.

ఒకనాడు సుశీల తన మేనమామయొక్క వాణీ నుతికి ఆరవేయుట మరచిపోయెను. మరునాడాతడు స్నానముచేసి కట్టుకొనుటకు జూడగ వాణీ బురదతో తడిగా నుండెను. అతడేమియు అనలేదు కాని కామేశ్వరమ్మ ముఖము వాచినట్లామెను చీవాట్లు పెట్టెను. సుశీల ఏడ్చుచు వాణీ నుతుకుచుండెను. అది చూచి రామనాథమునకు మిక్కిలి దుఃఖము కలిగెను. "మా సౌఖ్యములకొరకే దిక్కులేని పిల్లను ఇన్ని బాధలు పెట్టుచున్నాము. దేవునియెదుట దీనికెట్లు సమాధానము చెప్పగలను?" అని ఖేదపడెను. కాని కామేశ్వరమ్మనుమాత్ర మేమియు అనలేదు. ఎట్లైన నీ అనర్థమును తొలగించవలెనని ఆతడు నిశ్చయించెను. దినవారములు ముగించి ఇప్పుడాతడు గోపాలశాస్త్రిమీద దావా తెచ్చుటయందు తత్పరుడై యుండెను. ఈ దావా గెలుచునని ప్లీడర్లాతనికి నమ్మకము కలుగునట్లు చెప్పుచుండిరి. "ఐదువేలు దావాలో గెలిచిన నేనెంత అదృష్టవంతుడను?" అని యాతడనుకొనుచుండెను. ఈ భావికల్పన లాతనిని ఉన్మత్త పరచుచు క్రొత్త కోరికలను పుట్టించుచుండెను. ఆతడీ సొమ్ములతో నొకయిల్లు కట్టించుట కాలోచించుచు మనస్సునందే ఆయింటి ప్లానును చితిరించుకొనుచుండెను. ఈ యానంద కల్పనలలో మునిగి యాతడు సుశీలమాటయే మరచిపోయెను. కాని కామేశ్వరమ్మ పెట్టు బాధ లాతనిని మేలొక్కలెను. రామప్రసాదిచ్చిన వెయ్యిరూపాయల నాతడు దావాఖర్చుల నిమిత్తము ప్రత్యేకముగా నొకచోట నుంచెను. ఒకనాడాతడు కామేశ్వరమ్మతో నీ సంగతులను ప్రస్తావించుచు

సుశీలకు మరియొక సంబంధము చూచు విషయమై కూడ ప్రస్తావించెను. ఈ మాటలు సుశీల చెవులలో బడెను. దావా సంగతులు విని ఆమె దుఃఖించి, దావాచేయుట అనుచితమని తలచెను కాని వివాహ విషయమైన మాటలు వినినప్పుడు మాత్రమామె ఊరుకొన లేక పోయెను. ఒక ప్రబలమైన శక్తి ఆమె సిగ్గును, సంకోచమును కూడ తొలగించి వేసెను. రామనాథ ముక్కడనుండి వెళ్ళిపోగానే ఆమె కామేశ్వరమ్మవద్ద కు ్చుని మెల్లగా "మాను ఇప్పుడు మీతో నేమి మాట్లాడుచు.. ్నది" అని యడిగెను.

కామే—(చికాకుతో) ఏమి చెప్పుతారు? తమ కష్టములకు దుఃఖపడుచున్నారు. ఆదార్భాగ్యరాలు కమలయే ఇది యంతయు తెచ్చి పెట్టినది. ్లోయిన నీచిక్కులన్నియు ఎందుకు సంభవించును? తిరిగి ఇవ్వడంత ంచి వంశములోనివాడు దొరకుట కష్టము. దగ్గర గ్రామములోనున్న ొక సంబంధమును జూచుట కాయనఇప్పుడే వెళ్లినారు.

సుశీ—్రత్యం ంచుకొని) నన్ను ఏలాగైనను వదలించుకొనుటకు నేను మీకంత కష్టమును కలుగజేయుచున్నానా? నానిమిత్త మనవసరముగ కష్టపడవద్దని మామతో చెప్పండి.

కామే—నీవాయన ప్రియు మేసకోడలవు. నీదుఃఖమును జూచి ఆయన సహింపలేరు. 'ఇప్పటిమట్టుగు ఊరుకోండి. దావాసామ్మొ వచ్చిన తర్వాత సంబంధమూ జూడవచ్చు' నని నేను చెప్పాను. కాని ఆయన నామాట లెప్పుడు విన్నారు?

సుశీ—నన్నక్కడ కెందుకు పంపివేయకూడదు?

కామే—(ఆశ్చర్యముతో) ఎక్కడకు?

సుశీ—(సరళముగ) విష్ణువర్ధనమో, కళ్యాణపురమో.

కామే—ఏమి సత్యకాలపు మాటలాడుచున్నావు? ఆలాగైతే ఈ యేడుపంతా ఎందుకు? వాళ్ళు నిన్ను ఇంట్లో నుండనిచ్చుటకే

వప్పుకొన్నఎడల ఈ యల్లరంతా ఎందుకు చేస్తారు?

సుశీ—కోడలిగా ఉంచుకోకపోతే దాసీగానేనా ఉంచుకోరా?

కామే—(నిర్దయతో) ఐతే వెళ్ళిపో. నిన్నడ్డుపెట్టువారెవ్వరు? నిన్నక్కడకు తీసుకువెళ్ళి, అవమానమునుపొంది, తిరిగి నిన్ను తీసుకొని వచ్చుట మా వల్లకాదు. ఆయన వారిమీద దావా చేసి సొమ్ము ఫుచ్చుకొని తీసుకొంటారు.

సుసీ—అత్తా! వాళ్ళు అభిమానస్తులే అగుకోండి. కాని నేను వెళ్ళి వారి సొమ్ములు వద్ద నిలువబడితే వారికే దయ పుట్టుతుంది. వారు నన్ను గుమ్మములోనుండి తగిలివేయరని నాకు నమ్మకముగా నున్నది. శత్రువునైనను గుమ్మములోనుండి తగిలివేయుటకు సంకోచము కలుగును. నేను వారి.....

కామే—(ఈ సిగ్గుమాలిన తనమును సహింపలేక, మాట కడ్డము వచ్చి) ఛీ! నోరుమూసుకో. ఇటువంటి మాటలాడుట నీకు కొంచమైనా సిగ్గులేదా? నువ్వు విను, పినకపో, నేనుమాత్రం వప్పుకోను. వాళ్లు గొప్పవాళ్లైతే మాకు లక్ష్యమేమిటి? ఈలా మమ్మలని అవమాన పరుస్తారా? వాళ్లిప్పుడు వచ్చి బుజ్జి బద్దలుకొట్టుకున్నా వాళ్ళను మీ మామ గుమ్మములోనికైనా రానివ్వరు!

సుశీల మరిమాటలాడలేదు. లోక మేమనుకొనుచున్నను ఆమె తన్ను వివాహితురాలినిగానె తలచుచుండెను. ఒక వివాహితకన్య మరియొక ఇంటి కోడలగుట ఆమెకు సిగ్గుగాను, అసహ్యముగాను, ఉండెను. పెండ్లి ఇంకొకనెల ఉన్నప్పటినుండియు ఆమె మోహనుని రూపగుణ ప్రసంశలను వినివిని తనను అతనికి అర్పించుకొనెను. పెండ్లి పీటలవద్ద అతనిని తన భర్తగా భావించి చూచెను. కాని అపరిచితునివలె జూడలేదు. ఇన్నిరోజు లతని భర్తగా భావించిన తర్వాత మరియొకనిని వివాహ మాడుటయన్న ఆమెకు అసహ్యముగా

నుండెను. మోహానుని రూపమిప్పుడామె తన హృదయమునుండి పెరికివేయు జాలకుండెను. ఆతని నామె ఎన్నడును మరచిపోవజాలదు. అతడామెను గురించి కనుక్కున్నను, కనుకోకపోయినను, అంగీకరించిన ను, అంగీకరించకపోయినను అతడామె భర్తయే వివాహము నకు మంగళసూత్ర మొక్కటియే. బంధనము కాదు మనోసంకల్పమే నిజమైన బంధనము.

సుశీల కిప్పటివరకు తానెప్పటికైనను అత్తవారింటికి వెళ్ళగలుగు దుననియు ఎప్పటికైనను భర్తయొక్క ఆశ్రయము పొందగలుగుదు ననియు, ఆశగా నుండెను. కాని ఈరోజున తనవివాహము యొక్క అసలు పునర్వివాహముయొక్క మాటవిని ఆమెయొక్క అనురాగ హృదయము కంపింప సాగెను. ఆమె నిస్సంకోచముతో తనను అత్తవారింటికి పంపమని కామేశ్వరమ్మను తనశాయశక్తులా బ్రతి మాలెను. ఇంతకన్న ఆమె ఏమి చేయగలదు? కామేశ్వరమ్మ యొక్క నిర్దయా పుపేక్షలు జూచి ఆమెయొక్క ధైర్యమున నడల సాగెను. మనశ్శాంతి లేకుండెను. రాత్రి అందరు నిద్రించిన తర్వాత కృష్ణశర్మకు ఉత్తరము వ్రాయుటకు పారంభించెను. ఇదియే ఆమె ఆఖరి ప్రయత్నము. ఇదియు నిష్ఫలమైన తన కర్తవ్యము నెరవేర్చుట కామె స్థిరపరచుకొనెను. ఆమె ఇదివరకే ఉత్తరమెట్లు రాయవలెనో ఆలోచించుకొని ఉండుట వలన కేవలము వ్రాయుటయే తర్వాయిగా నుండెను. కనుక ఆమె త్వరలోనే ఇట్లువ్రాసి ముగించెను :—

"పూజ్యులగు మామగారి పాదపద్మముల సన్నిధికి—

నేను చాల దుఃఖములో నున్నాను. నామీద దయయుంచి, మీ పాదాశ్రయము నాకొసంగుడు. తండ్రిగారు నడలోపడి ప్రాణములు విడచిరి. మీమీద దావాచేయుట కిక్కడ ప్రయత్నములు జరుగు చున్నవి. నాపునర్వివాహ విషయమైకూడ మాటలు జరుగుచున్నవి

నామీర మరువకుడు. ఒక వారమువరకు మీకొరకు ఎదురు చూచెదను. అటుపైని మీరీ దీనురాలి ఆర్తనాదము వినజాలరు."

ఇంతలో దోమలు కొడకుట్టుటవలన కామేశ్వరమ్మకు మెలకువ వచ్చెను. ఆమె ఒడలు విరుచుకొనుచు, "ఇంతఅర్ధరాత్రివరకు మేలుకొని ఏమి చేయుచున్నావు?"

సుశీ—(నిర్భయముతో) ఉత్తరము వ్రాయుచున్నాను.

కామే—ఎవరికి?

సుశీ—మా మామగారికి.

కామే—ఏనుగుతిలోనైననువడి చావలేక పోయినావు?

సుశీ—వారము దినములైన తర్వాత అట్లే చచ్చెదను.

కామేశ్వరమ్మ మరియేమియు మాటలాడక తిరిగి నిద్రించెను. సుశీల ఆయుత్తరమును కవరులో పెట్టి చిరునామా వ్రాసిన తర్వాత దానిని బట్టలక్రింద దాచి నిద్రించెను.

౧౨

కృష్ణశర్మ కాలేజీలో చదువుకొనుచున్నప్పుడే ఆతనికి ప్రథమవివాహమైనది. ఇంటరుమీడియటు ప్యాసగునరి కతడొక బిడ్డ తండ్రికూడ నయ్యెను. పిల్లవాడుపుట్టి నప్పుము కొంచము బలముగానున్నను, తల్లి ఇంకను బాల్యావస్థలోనే యుండుటవలన శిశుసంరక్షణ ఎట్లు చేయగలదు? అందువలన పిల్లవాడు క్రమక్రమముగ క్షీణించి సంవత్సరము పూర్తిగ నిండకముందే చనిపోయెను. తల్లికూడ సూతికజబ్బువలన మరికొన్ని నెలలు బాధపడి కొమారుని కలుసుకొన ఈ లోకమునుండి వెళ్లిపోయెను. ద్వితీయవివాహము చేసికొననని కృష్ణశర్మ నిశ్చయిం

చుకొనెనుగాని బి. యల్ ప్యాసై వకాల్తీ పుచ్చుకొనగానె తిరిగి వివాహబంధములో చిక్కుకొనవలసి వచ్చినది. సుభద్రమ్మవివాహమై అత్తవారింటికి వచ్చి, ఇప్పటికిని సంవత్సరము లయ్యెను.

మొదటి రెండుమూడు సంవత్సరములలో కృష్ణశర్మకు సంతాన ధ్యానమే లేకుండెను. వదినగారా ప్రశ్నశ తెచ్చినప్పుడాత డామె మాటలను నవ్వు తాలక్రింద కట్టివేయుచు, "నాకు సంతానమునందు కోరికలేదు. నేనా బాధలు పడలేను" అని నవ్వుచు జవాబు చెప్పుచుండును. ఇంతవర కాతనికి సంతాన ము కలుగుననియే ఆశగానుండెను.

కాని నాల్గుసంవత్సరములు కాగానే సంతానము మరి కలుగదేమో యని నిరాశపుట్టసాగెను. "నిజముగ నేను సంతానవంతుడను కానా! అని అతడు విచారించుచుండెను. దినములు గడచుకొలదియు, నీ విచార మధికము కాసాగెను. ఇప్పుడాతనికి జీవితమే శూన్యముగా తోచుచుండెను. ఆ యింటి సుభద్రమ్మతో నిరాశగా మాట్లాడునప్పుడామె యాతనిని మందలించుచుండును కాని ఆ మెకు కూడ విచారము లేకపోలేదు. కర్మఫల మనుభవింపక తప్పదని సమాధానపడుచుండును.

కృష్ణశర్మ తనలో, "సంతానము లేకపోయిన మించిపోయినదేమి? పిల్లలు పుట్టిన దగ్గరనుండియు వారిని పాతికసంవత్సరములవరకు పెంచి పెద్దవారిని జేసి, చదువు సంధ్యలు చెప్పించి, పెండ్లి పేరంటములు చేయవలయును. ఇన్ని బాధలు పడినను బాగుపడెదరో లేదో; ఆ పిల్ల లొకవేళ చనిపోయిన బ్రతికియున్నంత కాలము వారిపై తలచుకొని ఏడ్చెదము. ఒకవేళ మనమే చనిపోయిన వారి జీవితములు కష్టముల పాలగును. అందువలన సంతానము లేకపోవుటయే మంచిది." అని సమాధానపడుచుండును. కాని ఈ సమాధానము లాతని మనస్సునకు తృప్తిని కలిగించలేదు. ఆ తడు సుభద్రమ్మవద్ద తనభాధలను దాచు

టకు ప్రయత్నించుచు, ఆమె ఈ విషయములో నిర్దోషియని తలచి ఆ మెను పూర్వమువలె ప్రేమించు చుండెను. కాని హృదయమునందు నిరాశ క్రమ్ముకొని యున్నప్పుడు ముఖమునందు వికాసమెట్లు కలుగును? సుభద్రమ్మకు మనస్సునం దీ విచారమున్నను, ఆమె పతిప్రేమయందును, సేవయందును ఎప్పుడును లోపము చెయ్యలేదు. రోజులు గడచినకొలదియు ఆమె యందు కోమలత్వ మధికమగు చుండెను. ఆమె తన ప్రేమానురాగములచే సంతానాభిలాషను, అణగద్రొక్కుటకు ప్రయత్నించు చుండెను. కాని రోగియొక్క జబ్బుపాటలవలన కుదుర్చుటకు ప్రయత్నించు వైద్యునివలె ఆమె ఈ దుస్తకార్యము నందు విఫలురాలగు చుండెను.

గృహసంబంధమైన చిన్నచిన్న విషయములనుకూడ ఆమె అనన సరముగ అతనితో జెప్పుచు, బొక్కక్కప్పుడు చీవాట్లుపెట్టుచుండును. మోహనుడు వీంటికి వచ్చిన తర్వాత అతని విషయమై ఎన్నియో సారులు ఆతని ఎదుటనే చీవాట్లు తిననలసి వచ్చెను. స్త్రీ తనభర్త చేతిదెబ్బలను సహింపవలదు గాని ఇతరుల ఎదుట ఆతని తిరస్కార దృష్టినికూడ సహింపజాలదు. మోహనుడు తమ యింటిలోనుండుట సుభద్రమ్మకు కంటకింపుగా నుండెను. చివరకది పైకుబికినది. అప్పుడు ఎండలు తీక్ష్ణముగానుండెను. పంటలక్కరాకపోవుటవలన ఆరోజున సుభద్రమ్మయే వండనలసివచ్చెను. ఎండవేడిమికి సాయము పొయ్యి వేడికూడ భరింపలేక ఆమె సాయంత్రము తనభర్తనిమిత్తము కుంపటి విసన బియ్యము పడవేసి, తనకు మోహనునకు పొడియన్నమును మూతపెట్టెను. కృష్ణశర్మ భోజనమునకు కూర్చొని మోహనుని కంచమునందు పొడియన్నమును జూచి కోపముతో తన కంచమూతని ముందుపెట్టి, వానికంచమును తాను పెట్టుకొనెను. అది చూచి సుభద్రమ్మకు వట్టరాని కోపమువచ్చి, భర్తను కఠినపు మాటలాడెను.

ఆతడుకూడ దానికి తగినట్లే జవాబు చెప్పెను. ఈవిధముగ మాటలు ముదిరినందున, శర్మ కోపము పట్టజాలక భోజనమైనా చేయకుండనే లేచి వెళ్ళిపోయెను. ఆతడట్లు వెళ్ళిపోవుచున్నప్పుడైనను సుభద్రమ్మ ఆతనిని బతిమాలి అడ్డుపెట్టలేదు. సుభద్రమ్మ ఆకంచమును తీసి ఒక మూల పడవేసి తానుకూడ ముసుగుపెట్టుకొని పండుకొనెను. కాని ఎంతసేపటికిని ఒకరి కోపమైనను శాంతించలేదు. మరునాడు వంట అక్క వచ్చి వంట జేసెను గాని, సుభద్రమ్మగాని, కృష్ణశర్మగాని భోజనమునకు రాలేదు. మోహనుడు భోజనమునకు రమ్మని వారి నిద్దరను మాటిమాటికిని బ్రతిమాలుచుండెను. కాని ఒక రాకలి లేదనియు, ఒకరు ఆలాగే భోజనం చేస్తాను. ఇంతలో ముఖం దిరిగి పోదు. ఈపాటి ఆకలి కోర్చలేకపోతే ఎందుకు పనికివస్తాం అనియు జవాబు చెప్పుచుండిరి. మోహనుడే ఈకలహమునకు కారకుడైనను, సుభద్రమ్మ అంతతో నవ్వుచు మాట్లాడు చుండుట ఆశ్చర్యము.

మూడు రూపాయలైనది. కృష్ణశర్మ నిద్రనుండి లేచి, బద్ధకము తీర్చుకొనుచుండెను. అతనికి సుభద్రమ్మమీది కోపమింకను తగ్గలేదు. ఆమెతప్ప తక్కిన వారెవ్వరు జెప్పినను, వినుటకు సిద్ధముగా నుండెను. ఇంతలో పోస్టు బంట్రోతు ఒక "నాట్‌కైండ్" ఉత్తరమును దెచ్చి ఇచ్చెను. పోస్టు బంట్రోతా యుత్తరమును దెచ్చి గొప్పఅపరాధమును జేసినట్లు కృష్ణశర్మ వానివైపు కోపముతో జూచెను. దరిద్రపు పార్టీ ఎవ్వడో తన సోదెను వ్రాసుకొనెనని తలచి దాని త్రిప్పివేయ జూచెనుగాని తిరిగీ ఆలోచించి ఆయుత్తరమును విప్పి చదువ జొచ్చెను. ఆది సుశీల వ్రాసిన యుత్తరమే. అతడు దానినొకసారి చదివి, బల్లపై పడవేసెను. ఒకక్షణమైన తర్వాత దానిని తిరిగీ చదివి, ఆలోచించుచు ఆగదియందే పచారు చేయసాగెను. ఆప్పుడు గోపాలశాస్త్రియే అక్కడనున్న, అతడా యుత్తరమాతనికి జూపించి, ఇది మీపంక్తి

మర్యాద లోకనిందా భయములయొక్క ఫలము. మీరొక మనుష్యుని ప్రాణమును దీసినారు. ఆపాపము మీకే చుట్టుకొనును. అని చెప్పి యుండును. దావాసంగతిచదవగనె కృష్ణశర్మకు ఒకవిధమైన ఆనందము కలిగెను. "ఈదావా మాఖ్యు చేసిన చాల బాగుగనుండును. దానితో నీతని వంశమున్యాయ గర్వము అడగిపోవును. రామనాధము తప్పక గెలుపగలడు. అప్పుడీ వంశమర్యాద ఎంతప్రియమైన వస్తువో అన్నయ్యకు బాగుగ బోధపడును. పాపమా అమాయకపు బాలిక యొక్క మనస్సెంత దుఃఖపడుచున్నదో!" కృష్ణశర్మ తిరిగీ ఆయుత్తరమును దీసి చదివెను. దానిలో తనయందామెకు మిక్కిలి శ్రద్ధా భక్తులున్నట్లు ఉండెను. ఈయుత్తరమాతని న్యాయ ప్రియత్వమును త్తేజింప జేసెను. "పూజ్యులగు మామగారు" అను ఈయొక్క శబ్దమే అతనిని వశీభూతుని జేసికొనెను. అది ఆతని హృదయమునందలి వాత్సల్యమును తీగను నాటింప జేసెను. అతడు వెంటనే బట్టలను మార్చుకొని, నారాయణదాసింటికి బయలుదేరెను. కాని అతడింటి వద్దలేనట్లును, రామదేవుగారింటికి వెళ్ళినట్లును తెలియ వచ్చెను. వెంటనే అతడు బైసికిల్ మీద దేవుగారింటికి బయలుదేరెను. సుశీల విషయమై వెంటనే ఏదో వకటి నిశ్చయపరుచుకొన డాత్రుతపడు చుండెను. అలస్యమైన ఈయుద్రేకము చల్లారునని అతని భయము.

ఆరోజున దేవుగారింటిచుట్టు పట్టణమునుండి వచ్చిన, యొక గొప్ప జలతరంగిణీ ప్రవీణుని వాయిద్యము జరుగుచుండెను. దానిని వినుట కనేకులు వచ్చియుండిరి. శర్మ వారింటికి వెళ్ళుసరికి నారాయణదాసు, ప్రొఫెసర్ శంకరరావుగార్లకు వివాదము జరుగుచుండెను. దేవు ప్రభాకరరావు, తేగాలిసాహేబు కూర్చుని ఆవివాదమును వినుచుం డిరి. శర్మను జూచి, దేవు లేచి, స్వాగతమిచ్చి "రండి, రండి, చూడండి. ఇక్కడ ఘోరయుద్ధము జరుగుచున్నది. వీరి నేలాగైను

సమాధానపరచండి. లేకపోయిన ఈవివాదము చివరకు దెబ్బలాటలో నికి కూడ దిగగలదు."

ఇంతలో శంఖరరావు మాట కడ్డమువచ్చి, "థియాసఫిస్టులగుట ఏ మియ తప్పపని కాదు. నేనుకూడ థియాసఫిస్టునే. ఈ సంగతి పట్టమంతా ఎరుగును. ఇవ్వుడమెరికా, జర్మనీ, రష్యా మొదలగు దేశములలో రామకృష్ణులయందు భక్తి, గీతోపనిషత్తులు మొదలైన సద్గ్రంథములయందు గౌరవము, ఇవి యున్నియు మా సమాజపరిశ్రమ యొక్క ఫలితములే. మా సమాజము హిందూజాతియొక్క గౌరవ మును వృద్ధిపొందించినది. దాని మహత్త్వమును వ్యాపింపజేసినది. మన అలసత్వమువలన ఎన్నియో శతాబ్దములనుండి అడగియున్న ఈ మత ముయొక్క మహత్త్వమును వెల్లడింపజేసినది. జ్ఞానజ్యోతివలన అంధ కారమును బాపి, మనము తెలిసికొన శక్యముకాని మహత్వమును వెల్లడించిన ఈ సమాజమువారి కీర్తిని స్వీకరింపకపోయిన మనము వరమకృతఘ్నుల మగుదుము. ఈ కీర్తి బ్లావెటస్కీదైనను, మరి ఎవ రిదైనను, మనకు దానితో సంబంధములేదు. ఏది మన అంధకార మును బాపినదో, దానిని స్వీకరించుట మనకర్తవ్యము. దీనిని మీరు బానిసత్వమనుట మిక్కిలి అన్యాయము."

నారాయణదాసు దీనిని నిరర్థకపువాదనవలె నిర్లక్ష్యముగా విని, "దీని పేరే బానిసత్వము. కాని బానిసత్వముకూడ నొకవిధముగ స్వతంత్రమైనదే. దాని యధికారము దేహముపైననే గాని ఆత్మ పైని లేదు. మీ సంఘము వారు తమ ఆత్మలనే అమ్మివేసికొను చున్నారు. ఈ ఇంగ్లీషు చదువే మిమ్ములని నింత నీచస్థితికి దెచ్చినది. యూరోపువిద్వాంసులు ఏ విషయము గురించియైనను గుణదోషములు ప్రకటించ నంతవరకు, మీరా విషయమై ఉదాసీనులుగ నుండెదరు. మీరు గీతోపనిషత్తులను, బ్లావెట్‌స్కీ, మేక్సుముల్లరు వాటిని గౌర

వించు చున్నారనియే గౌరవించు చున్నారు. గాని అవి అమూల్య గ్రంథములని గ్రహించి గౌరవించుట లేదు. మీ యందు స్వతంత్ర శక్తి బొత్తిగా పోయినది. ఇదివరకు మీరు తాంత్రికవిద్య విషయమై ఆలోచించనే లేదు. ఇప్పటి యూరోపువిద్వాంసులు దాని రహస్యమును వెల్లడించుటకు ప్రారంభించగనే ఇప్పుడు మీకుకూడ ఆ మంత్రవిద్యయందు నమ్మకము కలుగుచున్నది. ఈ మానసిక బానిసత్వము శరీరబానిసత్వముకంటె ఎన్నియో మడుగులు నీచమైనది. మీరు పనిమత్తుల నింగ్లీషునందడుగు, గీతను జర్మనీయందును జదువుచు, అర్జనుడనుటకు బదులు అర్జనా యనియును, బుద్ధుడకు బుట్టాయని యును పలుకుచు, మీ స్వభాషాజ్ఞానమును వెల్లడించు చున్నారు. మీరు మీ మానసిక బానిసత్వమువలననే చిరకాలమునుండి ఎగురు చున్న మన జాతీయమహాపురుషుల ప్రతిభయను విజృంభణాకాశమును పెకలించి, ఆక్షేత్రమునందు మీ పరాజయమును స్వీకరించు చున్నారు"

శంఖరావు దీనికి జవాబు చెప్పబోవు చుండగ రామవిక్రమదేవు మాటకడ్డము వచ్చి, "స్నేహితులారా! నేనివ్వడు మాట్లాడకుండ నూరుగొన జాలను. దానుగారు! మీరు మీ బానిసత్వమను శబ్దమును దయచేసి ఉపసంహరించు కొనండి."

నారా—ఎందుకుపసంహరించు కొందును?

రా-దే—దీనిని ప్రయోగించుటకు మీ కధికారము లేదు.

నారా—మీ యుద్దేశమేమో నాకు బోధపడలేదు.

రా-దే—మనలో ఎవరికినిగూడ నితరులను బానిసలనుట కధికారము లేదని నా యుద్దేశము. గ్రుడ్డివారి నగరమునందు. ఎవరినెవరు గ్రుడ్డివాడని పిలచెదరు! మనమందరమును గూడ దరిద్రులమైనను, ధనవంతులమైనను కూడ బానిసలమే. మనము నాగరికత లేని పల్లెటూరి రైతులమైన మనరామును భజించెదము. మనగోవులను సంరక్షించు

కొనెదము. మన దేశీయరీతిని బట్టలను ధరించెదము. మనమాతృ భాషను మాట్లాడెదము. మన పవిత్రమైన గంగయందు స్నానము చేసెదము. అందువలన మనమంత భానిసల మనిపించుకొనము. మనము ఇంగ్లీషు చదువుకొన్నవారము, నపనాగరికులము, ఐశ్వర్య వంతులమునై, విదేశభాషను మాట్లాడుచు, దొరలవలె బట్టలను వేసి కొనుచు, కుక్కలను పెంచుచు, మనదేశస్థులను, మన ఆచారము లను నీచముగా జూచుచు. మరియూ భానిసలమగు చున్నాము. ఈ విధముగ జాతియంతయు రెండుభాగములుగ విభక్తమై యున్నది. ఇందువలన నొకరి నొకరు భానిసలని అన సక్కరలేదు. భానిసత్వ మును ఆత్మీయమనియు, మానసికమనియు, శారీరకమనియు, భాగిం చుట వట్టిభ్రాంతి. భానిసత్వము కేవల మాత్మీయము. ఈ దశలు దాని అంతర్గతములు. మోటారు, బంగాళా, ఔన్నీసు, పియానా మొదలగు నవన్నియు సంకెళ్లు. ఈ సంకెళ్ళనుండి ఎవరు తప్పించు కొనగలరో వారే నిజమైన స్వతంత్రమును, ఆ నందమును, అనుభవిం చగలరు. వా రెవరో మీకు తెలియునా? తమ చెమటనూడ్చి కష్ట పడి సంపాదించిన దానిని తినుచు, తమ జాతీయవేషమును, భాషను, భావములను ఆదరించుచు, ఒకరి ముందు తలలు వంచక సంచరించు నిరుపేదలగు మహర్షికులే."

ప్రభా—(నవ్వుచు) ఐతే మీరు ఋషికులే కావలసినది!

రా-దే—అట్లైతే నా పూర్వార్జన్మ పాపఫలమును అనుభవించు టెట్లు? డిన్నర్లలను మొదలైనవాటి నెట్లు సమకూర్చగలను? కితా బులకొరకు డిల్లీ, శిమ్లామి కాల్లెట్లు కొట్టగలను? డిన్నర్ల పార్టీలనిచ్చి దొరసానుల కుక్కలను వడిలో నెట్లు కూర్చుండ పెట్టుకొనగలను? ఇంగ్లీషు దేవతలను సంతుష్టిపరచి, ప్రసన్నుల జేసికొనుటకు దేశహిత కార్యములం దసమ్మతి నెట్లిప్పగలను? ఇవియున్నియు మానవుని

అథఃపతనమునకు ఆఖరి అవస్థలు. ఇవి అనుభవించనిదె నాకు ముక్తి గలుగదు. (కృష్ణశర్మతో) శర్మగారు! మీ తీర్మానము కొన్నిలాభం దెప్పుడు వచ్చునో సెలవియ్యండి. మీరిప్పుడు చాల నిరుత్సాహముగ కనబడుచున్నారు. మన ఇతర సాంఘిక కార్యములకు పట్టిన గతియే ఈ ప్రస్తావనకు గూడ పట్టదుకద?

నిజముగ కొన్ని దినములనుండి కృష్ణశర్మ నిరుత్సాహముగానె యుండెను. విద్యార్థి పరీక్ష నిచ్చువరకు రాత్రింబవళ్లు కష్టపడి చదివి, పరీక్షయందు తీర్ణుడైన తర్వాత, తన భావిజీవితమును గురించి చింతించి చింతించి నిరుత్సాహుడగును. ఏ సాధనము వలన తానిదివరకు సఫలత నొందెనో ఆసాధనము ఈ నూతన అగమ్యక్షేత్రమునందు ఉపయోగ పడవని అప్పుడాతనికి అనుభవ మగును. కృష్ణశర్మ గూడ నిప్పుడా స్థితిలోనే యుండెను. ఈ తీర్మానము గెలుచునను ఆశ ఎక్కువగుచున్న కొలదియు, దానివలన లాభ ముండదను అవనమ్మకము కూడ ఎక్కువగుచుండెను. ఈ తీర్మానమువలన లాభమునకు బదులు మీదుమిక్కిలి నష్టమే కలుగునేమోయని అతనికి భయముగ నుండెను. కాని తన సందేహములను పైకి ప్రకటించుటకు మాత్రము సాహసము లేకుండెను.

కృ-శ—(దేవువైపు విస్వాసదృష్టితో జూచుచు) లేదండి. ఆభయ మెప్పుడూ లేదు. ఈమధ్యతీరుబడి లేక పోవుటవలన నీ వని కొంచము వెనుక బడినది.

రా-దే—ఐతే ఈతీర్మానము ప్యాసగుటకు ఏమియు అడ్డులేదుకద?

కృ-శ—(తేగాలివైపు జూచుచు) ఆసంగతి ముసల్మాన్ సోదరులపై అధారపడియున్నది.

తేగాలీ—(మర్మభావముతో) వారిపై ఆధారపడుట ఇనుకపై గోడకట్టుటయె. అక్కడ వ్యవహార మేవిధముగా నున్నదో మీ

రెరుగరు. వారు మంచి సమయములో దగా చేసిన, ఆశ్చర్యపడ నవసరము లేదు.

కృ-శే—నే నట్లను కోను.

తే-ఆవి—మీరు పొరపాటుపడుచున్నారు. ఇప్పుడు వారిలో వారు చాల తగాయిదాలు పడుచున్నారు.

ప్రభా—బలభద్రరావునాయుడుగారు ఎందుచేతనో ఈరోజున సిక్కడకు రాలేదు. అతనిని ఏలాగైనను సమాధానపరిచి వప్పిం చాలి.

రా-దే—నే నాతనిని ఆహ్వానించలేదు. అతడేలాగూ రాడని నాకు తెలుసును. అతడు అభిప్రాయభేదములను విరోధములుగా కూడ భావించును. సాధారణముగ మన నాయకుల స్వభావమే ఇట్టిది. ఈయొక్క విషయమునందే వారి తెలివితేటలు కనబడుచు న్నవి. చిన్నచిన్న విషయములలోనైనను అభిప్రాయభేదములు వచ్చిన, తమ ప్రతికక్షులను పరమశత్రువులుగా నెంచి వారితో మాట్లా డుట మానివేయుటయే గాక, ఎదుటపడిన ముఖము చాటు వేయు దురు. ఇంతటితో తృప్తినొందక, సమయము దొరికి నప్పు డధికా రులతో లేనిపోని పోటీలు కల్పించి చెప్పుచుందురు. నలుగురు స్నేహి తులు కలసి నప్పుడు, వారి యాచారవ్యవహారములను విమర్శించుచు, తమ ప్రతికక్షుడు బ్రాహ్మణుడైన భిక్షుకుడనియు, క్షత్రియుడైన పల్లె టూరి మోటు పశువనియు, వైశ్యుడైన పిరికి పిసనారియనియు, శూద్రుడైన నౌఖరీ ముండావాడనియు, ఎత్తిపొడుచు చుందురు. సంగీతమునందభిలాషయున్న పోకిరీయనియు, భక్తిపరుడైన కపట మోగియనియు, ఎగతాళి చేయుచుందురు. చివరకు వారి తల్లిపై నను, భార్యపైనను గూడ నిందా పూరితములైన విమర్శనలు బయ లుదేరును. మన ఈ మతభేదములు చాలా పాపభూయిష్ఠములు

వీటికి ప్రాయశ్చిత్తము లేదు...అదుగో డాక్టర్ శ్యామలరావుగారి మోటారు వచ్చుచున్నది.

డాక్టర్ శ్యామలరావు మోటారు నుండి దిగి, అక్కడ కూర్చున్న పెద్దమనుష్యుల వైపు జూచుచు "I am sorry I am late" (నేను ఆలస్యముగా వచ్చినందుకు విచారించుచున్నాను.) అనెను.

రామదేవు అతనికి స్వాగతమిచ్చి సత్కరించెను. తక్కిన వారందరు కూడ అతనితో షేక్ హేండు చేసిరి.

డాక్ట—(కుర్చీపై కూర్చుండి) when is the performance going to begin? (పాట ఎప్పుడు ప్రారంభమగును...)

రా-దే—డాక్టరుగారు! ఇది నల్లవాళ్ల సభయని మీరు మరచి పోయారు కాబోలు?

డాక్ట—(నవ్వుచు) దేవుగారు! క్షమించండి. మీతో సహజ భాషమాట్లాడకూడ దనుకొనుట మరచి పోయాను.

రా-దే—కాని మీరా! దేవతల సభలో ఎప్పుడు ఇటువంటి తప్పు చేయరు.

డాక్ట—ఐతే దీనికి ప్రాయశ్చిత్తమేదో శలవియ్యండి.

రా-దే—మీరు మీస్నేహితులతో మాతృభాషను మాట్లాడుటయే దీనికి ప్రాయశ్చిత్తము.

డాక్ట—మీరు జమీందారులు కనుక మీరీప్రతిజ్ఞను నెరవేర్చ గలరు. కాని మేము దాని నెట్లు పాలించగలము? ఇంగ్లీషుభాషయే మా lingua franca (సార్వదేశికభాష)

రా-దే—దీనికి మీవంటి వారే ఇట్టి గౌరవమును ప్రసాదించినారు పాశ్చాత్యము, కాబూలుతాలూకు మూర్ఖశిఖామణులు, హిందూవ్యాపారస్థులు కలయుటవలన ఉర్దూభాష ఉద్భవించినది. మనదేశమునందలి భిన్నభిన్నప్రాంతముల విద్వాంసులొకరితో నొకరు మాతృభాషతో

మాట్లాడుకొనిన ఇప్పటి కేదోయొక సార్వదేశికభాష ఏర్పడియే ఉండును. మీవంటి ఆంగ్లేయభాషా భక్తులున్నంతవరకు ఐనదేశము నందు సార్వదేశికభాష ఏర్పడజాలదు. ఆంగ్లేయమువంటి ఉన్నత భాష దొరకగనే ఇప్పటివారు దానికి దాసులై పోవుచున్నారు. ఇంగ్లీషుభాష మాట్లాడుట వ్రాయుటయే తమ గౌరవమని వీరెందుకు తలచుచున్నారో నాకేమియు బోధపడుటలేదు. నేను కూడ సంగ్లీషు నేర్చుకున్నాను. రెండుసంవత్సరములు యూరోపునందుండి వచ్చినాను. మీఆంగ్లేయ పండితులతో సమానముగమాట్లాడగలను వ్రాయగలను గాని దానియందు మాట్లాడుట జాతీయభావమునకు విరుద్ధము.

కృష్ణశర్మ ఈ వాదమునకు దేనికిని పొల్లొసలేక. సమయము దొరకగనే నారాయణదాసు నొకవైపునకు బిలచి, రహస్యముగ సుశీల యుత్తరమును జూపెను.

నారా—మీరు రిప్పు డేమి చేయవలెనని ఉద్దేశించియున్నారు.

కృష్ణ—నాకే ఆలోచనయు తోచుటలేదు. ఉత్తరము వచ్చిన వెంటనుండియు నేను పడికొట్టుకొనిపోవుచున్నట్లున్నాను.

నారా—ఏదోవకటి ఆలోచించి చేయుక తప్పదు.

కృష్ణ—ఏమిచేయను ?

నారా—సుశీలను ఇక్కడకు తీసుకొనిరండి.

కృష్ణ—దీనితో ఇంటితో సంబంధము వదలిపోవును.

నారా—వదలిపోయిన పోవుగాక. కర్తవ్యము నెరవేర్చినప్పుడొకరికి భయపడిన నెట్లు ?

కృష్ణ—మీరు చెప్పినది నిజమేగాని నాయందంత సామర్థ్యము లేదు. అన్నగారి నప్రసన్నుల జేయుటకు నాకు సాహసములేదు.

నారా—మీ రామెను మీ ఇంటివద్ద ఉంచుకొనకండి. విధవాశ్రమమున ఉంచండి. అప్పుడు మీ కేమియు భయ ముండదు.

కృష్ణ—ఔను. మీరు మంచి ఉపాయమే చెప్పినారు. నా కింత మాత్ర ముపాయము తోచలేదు. కష్టసమయములందు నా బుద్ధి మందగించిపోవును.

నారా—కాని మీ రేలాగైనను వెళ్ళకతప్పదు.

కృష్ణ—ఏమి ? మీరు వెళ్ళినపని జరుగదా ?

నారా—బాగానే ఉన్నది. రామనాధముగారు ఆమెను నాతో నెందుకు పంపెదరు ?

కృష్ణ—దీనివలన ఆయన కేమి నష్టము.

నారా—మీ రొకప్పుడు చిన్న పిల్లలకంటె అమాయకముగ మాట్లాడుతారు. సుశీల ఆయన కొమార్తె కాకపోవుట నిజమే కాని ఇప్పు డాతడే ఆమెకు తండ్రివంటివాడు. కనుక అత డామెను ఒక అపరిచితపు మనుష్యునితో పంపుట కిష్టంపుకొనును.

కృష్ణ—నే నిప్పుడు వెళ్ళిన తప్పక ఉపద్రవము కలుగకమానదు. అన్నయ్యకి సంగతి తెలిసిన చాల కోపము వచ్చును. నన్ను చంపి వేయకమానరు. మొన్న నన్నాయన కొట్టిన దెబ్బ ఇంకా మరువు నకు రాలేదు.

నారా—సరే. మీరు వెళ్ళవద్దు. నేనే వెళతాను. కాని రామ నాధంగారి కేమి యుత్తర మివ్వండి. మీ కేమీ అభ్యంతర ముండ దనుకుంటాను.

కృష్ణ—మీరు దీనిని చులాగ్గా చెప్పుతూ ఉన్నారు. కాని నా కంతవరకైనా సాహసములేదు. ఏనా ఉత్తరం ఇస్తాను కాని అవ సరం వచ్చినప్పుడు దీనినుండి తప్పించుకొనుట కొక యుక్తి చెప్పండి.

నారా—(చికాకుతో) నాకటువంటి యుక్తులేమియు తెలియవు.ఏమి ధైర్యం ! మీరూ పకమనుష్యులేనా ! ఇంతటివారు లేరనునట్లు వేదిక మీదకెక్కి పెద్దపెద్దలెక్చర్లు చెప్పడమేమిటి! తిరిగి ఈపిరికితన మేమిటి!

కృష్ణ—(సిగ్గుపడుచు) మీ రేమన్నా సరే కాని ఈ కార్య భార మంతా మీరే వహించాలి.

నారా—సరే. ఒకతంతి నియ్యండి. లేక ఇదికూడా మీవల్ల కాదా?

కృష్ణ—(ఉత్సాహముతో) ఆలాగే తంతి నిచ్చెదను. మీ రేదో ఉపాయం చెప్పుతారని నాకు మొదటినుండి ధైర్యముగానే యున్నది. ఒకవేళ ఈ సంగతి బయలుపడిన నా పేరుపెట్టి ఎవరో ఈ తంతి నిచ్చిరనియు, నా కేమి తెలియదనియు చెప్పి తప్పించుకొందును.

కాని ఒక్క నిమిషములో ఆతని యుద్దేశము మారిపోయినది. ఆతడు తన పిరికితనమునకు సిగ్గుపడుచు తనలో, "నేను చేయు ధర్మ కార్యములను జూచి కోపగించుకొనుటకు అన్నయ్య అంత మూర్ఖుడు కాడు. ఒకవేళ ఆయనకు కోపమువచ్చినను నేను విచారింపకూడదు."

నారా—ఐతే. ఈ రోజునే తంతి నివ్వండి.

కృష్ణ—ఇట్లిచ్చుట కపటము చేసినట్లగునేమో?

నారా—ఔను. కావచ్చు. ఐతే మరియొక్కసారి ఆలోచించండి.

కృష్ణ—నేనే వెళ్ళినచ్చెద?

నారా—ఓ! చాలా బాగుంటుంది. ఆలా చేస్తే పని కూడా నిమిషములో నెరవేరుతుంది.

కృష్ణ—బాగానే ఉన్నది. మన మిద్దరం కూడా వెళ్ళదాం.

నారా—ఐతే, ఎప్పుడు ప్రయాణం?

కృష్ణ—'సుశీలను తీసుకొని వెళ్ళులకు వచ్చుచున్నాము' అని ఈరోజునే వారికి తంతినిచ్చెదను. ఎల్లుండి సాయంత్రం బండిమీద బయలుదేరి వెళదాం.

నారా—నిశ్చయమేనా?

కృష్ణ—నిశ్చయమే. మీరు నారెక్కవట్టుకొని ఈడ్చుకువెళ్లండి. నారాయణదాసు, సరళహృదయుడగు తనమిత్రుని వైపు ప్రశంసా

దృష్టితో నొక్కసారి జూచెను. తర్వాత వారిద్దరు శ్రావ్యముగా వినబడుచున్న జలతరంగిణీ వాయిద్యమును వినుటకు లోపలకు వెళ్ళి కూర్చుండిరి.

౧౩

మనము ఆరోగ్యలాభము కొరకు నీలగిరి మొదలగు ఆరోగ్యకరములైన ప్రదేశములకు వెళ్ళినప్పుడు పథ్యలోపము జరుగకుండ జాగ్రత్తపడవలెను. ఆరోగ్యసంపాదనయే మన ముఖ్యోద్దేశ్యమగనుక శరీర పరిశ్రమ, మొదలైనవి నియమానుసారముగ జేసెదము. కమల ఆత్మస్వాస్థ్యముకొరకు వితంతుశరణాలయము నందప్పుడు నివసించుచున్నది. ఈసంగతి తామె ఒక్కతీర్మానమైనను మరచియుండలేదు. ఆమె వితంతుసోదరీల సేవయందును, ధర్మగ్రంథపఠనమందును నిమగ్నురాలై యుండెను. వ్రతములు, స్నాననియమాదులు, ఆమె దుఃఖితహృదయమునకు శాంతి నిచ్చుచుండెను.

నారాయణదాసు రామవరపు వృత్తాంతమును మొదట ఆమె యొద్ద దాచెను గాని సుశీలను వితంతుశరణాలయమునందుంచుటకు నిశ్చయించిన తర్వాత నీ విషయము కమలకు తెలియజేయుటయే యుచితమని తలచి, రామదేవుగా రింటినుండి తిన్నగ ఆశ్రమమునకు పోయి ఈ సంగతినంతయు ఆమెకు ఉచితరీతిని తెలియబరచెను.

ఆశ్రమమంతయు నిశ్శబ్దముగా నుండెను. అర్ధరాత్రి కావచ్చినది. కాని కమలకు నిద్రాత్రము ఎంత ప్రయత్నించినను నిద్ర రమ్మనలేదు. ఆమె కిప్పుడు తన సుదర్శనయొక్క నిజస్వరూపము కండ్లముందు కనబడుచుండెను. క్లోరోఫారము మత్తునుండి తెలివి వచ్చిన తర్వాత రోగి, కోయబడిన తన గాయమును జూచి మూర్ఛితుడగు నట్లప్పుడు

కమల స్థితియుండెను. తల్లిదండ్రులు, చెల్లెలు, ఆమె యెదుట కూర్చున్నట్లును, తల్లి సిగ్గుచేతను, దుఃఖముచేతను తల వంచుకొని విచారించుచున్నట్లును, తండ్రి క్రోధోన్మత్తుడై నిష్ఫలురాలు కండ్లతో ఆమెవైపు జూచుచు నిలువబడినట్లును, శోకరాహిత్య తిరస్కారములు మూర్తీభవించినట్లు సుశీల యున్నట్లును తోచుచుండెను. ఈదృశ్యమును జూచి కమల మనస్సు చలించిపోవుచుండెను. ఆమె ఒక్కసారిగ ప్రక్కనుండి లేచి, తలను గోడకువేసి గట్టిగా కొట్టుకొన సాగెను. ఆమెకు తానొక పిశాచమువలె తోచుచుండెను. తలపైని భాగుగ దెబ్బతగులుటవలన ఆమెకు ముఖము తిరిగెను. ఒక్క క్షణమైన తర్వాత తెలివి వచ్చెను. తలపై తగిలిన గాయమునుండి నెత్తురు కారుచుండెను. ఆమె చప్పుడు నెమ్మదిగా తలుపు తెరచి పైకి వచ్చెను. వాకిలి యంతయు గాఢాంధకారముగా నుండెను. ఆమె తడబడుచు ఆ చీకటిలోనె వీధిగుమ్మమువరకు వెళ్ళెను. కాని తలుపు మూయబడి యుండెను. ఆమె తాళమును ఎన్నియోసార్లు ఆడించి జూచెను గాని లాభము లేకపోయెను. ఆప్రక్కనే కాపలావాడు నిద్రించుచుండెను. కమల నెమ్మదిగా వెళ్ళి, వాని తలక్రిందనున్న తాళపుగుత్తిని తీయుటకు ప్రయత్నించెను. ఇంతలో కాపలావాడు మేల్కొని దొంగ దొంగ యని కేకలు వేయసాగెను. కమల త్వరపాటుతో తన గదిలోనికి పోయి తలుపు మూసుకొనెను.

తెల్లవారుఝామునందలి చల్లగాలివలె మనస్సునందలి దుర్భర దుఃఖము కూడ శీఘ్రముగానె శాంతి పొందెను. కమల వెక్కివెక్కి యేడ్చుచు "నావంటి పిశాచిని ఈ ప్రపంచములో నుండదు. నేను భోగవిలాసములలో జిక్కుకొని నావంశమును సర్వనాశనము జేసితిని. నేను పితృ హంతకురాలను. సుశీల గొంతుకను నేనే కోసితిని. నా కళంకపూరిత ముఖము నామె కెట్లు చూపుదును? ఆమె యెదుట

యెట్లు వడగలను? నాన్నగారీ సంగతులన్నియు విన్నవ్వుడెంత దుఃఖ వడిరో?" ఇట్లు తలచుకొన్న కొలదియు ఆమె దుఃఖ ముపొంగి పొరలిపోవు చుండెను. అన్ని కష్టములకన్న నీవేదన ఆమెకు సహింప శక్యముగాకుండెను. గోపాలశాస్త్రి ఈ సంగతు లామెతండ్రికి జెప్పు టకు బదులు ఆమె నెన్ని బాధలు పెట్టినను కమలకంత కష్టము లేకుండను. భోగముల యందలి కోరిక, నిర్దయ, అవమానము, ఆమెను సిగ్గుమాలిన దానినిగ జేయకపోయిన, ఆమె ఇంటినుండి ఎన్నటికిని లేచిపోక పోయి ఉండును. భర్తయొక్క దెబ్బలను, నిష్ఠు రపు మాటలను పడుచు ఇంటియందే పడి యుండును. ఇంటినుండి లేచి పోవునప్పుడు తాను సాధ్వీమణియం దుండవలసి వచ్చునని ఆమె ఎన్నడును అనుకొనలేదు. ముందుసంగతిని ఏమియు ఆలోచించుకొన కుండ ఆమె ఇంటినుండి వచ్చివేసినది. ఆనిరాశా విచారస్థితియందు తనతండ్రి చెల్లెలన్నారను మాటయే ఆమె మరచిపోయెను.

చాల రోజులనుండి వారి కలుసు కొనకపోవుటవలన వారి సం గతియే ఆమెకు స్మరణకు రాకుండెను. ఈప్రపంచమునందు తా నేకాకి ననియు, నిస్సహాయురాలనియు, ఆమె భావించుచుండెను. తాను బంధువులకు దూరముగా నుండుటవలన తా నేమిచేసినను గుప్తము గానేయుండునని ఆమె తలంచియుండెను. కాని ఇప్పు డామె తిరిగి ఆత్మీయులబంధుజనమందు తగులుకొనవలసిన స్థితి సంభవించినది. తాను మరచిపోయినవారు తిరిగి తన ముందునకే వచ్చుటవలన, ఆమెకు పూర్వస్మృతి కలిగి సిగ్గుతోను విచారముతోను కృంగిపోవు చుండెను.

కమల మిగిలిన రాత్రియంతయు మనోవైకల్యముతో గడపి, తెల్ల వారుఝామున నాలుగుగంటలుకొట్టి వీధి తలుపు తీసినతోడనే ఆమె గోదావరీ స్నానమునకు బయలుదేరెను. కమల సాధారణముగ

స్నానమునకు ఒంటరిగనె వెళ్లుచుండెను. అందువలన చొకీదారాము నేమియు అడ్డుపెట్టలేదు. ఆమె నదిని చేరి, చుట్టుపట్ల నెవరైన నున్నారేమో యని ఇటునటు ఒకసారి పరికించి జూచెను. ఆమె ఈరోజున మామూలుగా స్నానముచేయుటకు రాలేదు. నదియందు పడి ఆత్మహత్య జేసికొనుటకు వచ్చినది. ఆమె కప్పు డనుమానము గాని, భయముగాని తత్తరపాటుగాని లేదు. ఆనుదినాడే సుశీల ఆశ్రమమునకు వచ్చును. ఆమె ఎటుల పటుటకంటె నదియందు లీన మగుటయే ఆమెకు సులభముగా దోచెను.

ఇంతలో ఆకస్మాత్తుగ ఎవరో తన వైపునకు వచ్చుచుండుటను ఆమె కనిపెట్టెను. ఇంకను కనుచీకటిగా నున్నను, ఆవచ్చుచున్న వాడొక సాధువని మాత్ర మామె తెలిసికొనగలిగెను. కమల వ్రేలియం దొక యుంగరమును డెను. ఆయుంగరము నాసాధువునకు దాన ముచేయవలెనని ఆమె నిశ్చయించుకొనెను. కాని ఆతడు దగ్గరకు వచ్చిన తోడనే కమల భయముచేత, అసహ్యముచేతను, సిగ్గు వలనను, ముఖమును ప్రక్కకు త్రిప్పి వేసికొనెను. ఆసాధువు రామ ప్రసాదే. కమల అట్లే నిలబడిపోయెను. రామప్రసాదామె కాళ్ళపైబడి, గద్గదస్వరముతో "కమలా! నాఅపరాధమును క్షమించుము" అని దీనముతో వేడికొనెను.

కమల కొంచము వెనుకకు తగ్గెను. ఆమెకు తనఅవమానముయొక్క దృశ్యము ఆమె కండ్ల ఎదుట ఆడుచుండెను. మానినగాయము రేపినట్లయ్యెను. ఆతనిని, నీవే నాపితృహంతకుడవనియు, నీవే నాజీవిత నాశనకారకుడవనియు, గట్టిగా చీవాట్లుపెట్టి నిష్ఠురము లాడవలెనని ఆమెకు బుద్ధిపుట్టెను గాని రామప్రసాదుయొక్క పశ్చాత్తాపము, ఉదారమైన సానుభూతి, సాధువేషము, ఆత్మహత్యజేసికొనుటకు ముందామె కుదయించిన వైరాగ్యము, ఆమె మనస్సును కరగించెను.

కమ—(కన్నీరు కార్చుచు, కరుణాస్వరముతో) మీ అపరాధమేమియులేదు. ఇదియంతయు నా కర్మ ఫలమే.

రా-ప్ర—కాదు. కమలా! అట్లనకు. ఇదియంతయు నా మూర్ఖతయొక్కయు, అజ్ఞానముయొక్క ఫలము. దీనికి తగిన ప్రాయశ్చిత్తము చేసికొనగలనని అనుకొంటిని గాని నా అత్యాచారములయొక్క ఘోర పరిణామములను జూచిన తర్వాత దీనికి తగినప్రాయశ్చిత్తము లేదని నాకు బాగుగ బోధపడినది. నేనీ కండ్లతోనే చూచ్యుగాను నీ తండ్రి గారు నదియందు పడి మరణించుట జూచితిని.

కమ—(ఆ తృతతో) ఏమీ? మీరు నాన్నగారు మునిగిపోవు చుండగ జూచితిరా!

రా-ప్ర—కమలా! మునిగిపోవుచుండగానే జూచితిని. నేను రాత్రి రామవరము వెళ్ళుచుండగా త్రోవలో ఆ యన నాకో కలసిరి. ఆ యన అంత అర్ధరాత్రియందు నదివైపునకు వెళ్లుచుండుట జూచి నాకు సందేహము కలిగెను. కనుక ఆ యనను నా నివాసమునకు తీసికొని పోయి, మనశ్శాంతి కలిగించుటకు చాలప్రయత్నించి సఫలుడనైతినని తలచి నేను నిద్రించితిని. కొంతసేపైన తర్వాత లేచి చూచునరికి ఆ యన అక్కడ కనబడలేదు. వెంటనే నదియొద్దునకు పరుగెత్తితిని. అప్పుడాతడు నన్నుగట్టిగా పిలచుచున్నట్లు వినబడినది. కాని నే నా యన ఎక్కడున్నాడో తెలిసికొన గలుగునరికి దయాదాక్షిణ్యములైన అలలు ఆయనను క్రింగివేసినవి. ఆ యన ఆత్మ నా కండ్లముందే స్వర్గమునకు పోయినది. నా పాపమింత ఘోరతరమైన దనియు క్షమింపరాదనియు అప్పటివరకు నాకు తెలియదు. ఈశ్వరుని ముందు నాగతి ఏమగునో?

సబ్బు మురికిని సుభ్రపరచునట్లు రామప్రసాదుయొక్క ఆత్మవేదన కమలయొక్క హృదయమాలిన్యమును తొలగించి వేసెను.

కమ—వరమేశ్వరుడు మీకు సుజ్ఞానమును ప్రసాదించినాడు. మీరు మీ జ్ఞానమువలన సితరులకు మేలొనరించి పాపప్రాయశ్చిత్తమును జేసికొనగలరు. కాని నా గతి ఏమగును? నేను రెండులోకములకు గూడ వెలియైతిని. అయ్యో! నా భోగతృష్ణ నన్నిని విధముల పాడుచేసినది. ఇకనేమి దాచను! మీ దారిద్ర్యము, అంతకన్న ఎక్కువగ మీ కాఠిన్యము, నాయం దసంతుష్టిని అంకురింపజేసినవి. నీచులకు గలుగుసుఖ్యాతి, సుఖము, భోగము, జూచి ఈ అంకురము పెరిగి పెరిగి పల్లేరువలె హృదయమునంతను కప్పివేసినది. అప్పుడు దానిని తీసివేయుటకు చిన్నప్రయత్నము కూడ నాకు కష్టముగా దోచెను. మీ ప్రేమ, సహానుభూతి, నమ్రత, ఆ ముండ్లను తీసివేయ గలిగియుండును. కాని మీరు దానిని తీసివేయుటకు ప్రయత్నింపక మరింత వృద్ధిపరిచి. బాధతో వ్యాకులపడి నేను జ్ఞానహీనురాలనైతిని. మీయొక్క పైశాచిక వ్యాపారము జ్ఞాపకమునకు వచ్చిన, నా హృదయము నందొక విధమైన మంట బయలు దేరును. నా యంతఃకరణమునుండి మీ పైశాపములు బయలుదేరును. ఇది నా అంతిమసమయము. ఒక్కక్షణములో ఈ పాపమయ శరీరము నరిలో ముసిగిపోవును. అందువలన మీ పాపములను క్షమింపుమని దేవుని ప్రార్థించుచున్నాను.

రా. వ్ర—(విచారస్వరముతో) కమాలా! ప్రాణత్యాగము వలన పాపపరిహారమైన యెడల నేనీ నరికే ఆత్మహత్య గావించుకొని యుందును.

కమ—పాపపరిహారము కాకపోయినను, చివరకీ దుఃఖములైననూ అంతమొందునుకదా!

రా. వ్ర—ఔను. నీ దుఃఖము లంతమొందవచ్చును. కాని నీనుండి దుఃఖపడుచున్నవారి దుఃఖము లంతమొందజాలవు. నీ తల్లిదండ్రులీ భౌతికశరీరమునుండి విముక్తులైరి గాని, దేహశూన్యము

లైనవారి యాత్మలు నీసమీపమునసనే సంచరించుచున్నవి. ఇప్పుడా యాత్మలకు నీ సుఖమువలన సుఖమును, దుఃఖమువలన దుఃఖమును, కలుగును. ఆత్మహత్య జేసికొని వాటికి దుఃఖము కలిగించుటయో, సన్మార్గురాలవై సుఖమును, శాంతిని కలిగించుటయో బాగుగా నాలోచించుకొనుమం. పశ్చాత్తాపము ఆత్మను పరిశుద్ధపరచుటకు దేవునిచే నొసగబడిన వరమువంటిది. దీని అభిప్రాయమును బోధపరచుకొనలేక, దుఃఖావేశముచేత, ఆత్మహత్యను జేసికొనిన ఆత్మోద్ధరణయొక్క చివరి ప్రయత్నమును నిష్ఫలమొనర్చిన వారమగుదుము. ఈ సంగతి బాగుగ నాలోచించుము. నీవు కూడ లేకపోయిన, ఆ యనాథబాలిక, సుశీల గతి యేమగును. ఆమె ఈ ప్రపంచ సుఖదుఃఖము లెరుగని అపాయికవు బాలిక. నీవు తప్ప ఆమె కిప్పుడీ ప్రపంచమునం దెవ్వరు కలరు? రామనాథము సంగతి నీ వెరుగుదువుకదా? అతడామె కేవిధమైన నిర్వాహకమును చేయజాలడు. ఆతనియందు దయ యున్నను, లోభగుణము దాని నణచివేయుచున్నది. ఏలాగైనను ఆమె బాధ్యతను అతడు తప్పించుకొన జూచుచున్నాడు. అప్పు డామె ఎవరివద్ద నుండగలదు?

రామప్రసాదుయొక్క ఈ కథనము నందు, కమలకు నిజమైన పశ్చాత్తాపము కనబడుచుండెను. ఆమె ఆతనివైపు దీనముగా జూచుచు, "సుశీలను కలుసుకొనుటకన్నను, ప్రాణత్యాగము జేసికొనుటయే నాకు సులభముగా కనబడుచున్నది. ఈ మధ్య ఆమె కృష్ణశర్మగారికొక యుత్తరము వ్రాసినదట. మా మేనమామ ఆమెకు మరియొక వివాహము జేయుటకు ప్రయత్నించుచున్నాడట. అది యెంత మాత్రము తన కిష్టము లేదనియు, తన్ను ఏలాగునైనను రక్షించవలసినదనియు వ్రాసినదట.

రా. ప్ర—ఆమె నిజముగ సుశీలయే.

కమ—పాపము కృష్ణశర్మగారి రేమి చేసెనరు? చివర కామెను తీసు కొనివచ్చి ఆశ్రమమునం దుంచుటకు నిశ్చయించిరట. ఆయన అన్న గారు సమాధానపడిన భాగుండును. లేనియెడల సుశీల ఆశ్రమమునం దెన్నిదినము లుండవలసివచ్చునో, ఆమె రేపే ఇక్కడకు వచ్చుచున్నది. ఆమె ఎదుటపడుటకు నేను సాహసింపలేకున్నాను. ఆమె నన్ను తిరస్కార ముతో జూచిన నేనెట్లు భరింపగలను? ఆమె చాతో మనసువిప్పి పలూట లాడకలేకపోయిన విషము త్రాగుటకన్న నాకు మరియొక గతిలేదు. ఇన్ని పరాభవములు పడుటకన్న చచ్చిపోవుటయే యుత్తమము.

రామప్రసా దామెవైపు నిశ్చలభావముతో జూచుచు, నిటువంటి స్థితియందు తా నున్నయెడల కమలవలె తాను కూడ ఆత్మహత్య జేసికొనుటకు సిద్ధపడుదునని మనస్సునం దనుకొనెను.

రా-ప్ర—కమలా! ఈవిచారము యదార్థమైనదే కాని నీమనస్సు నందు నీవెంత బాధపడినను సుశీల మంచికొరకు నీవు దానినంతనుసహిం పవలసినదే. నీవలన కలిగిన మేలు ఇతరులవలన ఆమెకు కలుగదు. ఇంత వరకు నీవు నీకొరకే జీవించితివి. ఇప్పు డితరులకొరకు జీవింపవలెను.

ఇట్లు చెప్పి రామప్రసాదు తాను వచ్చిన దారినే వెళ్ళిపోయెను. కమలు ఆతని మాటలను తన మనస్సునందు విమర్శించుకొనుచు నది యొడ్డున అల్లే నిలువబడిపోయెను. తర్వాత స్నానముచేసి, యుద్ధమునం దోడిపోయిన యోధునివలె తిరిగి ఆశ్రమమువైపు బయలుదేరెను.

౧౪

తాను శర్మగారికి వ్రాసిన యుత్తరమునకు జవాబు వచ్చునని సుశీలకు నమ్మకము లేదు. ఆమె వ్రాసి ఇప్పటికప్పుడే మూడు రోజులైనది.

దిన దినమునకు ఆమెకు నిరాశ ఎక్కువగు చుండెను. అనుకూలమైన జవాబు రానియెడల రామనాథమూమెకు వివాహము చేసివేయును. ఈ సంగతిని తలచుకొన్నప్పుడెల్ల సుశీలహృదయము కంపించి పోవు చుండెను. ఆమె ప్రతిదినమును తన కష్టములు నెమ్మెనను గట్టెక్కించ మని దైవమును ప్రార్థించుచుండెను. మోహనుని రూప మామె హృదయమును ఒక్క క్షణమైనను వదలుటలేదు. ఆమె యా రూప మును కండ్లయెదుట నుంచుకొని, చేతులు జోడించి, "ప్రాణేశ్వరా! నన్నెందుకు నీదానినిగ జేసికొనవు' లోకనిందకు భయపడు చున్నావా? అయ్యో! నా జీవితమింత చులకనయ్యె పోయినదా? నన్ను త్యజించె దవా? నన్ను నిష్ఫలులో పడవేసెదవా? కమల చెల్లెలనగుట నాఅప రాధమా? ఇది ఎక్కడిన్యాయము? నీ వెక్కడనైనను అగుపడిన కాళ్ళకు చుట్టుకొని వదలను. అప్పుడెట్లు తప్పించుకొని పోయెదవో చూచెదను. నా కన్నీటితో కరుగక పోవుటకు నీహృదయము శిలా మయమా! ఒక్కసారి కన్నెత్తి నా స్థితిని జూచిన నీవు నిలువగలవా? లేదులేదు. నీవెంతమాత్రము నిలువ జాలవు. నీవిశాల హృదయ మంత దయాసూన్యము కాజాలదు. కాని ఏమి చేయుదును? నాస్థితి నీకెట్లు తెలియును" అని విచారించుచుండెను.

నాల్గనరో జూదయమునసె కృష్ణశర్మవద్దనుండి రామనాథమునకు తంతి వచ్చెను. ఈసంగతి వినగానె సుశీలగుండె గడగడ వణకెను. ముందుసంగతి యేమగునో యని ఆమె అందోళన వడసాగెను. కాని రామనాథమూ తంతిని జూచిన తోడనే సంతోషభరితు డయ్యెను. అందులోనున్న రహస్య మాతనికేమి తెలియును? వియ్యాలవారిని సన్మానించుటకు బండ్లను సిద్ధపరచెను. పెండ్లివారు వచ్చుచున్నారని ఇంటివట్లను తుడిపించియు, ఇంటి సంతటిని శుభ్రపరచియు, చావడిలో తివాసులను పరపించియు రామనాథము అడావిడిగా నుండెను.

"పెండ్లి యైనను తిన్నగా కాలేదు. పిల్ల నత్తవారింటికి పంపడ మేమిటి? రామనాథ మేమయినా పన్నాగము వన్నుచున్నాడ"ని గ్రామువాను లందరు గుసగుస లాడుకొన సాగిరి. రైలువేళ కాగానే రామనాథము రైలుకు వెళ్ళి కృష్ణశర్మను తీసుకొని వచ్చెను. కృష్ణశర్మ, నారాయణదాసు, నౌకరు మాత్రమే వచ్చిరి.

మరునాడు సాయంత్రము సుశీలను పంపుటకు ముహూర్తము నిశ్చయింప బడినది. కాని వారింటి కిరుగుపొరుగు స్త్రీలెవ్వరును సుశీలను జూచుటకు రాలేదు. రామనాథము మాటిమాటికి లోపలకు వచ్చుచు, కోపముతో, "వీరిపని పట్టించెదను. పిల్లనుజూచుట కొక్క రైనను రావద్దా? యని ఇరుగు పొరుగువారిపై రుసరుసలాడసాగెను.

సాయంత్రమయ్యెను. బండివచ్చి వాకట్లో నిలువ బడియుండెను. కామేశ్వరమ్మ సుశీలను కౌగలించుకొని దుఃఖింప సాగెను.

సుశీల ఇప్పుడు తానసదివరకీ యింటియందు పడినకష్టము లన్నియు మరచిపోయెను. ఆమె హృదయమిప్పుడు ప్రేమతో నిండియుండెను. వీరితో సంబంధము వదలిపోవుచున్నది కదా యనియు, మరి ఈయింటిని జూడనుకదా యనియు తలచుకొన్న కొలదియు ఆమె హృదయము దుఃఖపూరిత మగుచుండెను. కామేశ్వరమ్మ హృదయము కూడ ఇప్పుడు అతి జాలిగాను దుఃఖముగా నుండెను. "తల్లిదండ్రులు లేని పిల్లను ఇన్నాళ్ళు కష్టపెట్టితిమిగదా" యని తలచుకొన్నప్పుడెల్ల ఆమెకండ్లు నీటితో నిండిపోవుచుండెను. ఇప్పుడు వారిద్దరి హృదయములయందు కూడ నిజమైన, నిర్మలమైన భావములుప్పొంగు చుండెను.

రామనాథము లోపలకు రాగానె సుశీల ఆయన కాళ్ళపై బడి నమస్కరించి కంటనీరు పెట్టుకొనుచు, "మీరే నాతల్లిదండ్రులు. ఈదిక్కుమాలిన పిల్లని మరచిపోకండి. నాక్షేమ మప్పుడప్పుడు కను

గొనుమండిన అదియే మహాభాగ్యముగా సంతోషించెదను." అని పలికెను. రామనాధ మామె నోదార్చుచు, "సుశీలా! విచారపడకు. నువ్వు నాపిల్లలలోని దానవే. సిన్ను దేవుడెప్పుడు రక్షించుగాక." యని దీవించి కన్నీళ్లు పెట్టుకొనెను.

సాయంత్రము కాగానె సుశీల సంరక్షించుచున్న ఆనంద యను ఆవు ముందనుండి ఇంటికి వచ్చెను. అప్పుడామె దానిని నిమురుచు, కంట తడిపెట్టుకొనెను. ఆ ఆవు నామె మూడు సంవత్సరములనుండి అతిప్రేమతో సంరక్షించు చుండెను. ఇకనామె దేనికి ప్రేమతో గడ్డిని తినిపించును? గవ్వలను గ్రుచ్చి దేనిమెడ నలంకరించును? ఆనంద తలవంచి ఆమె చెయ్యిని నాకుచుండెను. ఆమె వియోగ దుఃఖము దాని కండ్లయందు ప్రతిఫలించు చుండెను.

ఇంతలో వేళయగుటవలన కామేశ్వరమ్మ సుశీలను తీసుకొనివచ్చి బండిలో కూర్చుండబెట్టెను. బండీ బయలుదేరెను. అప్పుడు సుశీలకు తాను అగాధసముద్రమునందు కొట్టుకొనిపోవు చున్నట్లుండెను. గ్రామములోని స్త్రీలు గుమ్మములో నిలువబడి సుశీల వెళ్ళిపోవుచుండగా జూచి కండ్లనీరు పెట్టుకొనిరి.

రామనాధము వారిని సేమనువరకు దిగపెట్టుటకు వెళ్ళెను. వారు బండినెక్కి నమయుమున తమువంగి కృష్ణశర్మకు నమస్కరించెను. ఆ తడు రామనాధమ నకు ప్రతినమస్కారమును జేసెను. రైలు బయలుదేరగానె కృష్ణశర్మ నారాయణదానుతో నిప్పుడీ నాటకముయొక్క కఠినమైన భాగమును మన మభినయింప వలసియున్నది.

నారా—మీ మాటేమిటో నాకు బోధపడుట లేదు.

కృష్ణ—సుశీలతో ఏమియు చెప్పకుండగనే ఆ శ్రమములో దింపుటకంటె ముందుగా ఆ మెతో దీనికి తయారగునట్లు బోధపరచి చెప్పుటమంచిది.

నారా—ఔను. మీ యాలోచన బాగుగానే యున్నది. ఆలాగే వెళ్ళి చెప్పుదాం.

కృష్ణ—ఏలా చెప్పితే బాగుంటుందో ముందుగా ఆలోచించండి. పాపమామె తానిప్పుడత్త వారింటికే వెళ్ళుచున్నానను కొనుచున్నది. ఈ యాశ ఆమె వియోగదుఃఖమును కూడ మరపించినది. కాని మన ఈ సటన ఆ మెకు తెలిసిన ఎంతదుఃఖించునో! ముందే ఈ సంగతులన్నియు ఆమె కెందుకు చెప్పలేదని ఇప్పుడు నేను పశ్చాత్తాపమును పొందుచున్నాను

నారా—పోనీ. ఇప్పుడు చెప్పిన నేమి చెడిపోవును? విశ్వేశ్వరం వద్ద కైలు చాలనేపు అగును. అప్పుడామె యొద్దకు వెళ్ళి మెల్లిగా బోధ పరచి చెప్పుతాను.

కృష్ణ—నేను చాల పొగపాటు పని చేశాను.

నారా—పశ్చాత్తాపము పడి ముందున ఏ మైనను లాభమున్నయెడల మీ యిష్టము వచ్చినంత పశ్చాత్తాపపడండి.

కృష్ణ—మీ నద్ద పెన్సిలున్న ఒక్కసారి ఇయ్యండి సంగతంతయు ఉత్తరము వ్రాసి ఆ మెకు తెలియజేస్తాను.

నారా—అది కాదు. తంతినివ్వండి. చాలా బాగుంటుంది. మీరు విచిత్రపు మనుష్యుల్లా ఉన్నారు. గోటితో లాగేదానిని గొడ్డలితో పెల్లగించడానికి చూస్తూ ఉన్నారు.

కృష్ణ—స్థితి ఆ లాగున్నది. నన్నేం చెయ్యమన్నారు. నా కొక సంగతి తోచుచున్నది. విజయపురములో మనము డూప్లీ కేటుకొరకు కొంతసేపాగవలసి యున్నదికదా? అక్కడే ఆ మెవద్దకు వెళ్ళి ఈ సంగతంతా బోధపరచి చెప్పుదాం.

నారా—పాపం మీరీ విషయమై చాలాచిక్కుపడుచున్నారు. అందుచేతనే ఏ సంగతే నా ముందుగా బాగా ఆలోచించకుండా చేయ

కూడదని పెద్దలు చెప్పుతారు. ఇంత తంటాలుపడిన తర్వాత యిప్పుడు మీ మనస్సు స్థిమితపడినది. ఈ సంగతి ముందుగానె తోచిన బాగుండిపోవును. సుశీల స్త్రీల ఇంటర్ క్లాసు బండీలో కూర్చుండెను. అందులో మరియిద్దరు దొరసానులు కూడ కూర్చుండిరి. వారు సుశీలనుజూచి ఇంగ్లీషున తమలో తాము మిట్లు మాట్లాడుకొనిరి.

"ఈమె కొత్త పెండ్లికూతురివలె నున్నది."

"కాను. పెద్దయింటి పిల్లవలెనున్నది. అత్తవారింటికి వెళ్లుచున్నది. కాబోలు"

"బలవంతముగా తీసుకొని పోవుచున్నట్లున్న ది. ఏడ్చుచున్నదో?"

"ఇంతవరకు భర్తముఖమైనను చూచి యుండదు. అందుచేత అతనియందు ప్రేమ ఎట్లుండును. భయముచే ఆమెయుండలు కొట్టుకొని పోవుచున్నవి కాబోలు."

"ఇది వీరిలో చాల నీచమైన ఆచారము. పాపమీ బాలికను ఏ మియెరుగని కొత్తయింటికి పంపివేయుదురు. అక్కడ వీరికి తెలిసినవారెవ్వరును ఉండరు."

ఇది అనాగరికుల యొక్క ఆచారము. వీరు స్త్రీలను బలవంతముగా తీసుకొని వెళ్లిరని."

"(సుశీలతో) ఏమమ్మాయి! నీ యత్తవారింటికి వెళ్లుచున్నావా?" సుశీల నెమ్మదిగా తలయూపెను.

"నీ వింత సౌందర్యవంతురాలవు కదా. నీ భర్త కూడ నీకు తగినవాడేనా?"

సుశీ—(గంభీరభావముతో) భర్తయొక్క సౌందర్యమే ముఖ్యము కాదు.

"ఆతడు నల్లగా అనాకారిగా నుండినట్లైన?"

సుశీ—ఆతడెట్లున్నను మాకు పూజనీయుడే.

"సరే బాగానే యున్నది. నీ ముందున కిద్దరు యువకులను తీసి కొని వచ్చెదరు. అందులో నొకడు సౌందర్యవంతుడు. రెండవవాడు కురూపియైన నీ వెవరిని ఎంచుకొనెదవు?"

సుశీ—(దృఢస్వరముతో) మా తల్లి దండ్రులెవరిని నిర్ణయించిన వా నే. (తనలో) వీరు హిందూవివాహములను ఆక్షేపించుచున్నారు. అని తలచి కొంతసేపైన తర్వాత తిరిగి (వారితో) మీరే మీ భర్తలను స్వయముగా నెంచుకొనెదరని వినియుంటిని.

"ఔను. ఈ విషయములో మేము స్వతంత్రులమే."

సుశీ—మీ తల్లిదండ్రులకంటె మీరే తెలిసినవారని మీ యుద్దేశమా?

"వారు నిర్ణయించిన పురుషునియందు మాకు ప్రేమ యుండునో యుండదో వారికేమి తెలియును?"

సుశీ—ఐతే మీరు వివాహమునందు ప్రేమనే ముఖ్యముగా తీసికొనెదరా?

"ఔను. వివాహము ప్రేమయొక్క బంధనము గాక మరియేమిటి?

సుశీ—మేము వివాహమును ధర్మబంధముగా తలచెదము. ధర్మము తరువాతనే ప్రేమ.

తొమ్మిదిగంటలగుసరికి బండి విజయపురము చేరెను. నారాయణదాసు వచ్చి సుశీలను బండినుండి దింపి ప్లాట్‌ఫారముమీద నొక పల్లకిలో కూర్చుండ బెట్టెను. కళ్యాణపురపు బండి బయలుదేరుటకింకను అరగంట ఆలస్యమున్నది.

పరిచారకులు అందరును పెద్దపెద్దమూటలను, పెట్టెలను తలపైనను, చంకను పెట్టుకొని ఆవలకు వెళ్లుట కొకరినొకరు త్రోసుకొనుచుండిరి. మరియొక గుమ్మమువద్ద వందలకొలది మనుష్యులు నిలువబడి లోపలకు వచ్చుటకు త్రొక్కులాడుచుండిరి. ఇంకొక పెద్దగేటునుండి దొర

లు, దొరసానులు చేతికర్ణాలను త్రిప్పుకొనుచు, కుక్కలను వెంటబెట్టుకొని వీధిగా వచ్చుచుండిరి. వారినెవ్వరును అడ్డుపెట్టుటలేదు. ఇది అంతయు జూడ సుశీలకు మిక్కిలి ఆశ్చర్యముగానుండెను. ఇంతలో కృష్ణశర్మ ఆమెవద్దకు వచ్చి, "సుశీలా! [illegible] వినమూమగారిని కృష్ణశర్మను." సుశీల లేచినిలువబడి చేతులుజోడించి ఆతనికి నమస్కరించెను.

కృష్ణ—మేము నిన్ను విష్ణువర్ధనుని మొందుకు తీసుకొని వెళ్ళుట లేదని నీవాశ్చర్య పడవచ్చును. ఇంతవరకు నీసంగతి అన్నయ్యతో చెప్పక పోవుటయే దీనికి కారణము. నీయుత్తర మందిన తక్షణమే నిన్ను వెంటనే తీసుకొని రాకపోయిన, ఏమి ప్రమాదము సంభవించునో యని తొందరపడి వచ్చితిని. అన్నయ్యతో చెప్పి వప్పించుట కవకాశము లేకపోయినది. అందువలన నిన్ను కొన్ని దినములవరకు కళ్యాణపురమునందే యుంచవలసి వచ్చినది. మీయక్క కమలయున్న ఆశ్రమమునందే నిన్నుంచుట మంచిదని తలచితిని. ఆమెవద్ద నుండుట వలన నీకే యిబ్బందియు నుండదు. కమల గురించి నీవు విన్న చెడు సంగతులు నీ మనస్సునందుంచుకొనకుము. ఆమె సద్గుణవంతురాలు. ఆమె జీవితమిప్పుడు నిష్కళంకమై ప్రకాశించుచున్నది. అట్లు కాని యెడల నేను నాకోడలి నక్కడ ఉంచుటకెన్నడును వప్పుకొనను. ఒకటి రెండు రోజులలో అన్నయ్య నేలాగునైనను సమాధాన పరచెదను. ఈ యేర్పాటున కేమాత్రమిష్టము లేకపోయినను స్పష్టముగా జెప్పిన మరియొక యేర్పాటు జేసెదను.

కృష్ణశర్మ ఈ సంగతులను అతి కష్టముతో జెప్పి ముగించెను. తాను కమలను ప్రవేశించిన వాక్యముల యందుగాని, గోపాల శాస్త్రిని వప్పించెదనని చెప్పిన వాక్యముల యందుగాని ఆతనికంత విస్వాసము లేదు. ఈ యమాయక బాలిక నీవిధముగ మోసపుచ్చుట ఆతనికి కష్టముగా నుండెను.

సుశీ—(కన్నీళ్లుకార్చుచు. లజ్జావిషాద నిరాశలతో కూడుకున్న స్వరముతో) మీ ఆశ్రయమునే నమ్ముకొంటిని. మీ కిష్టమైతము గా దోచిన నట్లే చేయుడు.

సుశీల హృదయమిప్పుడు చులకన యయ్యెను. ఇక నామె తన భవిష్యత్తును గూర్చి ఆలోచించ వలసిన ఆవశ్యకత లేదు. కొన్ని రోజులవరకు తన జీవితమార్గము నిశ్చితమై పట్లామె తెలిసికొనెను. తన ఇల్లు కాలిపోవుచున్నను, కొంతసేపైనను వెలుగులో నుండ వచ్చునుకదా యని సంతోషించు మానవులే ఆమెసితి యుండెను.

వారు ముగ్గురును ఆశ్రమము చేరునరికి వదునొకండు గంట లయ్యెను. కమలతో నీసంగతి జెప్పుటకు నారాయణదాసు ముందుగా లోపలకు వెళ్ళెను. కాని ఆమె గదివద్దకు వెళ్ళి చూడగా ఆమె జ్వరముతో తెలివితప్పి పడియుండెను. ఆశ్రమమునందలి స్త్రీలామె కుపచారములు చేయుచుండిరి. ఒకయువతి విసరుచుండెను. ఒక యువతి తల పట్టుచుండెను. ఇంకొకతె ఆమె కాళ్లు పట్టుచుండెను. ఉండియుండి కమల గట్టిగా మూల్గి పలువరించుచుండెను. నారాయణదాసు వ్యాకులముతో, "డాక్టరును తీసికొని వచ్చిరా?" యని అడుగగా "ఇప్పుడే చూచి వెళ్ళిరి." అని అక్కడ నున్నవారు జెప్పిరి.

లోపలనుండి ఒక స్త్రీ వచ్చి సుశీలను బండినుండి దింపి లోపలకు తీసుకొని వెళ్లెను. సుశీల కమల మంచమువద్ద నిలువబడి, "అక్కయ్యా!" యని పిలచెను. కాని కమల పలుకలేదు. కళ్లు విప్పి చూడలేదు. సుశీల అట్లే నిలువబడిపోయి అక్కవైపు జూచుచు కన్నీరు కార్చుచుండెను. "మూడు, నాలుగు సంవత్సరములక్రిందట నాతో కలసి ఆడుకొన్న నాప్రియమైన అక్కేనా యీమె? ఆనల్లని పెద్ద తలకట్టు ఏమైనది? చంద్రునివలె మెరసిపోవు ఆనవ్వుముఖ మేమైనది? విశాలములైన ఆకండ్లెక్కడకు పోయినవి? ఆకోమలమైన కంతము,

ఆ దబ్బపండువంటి శరీరము ఎక్కడ మాయమైనవి? ఈమె మా అక్కయ్యా! లేక ఆమె శవమా!" అని తలచుకొనుచు ఆమె విచారపడసాగెను. ఆ పాలిపోయిన ముఖమునందు విరక్తి ఆత్మత్యాగముల యొక్క నిర్మలమైన, శాంతిమయమైన జ్యోతి ప్రకాశించుచుండెను. సుశీల హృదయమామె జూడగానె తీవ్రప్రేమలతో నిండిపోయినది. అచ్చటి స్త్రీలు వెళ్ళిపోయిన తర్వాత సుశీల ఏడ్చుచు కమలను కౌగలించుకొని, "అక్కయ్యా! సుశీల నీకొరకు వచ్చినది. ఒక్కసారి కళ్లు విప్పి చూడు. నీవంట్లో ఇప్పుడేలాగున నున్నది." అని యడ్చెను.

కమల కళ్లు విప్పి ఆశ్చర్యముతో వెట్టిదానివలె సుశీలనైపు జూచుచు, "ఎవరు? సుశీలా! నువ్వా. దూరముగా నుండు. నన్ను ముట్టుకోకు. నేను పాపాత్మురాలను. దౌర్భాగ్యురాలను. దుష్టురాలను. నువ్వు సచ్చరిత్రవు. సాధ్వీమణివి. నన్నంటకు. ఈ హృదయమును కోరికలు, చెడుతలంపులు మైలపరచినవి నీ స్వచ్ఛహృదయమును దీనిదరికి జేరనివ్వకు. ఇక్కడనుండి వేగముగా తొలగిపో. అదుగో నరకము. అగ్నిగుండము మండుచున్నది. యమదూతలు నన్నా అగ్నిగుండమునందు పడవేయుట కీడ్చుకొని పోవుచున్నారు! నీవిక్కడనుండి పారిపో." ఇట్లు పలుకుచు కమల తిరిగి మూర్ఛితురాలయ్యెను. సుశీల ఆరాత్రి యంతయు కమలకు విసరుచు ఆమె ప్రక్కలోనే కూర్చుండెను.

౧౫

సుశీల ఆశ్రమమునకు వచ్చి ఇప్పటికి నెలకు పైగా యైనది. కాని ఇంతవరకు కృష్ణశర్మ ఈసంగతి తనవారి కెవ్వరికిని జెప్పలేదు. ఒకప్పు

డన్న కుశ్శరము వ్రాయుచుననియు, ఒకప్పుడు నారాయణదాసు నన్నవద్దకు పంపుదుననియు తలచుచుండెను. కాని చివర కేదియు స్థిరపరచుకొనలేకుండెను. వేశ్యల విషయమైన తీర్మానమును ముని స్పాల్టీయందు వేగముగా ప్రవేశపెట్టవలసినదని ఒకవైపున స్నేహితులు తొందరపెట్టసాగిరి. తన తీర్మానము తప్పక నెగ్గగలదను నమ్మిక మాత్రమునకు గలదు. ఆలస్యమైనకొలదియు ఆటంకములు వచ్చునని కూడ తెలియును. ఏనను తీర్మానమును ప్రవేశపెట్టుటకు వెనుదీయుచుండెను. చివరకు మే నెల వచ్చెను. నారాయణదాసుయొక్కయు, ప్రొఫెసర్ శంఖరరావుయొక్కయు అనురోధములవలన చివరకు కృష్ణశర్మ తన తీర్మానమును కౌన్సిలునందు పెట్టుటకు సూచన చేయవలసి వచ్చెను. తీర్మానము చర్చింపబడు తేదీ కూడ నిశ్చయించబడినది.

చర్చదినము సమీపపడుచున్నకొలదియు కృష్ణశర్మ మనస్సునందాందోళన వృద్ధియగుచుండెను. కేవల మీ తీర్మానము ఆమోదింపబడుటవలన దాని యుద్దేశ్యము పూర్తికాజాలదని అతడనుమానించుచుండెను. దీనిని కార్యరూపమునందు పెట్టుటకు పురుషునందలి తగు మనుష్య లందరియొక్కయు సహకారసానుభూతులావశ్యకములు. ఇందువలననే అతడు హాజీఅస్సీమ్‌సాహేబును తనవైపునకు త్రిప్పుకొనుటకు ప్రయత్నించుచుండెను. వేశ్యలయందాతని కెక్కువ పలుకుబడి కలదు. ఆత డెట్లు చెప్పిన వారట్లు నడుచుకొనుటకు సిద్ధపడుదురు. చివరకు హాజీసాహేబు కృష్ణశర్మ పక్షమునకు తిరిగిపోయెను. శర్మయొక్క నడవడి, పరోపకారబుద్ధియందాతనికి మంచి విశ్వాసము కలిగెను.

కృష్ణశర్మ తీర్మాన మీరోజున కౌన్సిలునందు ప్రవేశపెట్టబడును. ప్రేక్షకులతో మునిస్పాలిటీభవన మంతయు నిండిపోయినది. వేశ్యలు కూడ తమపక్షమువారితో భవనమును చుట్టవేసిరి.

కొన్నిలునందు కార్యక్రమము ప్రారంభింపబడినది. సభికు లందరు కూడ హాజరైరి. డాక్టర్ శ్యామలరావు తీర్మానముకొరకు చెన్న పట్నం వెళ్ళకుండ ఆగిపోయెను. అబ్దుల్ వహాబ్‌సాహేబునకు తొలినాటి రాత్రి యంతయు నిద్రపట్టలేదు. తెల్లవార్లు ఈసంగతిని గురించే ఆందోళన పడుచుండెను.

కృష్ణశర్మ తీర్మానమును ప్రవేశపెట్టుచూ మంచి సబబులతో తీర్మానావశ్యకతను వివరించెను. తీర్మానము మూడుభాగములుగ విభజింపబడినది :—

I. "వేశ్యలను పట్టణముయొక్క ముఖ్యస్థలములనుండి తొలగించి ఊరిబయట నివసింపజేయవలెను.

II. "వారిని, పట్టణమునందలి, షికారు తిరుగుస్థలము లందును, పార్కులందును తిరుగకుండ నిషేధింపవలెను.

III. "వేశ్యలను నాట్యమునకు పిలచువారి పైని ఎక్కువగా పన్ను వేయవలెను. పాటకచ్చేరీలు ఎటువంటి బహిరంగస్థలము లందును జరుగ నివ్వకూడదు. ప్రొఫెసర్ శంఖరరావు తీర్మానమును బలపరచెను.

హకీమ్‌శహరత్ ఖాన్—ఈ తీర్మానము యెడల నాకును సానుభూతికలదు. కాని సవరణలేకుండ నేను దీనిని ఆమోదింపజాలను. రిజల్యూషనుయొక్క మొదటిభాగమునందు "వేశ్యలకు వివాహము చేయవలెను. లేనియెడల వారు స్వతంత్రముగ జీవించుట కేదైన నొక కళను నేర్పించవలెను." అను సవరణను నేను బెట్టుచున్నాను.

రామదేవు—ఈ సవరణతో నాకు పూర్తియైన సానుభూతికలదు. వేశ్యలను పతితులనుటకు మనకేమియు అధికారము లేదు. అట్లనుట మన మూర్ఖత్వము. మనము లంచములను పుచ్చుకొనుచున్నాము. అక్రమవడ్డీలను పుచ్చుకొనుచున్నాము. అసహాయుల గొంతుకలు నులుముచున్నాము. సంఘముయొక్క ఒక అంగము నీచమైనదనియు

తుచ్ఛమైనదనియు అనుటకు మన కధికారములేదు. అందరకన్నను నీచులము, పాపాత్ములము, దురాచారులము, అన్యాయవర్తనులము మనమే. ఇటువంటి మనము తెలిసిన వారమనియును, నాగరికులమనియును, ఉదారవంతులమనియును, గొప్పవారమనియును, అనుకొనుచున్నాము. చదువుకొన్న మనకంటె ఆ వేశ్యలే నయము. వీరివీధి ఎప్పుడును కలకలలాడుచు, ముకాణములతోను, పూపులతోను కూడి శోభగానుండును. ఈ వీధుల సొల్లపరలంకరింప జేయుచున్నారు? మనమే. ఈ పిట్టలను మనమే పట్టుచున్నాము. ఈ బొమ్మలను మనమే తయారుచేయుచున్నాము. ఏ సంఘమునందు దురాచారులగు జమీందారులు, లంచగొండులగు రాజకీయోద్యోగులు, లంచములిచ్చు వర్తకులు, స్వార్థపరులు, సన్మార్గమునకు వ్యతిరేకులగుచున్నారో ఆ సంఘమునందు వేశ్యలెందుకు వృద్ధి పొందరు? పాపాత్ముల ధనము పాపాత్ములకు తప్ప మరి యెవరికి చెందును? ఏదినమున నజగులు, లంచములు, దొంగవడ్డీలు అధికవృద్ధులు ప్రబలముమానో ఆనాడే ఈ వేశ్యలు కూడ నశించెదరు. అంతవరకు వీరిట్లుండ వలసినదే. అసలు తీర్మానమీ సవరణ లేనియెడల కోసిన గాయమునపై పూతనుపలాస్త్రీ వేయుసట్లు యగును. అందువలననే నీ తీర్మానమును అంగీకరింపను.

ప్రభాకరరావు—అసలు తీర్మానముతో నీసవరణకేమి సంబంధమున్నదో నాకేమియు బోధపడుట లేదు. దీనిని మీరు ప్రత్యేక తీర్మానముగా పెట్టవచ్చును. సంస్కరణమును మీ రెంతవరకు జేయగలిగిన ప్రశంసనీయమే. ఈపని వేశ్యలు పట్టణములో ఉన్నప్పుడు చేయుట ఎంత సులభమో పట్టణము బైటనున్నప్పుడును అంత సులభమే కాకుండ ఎంతో యెక్కువ వీలుగా నుండును.

అబ్దుల్ వహా—నాకీ సవరణతో పూర్తియైన సానుభూతిగలదు.

సూర్యారావు—ఈసవరణలేనిదే నేనితీర్మానమును ఆమోదింపను.

నరసింహశెట్టి—ఈ సవరణను నేను కూడ బలపరచుచున్నాను.

కృష్ణశర్మ—వేశ్యలను కష్టపెట్టుట ఈ తీర్మానము యొక్క ఉద్దేశముకాదు. వారి నెత్తిని మంచి మార్గమునకు తెచ్చుటయే దీని ముఖ్యోద్దేశము. కనుక ఈ సవరణను అంగీకరించుటకు నాకెట్టి అభ్యంతరమును లేదు.

తేగాలి—ఈ సవరణవలన అసలు తీర్మానముయొక్క ఉద్దేశము చెడిపోవు నేమోయని భయముగా నున్నది. మీరు నిర్మించుచున్న సౌధమునకు సింహద్వారము మూసివైచి పెరటివైపు నుండియొక పాణి ద్వారమును కట్టించుచున్నారు. ఇంతవరకు హాయిగా స్వేచ్ఛారముగ కాలము గడుపుచున్న ఈ వేశ్య లిప్పుడు కష్టపడి సంఘంచి జీవితము లను గడుపుకొనుట అసంభవము. వారెన్నటికిని అట్లొప్పుకొనరు. వారీసవరణ నాధారముగా జేసికొని, ఒకరు ఏభాయింటియందే సింగరు మిషీనును పెట్టి కుట్టుపనితో జీవితమును గడుపుకొనెద మనియు, ఒకరు తమ యింటియందే మేజోళ్లల్లుకొని జీవించెద మనియు, ఒకరు తమలపాకు లంగడిని పెట్టుకొనెద మనియును వే రొకరు పండ్లంగడిని పెట్టుకొనెద మనియును, ప్రకటించి యూరి బైటకు వెళ్లకుండ తప్పించుకొనెదరు. వారు పైకి పండ్లిండ్లు చేసుకొనునట్లు నటించినను లోపల యథాప్రకారముగ వారి వృత్తినే జేసికొనెదరు. అందువలన నీ సవరణను ఎంతమాత్రమును అంగీకరింప కూడదు.

రామారావు—నే నీ సవరణను ఆక్షేపించుచున్నాను.

వెంకటరావు—కృష్ణశర్మగారు మంచివారనియు, పెద్దమనుష్యు లనియు అనుటలో సందేహ మేమియు లేదు. కాని ఈ సవరణను అంగీకరించి తన తీర్మానమును బలపరుచుకొనుటకు బదులు అందరను సంతోషపెట్టుటకు జూచుచున్నారు. దీనివలన ఆయన ఉద్దేశమునకే

భంగము కలుగును. హకీమ్‌శఫారత్ ఖానుగారు బాగుగ నాలోచించిన ఈ సవరణను ఎన్నటికిని పెట్టియుండరు.

చైర్మన్ బలభద్రరావునాయుడు తీర్మానముయొక్క మొదటి భాగమునకు సమ్మతులను తీసికొనెను. తొమ్మండుగురు అనుకూలముగను ఎనమండుగురు ప్రతికూలముగను సమ్మతి లిచ్చుటవలన ఆభాగ మామోదింపబడినది. తిరిగి సవరణపైని సమ్మతులు తీసికొనబడెను. ఎనమండుగురు అనుకూలముగను ఎనమండుగురు ప్రతికూలముగను సమ్మతులిచ్చిరి. కాని భవిష్యత్తుని అనుకూలముగ తన సమ్మతి నిచ్చుటవలన అది కూడ ఆమోదింపబడెను. డాక్టర్ శ్యామలరావు ఎటువైపునను తన సమ్మతి నివ్వక తటస్థముగా నుండెను.

ప్రొఫెసర్ శేషగిరిరావు, బారిష్టర్ సివరామ్, ప్రభాకరరావుగార్లు, సవరణ ఆమోదింపబడుటకలన తా మోడిపోయినట్లు భావించి కృష్ణశర్మ విశ్వాసఘాతకము చేసిన ట్లాతనివైపు చూడసాగిరి. రామదేవు మాట సిలుకడలేనివాడనియు, ఉద్దేశశూన్యుడనియు, భాతాకాసిరాయుడనియు, మొదటనే వారు నిశ్చయించుకొనిరి.

అబ్దుల్‌వఫా ఆశించి మిత్రగణము తామే జయమొందినట్లు సంతోషించసాగిరి. వారట్లు సంతోషముగా నుండుట ప్రభాకరరావు మొదలైనవారికి కష్టముగా నుండెను.

ప్రస్తావనయొక్క రెండవభాగముపై సమ్మతులు తీసుకొనబడెను. ప్రభాకరరావు అతని స్నేహితులు తీర్మానమునకు వ్యతిరిక్తముగా సమ్మతుల నిచ్చిరి. వా రీవిధముగ కృష్ణశర్మపై కసితీర్చుకొన నుద్దేశించిరి. ఆభాగ మోడిపోయినది. అబ్దుల్‌వఫా వారి స్నేహితులు సంతోషముతో చప్పట్లు కొట్టసాగిరి.

ఇప్పుడు ప్రస్తావనయొక్క మూడవభాగముయొక్క వంతు వచ్చినది. రామదేవు దానిని బలపరచెను. కాని ప్రభాకరరావు ఆతని స్నేహి

తులు దీనికి కూడ వ్యతిరేకముగానే సమ్మతుల నిచ్చిరి. సవరణ ఆమోదింపబడిన తర్వాత తీర్మానముయొక్క తక్కిన భాగములు నిరుపయోగములని వారి యుద్దేశ్యం. చివరకు తీర్మానము కూడ ఓడిపోయినది.

సభ పూర్తియగుసరికి రాత్రి యయ్యెను. తమపక్షము గెలిచిన వారు సంతోషంతో వెళ్ళిపోయిరి. ఓడిపోయినవారు నిరుత్సాహముతో ముఖములు వేలవేసుకొని వెళ్ళిపోయిరి.

వెళ్ళిపోవుచున్నప్పుడు రామదేవు బారిష్టర్ శివరామ్‌తో, "చివరకు మీ రేమి యీలా చేసినారు?"

బా-శి—(మర్మభావముతో) మీ రేమి చేసినారో మేము అదే చేసినాము. మీరు ఘడియమీద దెబ్బకొట్టినారు. మేము దానిని అసలుకే విరిచివేసినాము. చివరకు రెండింటి పర్యవసానమూ ఒక్కటే.

అందరును ఎవరి ఇండ్లకు వారు వెళ్ళిపోయిరి. చీకటి గాఢాంధకారముగా నుండెను. బంట్రోతులు, కావలావారు కూడ దీపములార్పి, తలుపులు మూసి వెళ్లిపోయిరి. కాని కృష్ణశర్మ మాత్రము మైదానమునందు నిరుత్సాహము, విచారము మూర్తీభవించినట్లు కూర్చునియుండెను.

౧౬

కృష్ణశర్మ ఎంత ఆలోచించినను ఈ సవరణను ఆమోదించుటలో తన తప్పేమియు కనబడలేదు. ఇంత చిన్నవిషయములో తనచిత్తశుద్ధిలింతగా కక్షవహించెదరని ఆతడెన్నడును అనుకొనలేదు. తీర్మాన మోడి

పోయినను ఆ తని కంతగా విచారము కలుగలేదు. కాని తనమిత్రులు అవివేకముగా పరివర్తించి, ఆ నేరమంతయు తనమీద వేయుటవలన ఆ తనికి మిక్కిలి విచారముగా నుండెను. ఈ సవరణ అంగీకరించుటవలన నష్టమేమియు లేదని ఆ తనియుద్దేశము. దీనివలన హానికలుగునని సూచించిన సబబులపై ఆ తని కావంతయు నమ్మకములేదు. సంస్కారోద్ధారణకొరకై ప్రవేశపెట్టబడిన ఈ తీర్మాన మోడిపోవుటవలన తన ఆశలన్నియు నిరాశలయ్యెనని ఆ తడు విచారించెను. అనవసరముగ నీచిక్కులన్నియు ఎందుకు తెచ్చిపెట్టుకొంటినా యని పశ్చాత్తాపపడజొచ్చెను. "నేను నిష్కారణముగ మండ్లలో జిక్కుకొంటిని. నే నీసవరణజోలికి పోకపోయిన ఈ నింద నాపై పడకపోయియుండును." అని అతడు విసుగుకొనుచుండెను. ఇప్పుడు నిందయంతయు కృష్ణశర్మ మీదనే పడినది. విరోధులు, స్నేహితులు కూడ నితనినేహేళన చేసిరి. పత్రికలన్నియు నితనినే విమర్శించెను. ఈ వాదనల్నియు ఇతడే భరింపవలసియున్నది. కృష్ణశర్మ కిప్పుడు మిత్రులుకాని, సానుభూతిపరులు కాని లేరు. నారాయణరావును న్యాయసభలోదించుటనియు, తనమిత్రులను సమాధానపరచుటనియు ఆ తడాశ పడెనుగాని అందుకు వ్యతిరేకముగ దానీతనిపైనే నేరము మోపెను. "మీరీ సవరణ నంగీకరించి కార్యమునంతను చెడగొట్టిరి. సంవత్సరమునుండి పడిన కష్టమునంతను మట్టిపాలు చేసివైచిరి." యని దాను నిష్ఠురము లాడసాగెను. రామదేవు ఒక్కడు మాత్రమే కృష్ణశర్మ నోదార్చి సానుభూతిని జూపుచుండెను.

కృష్ణశర్మ పూర్తిగ నొకనెల కచ్చేరీకి వెళ్లలేకపోయెను. ఇంటి యండెల్లప్పుడును ఒంటరిగ కూర్చొని ఈ విషయమే ఆలోచించుచుండెను. మిత్రులయొక్క వైరభావమును తలచుకొని విచారించుచు, తనలో, "ఇటువంటి చదువుకొన్నవాడు, మంచిచెడ్డలు తెలిసినవాడు

కూడ ఒక చిన్నమార్పువలన తమ నిశ్చితాభిప్రాయమునకు వ్యతిరిక్తముగ నడచుకొనుట జూచిన, ఈ దేశమునకు త్వరలో ముక్తి కలుగునని తోచను. నే నీసవరణ నంగీకరించి తప్పే చేసితినా? కాని నా తప్పువీరిని మంచిపార్టీనుండి ఎందుకు విముఖులను జేసినది!" అనితర్కవితర్కములు జేసికొను చుండెను. ఈయాందోళనస్థితిలో మనస్సును శాంతిపరచుట యందొక యబలకెంత శక్తికలదో కృష్ణశర్మకు భవమునకు వచ్చెను.

ఆతని మనస్థితి సుభద్రమ్మకు మాత్రమె బాగుగ తెలియును. ఆమెకు కూడ కృష్ణశర్మనలెనే ఈ సవరణ ఆవశ్యకమని తోచెను. ఆతని స్నేహితులపైని ఆతనికంటె సుభద్రమ్మయే ఎక్కువగ విమర్శన జేయుచుండెను. ఆమె విమర్శలవలన కృష్ణశర్మ మనస్సునకు కొంత శాంతి కలుగుచుండెను. సుభద్రమ్మ కిటువంటి విషయములను బోధపరచుకొనుటకును, విమర్శించుటకును తగిన శక్తిలేకపోయిన, ఆమె చేయుచున్న విమర్శ లన్నియును తన మాటలయొక్క ప్రతిధ్వనులే యనియును, తలచుచుండెను. ఏనను ఈ విమర్శనల వలన ఆతని మనస్సునకు సంతోషమే కలుగుచుండెను.

కాని ఒకనెల పూర్తి కాకుండనే ప్రభాకరరావు తనపత్రికలయందీపస్తాపన విషయమై వరుసగ విమర్శనలను వ్రాయసాగెను. ఆ విమర్శనలయందు కృష్ణశర్మను మరొక్కులతో నత్తి పొడువసాగెను. ఒకపత్రికయం దాతడు శర్మయొక్క పూర్వచరిత్రకును నీ సవరణకును ఒకఅపూర్వమైన సంబంధమును కల్పించి వ్రాసెను. మరియొక పత్రికయందాతని ప్రవర్తనను విమర్శించుచు, "నీ కృష్ణశర్మగారిప్పుడు దేశభక్తులైనారు. ఈయన, దేశమును మరచినను తనవిషయమును మాత్రము ఎన్నడును మరచిపోరు. దేశసేవచాటున తమస్వార్థమును నెరవేర్చుకొన జూచుచున్నారు." అని వ్రాసెను.

కృష్ణశర్మకి మిథ్యాదోషారోపణవలన మిక్కిలి కోపము కలుగుచుండెనో యంత ఆశ్చర్యముకూడ కలుగుచుండెను. దురహంకారమింత పనిచేయునని ఆతనికిప్పుడు బోధపడెను. ప్రభాకరరావు పైకి వివేకవంతునిగలెను మంచివానివలెకు కనబడుచున్నను ఆతని ఆత్మ ఎంత కలుషితమైనది? కాని ఈవిమర్శనలకు ప్రత్యుత్తరము వ్రాయుటకెవరును సాహసింపలేదు. ఒకనాడు సాయంత్రము శర్మ ఈ పత్రికను ముందుంచుకొని దానికి జవాబువ్రాయుటకు మేజావద్ద కూర్చుండెను. కాని ఏమిజవాబు వ్రాయుటకును ఆతనికి స్ఫురించలేదు. ఇంతలో సుభద్రమ్మ అక్కడకువచ్చి, "ఇంత ఉక్కలో నీమూల కూర్చుని ఏమిచేయుచున్నారు? వాకట్లో కూర్చొనరాదా?"

కృష్ణ—ప్రభాకరరావు ఈరోజు పత్రికలో నన్ను, కసిదీర తిట్టినాడు, దానికి జవాబువ్రాయుట కాలోచించుచున్నాను.

సుభ—ఆత డెందు కాలాగున మీమీద కత్తికట్టినాడు? (అని అనుమతీసి ఆవిమర్శనను పూర్తిగా చదివి పత్రికను తిరిగి బల్లపై పడవేసెను.)

కృష్ణ—విమర్శన ఏలాగున్నది?

సుభ—విమర్శన చాలా బాగుగనే యున్నది. దీనియందు తిట్లు తప్ప మరియేమియు లేవు. ఆడవారే తిట్లుతో దెబ్బలాడుకొనెదరని ఇది వరకు నే ననుకొనుచుంటిని. కాని ఇప్పుడు తెలిసినది. మొగవాళ్లే ఈతిట్లలో మాకన్న ఒకచెయ్యిపైగానున్నారు. ఈతడు విద్వాంసుడు కాబోలు!

కృష్ణ—ఆఁ. విద్వాంసుడు కాడా మరి? ఈతడు చదువనివున్న కమే లేదు.

సుభ—అందుకేనా ఇంత గర్వము!

కృష్ణ—నే నిప్పుడు దీనికి తగిన జవాబు వ్రాయుచున్నాను. దీని

వలన నానంగతి ఆతనికి బాగుగ బోధపడగలదు.

సుభ—కాని తిట్ల కేమి జవాబు వ్రాసెదరు?

కృష్ణ—తిట్లే.

సుభ—కాదు. కాదు. తిట్లకు మౌనమే జవాబు. తిట్టినవారిని తిట్టుట మూర్ఖులపని. మీరు కూడ తిట్టిన మీకును వారికిని గల తారతమ్యమేమి?

కృష్ణశర్మ సుభద్రమ్మవైపు గౌరవముతో జూచెను. ఆమె మాట లాతనికి బాగుగ నచ్చినవి. మనము అభిమానవశమున, అజ్ఞానులని తలచిన వారిపలన కూడ నప్పు డప్పుడు మంచి యుపదేశములను పొందుచుందుము.

కృష్ణ—ఐతే మౌనమే వహింపనా?

సుభ—నాసలహా అదే. అతని మనస్సుతీరా తిట్టనివ్వండి. చివర కాతడే సిగ్గు పడును. అదియే అతిట్లకు తగిన శిక్ష.

కృష్ణ—అత డెన్నటికిని సిగ్గు పడడు. ఇటువంటి వారికి సిగ్గన్న నేమియో తెలియకు. ఇప్పుడు నే నాతని వద్దకు వెళ్లిన, నన్నెంత గౌరవముచేసి నవ్వుచు మాట్లాడును. కాని సాయంత్రమైన తోడనే తిరిగి ఈతిట్ల మర్యాదయె.

సుభ—ఐతే ఇతరులను నిందించుటయే అతని పనియా?

కృష్ణ—అతని యుద్యమ మదికాదు. కాని పత్రికా సంపాదకులు చందాదారులను వృద్ధిపరచుకొనుట కీవిధముగ ఏదో యొక విమర్శనను జేయుచునేయుందురు. ఇటువంటి విమర్శనలవలన ప్రతిక లెక్కువగా అమ్మకమగును. ప్రజల కిట్టి వివాదములన్న చాలా నరదా. సంపాదకులు తమ మహత్వమును మరచి ప్రజలయొక్క ఈవివాద ప్రేమనుండి లాభమును పొందజూతురు. వీరు తమ ఉత్కృష్టపదవిని మరచి ప్రజలయొక్క కలహప్రేమను ఆహ్వానించుచుందురు.

మా చందాదారులను సంతోషపెట్టుటయే మాకర్తవ్యము. వారి సొమ్ము దినుచున్నాము గనుక వారికి సంతోషము కలుగనట్లే వ్రాసెదము." అని కూడ కొందరు సంపాదకులు చెప్పుచుందురు.

సుభద్ర—ఐతే వీరు కేవలము డబ్బుకే దాసులగుచున్నారు. వీరిపైని కోపగించుటకు బదులు జాలి పడవలెను.

పత్రికకు వ్రాయ నుద్దేశ్యమును మానుకొని కృష్ణశర్మ బల్లవద్దనుండి లేచి పోయెను. సుభద్రమ్మ ఇంత వివేకవంతురాలని ఆతడెన్నడును అనుకొనలేదు. "నే నింత చదువుకొన్నవాడనై నప్పటికిని ఈమెకు గల జ్ఞానము నాకు లేదు. అంత చదువుకొన్నది కాక పోయినను, మంచి ఆలోచనలను ఔదార్యమును ఈమెకు గలవు." అని మన స్సులో సంతోషించెను.

స్త్రీ సంతానహీనురాలై నప్పటికిని పురుషునకు శాంతమును ఆనందమును కలిగించగలదని ఆయనకిప్పుడు బోధపడెను. సుభద్రమ్మ యం దాతని కిప్పుడు నూతనప్రేమ ఉదయించెను. సంతోషమను కెరటము లేచి సంవత్సరముల నుండి హృదయమునందు కూడు కొన్న మాలిన్యమును ఒక్కక్షణములో కడిగి వేసెను. ఆతడు నిర్మలప్రేమతో ఆమెవైపు జూచెను. సుభద్రమ్మకు ఆ చూపుల యర్థము బోధపడి ఆమె హృదయ మానందముతో పొంగిపోయెను.

౧౭

కమలను జూచి వచ్చినప్పటినుండియు మోహనుని స్థితి, సంవత్సరముల తరుబడి కూడబెట్టిన ధనమును పోగొట్టుకొన్న దరిద్రుని స్థితివలె నుండెను. ఆతడు తనలో, "ఆమె నాతో మాటాడలేదు. సరికదా

నావైపైనను జూచినది కాదు. ఏమీ ఆమె నన్నంత నీచునిగా తలచి నదా! కాదు. కాదు. ఆమె తన పూర్వచరిత్రను తలచుకొని సిగ్గు పడుచు, నన్ను మరచి పోవుటకు ప్రయత్నించుచున్నట్లున్నది. నావివాహవిషయమై ఆమె వినియుండవచ్చు. అందువలన ఆమె నన్ను కఠినునిగను, నిర్దయునిగను భావించుచున్నది కాబోలు." అని తర్కించుకొనుచుండెను.

కమలను తిరిగి మరియొకసారి కలుసుకొననలెనని మోహనునకు చాల కోరికగా నుండెను. మరునటిదిన మాతను తిరిగి ఆశ్రమమును వైపున నున్న రేవునకు బయలుదేరెను. కాని ఆతడు సుధ్యత్రోవ నుండియే ఇంటికి వెళ్లిపోయెను. ఒకవేళ ఆమె సుశీల విషయమై అడిగిన ఏమని జవాబు చెప్పుదునని ఆతనికి భయము కలిగెను. అది కాక రామానందుని యుపదేశము కూడ ఆతని కప్పుడు జ్ఞాపకమునకు వచ్చెను. మోహనుడప్పు డప్పుడు సుశీల విషయమై తన కర్తవ్య మేమని ఆలోచించుచుండెను. నెలల తరుబడిని సంఘసంస్కరణ విషయమున యువన్యాసములను వినుటవలన ఆతనియం దీమార్పు కలుగుటలో ఆశ్చర్యమేమియులేదు. అతడు తన మనస్సునందు సుశీల విషయమై చాల అన్యాయముజరిగినదని నమ్ముకొనుచుండెను గాని తన కర్తవ్యమును తెలిసికొన లేకుండెను.

అత డీరోజులలో చాల పుస్తకములను చదువుచుండెను. సాని వీధిని బజారువీధిని విడిచిపెట్టిన తర్వాత ఆతని మనస్సీ క్రొత్తమార్గము ననుసరించెను. ఆర్యమతోపన్యాసములకు కూడ అతడు తరచుగా వెళ్లుచుండును. మనుష్యుడు గొప్ప విద్వాంసుడగుటవలన గౌరవమును సంపాదింపజాలడనియును దీనికి సచ్చరిత్రయే ముఖ్యకారణమనియును ఆత డాఉపన్యాసములవలన తెలిసికొనెను. ఆతని మనస్సునందు, విద్యకంటె సచ్చరిత్రయే అధిక్యతను వహించెను. అప్పటినుండియు

మోహనుడు మనోబల సంబంధమైన పుస్తకములను మహాపురుషుల జీవితచరిత్రలను ఎక్కువగ చదువసాగెను. అతడు పుస్తకములు చదువుటయందు అభిలాష దినదినాభివృద్ధి నొందుచుండెను. తాను విద్యా హీనుడైనను ఈ ప్రపంచక్షేత్రమునందు కొంతపని చేయగలుగునని అతనికి ధైర్యము కలిగెను. గ్రంథములు చదువు ఇంద్రియనిగ్రహము గురించియు, మనస్సును స్వాధీనమునందుంచుకొనుట గురించియు చెప్పబడిన సాధనముల నెల్లపుడు అతడు జ్ఞప్తియందుంచుకొనుచుండును.

మ్యూనిసిపాలిటీయందు కృష్ణశర్మ తీర్మానమును ప్రవేశపెట్టినప్పుడు మోహనుడు కూడ అక్కడనే యుండెను. సవరణను ఆయన అంగీకరించినప్పుడు మోహనుడు చాల విచారించెను. ఈ విషయమై తన పినతండ్రి చాల తప్పుచేసెనని అతడు తలచెను కాని పరిభాకర రావాతనిని పిలుస్కొనుటకు ప్రారంభించి నప్పుడుండియు అతడు తన పినతండ్రి పట్ల మున సమర్థించుటకు చాల ఆతృత పడుచుండెను. ఈ విమర్శలకు జవాబుగ మోహనుడు రెండుమూడు వ్యాసములను వ్రాసి ప్రభాకరరావునకు పోస్టుద్వారా పంపెను. చాల దినముల వరకవేమి ప్రచురింప బడునని ఆశపడుచుండెను. తన వ్యాసముల వలన గడబిడ పుట్టుననియు, మనుష్యులయందు పరివర్తన కలుగునని యు అతడు భావించెను. ప్రతిదినము పత్రిక వచ్చినతోడనే తన వ్యాసము ప్రచురింప బడినదేమో యని అత డాతృతతో వెతకుచుండును కాని దానికి బదులు ద్వేషపూరితములైన విమర్శనలే కన బడుచుండెను. వాటిని చదివిన కొలదియు ఆతని యొళలు నుండిపోవుచుండెను. ఆతడు తనలో "ఏవిధముగా నైన నీసంపాదకుని పని పట్టింపవలెను. అతడు నిశ్చముగ నిష్పక్షపాతియే యైన నా వ్యాసములును కూడ ప్రచురించి యుండును. వీటిని ప్రచురించకపోవుట

జూడగ ఆతనికి నిజానిజములు వెల్లడించుట కిష్టము లేదనియు, కేవలము జనులను సంతోషపెట్టుటకే ప్రతిదినము దూషణలతో పత్రికలు నింపుచున్నాడనియు వెల్లడి యగుచున్నది.” అని అనుకొనుచుండెను కాని మోహనుడు తన ఊహాదేవతలను ఎవరి యెదుటను ప్రకటించ లేదు. ఒకనాటి సాయంత్ర మాతడు లావైన చేతికఱ్ఱను పట్టుకొని ప్రభాకరరావుయొక్క పత్రికాలయమునకు వెళ్ళెను. కార్యాలయము మూయబడియుండెను. కాని ప్రభాకరరావు తన ఆఫీసుసందు కూర్చుని ఏదో వ్రాసుకొనుచుండెను. మోహనుడు నిస్సంకోచముగ అతని వద్దకు వెళ్ళి నిలువబడెను. మంచి బలమైన యువకుడు లావుపాటి కఱ్ఱను పట్టుకొని తన యెదుట నిలువబడుట జూచి, తులుక్కువడి, వినుగుతో “మీరెవ్వ” రని ప్రశ్నించెను.

మోహ—నేనీ యూరివాడనే. మీరిన్నిదినములనుండి కృష్ణశర్మ గారి నెందుకు మీ పత్రికలలో దూషించుచున్నారని అడుగుటకు వచ్చితిని.

ప్రభా—ఒహో! మీరేనా! నా వద్దకు వ్యాసములను పంపినారు.

మోహ—ఔను. నేనే పంపితిని.

ప్రభా—అందుకు మీకనేక వందనములు. దయచేసి ఈ కుర్చీ మీద కూర్చొనుడు. మిమ్ములను స్వయముగ కలుసుకొన వలెననియే అనుకొను చున్నాను. కాని మీనివాస మెచ్చటనో తెలిసినదికాదు. మీ వ్యాసములు చాల సొగసుగాను, నబబుగాను ఉన్నవి. వాటిని తప్పక ప్రచురించెదను. కాని వ్యాసకర్తపేరు తెలియనిదే ప్రచురించుట మానియమ విరుద్ధము. అందువలననే ఇంతవరకు ప్రచురించ లేకపోయితిని. తమ నామధేయము?

మోహనుడు తన పేరును తెలియ జేసెను. ఇవ్వుడాతని కోపము కొంతవరకు శాంతించినది.

ప్రభా—తమరు కృష్ణశర్మగారి ప్రాణస్నేహితులవలె నున్నారు.

మోహా—నేనాతని అన్న కుమారుడను.

ప్రభా—ఓహో ఐతే మీరు మావాళ్ళే. కృష్ణశర్మగారు క్షేమముగా నున్నారా? చాల దినములై ఆయన దర్శనము చేయలేదు.

మోహా—ఇప్పటికి బాగానే యున్నారు. కాని ఈ విమర్శన లిట్లేయుండిన ఆయన స్థితి ఎట్లుండునో దైవమునకే ఎరుక. మీరా యన పరమమిత్రులై యుండియు ఇంత ద్వేషము వహించుట ఆశ్చర్యముగా నున్నది.

ప్రభా—ద్వేషమా! రామరామ! ఆయనయందు నాకు లేశమాత్రము ద్వేషములేదు. మీరు మాసంపాదకుల కర్తవ్యము నెరుగరు. మేము ప్రజలయెదుట నొకరికి మిత్రులము కాము ఒకరికిశత్రులము కాము. ప్రజల నుద్దేశములు ననుసరించి మా బాల్యస్నేహితులను సహితమువిడిచి పెట్టము. జన్మశత్రువుల నైనను ఒక్కప్పుడు పొగడెదము. సార్వజనిక విషయములందు మేము ఎవరి తప్పులను క్షమింపజాలము అట్లు మేము క్షమించినయెడల ఆతప్పులు మరింత హానికరములగును. శర్మగారు నాకు పరమమిత్రులు. నేనాయనను మనస్ఫూర్తిగ ఆదరించెదను. ఆయనను విమర్శించుటవలన నాకెంతయో మనోవేదన కలుగుచున్నది. మొన్నటివరకు కేవలము నేనాయన సిద్ధాంతములకు వ్యతిరేకుడను. ఆయన ఈసవరణ నంగీకరించుటలో మరియొక యుద్దేశమున్నదని మొన్ననే తెలిసినది. ఈ విషయమై మీకు చెప్పుటలో ఏమియు హానిలేదనుకొనెదను. ఆయన కొన్ని నెలల నుండి కనులాభాయి యను వేశ్యను రహస్యముగ విశంతు శరణాలయమునం దుంచెనట. సుమారొక నెలదినములనుండి ఆమె చెల్లెలు కూడ అక్కడనే యున్నదట. ఈసంగతి నిజము కాకూడదనియే నేను గోరుచున్నాను. కాని దీని నిజానిజములు తెలిసికొనుటకే సంగ

తిని తెలిసికొనుటకు త్వరలోనే పత్రికలో ప్రచురింప బోవుచున్నాను.

మోహా—ఈ సంగతి మీ కెట్లు తెలిసినది?

ప్రభా—అది నేను జెప్పనుగాని ఈ సంగతి కృష్ణశర్మగారిని కనుకొని అబద్ధమైన నాకు కబురుపంపును. ఈ ప్రస్తావన పురపాలక సంఘసభయందు ప్రవేశపెట్టక ముందు శర్మగారు తమచుగ హోజీహాస్సీమ్ సాహేబింటికి వెళ్లుచున్నట్లు కూడ నాకు తెలిసినది. ఈ సంగతులను బట్టి ఆ యన యొక్క ఉద్దేశములను నే నెట్లు బోధపరచు కొంటినో మీరే తెలిసికొనగలరు.

ఇప్పటికి మోహానుని కోపము పూర్తిగ శాంతించినది. ప్రభాకర రావుయొక్క మాటలతని వశపరుచుకొనెను. మోహానుడు మనస్సునందు ప్రభాకరరావును ప్రశంసించుచు కొంతసేపాతనితో సీ సంగతులు మాట్లాడి, ఇంటికి వెళ్ళిపోయెను. సుశీల ఆ శ్రమమున కందెందు కుంచబడినదో యనుసంగతి ఇప్పుడా తని మనస్సును పీడించుచుండెను.

రాత్రి భోజనసమయము నందీసంగతిని తన పినతండ్రి నడిగి తెలిసికొనవలెనని ఆతడు నిశ్చయించు కొనెనుగాని అడుగుటకు సాహసము లేకపోయెను. కమల విధవాశ్రమమునుండి వచ్చుచుండుటయు, పోవుచుండుటయు ఆతడిదివరకు జూచియుండెను. కాని ఇప్పటివరకీ సంగతులేమియు ఆతనికి బోధపడలేదు. కాని ఈ సంగతుల నన్నిటిని బట్టి ఆలోచింపగ సుశీలనుకూడ ఆ శ్రమము నందుంచుటను గురించి ఆతనికి సందేహము కలిగెను. రాత్రి యంతయు ఈ సందేహముతో ఆతని మనస్సు కొట్టుకొనుచుండెను. "సుశీల ఆ శ్రమమున కెందుకు వచ్చినది? బాబయ్యగారామె నిక్కడ కెందుకు తీసికొని వచ్చినారు? రామనాథ మామయు తన ఇంటియం దుంచుకొనుట కిష్టపడలేదా!" యను నీ విధమైన సంశయములతని మనస్సునందు పుట్టుచుండెను.

తెల్లవారగానె మోహానుడు విధవాశ్రమము వైపు బయలుదేరెను. ఒకవేళ కమల అటువైపు వచ్చిన ఆ మెవలన నీ సంగతులన్నియు తెలిసికొనవచ్చునని ఆతని అభిప్రాయము. ఆతడు నదియొడ్డున పావం చాలపై కూర్చున్న కొంతసేపటికే కమల ఆ వైపునకు వచ్చుచుండుటను జూచెను. ఆమెవెనుక నింకొకయువతి కూడ తలవంచుకొని వచ్చు చుండెను.

కమల చాల దినములనుండి మోహానుని కలుసుకొని మాట్లాడ వలెనని కోరుచుండెను. అందువలన అతనిని జూచినతోడనే ఆమె ఆగిపోయెను. ఇదివర కామె మోహానునితో మరి మాటాడకూడదని నిశ్చయము చేసికొన్నను, సుశీలకొరకు మాట్లాడవలసి వచ్చెను. ఆమె సిగ్గువచ్చు, మోహానునితో, "భాగ్యవశమున మీ దర్శనము దొరకినది. క్షేమమేనా?

మోహా—(గుండెలు తటతట కొట్టుకొనుచుండగా) ఆఁ. అందరు క్షేమమే.

కమ—చాల నీరసముగ కనబడుచున్నారు. సుస్థిచేసినదా?

మోహా—అబ్బే, కులాసాగానే యున్నాను. నాకు జబ్బేమిటి?

కమ—ఒక్కనిముషము కూర్చోండి. మీతో చాల మాట్లాడ వలసియున్నది. మి మ్మిప్పటినుండి "అన్నయ్యా" యని పిలచెదను. మన కిప్పుడు సోదర సోదరీ సంబంధ మేర్పడినది. నేను మీ వదినను. నానోటినుండి కఠినపుమాటలు వచ్చిన మరియొక విధముగ తలచ కండి. నాస్థితి మీకు తెలిసియే యున్నది. మీ పినతండ్రిగారు నాకు చాల సహాయము చేసినారు. ఇప్పుడు నేను ఆశ్రమమునందు దినములు గడపుచున్నాను. ఈ యభాగ్యురాలకు నాచెల్లెలుకూడ ఒకమాసమై ఇక్కడనే యున్నది. మా మేనమామగా రింటియం దిక నామె యుండలేకపోయినది. శర్మగారిని దైవము రక్షించుగాక! ఆయనయే

స్వయముగ వెళ్లి దీనిని తీసికొని వచ్చినారు. కాని ఇక్కడ దిగపెట్టిన తర్వాత ఆయన దీని సంగతియే మరచిపోయిన ట్లున్నారు. ఒక్కసంగ తడిగెదను చెప్పండి. అన్న దొంగతనముచేసిన తమ్ముని శిక్షించుట ఎక్కడి న్యాయము? ఇప్పుడు మీవద్ద ఏసంగతియు దాచుటలేదు. నా దురదృష్టమువలనను, రోజుల వంకరవలనను, పూర్వజన్మపాపము వలనను, దౌర్భాగ్యురాలనై ధర్మమార్గమును విడిచిపెట్టితిని. దానికి తగిన శిక్షను నే నివ్వు డనుభవించుచున్నాను. కాని మీ రందరును దీనిని పరిత్యజించుటకు పాప మిది యేమి అపరాధము చేసినది? దీనికి తగిన జవాబు మీరే చెప్పవలసి యున్నది. పెద్దవాళ్లేమంటారో యను వంకమాత్రము చెప్పకండి. అట్లనుట వట్టి పిరికితనము. ఇది న్యాయమో అన్యాయమో మీరు మనస్సాక్షిగ చెప్పండి. మీ రింత అన్యాయమున కొడిగట్టుకొనెదరా? ఒక అమాయకపు బాలిక జీవిత మును నష్టపరచుటకు మీకు దయలేదా?

సుశీల అక్కడ లేకపోయిన మోహనుడు తన మనోభావములను ప్రకటింపగలిగి యుండును. తన తప్పు తప్పక యొప్పుకొని యుండును. కాని సుశీల ముందు తా నపరాధినని యొప్పుకొనుట కాతడు సిగ్గు పడెను. అది కాక వంశమర్యాద యను అడ్డుచెప్పుటకు కూడ అతనికి సంశయముగా నుండెను. సుశీలకు దుఃఖము కలిగించునట్టిగాని అనవ సరపు ఆశను కలిగించునట్టి మాటలను గాని తన నోటివెంట రాకుండ ఆతడు జాగ్రత్తగా నుండెను. అత డిప్పుడు సుశీలనుండి తన దృష్టులను మరలించుకొనలేకుండెను. అతని స్థితి ఇప్పుడు బంధువులు తెచ్చిన కమ్మని మిఠాయిలను జూచి నోరూరుచుండినను తల్లి భయముచేత వాటిని తీసికొని తినలేని బాలునివలె నుండెను.

మోహన—సోదరీ! మీరు మొదటనే నానోరు కట్టివేసినారు. అందువలన ఇది యంతయు మాపెద్దవారు చేసిన పనియే యని

నే నెట్లు చెప్పగలను! వారిపై ఈ నింద మోపి నేను నిర్దోషినని చెప్పజాలను. అప్పుడు నేను కూడ లోకనిందకు భయపడితిని. ప్రపంచమునం దుండి ప్రపంచరీత్యా నడచుకొనవలెనని మీరు కూడ వప్పుకొనెదరు. అందుచేత నీ యన్యాయమును మేమే చెయ్యలేదు. ఈ తప్పంతయు సంఘమునదే.

కమ—సోదరా! మీరు చదువుకొన్నవారు. మాటలలో నేను మిమ్మ్ము జయింపజాలను. మీ కెట్లు న్యాయమని తోచిన నట్లే చేయుడు. ఒకరు జేసినను, సంఘము జేసినను అన్యాయము, అన్యాయమె. ఇతరుల భయమువలన, ఒకరికి అన్యాయము చేయకూడదు. సుశీల ఇక్కడ నిలువబడియున్నది. ఇంతకన్న మరి నేను చెప్పజాలను కాని వక్కసంగతి మాత్రము చెప్పెదను. మీకు మరియొక చోట ధనము, సన్మానము, రూపము, గుణము దొరకవచ్చును గాని ఈ ప్రేమ మాత్రము దొరకజాలదు. ఈమె హృదయము కూడ మీ హృదయమువలె కఠినమైనదే యైనయెడల నిప్పు డామె క్రొత్త అత్త వారి ఇంటిలో సౌఖ్యముగను, ఆనందముగను ఉండి యుండును. కాని ఈమె హృదయ మట్టిది కాదు. మీమీది ప్రేమయే ఈమె నిక్కడకు లాగుకొని వచ్చినది. మీ రీమె నెట్లాదరించినను సరే. ఈమె మాత్రము మీమీది ప్రేమతోనే ఈ జీవితము నంతను గడుపును.

సుశీల కండ్లవెంట నీరు కారుచుండుట నాతడు జూచెను. అప్పుడు ప్రేమతో గూడుకొన్న ఆతని సరళహృదయము దుఃఖముతో నిండి పోయెను.

మోహ—(కరుణాస్వరముతో) ఇప్పు డేమి చేయవలెనో నా కేమియు పాలిపోవుటలేదు. నాహృదయము దుఃఖముచే వగిలిపోవు చున్నది. దైవసాక్షిగా జెప్పుచున్నాను.

కమ—మీరు పురుషులు. మీకు దైవమున్నిసామర్థ్యములను

దయచేసినాడు.

మోహా—మీరెట్లు సలహానిచ్చినట్లు చేయుటకు సిద్ధముగనున్నాను.

కమ—మనస్సాక్షిగ చెప్పుచున్నారా?

మోహా—నామనస్థితి ఎట్లున్నదో దేవునకే యెరుక నోటితో ఏమని చెప్పను?

కమ—మొగవారి మాటలయందు విశ్వాసము కలుగకున్నది. (ఇట్లు చెప్పుచు కమల చీరనవ్వు సవ్వెను.)

మోహా—(సిగ్గుపడుచు) నావశమేయైన యెడల నాహృదయమును విప్పి మీకు చూపియుందును. (ఇట్లు చెప్పి అతడు సుశీలవైపు ఓరకంటితో జూచెను.)

కమ—సరే, మీరిప్పు డీనదియొడ్డున సుశీల చెయ్యిని పట్టుకొని, "నీవు నాభార్యవు. నేను నీపెనిమిటిని. నేను నిన్ను ప్రేమించి పోషించెదను." అని చెప్పండి.

మోహానుని ఆత్మబలము జవాబు నిచ్చివేసెను అతడు తనముఖమును దాచుకొనుటకు ఇటు నటు చూడసాగెను. గోదావరి తనను ముంగి వేయుటకు వచ్చుచున్న ట్లాతనికి తోచుచుండెను. ఆతడు మునిగుపోవుచున్న మనుష్యునివలె ఆకాశమువైపు జూచి తిరిగి సిగ్గుచేత తలవంచుకొని మెల్లమెల్లగా "కమలమ్మా! దీనివిషయమై ఆలోచించుకొనుటకు నాకు కొంత వ్యవధినిమ్ము." కమల నమ్రతతో, "ఔను. ఆలోచించియే నిశ్చయపరచుడు మిమ్ములను సందిగ్ధస్థితిలో పెట్టుట నాకు కూడ నిష్టములేదు." సుశీలతో "చూచితివా! నీభర్త ఇప్పుడు నీయెదుటనే నిలువబడియున్నాడు. నేను చెప్పగలిగిన దంతయు చెప్పితిని. కాని అతని మనస్సు కరుగలేదు. ఇక నీకాయన దర్శనమగుట దుర్లభము. నీప్రేమ నిజమైనదై,

దానియందు బలమున్న ఆయననాపి, ఆయన వద్ద ప్రేమ వరము వుచ్చుకో" ఇట్లు చెప్పి కమల నదివద్దకు బయలుదేరెను. సుశీల కూడ ఆమె వెనుకనే మెల్లగా నడువసాగెను. ఆమె ప్రేమ మానము క్రింద అణగిపోయెను. ఎవరికి తన ప్రేమ నర్పించి, యావజ్జీవము దుఃఖముతోనైనను గడపుటకు నిశ్చయించినదో, ఎవరికి, తన్ను మనస్సునందే అర్పించుకొన్నదో ఆతనిని ప్రత్యక్షముగా జూచియు, మాట్లాడలేక పోయినది. ఆతని యవస్థ నామె ఎరుగదు. అతని కష్టముల నామె విచారింపలేదు. ఆతని పరాధీనతను గురించి ఆలోచించలేదు. ఇప్పు డామె చేతులు జోడించి మోహానుని ఎదుట నిలువబడినచో తన కోరిక నెరవేరియుండును. కాని ఆమెకు విసయము కన్నమానమే అధికముగా తోచెను. మోహాను డొక్కటిణ మక్కడ నిలువబడి, తరువాత పశ్చాత్తాపపడుచు ఇంటికి వెళ్లిపోయెను.

౧౨

మోహానుడు తానెంతో పాపముచేసిన వానివలె విచారపడుచుండెను. ఆతడు మాటిమాటికిని తన సంభాషణను మనస్సునందు వితర్కించుకొనుచు, తాను చాల నిర్దయుడనని అనుకొనుచుండెను. ప్రేమ అతనిని వెట్టివానిగ జేసివైచెను. అతడు తనలో, "లోకమన్న నా కెందుకింత వెరపు? సంఘము నన్నేమిచేయును? మిథ్యాపవాద భయము చేత నీ సతీరత్నమును పోగొట్టుకొందునా? నా పూర్వజన్మ సుకృతమువలన నాకీ సుగుణరాశి లభించినది. తమ సంఘనియమములను పాటించి నన్ను నా బందుగులు విసర్జించిన నా కేమి నష్టము? మనను పాపకర్మములనుండి తప్పించగలిగిన, అట్టిలోకనిందకు భయపడవలెను.

కాని మనక ర్తవ్యమున కడ్డువడిన దానికి భయపడుట మన పిరికితనమే. నిరపరాధులపై అబద్ధములగు అభియోగములను దెచ్చిన సంఘము మనలను వెలివెట్టక పోవుటయే గాక అది మనకు సహాయము జేయుచు సాక్షులను వకీళ్ళను సమకూర్చుచున్నది. ఎవరిధనమునైనను, వస్తువులనైనను అపహరించిన, సంఘము మనలను శిక్షింపదు. ఒకవేళ శిక్షించినను నామమాత్రముగ శిక్షించును. కాని ఇటువంటి సత్కార్యములయందు ఆ సంఘమే మనకు చెడుపేరు తెచ్చును. జీవితపర్యంతము కళంకము నంటగట్టును. లోకనిందకు వెరచి నే నీయధర్మమును చేయజాలను. నే నామెను నడిసముద్రములో వదలివేయలేను. సంఘము నన్నెట్లు నిందించినను సరే. నేనీ అన్యాయమును మాత్రము చేయజాలను. తల్లిదండ్రుల యాజ్ఞను పాలించుట నా ముఖ్యకర్తవ్యమని నే నొప్పుకొందును. వారే నాకీ జన్మనిచ్చి, పెద్దవానిని జేసిరి. తండ్రి యొడిలో నాడుకొంటిని. తల్లి పాలతో పెరిగితిని. వారి కనుసన్నను సంతోషముతో విషము త్రాగగలను. కత్తి అంచుపై నైనను సాము చేయగలను. నిప్పులలో కూడ నురుకగలను. కాని వారాగ్రహించినను కూడ నీ యువతిని తిరస్కరింపజాలను. ఈ మెను రక్షించుటయే నా పరమధర్మము. నా కర్తవ్యము. నాన్నగారికి, అమ్మకుకూడ నాపై తప్పక కోపమువచ్చును. వారు నన్ను బహిష్కరించి, చచ్చిపోయినట్లుకూడ భావింపవచ్చును. కాని కొన్నిదినములు విచారించిన తర్వాత వారికే ధైర్యము కలుగును. వారు నన్ను మరచిపోగలరు. కాలము వారి గాయమును మాన్పగలదు.

"అయ్యో! నే నెంత కఠినుడను? నా దెంత పాషాణహృదయము? రాణివాసమునకు శోభ తెచ్చు యువతి నా యెదుట దీనురాలై నిలువబడి నప్పుడు నా హృదయము కొంచమైనను కరగినదికాదు. అటువంటి సమయమందు నేనామె కాళ్ళపై బడి, చేతులు జోడించి, "రమణీ!

నా అపరాధములను క్షమింపుము" అని వేడికొని నదీజలములను తెచ్చి ఆమె కాళ్ళనుకడిగి ఇష్టదేవత నుపాసించు నట్లామె నుపాసింపవలసి యుండెను. కాని నేను రాతివిగ్రహమువలె కదలక నా వంశమర్యాదను పట్టుకొని కూర్చుంటిని. అయ్యో! ఎంతమందబుద్ధిని? నా కఠినవచనముల వలన ఆమె కోమలహృదయ మెంత కృంగిపోయినదో? ఆ సంగతి ఆమె కన్నీటిసలనలనే స్పష్టమైనది. ఆమె నన్ను ప్రేమశూన్యుడనియు, గర్వియనియు, ధూర్తుడనియు తలచియుండును. ఆమె నా వైపు కన్నెత్తియైనను జూడలేదు. నిజముగ అది నాకు తగిన శిక్షయే."

ఈ పశ్చాత్తాపము చాలదినములవరకు మోహానుని మనస్సును బాధించు చుండెను. చివరకాతడు తన సంసారమును వేరుపరచుకొన వలెననియు, తనస్వశక్తిపై నే ఆధారపడవలె ననియు తలచెను. ఇంతకు తప్ప మరియొక దారి అతనికి కనబడలేదు. "అమ్మ నాన్నగారు నన్నింటిలోని కైనను రానివ్వరు. బాబయ్యగారు నాకు తప్పక ఆశ్రయమిచ్చెదరు. కాని వారింటి యందుండి మనస్పర్థలు పుట్టించుట న్యాయముకాదు. ఈ తడే మా పిల్లవానిని చెడిపి నాడని నాన్నగారు ఈయనపై తప్పక వాగుచేసెదరు. అందువలన నాదారిని నేనుజూచుకొనుట తప్ప మరియొక సాధనము లేదు.

మోహానుడు తాను రగులుకొలిపిన నిప్పును ఆర్పివేయవలెనని తలచుచుండును కాని తీరా బయలుదేరు సమయమునకు ధైర్యము నడలిపోవుచుండెను. ఇల్లెక్కడ? ఏ యాధారము జూచుకొని ఆ మెను సమాధానపెట్టుదును? అను సంశయము లాతని మనస్సునందు కలుగుచుండును.

ఈ సమస్య నెట్లు పూర్తి చేయుదునను విచారమాతని మనస్సు నెల్లప్పుడు బాధించు చుండెను. ఆ తడు పనికొర కూరంతయు గాలిం

చివై చెను. ఒకప్పుడా ఫీసులకు పోవును. ఒకప్పుడు మిల్లులకు పోవు చుండును. ఈ విధముగ రోజుకు మూడునాలుగు గంటలు పనికొరకు తిరిగి తిరిగి ఇంటికి వచ్చుచుండును. ఇప్పటి వరకాతని జీవితము సౌఖ్య ముగాను, గొప్పగాను గడచిపోయెను. వినయమనుదాని నింతవరకాత డెరుగడు. స్వాభిమాన మాతని రోమరోమముల నిండియున్నది. ప్ర పంచానుభవమాతని కించుకైనను లేదు. అధికారుల ఎదుట చేతులు జోడించిన కాని తనవని నెరవేరదను సంగతాత డెరుగడు. నమ్రత, పరిశ్రమ, నిపుణతలు, గలవారి యొక్కయు, అవమానమును సహిం చువారి యొక్కయు, ఆత్మాభిమానమును వదలు కొనువారి యొక్క యు కార్యములే ఈ కాలమున నెరవేరుననియు, అట్టివారికే ఉద్యో గములగుననియు, మనుష్యుని దేవతుల్యునిగా జేయు సద్గుణములీ క్షేత్రమునందు నిర్లక్ష్యదృష్టితో జూడబడుననియు మోహనుడెరుగడు. మోహనుడు మర్యాదగలవాడు. సత్యప్రియుడు, దయాస్వభావము కలవాడు. అమాయకుడు. ఐనను ఉన్నతవిద్య లేకపోవుటవలన నీగు ణములకు ప్రపంచదృష్టియందు విలువలేకుండెను. మోహనుడు తన సమయమునంతను వ్యర్థముగ పో గొట్టుకొంటి ననియును, జీవనా ధా రమును కలిగించు యేపనిని నేర్చుకొనక పోతిని కదా యనియును విచారింప జొచ్చెను. ఈ విధముగ నొకమానసముసకు పైగా గడచి పోయెను. కాని మోహనునకే పనియు దొరకలేదు.

ఈ నిరాశక్రమక్రమముగ ఆతని హృదయమునందు నంతుష్టిని కలిగింప సాగెను. ఆతనికి తన తల్లిదండ్రుల పైనను, పినతండ్రిపైనను, ఈ ప్రపంచము పైనను, చివరకు తనపైనను కూడ కోపము కలుగు చుండెను. ఇదివర కాతడు గుట్టుముపై మికారు వెళ్లుచుండెడువాడు. కాని ఇప్పుడెవరైనను గుట్టుముపై కాని కారుపైకాని వెళ్లుచుండగా జూచిన ఆతనికి చాల చికాకుగ నుండెను. రోడ్డుపైని తా నడ్డముగా

నడచుచున్నప్పుడు బండిశోలువాడు అదలించినను ఆతడు లక్ష్య పెట్టుట లేదు. ఎవరేమన్నను ఇప్పుడాతడు దెబ్బలాడుటకే సిద్ధపడు చుండెను. పంట్లాము కోటు వేసికొని సౌఖ్యముగ గుఱ్ఱపు బండిలోను మోటారులోను పోవుచున్న వారిని జూచినప్పు డాతడు తనలో "వీరింత హాయిగ షికారు వెళ్ళుచున్నారు. నా దురదృష్ట మెందు కీవిధముగ నున్నది?" అని విచారించుచుండును. మోహనుడు గొప్ప కుటుంబములోని వాడగుటవలన తన జీవనాధారమును గురించిన ప్రశ్న ఇదివరకాతని కెన్నడును కలుగలేదు. ఇందు వలననే ఆతడు చదువు విషయమై అంతశ్రద్ధ తీసికొనవలసిన అవసరము లేకపోయెను. కాని అకస్మాత్తుగ ఆతనికీ చిక్కు సంభవించుటవలన తన అసమర్థత ఇప్పుడాతనికి బోధపడెను. ఆతడు పెద్ద ఇంగ్లీషువరీక్షలు ప్యాసు కాక పోయినను స్వభాషయందు మంచి జ్ఞానమును సంపాదించెను. పరీక్షలు ప్యాసైనవారు మాతృభాషయం దశ్రద్ధ జూపుటవలన జాతికిని దేశమునకును కూడ చాల అనర్థము కలుగుచున్నదని ఆతని అభిప్రాయము. ఆతనికి తన బుద్ధిపై నిదివరకు గర్వముగా నుండెను. తన వ్యాసములు పత్రికలయందు ప్రచురింపబడి నప్పటినుండియు ఆతడు ఇంగ్లీషు చదువుకొన్నవారిని నిర్లక్ష్యభావముతో జూడసాగెను. "వీరందరకూడ స్వార్థపరులు. దరిద్రుల గొంతుకలు కోయుటకును, తమపొట్టలు నింపుకొనుటకునే వీరింగ్లీషును చదువుకొనిరి. వీరందరు నాగరికతకు బానిసలు. వీరియందు దయాధర్మములు లేవు ఆత్మబలము లేదు. వీరికి మాతృభాషయందు ప్రేమ లేదు. వీరుకూడ మనుష్య మాత్రులేనా!" అని మోహనుడనుకొనుచుండును. కానితన జీవితసమస్య తలచుకొన్నప్పు డాతడు "వీరియెడల నేను అన్యాయముగా తలచుచున్నాను. వీరు నిజముగ దయాపాత్రులే. నాకరిత భాషా పాండిత్యము లేకపోయినను చాలమందికంటె నేనే నయము.

నా యుద్దేశములంత శ్రేష్ఠములు కాకపోయినను నీచములు మాత్రము కావు. కాని నాజీవితమున కిప్పుడేద్వారమును తెరచియుండలేదు. నాకిప్పుడొక్క బంట్రోతు పనికిమాత్రమె అర్హత కలదు. ఇంకను ఎక్కువగ తంటాలుపడి ప్రయత్నించిన కాన్‌స్టేబిల్ పని అగునేమో? సరి ఇంతవరకే నా సామర్థ్యము. ఇది ఎంత అన్యాయము? ఎంత సత్ప్రవర్తకుడైనను, ఎంత సామర్థ్యమున్నను ఇంగ్లీషు భాషాజ్ఞానము లేకపోయిన నిది యంతయు నిరర్థకమే. ఈ యన్యాయమును మౌనముగ సహించుటకన్న అవమాన మేకలదు? ఇటువంటి నీచపునౌఖరీ ఆశను నా మనస్సునుండి తొలగించుకొనుటయే యుత్తమము."

ఇప్పుడు మోహానునిస్థితి రాత్రియం దడవిలో తిరుగుచు చీకటిపై చికాకుపడువాని స్థితివలె నుండెను.

ఇట్టి నిరాశావిచారములతో నొకనా డాతడు నదియొడ్డున తిరుగుచు పడవలరేవు వైపునకు వెళ్లెను. నదియంచు రహదారిపడవలిటునటు పోవుచుండెను. కొన్ని షికారుపడవలయందు పురవాసులు చల్లగాలి కొరకు తిరుగుచుండిరి. కొన్ని పడవలు సామానుల నెక్కించుకొని పోవుచుండెను. మోహానునకు కూడ షికారు వెళ్లవలెనని బుద్ధిపుట్టుట వలన ఆతడొక పడవను మాట్లాడి దానిలో కూర్చుండెను. సాయంసమయమునందలి చల్లగాలియు, నది కిరువైపులను గల ప్రకృతి సౌందర్యమును అతనిని పరవశునిగ జేసెను. అప్పుడాతడు తనలో, "ఇది ఎంత సంతోషకరమైన జీవితము. దైవము నాకుకూడ నిటువంటి జీవితమును దయచేసిన ఎంత సౌఖ్యముగ కాలము గడుపుదును? నదియొడ్డున తిరుగుచు నదీతరంగములపై షికారు తిరుగుచు ఆనందము ననుభవించుదును. సుశీల మా కుటీరముయొక్క ద్వారమువద్ద నిలువబడి నారాక కెదురు చూచుచుండును. అప్పుడప్పుడు మే మిద్దరముకూడ షికారు తిరుగుచుందుము." అని తల

చెను. ఈ ఆనందమయకల్పనల వలన అతని సుఖమయజీవనము యొక్క సౌందర్యచిత్రము కండ్లయెదుట చిత్రింపబడిన ట్లుండెను. ఆ యానందమయస్వప్నము నాతడు జూచిచూచి చివరకు వ్యాకులు డయ్యెను. అక్కడి ప్రతివస్తుస్థను, సుఖము, ఆనందము, శాంత ములలో మునిగి తేలుచున్న ట్లుండెను. మోహాను డప్పుడొక మోతు బరియగు పడవవానితో, "ఏమోయి! వెంకన్నా! ఇక్కడ ఏదైనను ఒక షికారుపడవ అమ్మకమున కున్నదా?" యని అడిగెను. అప్పుడా పడవవాడు చుట్ట త్రాగుచుండెను. మోహానుని చూడగనె లేచి నిలువబడి, "శిత్తం బాబు" అని అక్కడ అమ్మకమునకు సిద్ధ ముగానున్న కొన్ని పడవలను జూపెను. మోహాను డొక క్రొత్తరకపు షికారుపడవ నెంచి దానిని బేరము చేయుచుండెను. అప్పుడా చుట్టు పట్లనున్న పడవలవా రందరు కూడ ఆతని జుట్టును చేరిరి. చివరకు మూడువందల రూపాయలకు బేరము కుదిరెను. పడవ నమ్మినవాడే నౌఖరుగా నుండి పడవను నడపుట కొప్పుకొనెను. అంతయు సిద్ధ మైన తర్వాత మోహాను డింటికి బయలుదేరెను. అప్పుడాతని కే వస్తువునకు కొదువలేనట్లును తాను యుద్ధమునందు జయమొంది నట్లును అతి సంతోషముగా నుండెను. ఈ సంతోషమువలన రాత్రి తెల్లవార్లు నిద్ర పట్టలేదు. తాను నదియందు క్రొత్తపడవలో షికారు తిరుగుచున్నట్లును, నదియొడ్డున మంచి లతలతోను, పువ్వుల తోను కూడుకొన్న చిన్నతోటలో నొక సొగసైన చిన్న ఇల్లును తాను గట్టించినట్లును, సుశీల మనోహరాకారము ఆయింటిని ప్రకా శింపజేయుచున్నట్లును, మరియొకసారి తాను సుశీలతో కలసి విహ రించుచున్నట్లును అనేకవిధములుగ కలలను గనుచుండెను. మనకు దేనియందు మిక్కిలి మక్కువయుండునో అదియే మన కెల్లప్పుడును కండ్లకు కట్టిన ట్లుండును. మోహానుకు సుశీలను, సాధారణమైన బట్ట

లను కట్టుకొని నదియొడ్డున తల వంచుకొని నిలువబడి యున్నప్పుడు జూచియుండెను. అప్పటినుండి ఆయన ఆకని కండ్లు ఎటునుండి తొలగిపోలేదు.

తాను ప్రారంభింపబోవు ఈ వ్యవహారమునందు లాభమే కాని నష్టము రాదని మోహనుడు మనస్సునందు కల్పనలను జేయుచుండెను. కాని ఇంతసామ్రాజ్యమును పుట్టించుట కెక్కడనుండి వచ్చునను ఊహ ఆతనికి స్ఫురింపకపోవుట చాల విచిత్రము.

తెల్లవారగనే, "నే నింతసొమ్మెక్కడనుండి తెత్తును? ఎట్లు సమకూర్తును? ఎవరినడిగిన నెవరిచ్చెదరు? ఏవంకబెట్టి అడుగుదును? బాబయ్య నడుగుదునా? కాని ఆయన కొన్ని నెలలనుండి తిన్నగా కచ్చేరీకైనను వెళ్లుటలేదు. ఆయనయాత్రము సొమ్మెక్కడనుండి తెచ్చెదరు? నాన్నగారిపద్ద పుచ్చుకొనుట రాతినుండి నీరుతీయుటయే. యేమి చేయుదును? ఇప్పుడు వెళ్లి సొమ్మివ్వకపోయిన నామాట పోవును." అని చింతించుచు మోహనుడు డాబాపైన పచారు చేయుచుండెను. ఇంతవరకు నిర్మించిన కల్పనాభవనము చూచుచుండగనే కూలిపోవసాగెను. యవ్వనమునందలి కోరికలు వెదుళ్లమంటవంటివి. అవి ఎంతవేగము మండునో అంతవేగముగ ఆరిపోవును.

అకస్మాత్తుగా మోహనుని కొక యుపాయము తట్టెను. శత్రువును భూమిపై పడద్రోసి హేళనచేయుచున్న ట్లతడు భావించెను, "ఆహా నే నెంత మూర్ఖుడను! మూడువందలకన్న ఎక్కువ విలువగల వాచీ గొలుసు, ఉంగరములు నాపెట్టెయందే యున్నవి. వాటి నిప్పుడెందు కమ్మకూడదు? ఒకవేళ అమ్మ అడిగిన ఖర్చుపెట్టివేసినానని స్పష్టముగా చెప్పివేసెదను. నాన్నగారడిగిన అప్పటిమాట చూచుకొనవచ్చును." అట్లనుకొనుచు ఆతడు గదిలోనికి వెళ్ళి పెట్టె తెరచి వస్తు

వులను పైకి దీసి వాటి నెట్లమ్మ్మదునా యని ఆలోచింపసాగెను. బజాయిలో స్వయముగా అమ్మ్మట కాతనికి చిన్నతనముగా దోచెను. ఈ విషయమై ఆలోచించుచుండగా నింతలో వెంకటస్వామి గది నూడ్చుటకు లోపలకు వచ్చెను. ఆతడు మోహానుని ముఖము వాడి యుండుటను జూచి, "ఏం బాబు! ఆలా వున్నాగు? రాత్రి నిద్రపట్ట లేదా? కళ్ళు పొంగి ముఖం వాడిపోయింది?"

మోహా—ఔను. రాత్రి నిద్రపట్టలేదు. నామనస్సు స్థిమితముగా లేదు.

వెంక—ఏం బాబు? ఎంగునీత? నే నా సంగతి వినకూడదూ?

మోహా—నీతో చెప్పిన ఈ సంగతి ని ముషములో నిల్లంతయు ముట్టించివేస్తావు.

వెంక—బాబూ! చిన్నప్పటినుండి మిమ్మల్నిచే కనిపెట్టుకొని ఉన్నాను. నే నంత నమ్మకమైనవాడిని కాకపోతే యిన్నా భ్యంచుకు తారా? మరేం భయం లేదు నాతో చెప్పండి.

మోహా—(జంకుతూ) ఒరే వెంకన్నా! నావద్ద కొన్నివస్తువులున్నవి. వాటిని ఏలాగేనా అమ్మాలి. నా కిప్పుడు సొమ్మసరముగా కావలసియున్నది.

వెంక—దీనికేనా బాబు ఇంతిశారిస్తున్నాగు! నీవొంటి గొప్పోరు నగుకు లెందు కమ్ముకోవడం? అమ్మగోరి నడగండి. అమ్మగోరు ఎప్పుడూ లేదనగు. కాని పంతులుగోరి నడుగుతే లాభం లేదు. ఈ యింట్లో పంతులుగోరి పెత్తన మేమి లేదు. అంతా అమ్మగోరి ఇష్టమే.

మోహా—ఇంట్లోవాళ్ళ నడగడం నా కిష్టం లేదు.

వెంకటస్వామి ఆ సరుకులను పుచ్చుకొని ఉజ్జాయింపుగా ఆ సరుకు లెంత బరువున్నవో చేతితో ఆడించి చూచెను. సాయంత్రమునకు

వాటి నమ్మి సొమ్ము తీసుకొని వచ్చెదనని మోహనునితో చెప్పి వెళ్ళిపోయెను. కాని వాడు బజారునకు వెళ్ళక తిన్నగా తనగదిలోనికి వెళ్ళి తలుపులు వేసికొనెను. ఆతడు తన మంచముక్రింద త్రవ్వి రూపాయలతో నిండియున్న ఒక చెంబును పైకి తీసెను. జీవిత మంతటిలో వాడు జేసిన కపటము, లోభము అన్యాయము ఈ రూపాయలరూపముతో ఆ చెంబునందు సమకూర్చబడి యుండెను. ఈ కారణముచేతనె కదా పెద్దలు డబ్బు పాపిష్టిది యని చెప్పెదరు.

వెంకటస్వామి ఆ రూపాయలను లెక్కబెట్టి ఇరువది, ఇరువది చొప్పున దొంతులు పెట్టెను. అన్నియు కలిపి పదిహేడు దొంతులైనవి. తర్వాత అతడు వస్తువులను త్రాసులో వేసి తూచగా అవియున్నయు పదిహేను తులములకు పైగా నుండెను. అప్పుడు బంగారపు ధర ఎక్కువగానున్నను ఇరువదియైదు చొప్పున దొంతులు పెట్టగా పద మూడు దొంతులై పదిహేను రూపాయలు మిగిలిపోయెను. అనగా ఆవస్తువులకు తాను కట్టినధర కింకను రమారమి ముప్పదియైదురూపాయలవరకు తక్కువగా నుండెను. వాడు తనలో, " చేతకి దొరకిన ఈ వస్తువులను వదలుకొనకూడదు. వడ్డీమాత్రము తులములే యున్నవని చెప్పివేసెదను. అట్లుచెప్పిన నావద్ద ఇంక పదిహేను రూపాయలు కూడ మిగులును. " అని అనుకొని వస్తువులను చెంబులోపెట్టి మూతను గట్టిగా బిగించి యథాప్రకారముగ దానిని భూమిలో పూడ్చి వేసెను. అనుకొనకుండ నిమిషములో ఏ బడిరూపాయలు లాభము వచ్చుటవలన వెంకటస్వామి సంతోషమును పట్టజాలకుండెను. ఇటు వంటి అవకాశము వాని కిదివరకెన్నడును చిక్కలేదు. వాడు తనలో, "ఈ రోజున లేచి ఎవరిముఖము జూచితినో నా అదృష్టము బాగున్నదని" పొంగి పోవుచుండెను. పదిగంటలు కొట్టగానే వెంకటస్వామి మూడువందల ఇరువదియైదు రూపాయలను దెచ్చి మోహనుని

చేతిలో బోసెను. ఈ సొమ్ము ఉచితముగా దొరకినట్లతడు సంతోషించెను. వెంకటస్వామి ఆ రూపాయల నిచ్చివేసి స్వార్థరహితునివలె ముఖమును త్రిప్పుకొని వెళ్ళిపోవుచున్నట్లు నటించెను. మోహనుడు వాటిలోనుండి ఐదురూపాయలను దీసి, వీటితో నే మైనను కొనుక్కో అని వెంకటస్వామికివ్వ బోయెను. కల్లును జూచి భయపడి ముఖమును త్రిప్పుకొను సత్పురుషునివలె తలనాడించుచు, "మీ వల్లే బతుకుతున్నాం బాబు. చిన్నవంతులుగారి దగ్గర పుచ్చుకుంటానా?

మోహన—లేదులేదు. నేను సంతోషముతో నిచ్చుచున్నాను. పుచ్చుకో.

వెంక—లేదుబాబు నామాట యినండి. వద్దువద్దు. ఈల సేసినట్లైతే యీపాటికి నాలుగు డబ్బులు సంపాదించి ఉండనా? దేవుడు మిమ్మలిని నల్లగా చూస్తే నాకదే పదివేలు!

వెంకటస్వామి చాల నమ్మకస్థినవాడనియు, ఈతనితో సీవిషయమై సలహా చేయనచ్చుననియు మోహనుడు తలచెను.

సాయంకాలము కాగానే మోహనునియొక్క పడవ ఆకాశము నందు పోవు మేఘమువలె గోదావరీతరంగములపై పోవుచుండెను. కాని మోహనుని ముఖముసందు సంతోషవికాసములకు బదులు భవిష్యత్తును గూర్చిన విచారము కనబడుచుండెను. పరీక్షయందు కృతార్థుడైన విద్యార్థి ముందు సంగతిని గురించి ఆలోచనామగ్నుడగునట్లు మోహనుడు కూడ తన భవిష్యత్తును కూర్చి ఆలోచింప సాగెను. సంసారరూపమైన రొంపినుండి రక్షించిన ఊతకఱ్ఱ విరిగిపోయి తాను నడిసముద్రములో కొట్టుకొనుచున్నట్లాతనికి తోచుచుండెను. "పడవను వదలితిని. కాని యొడ్డు చేరగలనా? నీరు లోతుగా నున్నది. గాలి విస్తారముగా వేయుచున్నది. జీవనయాత్ర నే ననుకొన్నంత సులభమైనదికాదు. అలలయొక్క ధ్వని మాధుర్య

ముగా నున్నను, ఒక్కొక్కప్పుడు భయంకరముగా కూడ నుండును. గాలి మందమందముగా నుండి పడవను మెల్లమెల్లగా కదలించినను, ఒక్కొక్కప్పు డొక్కప్పుడై దానిని ముంచివేయును సే!"

౧౬

మోహనుడు పత్రికలకు వ్రాసిన ఉపన్యాసములవలన ప్రభాకరరావు యొక్క క్రోధము కొంతవరకు శాంతించెను. మరియు మోహనుని నిరోధమువలన కృష్ణశర్మ కమలయొక్క పూర్తియైన వృత్తాంతమును వ్రాసి ప్రభాకరరావునకు పంపెను. అందువలన కూడ ఆతని మనస్సు స్థిమితముగా నుండెను.

మ్యూనిసిపాలిటీయందు వేశ్యల విషయమై తిరిగి పెట్టబడిన తీర్మానము సవరణతో కూడ నామోదింపబడి మూడు మాసములయ్యెను. సవరణవిషయమైతే గాలీసాహేబు సూచించిన అనుమానములుకూడ నిరాధారములని వ్యక్తమయ్యెను. బజారునందలి మేడలపైని కాని, సాధీధియందు మేడలపైని గాని వేశ్య లెవ్వరు దుకాణములను పెట్టలేదు. ముందుముందు అక్కడినుండి తమరిని తగిలివేయుదురను భయముచేత వారుతమ బసలను మరియొకచోటునకు మార్చుకొనిరి. అందువలన చాల మేడలు ఖాళీగా నుండెను.

కృష్ణశర్మ మొదట వేశ్యలయందలి యసహ్యముచేత నీతీర్మానమును పెట్టెను కాని యీ విషయమై తర్కించి యాలోచింపగా ఆతని అసహ్యత దయాదాక్షిణ్యములుగా మారిపోయెను. ఈ భావములే ఆతనిని సవరణ నంగీకరించునట్లు చేసినవి. శర్మ తనలో, "పాప మీ యబలలు ఇంద్రియచాపల్యమువలన తమ సర్వస్వమును

నాశనపరచుకొనుచున్నారు. విలాసప్రేమ వీరిని గ్రుడ్డివారినిగ జేసి వేయుచున్నది. ఇటువంటి స్థితియందు వీరు మన జాతికి పాత్రులే. ఈ దుర్వ్యసనవలన సులభముగా బాగుపడగల వీరి దేహమును శక్తియు మరింత బలహీనములైపోవుచున్నవి. ఉపదేశములవలనను, ప్రేమవలనను, శిక్షణవలనను రక్షింపబడగల వీరి యాత్మలు మన లోనుండు స్వార్థికలచేతనే యుగింప చెడిపోవుచున్నవి. మాయామోహములవలన గ్రుడ్డివార మగుచున్న మనకు వారిని దండించుట కెట్టి యధికారమును లేదు. వారి కర్మమే వారిని దండించుచుండగా మనము కూడ నీయత్యాచారములవలన వారి నెందుకు మరింత దుఃఖపెట్టవలెను?" అని భావించుచుండును.

మన మనస్సునందలి తర్కవితర్కములు కర్మమార్గమును సూచించును. కృష్ణశర్మ సంకోచమును అభిమానమును విడిచిపెట్టి చివరకు కర్మక్షేత్రమునందు ప్రవేశించెను.

కమల యెదుటపడినపసుగెత్తునట్టి శర్మ యివ్వుడు దినమంతయు సాసివీధియందే కనబడుచుండెను. ఎవరేమనుకొన్నను యివ్వుడాతడు లక్ష్యపెట్టలేదు. ఆతని కివ్వుడాత్మ బలము వృద్ధిపొంది హృదయమునందు నిజమైన సేవాభావము జాగరితమైనది. లోక నిందాభయము యీతనిని విడిచిపెట్టెను. రాళ్లు రువ్వినను పచ్చికాయ చెట్టునుండి నేల పడదు. కాసి పక్వమైన పండు దానంతట అదియే క్రిందపడును. కృష్ణశర్మయొక్క అంతఃకరణయం దివ్వుడు సేవాప్రేమల యొక్క భావములు పరిపక్వము లయ్యెను.

నారాయణదాసాయను కీవిషయమునందు వ్యతిరిక్తముగా నుండెను. ఫుట్టుకతో వేశ్యలైనవారెన్నటికి బాగుపడజాలరని అతని యుద్దేశము. తీర్థాసమునకు సవరణనుపెట్టిన సెహరత్ ఖాను కూడ నీవిషయమై అంత శ్రద్ధ తీసుకొనలేదు. రామదేవు తన

సంగీతసాహిత్యములలో పడి కొట్టుకొనుచుండెను. కేవలము సాధు రామానందస్వామియే కృష్ణశర్మకో కార్యమునందు అసరాగానుండెను, ఇప్పుడా యోగియందు నేవ నిజభావముతో నవతరించిన ట్లుండెను.

౨౦

కొన్ని నెలలు గడచిపోయినవి. కాని మోహనుడు తన యీ క్రొత్త వ్యాపారమును గురించి ఇంట్లో నెవరితోను జెప్పలేదు. అతడు చీక టుండగనే లేచి స్నానము వంకజెప్పి రోజు ప్రొద్దుటే గోదావరి యొడ్డునకు పోయి పది గంటలకు తిరిగి వచ్చుచుండును. తిరిగి భోజ నము చేసి వెళ్ళి రాత్రి భోజనముల వేళ కింటికి వచ్చుచుండును. ఇప్పు డాతని పడవ మిగిలిన షికారు పడవ లన్నిటికంటె అందము గాను సౌఖ్యప్రదముగాను ఉండెను. అందులో రెండుమూడుకుర్చీలు, పరుపులు, బాలీసులు ఉండెను. అందువలన పట్టణమునందలి ధన వంతులు రసికులు దీనిపైనే షికారు వెళ్లుచుందురు. అద్దె విషయమై మోహనుడు స్వయముగ మాట్లాడక పడవవాని ద్వారానే వ్యవ హారము జరుపుచుండెను. అత డొక్కొక్కప్పుడు నదియొడ్డున పచారు చేయుచుండును. ఒక్కొక్కప్పుడు పడవలో షికారు వెళ్లు చుండును. "వ్యవహారమును స్వయముగ జేసికొనుట కెందుకీ ముఖ మాటము? నే నేమియు చెడువని చేయుటలేదు. ఒకరిక్రింద బాని సనుకాను." అని అతడు మనస్సున తర్కించుకొనుచుండును. కాని ఎవరైనను పెద్దమనిషి తన పడవవైపునకు వచ్చుచుండుటను జూచిన తోడనె అతని అడుగులు తమంతట అవియే వెనుకకు పోవుచుండును. అతని తండ్రి గొప్ప భూస్వామి. పినతండ్రి పెద్దవకీలు. అటువంటి

పెద్ద కుటుంబములోనివా డగుటవలన మోహాను డిటువంటి "తక్కువ" పని చేయుటకు సిగ్గువడుట సహజమే. ఈ సంకోచము వలన ఆతనికి చాల నష్టము కలుగుచుండెను. సులభముగ రూపాయి లాభము వచ్చుచోట అణాకి అర్ధరూపాయే లాభము వచ్చుచుండెను. వీవ్యవహారమునైనను స్వయముగ జేసికొనుటవలనను, పైడాబువల నను ఎక్కువ లాభము వచ్చును. మోహానునకీ సంగతి తెలిసినప్పటి కిని సంకోచమువలన నేమియు చేయలేకుండెను. ఐనను ఆతనికి దినము నకు రెండు రూపాయలకు తక్కువ లేకుండ లాభము వచ్చుచుండెను. చేతికి కొంత సొమ్ము చేకూరగనే ఆతడు మరి రెండు సామానుపడవ లను కొని వ్యాపారము చేయుచుండెను. ఇప్పు డాతనికి స్వతంత్ర జీవ నము చేయుటకు శక్తి కలిగెను. అందువలన నదియొడ్డున చిన్న ఇల్లు కట్టుట కాత డుద్దేశించెను. ఈ ఆలోచనలవలన ఆతని మనస్సునకు సంతోషము కలుగుచుండెను. సాధారణముగ ఈ సంతోష కల్పనల తోనే ఆతనికి తెల్లవాగుచుండెను.

ఈ సమయమునందే పురపాలకసంఘమువారు వేశ్యల నిమిత్తము ఊరిబైట నిండ్లను కట్టుటకు నిశ్చయించిరి. ఈ యిండ్లను భగవంత రావె కంట్రాక్టునకు తీసికొనెను. నది కేవలగట్టున నిటికలు, సున్నము, పెంకులు, బట్టీలు పెట్టుట కాతనికి స్థలముదొరకలేదు. అందువలన ఆతడు నది ఆవలియొడ్డున బట్టీలు పెట్టించుచుండెను. ఆ సామాను లన్నిటిని ఈవలి యొడ్డునకు తెచ్చుటకు భగవంతరావున కొక పడవ కావలసివచ్చెను. దానిగురించి మాట్లాడుట కాత డొకనాడు పడవల రేవునకు వచ్చెను. అక్క డాతడు మోహానుని కలుసుకొని సంగతి చెప్పగా మోహానుడు తన పడవలను జూపెను. అత డందులో నొక పడవను మాట్లాడెను. పడవ రోజునకు రెండుసార్లు సామానులను తెచ్చుట కొప్పుకొనవలయెను. భగవంతరావు మోహానునకు బయానా

నిచ్చి వెళ్ళిపోయెను.

డబ్బాశ బిక్కిలి చెడ్డది. ఐనను మోహానునకు అన్యాయముగ డబ్బార్జించు నుద్దేశము లేదు. ఇప్పు డాతనికి తన కర్తవ్యమును పరిపాలింపవలెనను చింత తలపై పెద్ద బరువునకె నుండెను. ఆతడు దీని నుండి ముక్తిని పొందుటకే రాత్రింబవళ్ళు నిష్ఫలముగా నుండెను. అతడు దమ్మిడీ దగ్గరనుండి కూడ జాగ్రత్తగా కూడబెట్టసాగెను. ఇప్పు డేలాగునన్నైనను డబ్బు కూడబెట్టి పేరుగా నిల్పు కట్టింపవలెనను చింత గట్టిగా పట్టుకొనెను. మోహనుడు ఝూ రాత్రి యున్న దనగానె లేచి రేవుకు వెళ్ళి పడవవానిని లేపి తాను కూడ పడవతో ఆవలియొడ్డునకు వెళ్ళుచుండును. పడవ తిరిగి వచ్చునప్పు డాతడు పడవవానితో నుదారముగా మాట్లాడుచు వాని కుత్సాహము పుట్టించుచుండును. నుధ్యాహ్న మోహనుడు కూడ స్వయముగా తెడ్డువేయుచుండును. తాను తెడ్డు వేయునప్పుడు పడవ వేగముగా పోవుట జూచి అత డుత్సాహముతో నింత వేగముగా తెడ్డువేయుచుండును. సరంగులు కళాసులు మొదట వారిలో వారు నవ్వుకొనిరి గాని తర్వాత ఆతని బలమును జూచి ఆశ్చర్యపడుచు "మనమను కొన్నకంటె సీతడు చాల బలవంతుడు. అవసరమువచ్చిన సీబాబొక్కడే పడవను నడపగలడు. కనుక మన ఆటలు ఈయనటుండుసాగవు." అని వారిలో వారనుకొనుచు ఆతనివద్ద మరింత భయభక్తులుగా మెలగసాగిరి. ఈ విధముగ పట్టుదలతో ఎంత రాత్రియైనను రోజుకు రెండుసార్లు పడవను నడిపించుచుండెను. ఇట్లు రెండుమాసములు గడచెను. మోహానునకు దీనివలన చాలలాభమువచ్చెను. పని ఎక్కువగా నుండుటవలన ఆతడు మరి యిద్దరు నౌకరులను కుదుర్చుకొనెను.

మోహను డిప్పుడు పడవవారి కందరకు నాయకుడుగా నుండెను. సదియొడ్డున ఆతడు కట్టించుచున్న ఇల్లు కూడ తయారయ్యెను. ఆ

యింటియందు ఒక కచ్చేరీ చావడి వడకగది, సామానుకొట్లు మాట గది గలవు. ఆ యిల్లు చాల సదుపాయముగా నుండెను. వడకగది యందు రెండు పెద్ద మంచములు, ఒక బల్ల, రెండు కుర్చీలు, కచ్చేరీ చావడియందు పెద్దబల్ల, ఐదు కుర్చీలు, పెద్ద దీపము ఉండెను. ఇంటి ముందు చిన్నతోట దాని మధ్య నొక అరుగు వేయబడి యుండెను. ఇంటిమీదకు నుంచినుంది పూలతీగలను సొగసుగా ప్రాకింపుల వలన సిల్లు పొదరింటివలె జూచుటకు మిక్కిలి అందముగా నుండెను. కళాసులు, సరంగులు పని లేనప్పుడు తోటలోని అరుగుపై కూర్చుండి కబుర్లు చెప్పుకొనుచుందురు. మోహనుడు పైయుద్యోగస్థులతో ఉత్తరప్రత్యుత్తరములను జరిపి, సరంగులను, కళాసులను పెట్టిపనిచేయుండి తప్పించి వారి కెంతో ఉపకారము జేసెను. అందువలన వారందరు మోహనుని యెడల భయభక్తులు కలిగి మెలగుచుండిరి. ఇప్పుడాతనిచేద్ద నిలువ ఉండుటవలన, మోహనుడు వీరి కపసరమువచ్చినప్పుడు వడ్డీ పుచ్చుకొనకుండనే బాకు లిచ్చుకొనును. ఎక్కువగా పని యుండుటవలన తన వాడుక నిమిత్త మొక సైకిలును, కులాసాగా నున్నప్పుడు వాయించుకొనుట కొక హార్మోనియమ్మును అతడు కొనెను. ఇంకను తన వ్యాపారమును వృద్ధిచేసికొనుచు అతడు మరి రెండు, మూడు షికారుపడవలను కొనుటకు నిశ్చయించెను. ఒక్కతీరుణమైనను తన దృష్టినుండి తొలగనట్టి సుశీలాదేవికొరకే మోహనుడీ ప్రయత్నములన్నియు జేయుచుండెను. స్వతంత్రముగ సంసారమును నడపగల శక్తి ఇప్పుడాతనికి కలిగెను. కాని పినతండ్రి అనుమతి లేనిదే సుశీలను దీసికొనివచ్చుట కాతనికి సాహసము లేకుండెను. భోజనసమయమునం దీసంగతి నాతనితో జెప్పవలెనని మోహనుడనుకొనుచుండును. కాని తీరా సమయమున కాతనికి సాహసము కలుగకుండెను.

మోహనుడు తాను జేయుచున్న వ్యవహారము గురించి పిన

తండ్రితో జెప్పకపోయినను, కంట్రాక్టరు భగవంతరావువలన సీసంగతి యంతయు కృష్ణశర్మకు దెలసెను. మోహనుని స్వయంకృషిని విని సంతోషించి మరి రెండు పడవలను కొని ఇచ్చి వ్యాపారమును వృద్ధి చేయవలెనని తలచెను. కాని మోహను డీ సంగతిని తనతో స్వయముగ జెప్పనందున తాను జోక్యము కలిగించుకొనుట అనుచితమని తలచి ఊరకుండెను. ఆతడు మోహనుని మొదటినుండియు ప్రేమతోనే జూచుచుండెను. కాని ఇప్పుడు గౌరవముతో కూడ జూచుచుండెను. సుభద్రమ్మ ఆతనిని తన కొమారునివలెనే ప్రేమించుచుండెను.

ఒకనాటిరాత్రి మోహనుడు తన ఇంటివసారాలో కూర్చుని నదివైపు ధ్యానముతో జూచుచుండెను. ఆ రోజున నెందుచేతనో ఆతని పడవలింకను తిరిగి రాలేదు. ఆతనిముందు బల్లపై దీపము వెలుగుచుండెను. ఆతనిచేతియం దొక పత్రిక యుండెను. గాని ధ్యానము దానియందు లేదు. పడవలింకను రాకపోవుటవలన నేమి యుపద్రవము వచ్చినదో యని ఆతడు భయపడుచుండెను. మోహనుడు పత్రికను బల్లపై పడవైచి, ఏమియు తోచక నదియొడ్డునకు బయలు దేరెను. ఇసుకపై వెన్నెల పిండి యారబోసినట్లతి రమణీయముగ నుండెను. చంద్రకిరణములు నదీతరంగములపై బడి సొగసుగా ప్రకాశించుచుండెను. మోహనుని ఇంటి ఎదుటి అరుగుపై చాలమంది సరంగులు, కళాసులు కూర్చొని వారిలో వారు మాట్లాడుకొనుచుండిరి. ఇంతలో నిద్దరు స్త్రీలు పట్నమువైపునుండివచ్చి, ఆ పడవవారితో, "మేము నది దాటవలసియున్నది. ఎవరైనను మమ్మి నది దాటించెదరా?" యని అడిగిరి.

మోహను డా ప్రశ్నించుచున్న ఆమె కంఠస్వరమును పోల్చెను. ఆమె కమలయే. ఆ స్వరమును వినగనే మోహనుని గుండెలు దడ

దడ కొట్టుకొని కండ్లు చీకట్లు క్రమ్మెను. ఆత డొక్కడాటున అరుగు వద్దకు వచ్చి "కమలమ్మా! నీవిక్కడ కెట్లు వచ్చితివి?" అని తడ బడుచు ప్రశ్నించెను. కమల పోలికపట్టనట్లతనివైపు నిదానముతో జూచెను. ఆమె ప్రక్కనున్న స్త్రీ తలవంచుకొని దీపము వెలుగునుండి తప్పించుకొనుట కామె వెనుకకు పోయెను. కమల ఆశ్చర్యముతో, "ఎవరు? మోహనరావుగారా?" యని పలుకరించెను.

ఇంతలో అక్కడ నున్న కళాసులు, సరంగులు వారి చుట్టును జేరిరి.

మోహ—(వారితో)మీరందరు మీమీఇండ్లకు వెళ్లిపొండి. వీరు మాబంధువులె. ఈరో జిక్కడనే యుండెదరు. (కమలతో) కమలమ్మా! మీకుకుశలమేనా? సంగతు లేమిటి?

కమ—అంతా కుశలమే. నుదుటవ్రాసిన వ్రాత అనుభవించుచున్నాము. ఈరోజున మీరు పత్రిక చూడలేదు కాబోలు? ప్రభాకరరావు ఏమివ్రాసెనో కాని ఆశ్రమమునందు చాల గడబిడపుట్టినది. మే మిద్దరము అక్కడ ఒక్కరొజునున్నను ఆశ్రమముపూర్తిగ ఖాళీ ఐపోవును. కనుక అక్కడనుండి వచ్చివేయుటయే యుత్తమమునితలచి వచ్చితిమి. మీవిషయమై కొంచము శ్రమ తీసికొని, నది దాటుట కొక పడవ కుదిర్చిపెట్టండి. అక్కడనుండి బండి చేసికొని స్టేషనకు వెళ్ళి రైలు మీద రామవరము వెళ్లిపోయెదము.

మోహ—ఇప్పుడు మీరు మీఇంటికే వచ్చినారు. రామవరము వెళ్ళుటెందుకు? పాపము మీకు చాలకష్టము కలిగినది. కాని ఇప్పుడు మీరిక్కడకు రావడమువలన నాకతి సంతోషముగా నున్నది. ఎన్నిదినములనుండియో మీవద్దకు స్వయముగా రావలెనని తలచుచుంటిని కాని పని తొందరనుండి తీరుబడియైనది కాదు. నేను ఆరు నెలలనుండి పడవల వ్యాపారమును జేయుచున్నాను. ఇది మీ ఇల్లే. లోపలకు రండి.

కమల లోపలకు వెళ్ళెను గాని సుశీల ఆచీకటిలోనే నిలువబడి లోలోనవేదుచుండెను. మోహనుని నోటినుండి వచ్చిన ఆమాటలు విని నప్పటినుండియు ఆమె లోలోనదుఃఖించుచునే కాలము గడుపు చుండెను. ఆమె మాటి మాటికి తాను మోహనుని ఎడల జూపిన నిర్లక్ష్యమునకు పశ్చాత్తాపమును పొందుచుండెను.”నే నప్పుడాయన కాళ్లపైబడిన ఆయనకు నాపై తప్పక దయకలిగియుండును.” అని ఎల్లప్పుడును విచారించుచుండెను. మోహనుని యాకార మెల్లప్పు డామె కండ్లకు కట్టినట్లుండి. ఆతనిమాట లెల్లప్పుడును చెవులలో ప్రతి ధ్వనించుచుండెను. ఆమాటలు కొంచము కఠినముగానున్నను, సుశీల కవి ప్రేమ దయతో కూడుకొన్నట్లు తోచుచుండెను. ఇది యంతయు నాదినముల మహత్యమునియు, దీనిలో మోహనుని తప్పేమియు లేదనియుఁ ఆమె తన మనస్సును సమాధానపరచుకొను చుండెను.”నిజముగా పాపమాయన ఏమిచేయగలరు? తల్లిదండ్రుల యాజ్ఞను పాలించుట ఆయన కర్తవ్యముకాదా? ఆయనను ధర్మ మార్గమునుండి కేవ్పింప జూచుట న్యాయముకాదు.....ఔను నేను నా స్వామిని నిర్లక్ష్యభావముతో జూచితిని. ఆరాధ్యదైవమును అగౌ రన పరచితిని. స్వార్థపరురాలైన ఆతని నవమానించితిని.” అని ఎల్లప్పుడును తనలో తలపోసుకొనుచుండెడిది. దినములు గడచిన కొలదియు ఆమె విచారము వృద్ధియగుచుండెను. విచార, పశ్చా త్తాప, విరహములవలన ఆమె జేష్టమాసపునదివలె క్రమక్రమముగ క్షీణించిపోవుచుండెను.

కమల ఇంటిలోనికి వెళ్ళగానె మోహనుడు మెల్లగా సుశీలవద్దకు వచ్చి కంపితస్వరముతో, “సుశీలా!” యని పిలచెను. కాని మరి అతని నోటినుండి మాటరాలేదు.

సుశీల ప్రేమచే వివశురాలయ్యెను. ఆమె తనలో, “ఈ జీవిత

మేమిశాశ్వతము ? నేను ఎంత కాలము జీవించెదనో లేక చనిపోయెదనో ? ఈయన దర్శనము తిరిగి నాకు లభించునో లభించదో ? కాబట్టి ఈయన కాళ్ళపైబడి నా మనసుదీర నేడ్చెదను. ఇంతకన్న మంచిసమయము మరి నాకు దొరకుట కష్టము. నాథా ! మీరొక్క సారి నన్ను మీ చేతులతో లేవనెత్తి నా కన్నీటిని తుడిచిన నా జన్మము సఫలతనొందును. నేను జీవించియున్నంతకాలమును ఈ సౌభాగ్యమును తలచుకొని సంతోషపడుచుందును. ఇదివరకు మీ దర్శనమునకును ఆశనే వదలుకొంటిని. కాని దైవ మీ యవకాశ మును కలిగించినప్పుడు నాకోర్కె నెందుకు తీర్చుకొనకూడదు ?" అని విచారించుచుండెను.

ఇట్లు విచారించి సుశీల ఏర్చుచు మోహనుని కాళ్ళపైబడెను. కాని వాడిపోయిన పువ్వు గాలితాకుడు తగలగానె రాలిపోయెను. మోహను డామెను లేవనెత్తి, ఓదార్చుటకు వంగెను సుశీల స్థితి జూడగనె అతని గుండె బ్రద్దలయ్యెను. ఇదివర కాతడు నదియొడ్డున జూచినప్పు డామె, సౌందర్యమైన నూతన పల్లవమువలె నుండెను కాని ఇప్పుడు వసంతఋతువుసందు వాడి రాలిపోయిన చిగురుటాకు వలెనుండెను.

మోహనుని హృదయము, నదియందు ప్రకాశించుచున్న చంద్ర కిరణములవలె చలించిపోవుచుండెను. ఆతడు వణకుచున్న చేతులతో ఆచైతన్యవిహీనమైన శరీరమును లేవనెత్తెను. ఇట్టి నిరాశాస్థితియం దాతడు దేవునినే నమ్ముకొనియుండెను. ఆతడు కన్నీటితో "ప్రభూ! నేను చాల పాపమును జేసితిని. అతికోమలమైన హృదయమును మిక్కిలి నిర్దయతో తిరస్కరించితిని. కాని ఆ పాపముయొక్క ప్రాయశ్చిత్త మిప్పు డనుభవించుట అశక్యముగా నున్నది. ఈ యమూల్యరత్నము నింత త్వరలో నానుండి తీసికొనిపోకు. ఓ దయా

మయా! నాపై నీ కరుణాకటాక్షములను ప్రసరింపజేయుము.” అని దైవమును ప్రార్థించుకొనెను.

మోహనుడు అచేతనురాలైన సుశీలను మెల్లగా భుజముపైని వేసి కొని తీసుకొని వెళ్ళి. మంచముపై పరుండబెట్టి, శోకాతురతస్వర ముతో, “కమలమ్మా! ఈమె స్థితి ఎట్లు పరిణమించినదో చూడుము. నే నిప్పుడే వెళ్లి డాక్టరును తీసికొని వచ్చెదను.

కమల ఆతృతతో తన చెల్లెలివద్దకుపోయి జూచెను. సుశీల ముఖ మంతయు చెమటతోనిండి కండ్లు మూతలుపడి యుండెను. నాడి యెక్కడను కనబడుటలేదు. ముఖము వివర్ణమై యుండెను. కమల వెంటనే విసనికట్టను దీసికొనివచ్చి, మెల్లగా విసరసాగెను. సుశీల స్థితిని జూచి, కమల కామెపై నెలలతరుబడినియున్న మనసులోని కోపము దయగా మారెను. ఆమె మోహనునివైపు తిరస్కారముగా జూచుచు, “ఇదియంతయు నీ యత్యాచారముయొక్క ఫలమే. నీ చేతులారా జేసిన పాపఫల మనుభవింపకతప్పునా! నీ కఠినమైన చేతులే కోమలపుష్పమును నలిపివేసినవి. నీ మోటుకాళ్ళతో నీ లేత మొక్కను మట్టిచేసినవి. నదియొడ్డున నీ వాడిన దయావిహీనమైన మాటలను వినినప్పటినుండియు నీమె కంటినీరు కట్టలేదు. ముఖము మీద నవ్వు మాయమయ్యెను. ఎంతయో బ్రతిమాలి చీవాట్లుపెట్టిన బలవంతముగా రెండుమూడు పిడచల యన్నమును మాత్రము తిని లేచిపోవుచుండెడిది. ఎవరి ప్రేమను జూచి నీవు మోహితుడవగు చుండెడినాడవో, ఎవరి పాదముల నొత్తుటకైనను సంకోచపడ కుంటివో, అట్టి కమలయొక్క చెల్లెలనియే నీవామె నిట్లవమానపరచి తివి! కమలను ప్రేమించునపుడు మాత్రము నీవు నీతల్లిదండ్రుల యాజ్ఞను పాలించు పుత్రుడవు కావా? అప్పుడు మాత్రము నీవు శ్రేష్ఠమైన బ్రాహ్మణ కులస్థుడవు కావా? అప్పుడు మాత్రము నీ

చెడు ప్రవర్తనవలన నీ వంశముయొక్క పేరుప్రతిష్టలు పోలేదా ? ఇప్పుడు నీ వాకాశమునందలి దేవతవై తిరుగుచున్నావు కాబోలు ? చీకటియందు ఎంగిలిమెతుకులకైనను సిద్ధము. కాని వెలుగులో ఆహ్వానించినను తిరస్కారము !! ఇది కేవలము ధూర్తత్వము, దగా బాజీతనము కాక మరి ఏమి ? ఈ దుఃఖతురాలిమెడల నీవుచేసిన పాపమునకు తగిన ప్రాయశ్చిత్తము దేవుడే చేయును. ఈమె అనుభవించవలసినదేదో యిదివరకే అనుభవించినది. ఈరోజు జీవించినను రేపు చనిపోవచ్చును. కాని నీవు దీనిని తలచుకొని తలచుకొని బ్రతికియున్నంతకాల మేడ్చెదవు. మరియొక స్త్రీయైన ఈ పుటలు విన్న తర్వాత నీవైపు కన్నెత్తియైనను జూడదు. నిన్ను నిష్ఠురములాడియుండును. కాని అట్లు గాక నీమె ఎల్లప్పుడును నీపేరే జపించుచుండెడిది. ఐనదేదో ఐనది. విచారించిన లాభమేమి ? కొంచము చల్లని నీళ్ళను దీసికొనిరమ్ము. ”

మోహనుడు నేరస్థునివలె తలవంచుకొని ఈమాటల నన్నిటినివిను చుండెను. ఈనిష్ఠురములవలన ఆతని హృదయము కొంత చులకనబడెను. ఆతడీ తిరస్కారములకు తాను తగినవాడనే యని తలచుచుండెను.

మోహనుడు చన్నీటినిదెచ్చి కమలకిచ్చి తాను సుశీలకు మెల్లగా విసరసాగెను. కమల సుశీల ముఖముపై ఆసీటిని మెల్లగా చల్లు చుండెను. కాని ఆమె కండ్లువిప్పి ఇంకను జూడలేదు.

మోహన—డాక్టరును తీసుకొని రానా ?

కమల—తొందర పడవద్దు. చల్లదనము బాగా తగులగానే తెలివి వచ్చును. డాక్టరీ జబ్బునకు మందివ్వజాలడు.

మోహనరావున కిప్పుడు కొంత మనస్థిమితము కలిగెను.

మోహన—కమలమ్మా ! నేను కల్పించి చెప్పుచున్నానని నీవను కొన్నను సరే కాని నేను నిజమునే చెప్పుచున్నాను. వినుము. ఆ

దురదృష్టపు గడియలుండియు నామనస్సు నకు కొంచమైనను శాంతి లేకున్నది. మాటి మాటికిని నా మూర్ఖత్వమునుగూర్చి నేను పశ్చా త్తాప పడుచున్నాను. నా నేరమునకు స్వయముగ తీవ్రశిక్షణ వేసు కొనుటకై చాల సారులు ప్రయత్నించితిని గాని ఏ ధైర్యము చూచు కొని వేసుకొనుట యని నాకు సంకోచము కలుగుచుండెడిది. ఇంటి నుండి సహాయము వచ్చునను నాశ ఎన్నటికిని లేదుకదా? పైడాబే కాని నాయొద్ద పస వీమియులేదు. అందులను ఏలాగుననైనను కాలుగు డబ్బులు సంపాదించి చిన్న యిల్లు కట్టించవలెనను తాపత్రయములో యిన్నాళ్లు కొట్టుకొనుచుంటిని. మొదట నాఖరీకొరకు తిరిగి తిరిగి నాప్రాణము విసిగి పోయినది. కాని నాఖరీ ఎక్కడను దొరకలేదు.

చివరకు గోదావరీ దేవియే శరణమైనది. ఇప్పుడు. దేవుని దయవలన నాపడవలు నదిలో బాహాటముగా తిరుగుచున్నవి. ఇక నా కితరుల సహాయముతో పనిలేదు. నా స్వంతార్జన తోనే ఈ యిల్లును కట్టించితిని. మరికొంత డబ్బుజాగ్రత్త పెట్టినతర్వాత డూపులో పెద్దయిల్లు కట్టించ వలెనని అనుకొనుచున్నాను. ఇప్పు డీమెకు కొంచ మైనను చైతన్యము కలుగు చున్నట్లున్నదా? కమల కోపమిప్పుడు కొంత శాంతించినది. "ఆఁ. ఇక నేమియు భయములేదు. ఇది కేవ లము మూర్ఛ. పెదవులపై నలుపు క్రమక్రమముగ తగ్గిపోవుచున్నది రెప్పలు కదులు చున్నవి."

మోహానున కిప్పుడు తన ఆరాధి దేవత ప్రత్యక్ష మైనంత సంతో షము కలిగెను. "కమలమ్మా నీవు నాకు చేసిన ఉపకారమును నే నెన్నడును మరువను. మరి యొకవిధముగా జరిగిన నేనుకూడ ఆత్మ హత్య చేసికొన వలసినదే."

కమ—ఎందుకివ్వు డిటువంటి అమంగళపు మాటలు? దేవుని దయవలన నీమె ఔషధము లేకుండగనే స్వస్థత పొందగలదు. మీ

రిద్దరు చిరకాలము సౌఖ్యముగ జీవించెదరు గాక! నీవే యీమె కౌషధము. నీ ప్రేమయే యీమెకు జీవనమును. నీవు చేజిక్కిన తర్వాత నిక నీమెకు కావలసినదేమి? కాని నీవు కలలోకూడ ఈమె నాదరము కాని అవమానము గాని చేసిన తిరిగి ఈమెకీ దశయే సంభవించును. అప్పుడు నీవెంత పశ్చాత్తాప పడినను లాభముండదు.

ఇంతలో సుశీల ఒత్తిగిలి దాహ మడిగెను. కమల మెల్లగా మంచి నీళ్ల గ్లాసు నామెనోటి కందిచ్చెను. ఆమె రెండుమూడు గ్రుక్కల నీళ్లు త్రాగి తిరిగి మంచముపై పరుండి తన దృష్టిపై తనకే నమ్మకము లేనట్లిటునటు ఆశ్చర్యముగా జూడసాగెను. సుశీల తలుక్కుపడి కండ్లు మూసుకొనియే కమలతో "ఇది మన ఇల్లేనా" యని అడిగెను.

కమ—ఆఁ. ఆఁ. ఇది మనయిల్లే.

సుశీ—ఆయన యెక్కడనున్నారు? ఆయన నొక సారి పిలువు. నా స్వామీ! నా జీవనాధారమా! నాకు దర్శనమియ్యి. దహించి వేయుచున్న నా బాధను నివారింప జేయుము. (కమలతో) నేనాయనతో మాట్లాడవలెను. ఇంకను ఎందుకు రాలేదు? ఐతే ఉండు. నేనే వెళ్ళెదను. ఇప్పుడు నాకు ఆయనకు దెబ్బలాట ఉన్నది. లేదులేదు. నేనాయనతో దెబ్బలాడను. ఇంతమాత్రమే అడిగెదను. "నన్నువదలి ఎక్కడకును పోవద్దు. మీయిష్టము వచ్చినట్లు నన్ను చూడుము. కాని నన్ను మాత్రము విడిచిపెట్టకండి. ఇక నీవియోగమును భరింప లేను. మీరుననన్ను ప్రేమించుచున్నారని ఎరుగుదును. సరే, నేనుండుటకు మీరిష్టపడుట లేదుకాబోలు? కాని నేను మిమ్ములిడిచి పెట్టను. పోసీ, అదికాదు. నేనుకూడ మీవద్దనుండను. కాని మన యిద్దరకు వివాహము మాత్రమైనది. లేదులేదు. వివాహము కాలేదు. పోని మీతో నేను వాదించను. కాని మిమ్ములను మాత్రము విడువను. మీరు తిరిగి ముఖము త్రిప్పిన బాగుగ జరుగదు. నేనీ ప్రపంచములో

దుఃఖపడుటకు పుట్టలేదు. నామీద ఆగ్రహించకండి. నలుగురు నవ్వే దరు. పరిహసించెదరు. ఇంతేకదా! నాకొరకీ మాత్రము సహించండి. తల్లిదండ్రులు విడిచిపెట్టెదరని భయమా? ఏమి మాటలాడుచున్నారు! తల్లిదండ్రులు తమ బిడ్డల నెందుకు వదలిపెట్టెదరు? చూడుడు వానిని బ్రతిమాలి తీసుకొని వచ్చెదను. మా అత్తగారి కాళ్లు కడిగి నెత్తి మీద జల్లుకొనెదను. మామగారి కాళ్లు పట్టెదను. అప్పటికినీ వారికి నాపై దయరాదా!" ఇట్టిధోరణిలోనే సుశీలకుచిన్న నిద్ర పట్టెను.

కమ—(మోహానుసితో) ఈ మెకు నిద్రవచ్చుచున్నట్లున్నది. ఈ నిద్రలో స్వస్థత చెందగలదు చాలారాత్రి యైసది. నీవింటికి వెళ్లు. కృష్ణశర్మగారు నీ కొరకు గాభరా పడుచుందురు.

మోహా—మరి ఇప్పుడు వెళ్ళను.

కమ—వద్దు, వద్దు, వారు నీకొర కెదురు చూచుచుందురు. సుశీల కిప్పుడు కొంచము స్వస్థతగా నున్నది చూడు. ఎంత సౌఖ్యముగా నిద్రపోవుచున్నదో ఇన్ని దినముల కీదినమే ఈమె సౌఖ్యముగ నిద్రపోవుచుండుట జూచితిని.

కాని ఎంతచెప్పినను మోహాను డింటికివెళ్లుట కొప్పుకొనక వీధివరండాలో మంచము వేసికొని పరుండెను. ఆతని కెంతసేపటికిని నిద్రపట్టలేదు. అనేకములైన ఆలోచన లాతని మనస్సును కలతపెట్టుచుండెను.

౨౧

నారాయణదాసు న్యాయప్రియుడు. సాధుశీలుడు. న్యాయమెటులాగిన నాత డటుపోవుచుండును. ఈ విషయములో నాతనికి లేశమాత్రమైనను జంకుగాని అనుమానముకాని లేదు. కృష్ణశర్మ

న్యాయమార్గమునుండి తొలగెనని ఆతనికి తోచినతోడనె శర్మ సహవాసమును విడిచిపెట్టుటయేగాక ఆతనితో మాట్లాడుట కూడ మానివేసెను. కాని ప్రభాకరరావు ఆశ్రమనిమయమై విమర్శించుచు కమలాబాయియొక్క చరిత్రను వెల్లడించినతోడనె నారాయణదాసునకు చాల కోపమువచ్చెను. అప్పుడు పట్టణం దాతని కొక్క స్నేహితుడైనను లేకపోయెను. ఇట్టి సంస్థలకు అధ్యక్షత వహించి ఇతరుల సహాయసానుభూతులపై ఆధారపడవలసిన తనవంటివాడు ఒక పక్షమవలంబించుటనుచితమని ఇప్పు డాతనికి యనుభవమయ్యెను. ఆశ్రమమున కెడమగానుండి అందరతో మంచిగానున్న వేదానికి లాభము చేసినవాడు నగుదునని యాతము తలంచుచుండెను. అది సంధ్యాసమయము. నారాయణదాసు కూర్చుని, "ప్రభాకరరావుయొక్క ఆక్షేపణల కేమని జవాబు వ్రాయుదును? సంగతులు కొంతవరకు నిజమే. కమలాబాయి నిజముగ వేశ్యయే నేనీ సంగతి నెరిగియుండియే ఆమె నాశ్రమమునం దుంచితిని. కార్యాలోచన సభయం దీ విషయమై ఎవ్వరితోనూ సలహా చేయలేదు. నేను నిజముగ నీ యాశ్రమమును స్వంత సంస్థవలె తలచితిని. నా యుద్దేశము నిజముగ మంచిదైనను, దానిని రహస్యముగ నుంచుట చాల పొరబాటు" అని ఆలోచించుకొనుచుండెను.

ఏమి చేయుటకును నారాయణదాసు నిశ్చయించుకొనలేదు. ఇంతలో ఆశ్రమసంరక్షకురాలు వచ్చి, "అయ్యా! ఆనందబాయి, రాజాబాయి, గౌరి ఇంటికి వెళ్ళిపోవుటకు సిద్ధపడుచున్నారు. నేనెంత బోధపరచినను ఉండుటకు వా రొప్పుకొనుటలేదు."

నారాయణదాసు చికాకుతో "వెళ్ళిపోనిమ్ము. మరేమి ఫర్వాలేదు. వారికొరకు కమలను, సుశీలను ఇక్కడినుండి పంపివేయుజాలను."

నారాయణదాసు తనలో, "ఈ స్త్రీ లేమనుకొనుచున్నారో? కమలవారితో నుండుటకు కూడ వనికిరాకపోయినదికాబోలు? ఈమె యుండుటవలన ఆశ్రమమునకు చెడ్డపేరు వచ్చుననియు దాని వలన తమకు కూడ కళంకము వచ్చుననియు వీరనుచున్నారు. ఔను. రావచ్చు. వెళ్ళనీ. నేను వీరి నడ్డుపెట్టను."

అప్పుడే తపాలాబంటోర్తు ఉత్తరములను దెచ్చి, దాసున కైదుత్తరముల నిచ్చెను. ఒక యుత్తరమునందు "నేను నాకొమార్తె విద్యావతిని యాశ్రమమునం దుంచుట యనుచితమని తలచితిని. కనుక యామెను తీసికొనిపోవుటకు త్వరలోనే వచ్చుచున్నాను." మరియొక యుత్తరమునందు "ఆశ్రమమునుండి వేశ్యలను తగిలివేయుని యెడల నేను చందా నిచ్చుట మానివేసెదను." అని భయపెట్టుచూ యుండెను. మూడవ యుత్తరమునందు కూడ నిట్లే యుండెను. తక్కిన రెండుత్తరములను ఆతడు విప్పనేలేదు. ఈర్ష్యాపిపీలాతని భీతుని జేయులేదు సరికదా యాతని మనస్సును మరింత దృఢపరచెను. అతడు మనస్సులో, "నేను వీరి బెదిరింపులకు వణికిపోవుదునని అనుకొనుచున్నారుకాబోలు? నారాయణదాసెవ్వరిని లక్ష్యపెట్టడని వీరెరుగరు. ఆశ్రమము నశించిననుసరే కాని నేను కమలా సుశీలల నిక్కడనుండి పంపివేయుజాలను."

నారాయణదాసుయొక్క అహంకారము ఆతని సద్విచారములను జయించెను. సదుత్సాహము. దురుత్సాహము వీటి రెంటియొక్క ఆవేగమొక్కటియే. భేదము కేవలము వానియొక్క ఆచరణయందు కనబడును.

తనమూలముననే ఈ గడబిడయంతయు జరుగుచున్నదని కమల తెలిసికొని మనస్సులో దుఃఖపడుచు, "అయ్యో! నేనిక్కడ కెందుకు

వచ్చితిని ? నేనింత శ్రద్ధతో నీవితంతువులందరకు సేవజేసినందులకు తగిన ఫలమిదియా ? మే మిక్కడనుండి వెళ్ళిపోవుటకు దానుగా రొప్పుకొనరు. కనుక ఇక్కడనుండి మేము రహస్యముగ వెళ్ళిపో వలెను. అప్పుడే ముగ్గురు వితంతువులు వెళ్ళిపోయిరి. ఇంకిద్దరు ముగ్గురు వెళ్లిపోవుటకు సిద్ధముగా నున్నారు. చాలమం దీవిషయమై తమవారి కుత్తరములు వ్రాసిరి. ఇంతకన్న మరియొక దిక్కు లేని స్త్రీలు మాత్రమే యేమియు అనలేక నోరు మూసుకొని ఊర కున్నారు. వారు కూడ మమ్ములను చూడగానె మూతులుముడుచు కొనుచున్నారు. ఇక నీ యనమానమును నేను భరింపలేను."

కమల యీ విషయమై సుశీల సలహా నడిగెను. సుశీల కిప్పు డెటు చెప్పుటకును తోచుటలేదు. శర్మ యాజ్ఞ లేనిదే అక్కడనుండి వెళ్ళిపోవుట యనుచితమని ఆమె యుద్దేశము. ఆమె యింకను ఆశను విడువలేదు. ఆమె తనలో, "నేను సంపూర్ణముగ కృష్ణశర్మగారి యాధీనమునం దుండుటవలన నిప్పుడు స్వేచ్ఛగా నా యిష్టమువచ్చి నట్లు వెళ్ళిపోవుట కేమి యధికార మున్నది ?" అని ఆమె తలచు చుండెను. సుశీల మాట్లాడకుండుట జూచి కమల "నీ కిష్టమున్న నీ వుండు కాని నే నెంత మాత్ర మిక్కడ నుండజాలను." అని ఖచిత ముగ నామెతో జెప్పివేసెను. సుశీలకు కూడ తా నక్కడుండుట అనుచితముగానే తోచెను. కనుక చివరకు తన యక్కతో తాను కూడ వెళ్ళిపోవుటకు నిశ్చయించి యామెతో "నేను కూడ నీతో వచ్చెద" నని చెప్పెను.

కమ—ఒకవేళ శర్మగారికి కోపమువచ్చిన ?

సుశీ—ఆయనకీ సమాచారమంతయు ఉత్తరము ద్వారా తెలియజేసెదను.

కమ—మోహనునకు కోపమువచ్చిన ?

సుశీ—ఆయన ఎట్లు దండించినను సహించెదను.

కమ—బాగా ఆలోచించుకో. తరువాత పశ్చాత్తాపపడిన లాభ ముండదు.

సుశీ—న్యాయముచేత నే నిక్కడ నుండవలసినదే. కాని నీవు లేనియెడల నే నిక్కడ నొక్క నిముషమైన నుండజాలను. ఐతే మన మిప్పు డెక్కడకు పోవుటయో మొదట ఆలోచించు.

కమ—నిన్ను రామవరములో దిగవెట్టెదను.

సుశీ—మరి నీవో ?

కమ—నాకు దేవుడే దిక్కు. తీర్థయాత్రకు పోయెదను.

ఇద్ద రక్కచెల్లెండు చాలసేపు మాట్లాడుకొనిరి. తరువాత నిద్దరు కొంతసే పేడ్చిరి. రాత్రి ఎనిమిది గంటలు కొట్టినతోడనె నారాయ ణదా సింటికి వెళ్లిపోయెను. కమలా, సుశీల లిద్దరు కలసి ఎవ్వరు చూడకుండ నా రాత్రియే ఆశ్రమమును విడిచి వెళ్లిపోయిరి. రాత్రి యీ సంగతి ఆశ్రమవాసుల కెవ్వరికినీ తెలియలేదు. తెల్లవారగానె చౌకీదారువచ్చి నారాయణదాసున కీ సంగతిని జెప్పెను. ఆతడు తత్తరపడుచు ఆశ్రమమునకు వచ్చి కమలగదిలోనికివెళ్లి జూచెను. ఎక్కడి వస్తువు లక్కడనే పడియుండెను. కాని ఇద్ద రక్కచెల్లెండ్రు మాత్రము కనబడలేదు. కృష్ణశర్మగారి కెట్లు ముఖము జూపుదునా యని ఆతడు చాల విచారించెను. ఆత డీ సంగతిని ఆలోచించుచున్న కొలదియు కమలపై కోపము వచ్చుచుండెను. ఇదియంతయు కనుల పనియే యనియు, ఆమెయే సుశీలను మోసపుచ్చి తీసికొనిపోయి యుండుననియు, అని అత డనుకొనుచుండగా ఆతనికి కమల మంచ ముపై నొక యుత్తరము కనబడెను. ఆతృతతో దాను దానినిదీసి చదువసాగెను. ఆ యుత్తరము కమల ఆశ్రమమునుండి వెళ్లిపోవు చున్నప్పుడు వ్రాసినదే. దానిని చదివినతరువాత నాతనికి కొంత

ధైర్యము కలిగెను. కాని కమల వెళ్ళిపోవుటవలన ప్రతిపక్షులు తనను పిరికివానిగ తలచి పరిహసించెదరని యాతడు విచారించెను. చివర కాతడు వారి గదికి కాళ్ళుచాచి తిన్నగా శర్మగా రింటికి బయలు దేరెను. శర్మ ఈ సంగతినివిని, స్తంభించిపోయి వారిప్పు డొక్కడకు వెళ్ళియుండుగని ప్రశ్నించెను.

నారా—రామవరము వెళ్లియుందురు.

కృష్ణ—ఔను. అక్కడికే వెళ్లియుండవచ్చును.

నారా—దూరప్రయాణమైనప్పటికి కమలజాగ్రత్తగా నేవెళ్ళగలదు.

కృష్ణ—ఔను. ఆమెకా మాత్రము తెలివితేటలున్నవి.

నారా—వారొకవేళ రామవరము వెళ్ళకపోయిన ?

కృష్ణ—ఎవరు చెప్పగలరు ? ఎందులోనైననుపడి చచ్చిన చావ వచ్చును.

నారా—రామనాథముగారికి తంతినిచ్చి కనుక్కొనకూడదా ?

కృష్ణ—ఏముఖము పెట్టుకొని తంతి నిచ్చెదను ? ఆమె నామాత్రము రక్షించలేకపోయాను. ఇప్పు డామె విషయమై ఆయనకు వ్రాయుటకు నాకు చాల సిగ్గుగా నున్నది. నేను మిమ్మలిని నమ్మితిని. మీరింత యజాగ్రత్తగా నుండెదరని తెలిసిన, ఆమెను నాయింటియంచే యుంచుకొనియుందును.

నారా—నేనే వారిని పంపివేసినానని మీరనుకొంటూయున్నారు కాబోలు ?

శర్మ—అదికాదు. మీరు వారికి ధైర్యము చెప్పుచూ ఉండిన యెడల వారెన్నటికిని వెళ్లిపోయియుండరు. తీరా చేతిలోనుండి జారిపోయినతర్వాత నిప్పుడు నాతో చెప్పిన నేమి లాభము ?

నారా—తప్పంతా నామీదే తోర్పిసివేయడానికి మీరు చూస్తూయున్నట్లున్నది.

కృష్ణ—ఇం కెవ్వరిమీద పెట్టుతాను. ఆశ్రమసంరక్షకులు మీరే కదా?

నారా—సుశీల ఆశ్రమమునకు వచ్చి ఆరు నెలలకు పైగాయైనది. మీరు దారితప్పియైనను ఒకసారి ఆశ్రమమునకువచ్చి యామె సంగతిని కనుగొన్నారా? మీరెప్పుడప్పుడాశ్రమమునకువచ్చి యామె క్షేమసమాచారములు కనుగొనుచుండిన యామెకు ధైర్యముగా యుండి యుండును. మీరు మాటవరుసకైనను ఆమె క్షేమము కనుగొనలియెడల ఆమె యేధైర్యము మూటకొని అక్కడనుండగలదు? ఇందులో నాతప్పు కూడ ఉన్నదని నేను ఒప్పుకొంటాను. కాని మీ తప్పు లేదని మీరు ధైర్యముగా చెప్పండి.

కృష్ణశర్మ కిప్పట్లో నారాయణదాసుపై చాల కోపముగానుండెను. మొదట ఆతడు దాసు అనురోధమువలననే వేశ్యాసంస్కరణ విషయమున కలుగజేసికొనెను. కాని చివరకు పనిచేయవలసిన అవసరమువచ్చినప్పుడు దాసు మెల్లగా తప్పించుకొనుటయే గాక కృష్ణశర్మ వేశ్యల యెడల సహానుభూతి కలిగియుండుట జూచి ఆయనమీద అనుమానము కూడ పడసాగెను. వారిద్దరు కూడ తమమనస్సులలోని మంటలను పైకి జెప్పక యొకరిపై నొకరు దోషారోపణ జేసికొనసాగిరి. శర్మ ఈవిషయము నూతగొని దాసును బాగుగ నెత్తిపొడవవలెనని జూచెను గాని ఆయన ప్రతి వచనములను విని నోరుమూసుకొనవలసి వచ్చెను.

కృష్ణ—ఔను. ఆ తప్పు నాదే.

నారా—మీమీద తప్పు త్రోసివేయడం నా యుద్దేశముకాదు. తప్పంతా నాదే, మీరామె నెప్పుడు నాకు వప్పజెప్పిరో అప్పుడు మీరు నిశ్చింతగా నుండుట స్వభావము.

కృష్ణ—లేదు, లేదు నిజముగ నిదియంతయు నా పిరికితనము యొక్క ఫలము. మీరామెను బలవంతముగ నాపజాలరు.

కృష్ణశర్మ తన తప్పు నొప్పుకొని వాదమునంతను తారుమారు జేసెను. మనములొంగి ఇతరులను లొంగదీయగలము కాని కోపపడి లొంగదీయలేము.

నారా—బావుశ్రీ మోహనరావుగారి కీ విషయమై తెలిసి యుండవచ్చును. ఒక్క సారి ఆయనను పిలవండి.

కృష్ణ—వాడు రాత్రి ఇంటికి రాలేదు. వాడిప్పుడు పడవల వ్యాపారమును జేయుచున్నాడు. నదియొడ్డున చిన్న ఇల్లును కూడ కట్టించినాడు. రాత్రి అక్కడనే యుండిపోయి యుండవచ్చును.

నారా—బావుశ్రీ కమలా సుశీల లక్కడికే చేరుకొనియుంటారు. నన్నా సంగతి కనుక్కోమన్నారా?

కృష్ణ—మీరు భ్రమపడుచున్నారు. కాని ఆలా జరిగియుండదు. ఆత డంత ఉదారస్వభావము కలవాడు కాడు. వీరి నీడను జూచిన వరుగెత్తునంతటి భయ మాతనికి.

ఇంతలో మోహనరావా గదిలోనికి వచ్చెను.

కృష్ణ—రాత్రి ఎక్కడకు వెళ్ళినావు? తెల్లవార్లు నీ కొరకు బెంగ పెట్టుకొన్నాము.

మోహ—(తలవంచుకొని నేలవైపు జూచుచు) మీ రాలాగు బెంగపెట్టుకొంటారని నే ననుకొంటూనేయున్నాను. రాత్రి రావడానికి వీలులేనంత అవసరమైన పనివచ్చినది. వచ్చి చెప్పుటకై ననువీలుపడినది కాదు. నేనిదివరకల్లా మొఖమాటపడి మీతో ఒకసంగతి చెప్పలేదు. కొన్ని నెలలనుండి నేను పడవలనుకొని గోదావరిలో నడిపించుచున్నాను. గోదావరి దొడ్డున నొక చిన్న ఇల్లు కూడ కట్టించినాను. ఈవ్యవహారమును, దగ్గిరనుండి జరిపించిన మరియూ ఎక్కువ లాభముగానుండునని నాకు తోచుచున్నది. అందువలన ఆయింటియందుండుటకు నాకనుమతి నిమ్మని మిమ్ములను ప్రార్థించుచున్నాను.

కృష్ణ—ఈవిషయమై భగవంతరావు నాతో ఒకసారి చెప్పినాడు. కాని నీ వింతవరకు నాదగ్గరదాచడం ఏమీ బాగులేదు. మొదట నే నాతో చెప్పియుండిన నేను కూడ కొంత సహాయముచేసియుందును. పోనీ మంచిపనే చేశావు. నేను మరివకలాగ అనుకొనను. నీస్వయం కృషి జూచి నాకు చాలా సంతోషముగానున్నది. కాని నే నిక్కడ ఉంటూ యుండగా నీవు వేరేఉండడం నాకెంత మాత్రం ఇష్టంలేదు. మరికొన్ని పడవలు కూడా కొని వ్యాపారము జేసిన ఇంకను ఎక్కువ లాభముండదా?

మోహ—నేనూ ఆప్రయత్నములోనే యున్నాను. కాని ఇంకా కొన్ని పడవలు కొని వ్యవహారము పెంచిన, నదిఒడ్డున నుండిన గాని పని ఎంతమాత్రము జరుగదు.

కృష్ణ—నీవేమన్నా సరే కాని ఒక్కవూళ్ళోనే ఉండి మనమిద్దరం వేరు పడుట నాకేమి సమాధానంగా లేదు. కొంచం నష్టం వచ్చినా సరే కాని, నువ్వు వేరు పడడం మాత్రం నాకేమీ ఇష్టం లేదు.

మోహ—లేదు. బాబయ్యా, మీరు నాప్రార్థన అంగీకరింపక తప్పదు. నే నాలాగు వేరుండక తప్పనిసరి వచ్చినది.

కృష్ణ—ఏమిటా తప్పనిసరి? నీ సంకోచమేమిటో ఎందుకు స్పష్టముగా చెప్పకూడదు?

మోహ—నేను మీ యింటియందుండిన మీకు కూడ ననవసరపు చిక్కులు వచ్చును. ఇదివరకల్లా పిరికితనముచేతను, లోకనింద భయముచేతను, అజ్ఞానముచేతను నెరవేర్చలేని నాకర్తవ్యమును ఇప్పుడు నెరవేర్చుటకు స్థిరపరచుకొన్నాను. నేను మీ కుమారుడను. నాకే కష్టము వచ్చినను మీసీడనే చేరుదును. ఏ విషయమైనను, మీతో చెప్పక చేయను గాని వేరుగా మాత్ర ముండెదను. నాప్రార్థన అంగీకరించ వలసినది.

నారాయణదాసిక ఊరుకొనలేక మాట కడ్డమువచ్చి, "కమలా సుశీలలను నిన్న మీరు కలుసుకొన్నారా?" అని ప్రశ్నించెను.

మోహానుని ముఖము సిగ్గుచే ఎఱ్ఱబడెను. ఆతడు మెల్లగా "ఆఁ" అనెను.

కృష్ణశర్మ ఇప్పుడు గొప్ప ధర్మసంకటములో జిక్కుకొనెను. ఆతడు వారి విషయమై అడుగలేదు. మానలేదు. ఇంతవరకు సుశీల విషయములో తాను నిర్దోషిననియే ఆతడనుకొనుచుండెను. ఈ అన్యాయమంతయు తన అన్నయే జేసిననియు, మోహాను డాతడెట్లు చెప్పిన నట్లే చేయుననియు ఆతడనుకొనుచుండెను. కాని ఇప్పుడు మోహానుని తెగువజూచి ఆతని కెడముగా నుండుటయే యుత్తమమని తలచెను. లోకు లేమనుకొందురో యను భయమాతని కెన్నటికిని లేదు. కాని తనయాసరా జూచుకొనియే మోహాను డీవసిని చేసెనని తనయన్న కెక్కడ కోపమువచ్చునో యనియే ఆతని భయము. ఒకసారి గోపాల శాస్త్రికి కోపమువచ్చిన మరిత్తమించుటయన్నమాట వట్టిది.

కృష్ణశర్మ చాలసేపీ సందిగ్ధములో మునిగిపోయెను. చివరకాతడు మోహానునితో "మోహనా! ఈసమస్య చాలకఠినమైనది. నాపూచీపైని నేనేమియు చేయజాలను. అన్నయ్య ఆజ్ఞలేనిదే నే నాననిగాని, కాదని కాని కూడ సలహా చెప్పజాలను. నాయుద్దేశములను నీవెరుగుదువుకదా? నీవు నీకర్తవ్యమును నెరవేర్చుటకు స్థిరపరచుకొన్నందుకు నాకు చాల సంతోషముగా నున్నది. దేవుడు నీకు మంచిజ్ఞానమును ప్రసాదించినాడు. కాని అన్నిటికంటె అన్నయ్యగారి ఆజ్ఞయే నాకెక్కువ. ఐనను వారిద్దరక్కచెల్లెండ్రు ప్రత్యేకముగా నుండుట కేర్పాటు చేసిన అంత బాధయుండదు. అట్లుచేసిన వారికి కూడ నంత కష్టముండదు. ఇంతకంటె మరి నాకు సామర్థ్యములేదు. తరువాత అన్నయ్య కేలాగిష్టమైతే ఆలాగు చేద్దాం"

మోహా—నాన్నగా రేమంటారో మీ రెరుగరా ఏమిటి?

కృష్ణ—ఔను. తెలియకేమి?

మోహా—ఐతే ఆయన సలహా తీసుకొనుటవలన లాభమేమిటి? తల్లితండ్రుల యాజ్ఞయైన నా ప్రాణమునైనను ఇచ్చుటకు సిద్ధముగా నున్నాను. కాని వారిని సంతోషపెట్టుట కొక నిరపరాధురాలి యొక్క గొంతుకమాత్రము కోయజాలను.

కృష్ణ—వారిద్ద రక్కచెల్లెండ్రను వేరుగ నుంచుటవలన వచ్చిన నష్టమేమి?

మోహా—(కోపముతో) నే నేదైనను చెడువనిజేసిన భయపడ వలెను. గాని మంచిపనికి దావరికము భయము ఎందుకు? సుశీలను పోషించుట నా కర్తవ్యము. ఇంతవరకు పూర్తికాని వివాహసంస్కారము రేపు గోదావరి యొడ్డున ఇంటిలో పూర్తియగును. మీరు నాయందు దయయుంచి రేపక్కడకు వచ్చిన మహాభాగ్యమని తలచెదను. లేనియెడల నాకు దైవమే తోడు.

ఇట్లుచెప్పి మోహనరావు ఇంటిలోనికి వెళ్లెను. సుభద్రమ్మ యాతనిజూచి "బాగా మాయమైనావు లే. రాత్రల్లా నీకొర కొక్కలాగు బెంగపెట్టుకున్నాము. ఎక్కడ ఉండిపోయావేమిటి?"

మోహనుడు రాత్రి జరిగిన వృత్తాంతమంతయు పినతల్లితో జెప్పెను. కష్టసుఖములు జెప్పుట కాతనికి పినతండ్రియొద్దనున్న జంకు పినతల్లియొద్ద లేదు.

సుభ—ఆతని సాహసమును ప్రశంసించుచు, తల్లితండ్రుల భయమువలన ఎవరైనను చేసుకొన్న పెళ్లామును వదలుకుంటారా? లోకులు నవ్వితే నవ్వుతారు. కాని వారి భయమువలన ఒకరి గొంతుక కోస్తామా ఏమిటి? మీయమ్మ ఏమంటారో యని భయము కాని లేకపోతే ఆపిల్లను నావద్దనే ఉంచుకొందును.

మోహా—నాకు అమ్మనాన్నా భయము లేదు.

సుభ—ఇన్నాళ్లు వాళ్ల ఇష్టప్రకారమే నడచుకొన్నావు. పాపం చాలా కష్టాలు పడ్డది. అది కాక ఆపిల్ల బుద్ధిమంతురాలుట. మరి యొకరైతే తల్లిదండ్రులను నిర్లక్ష్యపెట్టి ఈపాటే ఆపిల్లను తీసికొని వచ్చియుందురు. నీవుకనుక ఇన్నాళ్లవరకు ఓర్చుకొన్నావు.

* * * * * *

సుభద్రమ్మా! నీవీ సూటలను పవిత్రభావముతో ననిన యెడల ఆదరపాత్రురాలవే. కాని నీ వీసమయమునందు ఈర్ష్య, ద్వేషముతో కూడుకొని యున్నావు. నీవు మోహానుకు పురెక్కించి ఆతని దృష్టియందు సీతోటి కోడలను తక్కువ పరచుటకు జూచుచున్నావు. మరియుమాత్సర్యహృదయమును గాయపరచి నీవు సంతోషపడుచున్నావు!

* * * * * *

మోహనుడు వెళ్లిపోయిన తర్వాత నారాయణదాసు కృష్ణశర్మతో, "మీమనస్సులోని మాటేయైనది కదా? ఇంకా వెనుకముందు లిట్లాలో చిస్తూయున్నారు?"

కృష్ణశర్మ ఏమియు జవాబు చెప్పలేదు.

నారాయణదాసు తిరిగి ఆతనితో, "ఈప్రస్తావన మొదట మీరే చేయవలసినది. కాని అట్లు నేయక దానిని అంగీకరించుటకు కూడ సింత సంకోచించుచున్నారేమి?"

కృష్ణశర్మ దీనికి కూడ జవాబు చెప్పలేదు.

నారా—ఆతడు తన భార్యతో వేరుండినమేమి తప్పు? మీదగ్గర నుంచుకొనరు. వేరుండనివ్వరు. ఇదేమి న్యాయము?

కృష్ణ—(రోషముతో) మీరే ఈచిక్కులలో నున్న యెడల బాగుగ బోధపడియుండును. ఒకరికి చెప్పుట సులభము. నేనూ మీవలె నితరులకు బోధించగలను. మీరే కదా వేశ్యా సంస్కరణ

విషయమై పెద్దపెద్ద ఉపన్యాసము లిచ్చి, పని చెయ్యవలసిన అవసరము వచ్చి నప్పుడు ముఖము మాటు వేశారు. మిగిలిన వాళ్లనుకూడ మీలాగే అనుకోండి. నే నేవనినైనను చేయగలను కాని అన్నయ్యకు మాత్రం కోపము తెప్పించ జాలను. ఆయనను సంతోషపెట్టుటకు నాసిద్ధాంతములను మార్చుకో వలసివచ్చినను మార్చుకొందును

నారా—జన్మముతో వేశ్యలైన వారిని భాగు పరచ గలనని నే నెప్పుడును మీతో ననలేదు. ఇంటిలోని వారి అనాదరణవలనను, చెడు సహవాసమువలనను పతితులైనవారికిని జన్మముతో వేశ్యలైన వారికిని ఏమియు భేదము లేదని మీ రనుకొనుచున్నారు కాబోలు. సాధ్యాసాధ్యములైన రోగముల కు ండెంత భేదమున్నదో వీరియందు కూడ నంత భేదమున్నదని నాయుద్దేశ్యము. అప్పుడే అంటుకొన్న నిప్పును మీరు ఆర్పగలరు కాని లోపలనుండి అంటుకొన్న పర్వత మును ఆర్పజాలరు. అట్లార్పి జూచుట వెఱ్ఱివాని లక్షణముగాని బుద్ధిమంతుల లక్షణముకాదు.

కృష్ణ—కాని మీరు చివరకు నాకుసహాయమైనను చేయవలసి యుండెను. మీరు ఒక్కగంట మాత్రము నాతో వేశ్యల ఇండ్లకు వచ్చినట్లైన, దేనిని మీరు జ్వాలాముఖపర్వత మనుకొనుచున్నారో, అది కేవలము ఆరిపోయిన బుగ్గి కుప్పయని గ్రహించి యుందురు. మంచివారు, చెడ్డవారు అందరిలోను ఉందురు. వేశ్యలలో కూడ మంచివారు లేక పోలేదు. వారిలో దైవ నిష్టాపరులు, పాప భీతులు భాగుపడ నుద్దేశము కలవారు, ఎంత మంది ఉన్నారో జూచిన మీ రాశ్చర్య పడుదురు. వారిని జూచినప్పుడు నాకెంతో ఆశ్చర్యము కలిగినది. వారికేదైనను చిన్న అసరా దొరికిన, ఆపాప కూపము నుండి పైకి వచ్చివేయుటకు సిద్ధముగా నున్నారు. వారు మొదట నాతో మాట్లాడనైనను మాట్లాడేవారు కారు. కాని నేనీ ప్రస్తావన

మీ బాగుకొరకే ప్రవేశపెట్టితిననియు, దీనివలన మీరు దురాచారములనుండియు, దుర్మార్గులనుండియు, దుష్టత్వమునుండియు, ముక్తి పొందగలరనియు, నేను బోధపరచి చెప్పిన తర్వాత వారికి నాపై క్రమక్రమముగ విస్వాసము కలుగసాగెను. పేరు చెప్పను గాని చాల మంది ధనవంతులగు వేశ్యలు నాకీ విషయమై ధనసహాయమును జేయుటకు సిద్ధముగా నున్నారు. కొంతమంది తమ కొమార్తెలకు వివాహము జేయుటకు కూడ సిద్ధముగ నున్నారు. మరియు రామానందస్వామియొక్క ఉపదేశమువలన వారిలో మంచి ప్రబోధము కలుగగలదని నా కాశ కలదు. అంతా ఎగతాళి జేయువారే కాని సహాయము జేయువా రొక్కరునూ లేరు. అదియే చాల విచారకరమైన సంగతి. వేశ్యబాలికల నుంచుటకును, వారికి తగిన శిక్షగరుపుటకును, ఒక ఆశ్రమము మిప్పుడు చాల అవసరముగా నున్నది. కాని నా మాట వినువా రెవ్వరు?

నారాయణదాసీ మాటలన్నియు శ్రద్ధతో వినమండెను. కృష్ణశర్మ చెప్పిన సంగతులన్నియు ఆయనకు సబబుగానే తోచెను. అందువలన నాతని మాటలపై దానునకు విశ్వాసము కలిగెను. తానే కార్య మసాధ్యమని తలచెనో అది నిజముగా సాధ్యమేయని యాతని కప్పుడు బాగుగ బోధపడెను.

నారా—రామదేవుగారితో మీరీ విషయమై ఏమియు మాట్లాడలేదా?

కృష్ణ—ఆఁ. మాట్లాడినాను. ఔనన్నది కాదని, కాదన్నది ఔనని ఊరికే వాదనలు, వివుర్శనలు, గడబిడ చేయడమే కాని వని చెయ్యడని ఆతని సంగతి మీ రెరుగరా?

మోహనరావుయొక్క వివాహసంస్కారము జరిగెను. నరయొద్దున వారి చిన్న యింటిని బాగుగ నలంకరించిరి. ఈ కార్యమునకు బంధువులు కాని స్నేహితులు కాని రాలేదు. కృష్ణశర్మ ఆ రోజుననే తమ గ్రామమునకు వెళ్లి అన్నతో నీ సంగతినంతయు జెప్పెను. గోపాలశాస్త్రి ఈ సంగతిని వినినతోడనే మండిపడుచు, "ఛీ దౌర్భాగ్యుని నరికివేసెదను! వాడు తన మనస్సులో నేమనుకొన్నాడో! నా సంగతి ఎరుగడుకాబోలు!" ఇంతలో జానకమ్మ మాట కడ్డము వచ్చి "ఏడ్చుచు నే నీ రోజుననే బయలుదేరి వెళ్ళి వాడిని మంచి మాటలాడి బోధపరచి తీసుకొని వస్తాను. వాడు వట్టి అమాయకుడు. వెఱ్ఱిబాగులవాడు. ఆ నీచురాలు కమల మాయలలో పడిపోయినాడు. నామాట వా డెప్పుడూ మీరిండు." అని ఏమేమో చెప్పుచుండగ గోపాలశాస్త్రి ఉగ్రుడై భార్యను తిట్టుచు "నువ్వు వాడి దగ్గరకు వెళతానన్నసంగతి ఎత్తితే నీగొంతుక పిసిగి నా గొంతుక పిసుకుంటాను. వాడికి సిగ్గులలో గెంతవలెనని యున్నది. గెంతనీ. పాలు త్రాగే చిన్నపిల్లవాడా ఏమిటి? వాడు వట్టి మోటపశువు. వా డడుక్కుని తినకపోతే నన్నప్పుడను. నా ప్రాణం రవంతా గుటుక్కుమనగానె ఈ యాస్తి అంతా రాజాలాగు అనుభవించవలెనని అనుకుంటూ యున్నాడుకాబోలు? ఇది ఏమీ పిత్రార్జితము కాదు. వాడు హక్కుగా అనుభవించడానికి. ఇదంతా నా కష్టార్జితం. వాడి కొక్క చిల్లిగవ్వైనా దక్కనివ్వను. అంతా యే దేవుడిగుడి పేరనో వ్రాసేస్తాను" అని మండిపడుచుండెను.

ఈ కబురు నిమిషములో గ్రామమంతయు వ్యాపించెను. ఎక్కడ నలుగురు చేరిననూ యీ గుసగుసలే. వైద్యనాథము కనబడినవారంద

రత్నా "నింతింత ఘోరాలు జరుగుతూఉంటే ఇంక ఈ ప్రపంచము నందు ధర్మ మెక్కడ నిలుస్తుంది ? ఎక్కడ జూచినా మాలకూడే. ఇంత అరాచకమా ? నేనే మతకర్తనైతే వీరి పొగ రణచివేసి యుందును. పట్నవాసాలు మరిగి ఇప్పటివాళ్లు శుభ్రముగా చెడి పోతూ యున్నారు. మోహనరా వేముఖంపెట్టుకొని వూళ్లోకి వస్తాడో చూస్తాను." అని అనుచుండెను.

శర్మ చాల రాత్రివరకూ అన్నవద్దనే కూర్చుని ఉండెను కాని అత డేమాత్రము మోహనుని ఉబుసెత్తినను శాస్త్రి అతనివైపు నిప్పులురాలు కండ్లతో చూడగానే అతని నోరు కట్టుబడిపోవు చుండెను. చివరకు శాస్త్రి పరుండబోవుటకు లేవగనే శర్మ మాత్రం శుడైనను మొండిధైర్యము తెచ్చుకొని "అన్నయ్యా ! మోహనుడు మనతో వేరుపడినను మనవాడేకదా ? వాడు మంచిచేసినను, చెడ్డ చేసినను, వాడి కేఅపకీర్తివచ్చినను, అది మనకుకాదా ? ఈ సంగ తంతయు తెలిసినవారు మనలను నిర్దోషులనియే అనవచ్చును. కాని లోకులు మోహనుని మనలను ఒక్కలాగే అనుకుంటారు. పాము చావకుండ కట్టి విరిగిపోయిన నేమి లాభము ? ఒక్కప్రక్కే రెండు నష్టములు ఉన్నవి. చెడ్డపేరు వస్తూయున్నది. పిల్లవాడు దూరమై పోతూయున్నాడు. రెండవప్రక్క ఒక్క సత్ప్రమేయున్నది. మనకు చెడ్డపేరువచ్చినా మనవాడు మనదగ్గరే యుంటాడు. అందువలన మనము మోహనునివద్దకు వెళ్ళి బోధపరచి చెప్పుదాం. ఒకవేళ వాడు మనము ఎంత చెప్పినా వినకపోతే.....శాస్త్రి మాట కడ్డమువచ్చి కోపముతో "వాడు మన మాట వినకపోతే ఆ రాక్షసిని వాడి మెడకు కట్టమనేనా నీ యుద్దేశము ? ఆ పనిమాత్రం నా వల్లకాదు. ఒకసారికాదు, రెండుసార్లుకాదు లక్షసార్లు చెప్పుతూ యున్నాను. నే నీఘోరమున కొడికట్టుకొనలేను."

ఒక్కక్షణమైన తరువాత గోపాలశాస్త్రి శర్మను జూచి తిరస్కారముతో "ఇదంతా నీ కళ్ళముందు జరగడం. నీ కొక్కపిసరైనను తెలియకపోవడం చూడగా నాకు చాల ఆశ్చర్యముగా నున్నది. వాడు ఇడవలు కొని వ్యాపారము చేస్తూయున్నాడు. ఇల్లు కట్టించాడు. ఆ యిద్దరు రాక్షసులను ఇంటిలో పెట్టుకున్నాడు. ఇంత జరిగినా నువ్వు కళ్లు మూసుకొనే కూర్చున్నావా? నువ్వేమో వాడిని బాగుచేసి, నిర్వాకంచేస్తావని సమ్మ నీదగ్గరకు వాడిని పంపాను. నువ్వు కళ్లు మూసుకొని చెవులలో వేళ్లుపెట్టుకొని కూర్చుంటావని నాకేమి తెలుసును? కొంచమైనను నువ్వు వాడిని గురించి కనుక్కుంటూవుంటే వాడింత మీరిపోయి యుండడు. నీకు చేతకాకపోతే నాపేర సూచనగానైనను వ్రాసియుంటే నేనే స్వయముగవచ్చి మంచిమాటలాడి, ఏవిధముగానైనను వాడి నిక్కడకు తీసికొనివచ్చి యుండును. .తీరా కొంపమునిగిపోయిన తర్వాత ఇప్పుడా నాకు సలహా చెప్పడానికి పరుగెత్తుకొని వచ్చావు? నీ నంగినంగి మాటలు చూస్తే నాకు నీమీద కూడా అనుమానముగా నున్నది. తప్పకుండా నీవు కూడ అందులోచేరి ఉంటావు. నీ వెరిగుండే వాడిని నూతిలో ఉరకనిచ్చావు. నేను నీకేమి అపకారము చేసినానని నామీద నీవిధముగ కక్ష తీర్చుకుంటూవున్నావు? నరే! నేను దీనికి తగినట్లే చేస్తాను. రేపుప్రొద్దుటే నాతరపున ఒక దానపత్రంవ్రాయి. "విడిగా నున్న మూడు ఎకరముల భూమీ తప్ప మిగిలిన ఆస్తియంతయు సీతారామస్వామి కోవెల కిచ్చివేయుచున్నాను." ఇక్కడ నీకు వాగ్భూషణములు లేకపోయిన కళ్యాణపురము వెళ్ళి వ్రాసి పంపు. నేను సంతకముచేసి తరువాత రిజిస్ట్రీ చేయిస్తాను." అని ఇట్లు చెప్పి గోపాలశాస్త్రి పరుండుటకు వెళ్ళిపోయెను. కాని శర్మకు మాత్రము ఆతడాడిన మాటలు చాల బాధించుటవలన ఆ రాత్రి నిద్రపట్టలేదు.

ఏ నిందనుండి తప్పించుకొనుటకు తన సిద్ధాంతములను త్రోసిపుచ్చి తన స్నేహితుల హాస్యాస్పదమునకు పాత్రుడయ్యెనో ఆ నింద ఆతనికి తప్పినదికాదు. ఇంతేకాక అన్నకు కూడ తనమీద అపనమ్మకము కలిగినది. ఇప్పు డాతనికి తన పొరబాటు స్పష్టముగా కనబడు చుండెను. నిజముగ అతడు మొదటినుండియు జాగ్రత్తగ ఆతని గురించి కనుక్కుంటూయుండినయెడల ఈ స్థితి రాకపోయియుండును. ఈ వేదనావిచారములయందు, ఒక బాలిక రక్షింపబడినదికదాయను సంతోష మాతనికి కలుగుచుండెను.

తెల్లవారినతోడనే ఆతడు తిరిగి కళ్యాణపురము వెళ్ళిపోవుటకు ప్రయాణమగుచుండగ జానికమ్మ అతనివద్దకువచ్చి, ఏడ్చుచు, "బాబూ! మీ అన్నయ్యగారి మూర్ఖపుపట్టు చూచినావా? పిల్ల వాని గొంతుక కోయుటకు సిద్ధపడుచున్నారు. కాని నువ్వు మాత్రం ఆలోచించి పనిచెయ్యి పొరబాట్లు పెద్దవాళ్ళకు సహితము ఒకప్పుడు వస్తాయి. వాడు వట్టి అమాయకుడు. వాడిమీద నువ్వుమాత్రము కోపగుంచుకోకు. ఎవరేనా కఠినముగా ఉంటే వాడు సహించలేడు. వాడి మనస్సు విరిగి ఏదేశాలకైనపోతే నేను బ్రతుకలేను. వాడి క్షేమం కాస్త కనుక్కుంటూఉండు. వాడు భోజనానికేమీ ఇబ్బంది పడకుండా చూస్తూఉండు. వా డిక్కడ నున్నప్పుడు ప్రత్యేకముగా ఒక గేదెను వాడికొర కుంచేవారము. వాడికి పాలంటే ఎంతో యిష్టము. ఎన్ని పాలు తాగినా వద్దనేవాడు కాడు. కాని పప్పూ అన్నములో నెయ్యి వేస్తే ఇష్టముయేదికాదు. నేను వాడికి తెలియకుండా పేరుకొన్న నేతిముద్ద అన్నములో కప్పెట్టి పడవేసేదాన్ని. ఇప్పు డీ సంరక్షణ అంతా ఎవరు చేస్తారు? పాపం! బిడ్డడేమి కష్ట పడిపోతున్నాడో! ఇక్కడ తినేవాళ్ళు, వాడుకొనేవాళ్ళు లేక ఎక్కడి వస్తువు లక్కడపడి దొర్లుతూ ఉన్నాయి. అక్కడవా డీ వస్తువుల

కోనరము ఇబ్బందిపడుతూ ఉంటాడు. బాబూ! వాడిచేతితో వాడే పడవ నడుపుతూ యుంటాడావేమిటి?" అని ప్రశ్నించెను.

కృష్ణ—లేదు. ఇద్దరునుగ్గురు సరంగులను జీతముల కుంచినాడు.

జాని—ఐనా వాడు ఎండలోను, వానలోను తిరగాలికాబోలు? జీతాలు ఇస్తేమాత్రం కనుకోక్కపోతే నాఖర్లు తిన్నగా పనిచేస్తారా? నాకు మరియొక ఆసరాలేదుకదా? నిన్నేనమ్మి, వాడిని నీకే వప్ప చెప్పివేశాను. వాడి నొక అనాథునిగ తలచి, వాడి క్షేమ సమాచారములు కనుక్కుంటూఉండు. నువ్వు వెయ్యేళ్లు ఆయుష్షుపోను కొని వర్ధిల్లాలి. నేను కార్తీకమాసములోవచ్చి వాడిని తప్పకుండా చూస్తాను. మీయమ్మ నిన్ను తలచుకొని, తలచుకొని ఏడుస్తూఉన్న దని వాడితో చెప్పు. ఈ సంగతి వింటే వాడికి కాస్త ధైర్యముగా ఉంటుంది. వాడిది చాలా మెత్తని మనస్సు. నన్ను తలచుకొని కంట తడిపెట్టుతాడు కాబోలు. నాదగ్గర ఈసొమ్ము ఉన్నది. ఇవి తీసికొనివెళ్ళి వాడి కియ్యి.

కృష్ణ—మీ రీ రూపాయ లివ్వడ మెందుకు? నే నక్కడికదా ఉంటాను. వాడిని దేనికీ ఇబ్బందిపడనివ్వను.

జాని—ఔను. నువ్వు అన్ని విధముల వాడికి సంరక్షణచేసి కనుక్కుంటూ నేయున్నావు. ఐనా ఈ రూపాయలు కూడ వాడి కియ్యి. అవసరమునకు పనికివచ్చును. ఈ చెంబుతో నెయ్యి ఇస్తాను. వాడికి పంపించు. బజారు నెయ్యి ఇంటి నెయ్యివలె ఎట్లుండును. దానికీ కమ్మతనమూ ఉండదు. సువాసనా ఉండదు. వాడికి తాండ్రంటే చాలా ఇష్టము. మన తోటలోని తియ్యమామిడి పండ్లతోపోశాను, అది, మన పెరటిలో కాసిన కూరలు మూటకట్టి ఇస్తూయున్నాను. మీయమ్మ బ్రతికిఉన్నంతకాలము నీ కే లోపము ఉండదనియు, దేనికీ ఇబ్బంది పడవద్దనియు వాడితో చెప్పు. మంచివాడేనా, చెడ్డవా

డేనా, ఆనలుసొక్కడేకదా, నా కాధారము ! లోకానికి వెరచి వాడిని దగ్గర ఉంచుకొన లేకపోయినా నామనస్సునకు దూరము చేసికొన లేకదా !

౨౩

సుందరములైన భావములవలన కవిత్వమునకు జీవము వచ్చినట్లును, సుందరములైన రంగులవలన చిత్రపటమునకు జీవకళలు వచ్చినట్లును, కమలా సుశీలలా యింటియందుండుటవలన దానికి జీవకళ వచ్చినట్లుండెను. గ్రుడ్డికండ్లకు దృష్టి వచ్చినట్లయ్యెను. ఎండిపోయిన మొగ్గవంటి సుశీల ఇప్పుడు వికశించిన పుష్పమువలె శోభాయమానముగా నుండెను. ఎండిపోయిన గోదావరీ స్రోతస్వినీ ప్రవాహముతో పొంగిపోవుచున్నట్లుండెను. జ్యేష్ఠవైశాఖముల ఎండవేడిమికి పడగొట్టికొనిపోయిన యావు శ్రావణ భాద్రపదములలో పొలములయందలి పచ్చిగడ్డిని మేయుచు పుష్టిగలిగి, ఆనందముగా నున్నట్లు ఆమె యును విరహముచే విలపించిన రమణి ఇప్పుడు నూతన శోభనుదాల్చి ప్రేమాస్వరూపురాలయ్యెను.

ప్రతిదినము ప్రాతఃకాలమునందా ఇరువయిద్దరు నున్న ఇంటినుండి ఇద్దరు కోమలాంగులు నదీ స్నానమునకు బయలుదేరు చుండుదురు. వారిలో నొకతె వట్టి లావణ్యముగను, చురుకుగను ఉండి కలకలలాడు చుండును. రెండవ యువతి సాధారణముగను, నెమ్మదిగను నుండును. మొదటి ఆమె నదియందు నుత్సాహముతో గంతులు వైచుచు, నీదులాడుచు స్నానము చేయుచుండును. రెండవ యామె నెమ్మదిగ స్నానము చేయుచుండును. ప్రభాతమందలి బంగారు కిరణముల యందీ రమణులిద్దరు మరింత ప్రకాశించుచుందురు.

సుశీల ఆనందముతో పాడుచుండును. కమల వంట వండుచుండును. సుశీల తలను దువ్వుకొనుచు, శృంగారించుకొనుచు, ఉండును. కమల బట్టలు కుట్టుచుండును. సుశీల అత్యావశ్యకముగ భుజించుచుండును. కమల రోగినివలె పరధ్యానముగా నుండి హితవులేనట్లు భుజించుచుండును.

మోహానుని స్వభావమునందు కూడ నిప్పుడు చాల మార్పుకలిగెను. అతడు ప్రేమయొక్క ఆనందము పరిభవించుటయందు తన్మయుడైయుండెను. ఇప్పుడాతడు చాల ప్రొద్దెక్కినగాని పరిగినుండి లేవడు. గంటలకొలది స్నానము చేయుచుండును. తర్వాత తల దువ్వుకొని, బట్టలు వేసికొని, అత్తరు సెంట్లను రాసుకొని సొగసుగా తయారగుట కొక గంటపట్టును. అప్పుడు నెమ్మదిగ ఫలహారముచేసి కాఫీ పుచ్చుకొని కచ్చేరీ చావడిలోనికి వెళ్లును. కాని అతని మనస్సు మరియొకచోటున నుండుటవలననొక్క నిమిషమైన నక్కడ స్థిరముగ కూర్చొనలేడు. మాటిమాటికి ఇంటిలోనికి పోవుచుండును. చావడిలో నవరితోనైనను చాలసేపు కూటాడవలసి వచ్చిన లోపలకు పోవువరకు అతనికి తొందరగా నుండును. సుశీల ఇప్పుడాతనిపై వశీకరణ మంత్రము ప్రయోగించినది.

కమల ఇంటిపనియంతయు జేయుటయే గాక పైపనికూడ చూచుచుండును. ఆమె భూమురాత్రి యున్నదనగానే లేచి తనస్నానమును జపమును ముగించి కళాసులను పడపవారిని పనులలోనికి పంపును. తర్వాత మోహానుకొరకు ఫలహారము తయారు చేయును. తొమ్మిది గంటలకొట్టునరికి కామె వంటపనియంతయు ముగించును. పదకొండు గంటలగునరికి ఇంటిపనియంతయు పూర్తిచేసి కుట్టుపనులు చేతిపనులు చేయుచుండును. రాత్రి అందరు భోజనములుచేసి పరుండిన తరువాత ఒంటరిగ కూర్చుని పురాణము చదువుచుండును. ఆమెక

రామాయణమన్న చాలఇష్టము, ఒక్కొక్కప్పుడామె భక్తవిజయము వివేకానంద రామతీర్థుల ఉపన్యాసములను కూడ చదువుచుండును. విదుషీమణుల చరిత్రలను చదువుట యందామెకు చాల యానక్తి. మీరాబాయి యనిన యామెకు మిక్కిలి భక్తి. కమల సాధారణ ముగ ధార్మిక గ్రంథములనే చదువు చుండును. కాని జ్ఞానమునందు కంటె భక్తియందే ఆమెకు మనశ్శాంతి కలుగుచుండెను.

కళాసుల భార్యలు సరంగుల భార్యలు కమలను చాల భక్తిగౌరవ ములతో చూచుచుండుదురు. వారిలో వారికి తగవులు వచ్చినప్పుడామె యే వారిని సమాధాన పరచుచుండును. వారి చిన్నపిల్లలకు ఆమె చొక్కాలు టోపీలు కుట్టి యిచ్చు చుండును. వారి నిమిత్తము కాటుక అగరు మొదలైనవి కూడ తయారుచేసి యిచ్చుచుండును. వారికి గాని వారిపిల్లలకు గాని రోగములు వచ్చిన కమల వారియిండ్లకు వెళ్ళి వారికి చిన్న చిన్న మందులిచ్చియు, పథ్యములు చెప్పియు సాహాయము చేయుచుండును.

కమల ఈవిధముగ కూలిపోయిన తన గౌరవమును లేవనెత్తు చుండెను. ఆచుట్టుపట్ల నున్నవారందరు ఆమెకు చాల గౌరవించు చుండిరి. బైట నీవిధముగ గౌరవము జరుగుచున్నను, నింటియందు మాత్రమాగౌరవములేదు. కమల ఒడలు దాచుకొనకుండ నింటి భార మంతయు వహించి, అన్నిపనులు సవరించు చున్నప్పటికి మోహనుని నోటినుండి ఒక్క కృతజ్ఞతా సూచకమైన మాటయైనను రాలేదు. సుశీలకూడ అక్కయెడల నిర్లక్ష్యము చూపసాగెను. భార్యాభర్త లిరువురు ఆమెనింటి దాసినలె జూచుచు పనులు చేయుటకే ఆమె యున్నట్లు తలచి నిశ్చింతగా నుండిరి. ఈపనుల యలసటవలన కమల కప్పుడు తలనొప్పియు, జ్వరమును వచ్చుచుండెను. అట్టి సమయముల యందుకూడ ఆమె మామూలు ప్రకార మింటిపనులు చేయక తప్పి

డిదిశాడు. ఆమె యొక్కొక్కప్పు డేకాంతముగ కూర్చుని తన దుర్దశను తలచుకొని ఏడ్చుచుండును. కాని ఆమెకు ధైర్యము చెప్పి యోదార్చువారెవ్వరు?

కమల స్వభావము చేతనే మానవంతురాలు. ఆమె ఇంటివరకెక్కడ నున్నను యజమాని రాకిగనే యుండెను. తనభర్త ఇంటియందు న్నప్పుడెన్ని కష్టము లనుభవించినను యజమానురాకగనే యుండెను. విలాసనగరమునందు నివశించి యున్నంత కాలమామెదే రాజ్యముగా నుండెను. వితంత్వాశ్రమమునందుకూడ శేషాధర్మములు నాచరించుచు అందరకు గౌరవ పాత్రురాలయ్యెను. అట్టి సలన నిప్పుడిక్కడ నీయవస్థయందుండుట ఆమెకు చాలు అసహ్యముగను, కష్టముగను ఉండెను. మోహనుడప్పుడప్పు డామెను ప్రశంసించుచు ఆమె సలహాలను పుచ్చుకొనుచు ఆమె యెడల గౌరవము చూపుచున్న యెడలను, సుశీల ఆమెయొద్ద కూర్చుని ఆమె మాటలందు గౌరవముంచి సంతోషపెట్టుచున్న యెడలను కమల యుత్సాహముతో నింతకన్న ఎక్కువ కష్టపడి ఇంటివనులన్నియు చక్కబెట్టగలిగి యుండును కాని ఆదంపతులిద్దరకు వారి సంతోష తరంగములం దితరులులేరియు గోచరించుటలేదు. ఒక వస్తువును గురిచూచి బాణము వేయునప్పుడు దృష్టియంతయు కేవల మావస్తువునందే లీన మగును. ప్రేమాసక్తుల స్థితికూడ నిట్టిదే.

సుశీలా మోహనులయొక్క ఉదాసీనత ప్రేమోన్మాదమువలన గాక మరియొకటి గాదు. కుష్ఠురోగులయెడల మనకు జాలియున్ననూ, వారిని నమీపించుటకు సాహసము లేక వారికి దూరముగా లోలగు నట్లు మోహనుడు కమలనుండి తప్పించుకొని తిరుగుచుండెను. ఆమె రూపలావణ్యములను జూచి తన భర్త ఎక్కడ లొంగిపోవునో యని సుశీల భయపడుచుండెను. మోహనుడు తనంతట తానే కమలకన్నుల

బడకుండ తిరుగుటవలన బాధ లేకపోయినది. లేనియెడల సుశీల అనుమానముచే దహించుకొనిపోయి యుండును. భార్యాభర్త లిరువురు కూడ చేతిలో నున్న పామును కండ్లు పడకుండునట్లు ప్రయత్నించుచుండిరి. కాని సంకోచమునవలన వారిలో వా రీవిషయమై చర్చించుటకు భయపడుచుండిరి.

క్రమక్రమముగ కమల కీ సంగతి బోధపడెను. ఒకనాడు సుభద్రమ్మ వెంకటస్వామిచేత అరటిపండ్లను వా రింటికి పంపెను. ఇంతకుముందు కూడ వెంకటస్వామి నా రింటికి పెక్కుసార్లు వచ్చెను. కాని కమల ఎన్నడును వాని కంట బడలేదు. ఆమెగు వాని కంట బడుట ఇష్టము లేదు. కాని ఈసారి వా డామెను జూచెను. ఇక నేమున్నది? వాని కడుపులో ఎలుకలు పరుగెత్తసాగెను. వాడు రాళ్లనైనను తిని అరిగించుకొనగలడు కాని రహస్యములను వాడు మనస్సునం దిముడ్చుకొనజాలడు. వెంటనే వాడు సరంగులనాయకునిచెవ్వకు చుట్టుతాగు మిషపై వెళ్ళి, వాని చెవిలో నీ సంగతి యంతయు నూదెను. "ఓరే! ఈవిడ సానిది. మొగుడు ఇంటినుండి తగిలేస్తే మా పంతులుగారింట్లో వంటకు కుదిరింది. అక్కడనుండి మేము తగిలేస్తే సానివీధిలో ప్రవేసించింది. ఇప్పుడు తిరిగీ వీ రింట్లో హాజరైంది." సరంగు లీమాటలు విని నిశ్చాంతపోయిరి. ఆ చుట్టుపట్ల ఉన్న ఆసురా రంగరు ఈవిషయమై గుసగుస లాడుకొనసాగిరి. ఆరోజునుండి ఆ చుట్టుపట్ల వారు మోహనుని ఇంటిలో నీళ్లు కూడ త్రాగుట మానివేసిరి. ఒకనాడు భగవంతరావు పడవకంట్రాక్టు విషయమైన లెక్కలు పరిశీలించుకొనుటకు వీ రింటికి వచ్చెను. అప్పు డాతనికి దాహము వెయ్యగా ఏదో వంక జెప్పి నదికి పోయి నీరు త్రాగి వచ్చెను. తన ఇంటికి వచ్చి, నదికి వెళ్ళి నీళ్లు త్రాగుట మోహనునకు గుండెలలో శూలముపెట్టి పొడిచినట్లుండెను.

వీరీయింటికి వచ్చి రెండేండ్లయ్యెను. క్రమక్రమముగ మోహనరావు చిన్నచిన్న విషయములలో సహితము కమలపై చికాకుపడుచు వినుగుకొనుచుండెను. ఈ పరిస్థితులను బట్టి చూడగ తా నిక్కడుండుట అసంభవమని కమలకు తోచుచుండెను. చెల్లెలు మరణించి నిక ఋణము తీరిపోయినది కదా యని విచారించెను. చెల్లెలివద్ద నుండి వారి సంతృప్తి జేయుచు ఏదో విధముగ తన జీవితమును గడుపుకొనవలెనని ఆమె ఇదివరకు తలచుచుండెను. ఆమె కింతకన్న మరియొక కోరిక లేదు. కాని అయ్యో! పాప మీ ఆసరా కూడ ఆమె కాళ్లక్రింద నుండి జారిపోయెను. ఆమె ఇప్పుడు నడిసముద్రములో నున్నట్లుండెను.

కమలకు తన పరిస్థితులవలన ఎంత దుఃఖము కలుగుచున్నను సుశీలతో గాని మోహనునితో గాని ఎన్నడును అయ్యో సెత్త లేదు. తన అవస్థలన కలిగిన జ్ఞానముగ, ధర్మచింతయు ఆమెను మరింత విషయవంతురాలినిగను సహనశీలదిగను జేసెను. ఆమె ఎల్లప్పుడు తలలో "ఎక్కడకు పోవుదును? నన్ను కాపాడువారెవ్వరు?" అని విచారించుచుండును. ఎటువైపు జూచినను ఆమెకు అగాధము వలె కనబడుచుండెను. ఇప్పటివరకు ఆమె యొక్క నిర్మలాత్మ అవలంబనమును కోరుచుండెను. ఏ యాసరా లేక ఈప్రపంచమునందు తన జీవితమును గడపవలసి వచ్చునని తలచునప్పుడెల్ల భయముచే ఆమె హృదయము కంపించి పోవుచుండెను. ఆమె వంటరిదైతే, అసహాయురాలిగ నీ సంసార సంగ్రామమునందు ప్రవేశించుటకు సాహసించ లేకపోవుచుండెను. గొప్పగొప్ప నేర్పరులు, ధర్మశీలురు, దృఢమనస్కులు కూడ నీ సంసారసంగ్రామమునందు దెబ్బ తినుచుండగా నిక నాగతి చెప్పేదేమి? నన్ను రక్షించువారెవ్వరు? నన్నోదార్చువారెవ్వరు?" అని యెల్లప్పుడు దుఃఖపడుచుండును. ఎంత యనాదరము

జరుగుచున్నను ఈ భయసంశయము లామె నక్కడనుండి కదల నిచ్చుటలేదు.

ఒకనాడు మోహాను డెక్కడకో వెళ్ళి తిరిగి తిరిగి పదిగంటలకు వచ్చి తన భార్యతో, "ఇంకా భోజనమున కెంత యాలస్య మున్నది. వేగముగా వడ్డించమను. బాబయ్యగారు రామనాథముగారు వచ్చినారట. నేను వెళ్ళి ఆయనను కలుసుకొనవలెను."

సుశీ—ఆయన ఈయూరా రెందుకు వచ్చిరి?

మోహా—నా కాసంగతి తెలియదు. ఆయన ఈరోజు ప్రొద్దుటే వచ్చిరనియు తిరిగి ఈ సాయంత్రమే వెళ్ళిపోయెదరనియు వెంకట స్వామి వచ్చి చెప్పినాడు. ఆయన ఇక్కడకే రావలెనని అనుకున్నా రట కాని (కమలవైపు సంజ్ఞ చేసి జూపుచు) ఏదో కారణముచేత రాలేదట.

సుశీ—ఐతే కొంతసేపాగండి. ఇంకా కొంచము ఆలస్య మున్నది.

కమ—(చికాకుతో) ఆలస్య మేమిటి? వంట అయినది. పీటవేసి చెంబుతో నీళ్లు పెట్టు. వడ్డిస్తాను.

సుశీ—కొంచంసేపు కూర్చుంటే ఏమి ములిగిపోయినది? ఉడికినది ఉడకలేదు తినుటకు అవతల రైలువేళ ఏమి మించిపోవడంలేదు.

మోహా—రోజంతా ఏమి చేస్తున్నారో నా కేమి బోధపడడం లేదు. ఈమాత్రం వంటవండడం పెద్దబ్రహ్మాండము ఐపోతూయున్నది.

మోహానుడు భోజనముచేసి వెళ్లిపోయిన తర్వాత కమల సుశీలతో, "సుశీలా! నే నిక్కడ ఉండడం మీ కిష్టములేదా ఏమిటి? నిజముగా చెప్పు, మీ మనస్సులలో ఏమున్నదో నాకు బాగా తెలుసును. కాని మీనోటినుండి ఆ కాస్తమాటా వచ్చేవరకు నే నిక్కడనుండి వెళ్ల దలచుకొనలేదు. నా కింతకంటె వేరుగతి లేదుకూడను.

సుశీ—ఏమిటక్కయ్యా! అటువంటి మాట లాడుచున్నావు. నువ్వుండబట్టేకదా వీచికూ లేకుండా ఈ సంసారము జరిగిపోతూ యున్నది. నువ్వు లేకపోతే నాచేత ఏమౌతుంది?

కమ—ఇటువంటి ముఖంతుడువుమాట లెక్కడ నేర్చుకున్నావు? మీ రిద్దరు కూడా నన్ను తృణప్రాయముగ చూచుచున్న సంగతి నాకు బోధపడలేదనుకొన్నావా? ఇందాకా మీ రిద్దరు నన్ను జూచి సంజ్ఞలు చేసికొనుట నేను చూడలేదనుకొన్నావా?

సుశీ—నువ్వు నిజంగా చూశావు? ఏమి చూచి ఏమనుకొన్నావో?

కమ—నేను చెప్పిన మాట లబద్ధమని నా ముఖమువైపు నమ ముగా జూచి చెప్పు.

సుశీ—ఐతే నీకంత బాగుగ తెలిస్తే నే నెందుకు చెప్పడము?

కమ—ఎందుకనగా అన్నీ చూస్తూఉన్నా నాకండ్లమీద నాకే నమ్మకం పుట్టడములేదు. లోకులు న న్నెంత నీచముగా జూచినను వారిని నే నేమియు అనను. వారికి నా మనస్థితి తెలియదు కాని అన్ని సంగతులు తెలిసిన నీవు నీ మగడు నన్ను నీచముగా జూచు చుంటను జూడ నాకు చాల నాశ్చర్యముగా నున్నది. నేను మీతో రెండు సంవత్సరములనుండి కలసి ఉన్నాను. అందువలన నా నడవడి గురించి మీకు బాగుగ తెలిసియుండవలెను. తెలిసికొనవలెను కూడాను.

సుశీ—లేదక్కయ్యా! నేను దైవసాక్షిగా చెప్పుచున్నాను. నువ్వన్నది నిజముకాదు. మాయింద నిష్కారణముగ అంత నింద మోపకు నువ్వు నాకు చేసిన మేలు నే నెన్నటికిని మరచిపోను. కాని సంగతి ఇది. ఆయనకు నిష్కారణముగ చెడ్డపేరు వచ్చుచున్నది. లోకులు ఇష్టమువచ్చినట్లూ అంటారు. అది కాకి సుభద్రమ్మగారు ఇక్కడకు రావలెనని ప్రయాణమైరారట కాని నీ వికడ ఉన్నావని రావడం

మానివేసినారట. ఈసంగతి ఆయన చెప్పారు. అక్కయ్యా! నువ్వు మరివక విధముగా అనుకోకు. ప్రపంచవ్యవహార మిలాగుంటే మే మేమి చెయ్యగలము?

కమల మరేమియు వాదించలేదు. చివరకామె అనుకొన్నట్లే యైనది. కాని ఆమె వెళ్లిపోవుట కింకొక ఆటంకము మాత్ర మున్నది. సుశీల కొద్దిదినములలోనే పిల్లతల్లియగుటకు సిద్ధముగా నున్నది. "ఈ సమయములో వెళ్లిపోయిన వీరు చాల కష్టపడిపోవుదురు. కనుక నింక కొన్నిరోజులూర్చి యుండెదను. ఇన్నిరోజులు సహించియున్నప్పుడిక రెండుమూడు మాసము లేపాటి? నానుండి వీరు నిష్కారణముగ చిక్కులు పడుచున్నారు. కాని ఇట్టి స్థితిలో మాత్రము వీరిని వదలి పెట్టి వెళ్లుట ధర్మముకాదు. అట్లు వెళ్లిపోవుటకు నామనస్సు కూడ వప్పుటలేదు." అని కమల తన మనస్సును సమాధానపరచుకొనెను.

కమల కిప్పుడు రోజొక యుగముగ నుండెను. కాని అట్లే ఆమె సహించి యుండెను.

రెక్కలులేని పక్షి పంజరములో బంధింపబడి యుండుటయే తనకు క్షేమకరమని తలచును కదా?

౨౪

కృష్ణశర్మ నాలుగైదు నెలలనుండి పడుచున్న శ్రమకు ఫలితముగ నిరువదిమంది వేశ్యలకు పైగా తమ పిల్లలను ఆశ్రమమునకు పంపుట కొప్పుకొనిరి. ముగ్గురువేశ్యలు తమ యాస్థి నంతను ఆశ్రమమున కిచ్చి వేసిరి. ఐదుగురు వేశ్యలు వివాహము చేసికొనుట కొప్పుకొనిరి. నిజమైన హితాకాంక్షి ఎన్నడును నిష్ఫలుడు కాడు. ఆతడు నిజమైన దేశ

శేవకుడనియు, స్వార్థ రహితుడనియు, తన్నుద్ధరించుననియు, సంఘము నకు విశ్వాసము కలిగిన అది ఆతని ననుసరించును కాని ఆ విశ్వాసము నిజమైన శేవకునియందు తప్ప తదితరులయందు కలుగదు. అంతఃకర ణము విశాలమైనది కానియెడల ఆ ప్రకాశముయొక్క ప్రతిబింబము ఇతరులయందు ప్రసరింప జాలదు. కృష్ణశర్మయందు నిజమైన శేవా భావ ముదయ మయ్యెను. సంఘమునందు నిజముగా నిటువంటి సజ్జను లెందరో కలరు. వారి మనస్సులయందు దేశశేవ చేయవలెనను యుద్దేశము కూడ నుండును. కాని చాలవరకు వారు తమ ఖ్యాతిప్రతి ష్టలకొర కాశపడెదరు. సాధారణముగ మనమేపని చేయ దలచినను దాని వలన మన పేరు ప్రఖ్యాతి గాంచవలెననియు, ఏదైన నొక ఫు స్తకము గాని, వ్యాసము గాని వ్రాసిన ప్రజ లేకగ్రీవముగ దానిని ప్రశంసించ వలెననియు ఆశించెదము. ఈ స్వార్థమునకు కొంత కాకపోయిన కొంతయైనను ప్రతిఫలము దొరకును. కాని లోకుల యొక్క హృదయమునందు మనము జొరపడ జాలము. ఒక మను ష్యుడు తానెంత దుఃఖములో నున్నను నిజమైన మిత్రుడు కాని వానితో తన దుఃఖములను చెప్పుకొనుట కిష్టపడడు.

ఇప్పుడు కృష్ణశర్మకు తరుచుగ సానిపీథికి వెళ్లవలసిన యవసరము కలుగుచుండెను. వేశ్యల జీవితముల గురించి ఆతని కనుభవము కలుగు చున్న కొలదియు ఆయనకు దుఃఖ మధిక మగుచుండెను. ఇటువంటి రమణీమణులు భోగ విలాసముల కొరకు తమ సర్వస్వమును పోగొట్టు కొనుట జూచి, ఆయన హృదయము కరుణామయ మగుచు కండ్ల వెంట నీరు కారుచుండును. ఈ స్త్రీలు ఆలోచన లేనివారు. బుద్ధి హీనులు, భావశూన్యులు కారని ఇప్పు డాతనికి బోధపడుచుండెను కాని వారు మాయలలో పడి తమ బుద్ధిసామర్థ్యములను విపరీత మార్గములయందు పెట్టుచున్నారు. కృష్ణహరి హృదయములను నిర్బల

ములుగ జేసివైచెను. కృష్ణశర్మ ఈ మాయాజాలమును త్రుంచి వేయుటకును, అచేతనములైనవారి యాత్మలకు చైతన్యమును కలిగించుటకును, అజ్ఞానావస్థనుండి వారిని తప్పించుటకును ప్రయత్నించుచుండెను. కాని ఆ మాయాజాలము దృఢముగాను, అజ్ఞానబంధనము బలముగాను, నిద్రమత్తు గాఢముగాను ఉండుటవలన మొదటి దినములలో యాతని పరిశ్రమమునకు తగినంత ఫలము కలుగలేదు. సారాయి మత్తునలన మనుష్యుని స్థితి ఎట్లుండునో అట్లే ఆవేశ్యల స్థితి కూడ నుండెను.

అక్కడ ప్రభాకరరావు అతని మిత్రబృందము ప్రస్తావనయొక్క మిగిలిన భాగములను తిరిగి కౌన్సిలునందు ప్రవేశపెట్టిరి. ఇదివరకు వారికి కృష్ణశర్మపై కోపము వచ్చుటవలన ఆ తీర్మానమునకు వ్యతిరిక్తముగ నుండిరి. కాని ఇప్పుడు శర్మ వేశ్యలపై చూపుచున్న అభిమానమును జూచి ఆయన ఆయుధముచేతనే ఆతనికి విఘ్నము కలిగింప దలచిరి. కృష్ణశర్మ ఆరోజున కౌన్సిలునకు వెళ్లలేదు. డాక్టర్ శ్యామలరావు నీలగిరి వెళ్లిపోయెను. కనుక ఆ రెండుభాగములు నిర్విఘ్నముగ ఆమోదింపబడెను.

మ్యునిసిపాలిటీవారు కళ్యాణపురము బైటను వేశ్యల నిమిత్తము ప్రత్యేకముగ నిండ్లను కట్టించుచుండిరి. కంట్రాక్టర్ భగవంతరావు చాల శ్రద్ధగాను, చురుకుగాను పనిచేయించుచుండెను. కొన్ని చిన్న యిండ్లు, కొన్ని పెద్దయిండ్లు కొన్ని మేడలు ఒక చిన్నబజారు ఔషధాలయము, పాఠశాల కట్టించుచుండిరి. షికారు తిరుగుటకు చిన్న పార్కును రామశాస్త్రి కట్టించుచుండెను. హాజీహాస్సీమ్ చిన్న మశీదును సుబ్బయ్యశెట్టి రామమందిరమును ధర్మార్థము కట్టించుచుండిరి. నియమితకాలమునకు ముందుగనె ఈపని నంతను పూర్తిచేయించెదనని భగవంతరావు ఖరారుచేసెను. కాని ఎక్కువపని

యగుటవలన ఎంత తొందరపడినను పని పూర్తియగుసరికి సంవత్సరము పట్టెను. ఇండ్లన్నియు తయారు ఐనతోడనె, "శీఘ్రముగా పట్టణమును వదలి క్రొత్తయిండ్లకు వెళ్లవలసినది" అని మ్యునిసిపాల్టీవారు వేశ్య లందరకు నోటీసులను పంపిరి.

వేశ్య లీ నోటీసులను లక్ష్యపెట్టరని పురవాసు లనుమానపడిరి. కాని వా రందరు ప్రసన్నవదనముతో నీ యాజ్ఞను పాలించుట జూడగా పుర జనుల కందరకు చాల నాశ్చర్యము కలిగెను. ఒక్కదినములోనే పట్టణ ములోని వేశ్యాగృహము లన్నియు ఖాళీయయ్యెను. రాత్రి యంతయు నతి సంచడిగా నుండు ఆ యిండ్లన్నియు శూన్యముగాను, నిశ్శబ్దము గాను ఉండెను.

సూర్యకాంతయను ధనవంతురాలగు నొక వృద్ధవేశ్య తన సర్వ స్వమును ఆశ్రమమున కిచ్చివేసెను. సాయంత్రమగుట తోడనె వేశ్య లందరు ఆమె యింటివద్ద సమావేశమైరి. ఆసభయందు సూర్యకాంత మిట్లుపన్య సించెను.

"సోదరీ మణులారా!

ఈరోజున మన జీవితమునందొక క్రొత్తయుగము ప్రారంభమైనది. దైవమికనైనను మనయందు దయజూపి మనలను మంచిమార్గమున నడిపించుగాక. మనమిన్ని దినములు అవమానకరమైన, నీచాతి నీచమైన జీవితమును గడపితిమి. ఇంతవరకు మనము పిశాచము చేతులలో నుంటిమి. మన యాత్మలు, మన దేహములు చాలవరకు చెడిపోయినవి. ఈయవ్వన మదమునందు మనస్థితినేగాక మనలను మన మేమరచిపోతిమి. ఈవీధియంతయు మన పాపములచే నపవిత్రమై పోయినది. ఇప్పుడు పరమేశ్వరుడు మనస్థితినిజూచి దయతలచి మనల నీపాపములనుండియు, నీనరక కూపమునుండియు విముక్తురాండ్రను జేయుచున్నాడు. కనుక ఇక ముందెన్నడును మనము దైవనిర్ణయములను

దాటక, దైవభక్తి, పాపభీతి కలిగి ప్రవర్తింపవలెను. ఈవీధిని విడిచి పెట్టుట మనలో కొందరు సోదరీమణులకు కష్టముగా నుండుననుటలో సందేహములేదు. మరికొందరు సోదరీమణులకు దైవము తమను రక్షించునను నమ్మకముకూడ లేకపోవచ్చును. ఆసోదరీమణులకు నేను చేయు విన్నప మేమనగా, జీవితముయొక్క స్వాతంత్ర్యమును దైవ మందరకొక్క విధముగనె ప్రసాదించినాడు. మీరు సద్వర్తనులుగా నుండు శక్తి మీయందే యున్నది. ఇప్పుడు మన జీవిత విధానములను మార్చుకొనుట వలన మనకు కష్టములు సంభవింపవచ్చును. ఐనను మనము వాటిని శాంతముతో ననుభవింపవలెను. మనకు ముందు ముందెన్ని కష్టములు వచ్చిన, మన పాపములయొక్క బరువంత తగ్గి పోవును. మన ఆత్మల నుద్ధరింపవలసిన దనియు, ఎన్నికష్టములు వచ్చుచున్నను సన్మార్గమును విడువకుండ మనోధార్ఢ్యమును ప్రసాదిం పమనియు దైవమును మరియొక సారి ప్రార్థించు చున్నాను."

తర్వాత రామతిలక మిట్లుపన్యసించెను. "మనము వకీలు కృష్ణ శర్మగారికి హృదయపూర్వకముగ వందనములు చేయవలసియున్నది. ఆమహానీయుడే మనకీ ధర్మమార్గము నుపదేశించెను. దైవ మాయన నెల్లప్పుడును రక్షించుగాక!"

తర్వాత చంద్రావతి ఇట్లుపన్యసించెను.

" సోదరీమణులారా!

పాపములకు నీచవర్తనమునకు దూరముగానుండుడని మాలక్ష్మ చెల్లెండ్రను కోరుచున్నాను. సంగీతము సాహిత్యము మన నిజమైన వృత్తులు. కనుక మనము వాటిని బాగుగ వృద్ధిచేసికొనవలెను. కామాతురులచేతి కీలుబొమ్మలముకాక మనము జాగ్రత్తగ నుండవలెను. చాల దినములనుండి మనము పాపములకు బానిసలమై యున్నాము. ఇప్పుడు మనలను మనమే రక్షించుకొనవలెను. మన సౌందర్యము,

యవ్వనము, హృదయము, మర్యాద, సిగ్గు, తెలివితేటలు, మొద లైనవి పాపాత్ములైన రసికపురుషుల కాహుతిచేయుట కేనా భగవం తుడు మనలను సృజించినాడు? యవ్వనవంతులగు రసికపురుషులు మనలను జూచి మోహించిన మన కెంత సంతోషము కలుగుచుండెడిది! వారలను జూచి మనమెంత పొంగిపోవుచుండెడి వారము? తప్పిపో యిన బంగారుపిట్ట మన పంజరములో ప్రవేశించినట్లు మన మానందిం చుచుండెడివారము. కాని సోదరీమణులారా! ఇదియంతయు మన అజ్ఞానమే. మనము వారిని ఖరీదిచ్చి లోబరుచుకొనుట లేదు. మనమే వారి సొమ్ముల కాసించి వారికి బానిసలమగుచున్నాము. మనలను వారు వెండిబంగారులతో కొనుచున్నారు. దానికి బదులుగ మనము మన పవిత్రములైన, అమూల్యములైన ఆత్మలను కోల్పోవుచున్నాము. ఇకముందు మనలో ఎవ్వరైనను మనము చేసికొన్న కట్టుబాట్లను తప్పి, నీచముగా ప్రవర్తించిన వారిని మనము బహిష్కరించవలెను."

తర్వాత సుందరీబాయియను వేశ్య ఇట్లు చెప్పెను.

"మన సోదరి చంద్రావతి మంచి యుక్తియుక్తముగ జెప్పినది. నాయుద్దేశముకూడ నదే. మనలను ఏ పురుషుడైన మోహించిన అత డెటువంటివాడో మనము మొదట కనుగొనవలెను. అతని ప్రేమ నిజ మైనదై మన మనస్సుకూడ నాతనియందున్న యెడల వెంటనే ఆతనిని పెండ్లిచేసి కొనవలెను. ఆతడు పెండ్లి చేసికొనుట కిష్టపడక పూర్వము వలె నింటికివచ్చుట ప్రారంభించిన, వెంటనే వానిని తిరస్కరించి పంపి వేయవలెను. మన మర్యాదను డబ్బున కమ్ముకొన గూడదు."

రామప్యారీ ఇట్లు చెప్పెను.

"స్వామీ రామానందు మనకు పుస్తకముల నిచ్చియున్నారు. వానియందు సౌందర్యము మన పూర్వజన్మ సుకృతఫలమనియు, మనము పూర్వజన్మ సంపాదితమును కూడ నీ జన్మమున నష్టపరుచు

కొనుచున్నామనియును వ్రాయబడియున్నది. మన సోదరి చంద్రావతి చెప్పిన సంగతుల నామోదించినవారు చేతులెత్తవలసినదని కోరుచున్నాను.''

వెంటనే సుమారిరువదిమ్మెనుగురు వేశ్యలు చేతులనెత్తిరి. ''దీనికి న్యతిరేకులు చేతులెత్తవలసినదని కోరుచున్నాను.'' అని రామప్యారి కోరెను. కాని ఒక చెయ్యియు పైకి లేవలేదు. ''ఎన్వరును న్యతిరిక్తముగ చేతులనెత్తలేదు. దీనినలన చంద్రావతి ఉద్దేశ్యమును అందరును ఆనోదించినట్లు తెలియుచున్నది. ఈదినము చాల శుభప్రదమైన దినము.'' అని రామప్యారీ పలికెను.

సమీప సూర్యకాంత తిరిగి ఇట్లు చెప్పెను.

''డబ్బది యెలుకలను చంపి తిని, పిల్లి తీర్థయాత్రకు బయలుదేరినట్లున్నదని మీ రందురేమో యని నాకు చాల భయముగా నున్నది. కాని నేను నిజముగ వారము దినములలో తీర్థయాత్రకు బయలుదేరుచున్నాను. నా జీవితమంతయు నీవిధముగ జరగిపోయినది. కాని జరిగిన దానికి విచారించిన లాభమేమి? ఇప్పుడు మీయొక్క నియమములను జూచి నా మనస్సెంత సంతోషపడుచున్నదో నేను మాటలతో చెప్పజాలను. మీయొక్క ఈపవిత్రోద్దేశములను దైవము సఫలీకృతమొనర్చుగాక ''

కొంతమంది వేశ్యలు వారిలో వారు గుసగుస లాడసాగిరి. వారికీ మాటలు రుచించనట్లు వారి ముఖములవలననే తెలియుచుండెను. కాని వారు జవాబు చెప్పుటకు సాహసించలేక పోయిరి. చెడుభావములు మంచిభావముల ముందు ఈవిధముగనే అడగిపోవును.

సభ ముగియగనే వేశ్యలందరును కాలినడకను దైవమును దర్శించుటకు యాత్రికులు బయలుదేరునట్లు ఆ క్రొత్తపురమునకు బయలుదేరిరి.

సానివీధి పాడుపడిన ట్లుండెను. సంగీతధ్వని కాని, మర్దలతాళముల ధ్వనికాని ఎక్కడను వినబడుటలేదు. రసికుల రాకపోక లాగిపోయినవి. కోతలైన తరువాత పొలమువలె ఆవీధి యుండెను.

౨౪

కొన్ని నెలలవరకు గోపాలశాస్త్రి తనవద్దకు వచ్చిన వారందరదగ్గరను మోహనుని దిట్టుచు, వాడు వట్టి భ్రష్టుడనియు, వంశము చెడబుట్టినా డనియు, తుచ్ఛుడనియు, వాని కొక్కదమ్మిడీయైనను ముట్టనివ్వ ననియు, బిచ్చమెత్తుకొను గతి పట్టిన నప్పుడు భోధపడుననియు కేకలు వేయుచుండెను. దానపత్రము వ్రాసి పంపుమని తమ్మునిపేర ఎన్నియో సార్లు వ్రాసెను. జానికమ్మ ఎప్పుడైనను మోహనుని ఉబుసెత్తిన కోపముతో నామెమీద మండిపడుచు నింటినుండి లేచిపోయి సన్యా సము పుచ్చుకొందుననియు, ఆభూర్తుని ముఖమిక జూడననియు కేకలు వేయుచుండును.

కొన్ని నెలలు గడచిన తర్వాత ఆతని మనోస్థితియందు మార్పు కలిగెను. ఆతడు మోహనుని ఉబుసెత్తుటయే మానివేసెను. ఎవరైనను మోహనుని దూషించిన విచారగ్రస్థుడగుచు, "బాబు! వాడి నెందుకు దూషించెదరు? వాడు చేసినది వాడే అనుభవిస్తాడు. వాడు మంచి వాడైనను చెడ్డవాడైనను దూరముగా నున్నాడు కదా? ఎవో నాలుగుడబ్బులు సంపాదించుకొని కాలక్షేపము చేయుచున్నాడు. ఆలా పడి ఉండనివ్వండి. వాడి ఉబుసు మనకెందుకు" అని అనుచుండును.

వైద్యనాధము ప్రతిదినము ఏదో యొక క్రొత్తకబురు తెచ్చుచుం డును. ఒకనా డాతడు గోపాలశాస్త్రివద్దకు వచ్చి, రామనాధము

మోహనునకు వెయ్యిరూపాయలిచ్చెననియు, ఆసొమ్ముతో నాతడు నదియొడ్డున ఇల్లుకట్టించి తోట వేయించుచున్నాడనియు, వ్యవహారము చేసి సొమ్ము బాగుగ నార్జించి ఖర్చుపెట్టుచున్నాడనియు, నాల్గు కల్పించి చెప్పెను.

ఇదివిని గోపాలశాస్త్రి కోపముతో, "ఏతే వాడు ముష్టెత్తుకుంటూ వుంటె నీకు సరదావా ఏమిటి? రామనాధం వాడికి సొమ్మెందుకిస్తాడు? ఇదివరకుచందా జనుచేసి పెండ్లిచేసినాడుట. వాడార్జించి ఖర్చుపెట్టుకుంటూ యున్నాడు. నువ్వు చూచినట్లు చెప్పేస్తూ యున్నావు. వాడెంత చెడ్డవాడైనను దుష్టుడుమాత్రం కాడు. కాలములో ఉన్నవాడు. సరదాలు కలవాడు. ఆర్జించుకొనుచూ ఉన్నాడు. ఖర్చుపెట్టుతూ యున్నాడు. కాని ఎవ్వరికి అపకారం చేయడం లేదు కదా? ఈ యూరిలో ఎంతమంది పోకిరీ కుఱ్ఱవాళ్లులేరు? వారు ఒక్కపైసా యైనను ఆర్జించలేరు సరికదా ఇంటిలోని సొమ్మును దొంగిలించి దుర్వ్యయములు చేయుచున్నారు. మావాడు వాళ్లకంటె సహస్రాంతము నయము."

ఈమాటలు విని వైద్యనాధము సిగ్గుపడిపోయెను. ఈవిధముగ గోపాలశాస్త్రి మనస్సు రోజులు గడచినకొలదియు మెత్తపడసాగెను. మోహనునియొక్క ప్రతిబింబము ఆతని కండ్లయెదుట తిరుగుచున్నట్లుండెను. ఆతని మాటలే ఎల్లప్పుడును జ్ఞాపకమునకు వచ్చుచుండెను. ఒకనాడాతడు భార్యతో, "చూడు. వాడెంత నిర్దయుడైపోయినాడో? మన మాటే మరచిపోయినాడు. నేను ఈయిల్లు వాకిలి భూమి పుట్ర నా నెత్తిని కట్టుకొనిపోతానా ఏమిటి? ఒక్కమాటికొడకు రావడమునకు వాడికంత తీరుబడి లేకపోయినదా? ఓరీ పాపాత్ముడా! నా దగ్గరా నీ గర్వము? నీకొరకు ఈలా కుల్లికుల్లి చచ్చిపోయిన తరువాత పరుగెత్తుకొని వచ్చి, నన్ను తలచుకొని తలచుకొని ఏడుస్తావు కాబోలు?

నన్ను చూడడమున కొక్కసారి రాలేవు? సరే చూద్దాం. నువ్వెక్కడకు పోతావో? ఎక్కడకు పోతే అక్కడకు వచ్చి నీపని పట్టిస్తాను."

భోజనముచేసి తీరుబడిగ కూర్చున్నప్పు డెల్ల "తన భార్యతో కొడుకును గురించియే మాట్లాడుచుండును. "చూచావు! చిన్నప్పటి నుండి వీడిది మొండిపట్టు. ఏదైనను ఒక వస్తువు కావాలని అన్నాడంటే అది ఇచ్చేవరకు ఆలా ఏడుస్తూనే యుండేవాడు. నీకు జ్ఞాపకము ఉన్నదో లేదో కాని ఒకసారి నా జెపమాలకొరకు ఎంత కింకపెట్టి ఏడ్చాడు? చివరకు అది చేతిలో పెట్టితేనే కాని ఊరుకొన్నాడు కాడు. మహా మొండివాడు. చూడు ఒక యుత్తర మైనను వ్రాసినాడు కాడు. నిమ్మళముగా చెవులలో వేళ్లు పెట్టుకొని కూర్చున్నాడు. మనము చచ్చిపోయినామని అనుకొన్నాడు కాబోలు." అనుచు బాధ పడుచుండెను.

జానికమ్మ ఈ సంగతులు వినుచున్నప్పు డెల్ల ఏడ్చుచుండును. గోపాలశాస్త్రియొక్క ఆత్మాభిమానము, పుత్రప్రేమ ముందు నిలువ లేకపోయెను.

ఈప్రకార మొక సంవత్సరమునకు పైగా జరిగిపోయెను. గోపాల శాస్త్రి మోహనునివద్ద కొకసారి వెళ్లవలెనని ఆలోచించుచుండెను. కాని ఆ యాలోచనను కార్యరూపమునందు పెట్టలేకపోవుచుండెను. ఒకసారి సామా నంతయు సర్దుకొని ప్రయాణమై తిరిగి ఆ సామానుల నెక్కడ వక్కడ పడవేసి ప్రయాణమును మానుకొనెను. ఇంకొకసారి స్టేషనువరకు కూడ వెళ్లి తిరిగి వచ్చివేసెను. ఆతని హృదయము మోహనునకును, ఆత్మాభిమానమునకును ఆటవస్తు వైపోయెను.

ఇప్పు డాతని మనస్సు గృహవ్యవహారములయం దేమియు వెళ్ళకుండెను. వారికి స్వంతవ్యవసాయము చాల కలదు. వెల్లి కనుగొనక పోవుటచేతను, సమయమునకు మళ్లకు నీరు పెట్టించకపోవుటచేతను

ఆ సంవత్సరపు పంట పూర్తిగ చెడిపోయెను. ఆతడు రైతులవద్ద సిస్తులు సహితము తిన్నగా వసూలుచేయుట మానివేసెను. రైతులు సిస్తులను తెచ్చినను వాటిని పుచ్చుకొని రసీదిచ్చుటకు కూడ శాస్త్రికి కష్టముగా నుండెను. అందువలన వారిని తిరిగి రమ్మని చెప్పి పంపివేయుచుండెను. ఇంటియందు బెల్లము నీరై పోవుచుండెను. కాని దానిని అమ్మించుట కత డేమియు ఏర్పాటును చేయలేదు. జానికిపుల్ల ఈ విషయమై జెప్పిన ఆమెపై చీకాకు పడుచు "ఈ యిల్లు నాకిళ్లు మట్టిలో కలసిపోనియ్యి. ఎవరికొర కీ నిర్వాక మంతయు చేసితినో వాడికే అక్కరలేనప్పుడు నా కెందు కీ తాపత్రయము" అని అనుచుండును. తన జీవితము, ధర్మనిష్ట, కర్మశీలత, ఆనందము అన్నియు కూడ నొక్కవస్తువుపైనే ఆధారపడి యున్నవనియు, ఆవస్తువే మోహనుడనియు ఆతని కిప్పుడు బోధ పడెను.

కృష్ణశర్మ చాల దినములై వారి గ్రామమునకు వెళ్లలేదు. ఆత డిప్పుడు పెద్ద కార్యభారములో మునిగిపోయి యుండెను. శాస్త్రి తమ్ముని కుత్తరములు వ్రాయుట మానివేసెను. కాని అతనివద్దనుండి ఉత్తరము వచ్చినప్పుడు మాత్రము ఆతృతతో చదువుచు ఆ యుత్తర ములో మోహనుని విషయమై ఏమియు లేనియెడల చిన్నబోవు చుండును.

ఒకనాడు గోపాలశాస్త్రి వీధి చావడిలో కూర్చుని ప్రేమసాగర మును చదువుచుండెను. కృష్ణునియొక్క బాల్యక్రీడలు చదువుచున్న ప్పుడాతనికి మిక్కిలి ఆనందము కలుగుచుండెను. ఇంతలో సాయంత్రమై చీకటి పడుటవలన ఆతడు మరి చదువ లేకపోయెను. కాని అక్కడ నుండి లేచుట కాతనికి బుద్ధి పుట్టినది కాదు. ఇంతలో కుక్కలరచి, గ్రామములోనికి ఎవ్వరో క్రొత్తవారు వచ్చుచున్నట్లు సూచించెను. మోహనుడు రాలేదుకదా? యని గోపాలశాస్త్రి గుండె దడ దడ

లాడ సాగెను. ఆతడు వెంటనే పుస్తకమును మూసి లేచుచుండగా కృష్ణశర్మ వచ్చి ఆతనికి నమస్కరించెను.

గో. శా—అందరూ క్షేమముగా నున్నారా?

కృష్ణ—దేవుని దయవలన అంతా క్షేమముగా నున్నారు.

గో. శా—ఆదిక్కుమాలిన వాడి సంగతు లేమైనను తెలుస్తూ యున్నవా?

కృష్ణ—ఆఁ కులాసాగానే యున్నాడు. నాలుగైదు రోజుల కొక సారి మాయింటికి వస్తూయుంటాడు. నేను కూడా అప్పుడప్పుడు వెళ్ళి వాడి యోగక్షేమము కనుక్కుంటూ యుంటాను. మరేమీ యిబ్బంది పడకుండా కులాసాగానే యున్నాడు.

గో. శా—ఆకరోకోటకుడు మాగురించి ఎప్పుడైనను తలుస్తూ యుంటాడా? లేక మేము చచ్చిపోయామని ఊరుకున్నాడా? ఇక్కడకు రానని వట్టుపెట్టుకున్నాడా ఏమిటి? మేము చచ్చిన తరువాత వస్తాడు కాబోలు. వాడి యుద్దేశమే ఆలావుంటె మేమెక్కడకైనా పోతాము. ఈయిల్లు వాకిలి, భూమి పుట్ర చూచుకుంటూ వాడే యీసంసారము చక్కపెట్టుకోనీ. అక్కడ ఒక పెద్దయిల్లు కట్టిస్తూ యున్నాడని విన్నాను. వాడక్కడే ఉండిపోతె ఇక్కడ ఉండేవాళ్లెవరు? ఈయాస్తి అంతా ఎవరు తినను?

కృష్ణ—ఇల్లు కట్టించడములేదు. ఏమిలేదు. ఈసంగతి మీతో ఎవరు చెప్పారో కాని వట్టి అబద్ధము. సున్నపుబట్టీలు, ఇటుక బట్టీలూ మాత్రము పెట్టిస్తూ యున్నాడు. అది కాక నది ఆవలియొడ్డున ఒక స్థలము కొనవలెనని అనుకొంటూ యున్నాడు.

గో. శా—ముందు ఈయింటికి నిప్పంటించి తరువాత అక్కడ భూమి పుట్ర కొనుక్కోమను.

కృష్ణ—మీరెందు కిటువంటి మాటలాడుతారు? మీరేమంటారో

అను భయము వలన వాడిక్కడకు రావడంలేదు. మీరు వాడిని తిమించారని ఇప్పుడు తెలిస్తే ఈక్షణములో రెక్కలు కట్టుకొని ఇక్కడ వాలుతాడు. నాదగ్గరకు వచ్చినప్పుడెల్ల మీగురించే మాట్లాడుతూ యుంటాడు. ఆజ్ఞయైన రేపే ఇక్కడకు వస్తాడు.

గో. శా—వద్దు వద్దు. నేను వాడిని రమ్మనమని అనను. వాడికి మే మేమా తామని వాడిక్కడకు వస్తాడు? ఒకవేళ వాడిక్కడకు రాదలచుకొంటే నడలు బాగా గట్టిపరచుకొని మరీరమ్మను. వాడిని చూచిన తోడనే నాకు వెఱ్ఱెత్తుకొని వస్తుంది. కఱ్ఱపట్టుకొని బయలు దేరుతాను. మూర్ఖుడు. నేనంటే అంత నిర్లక్ష్యమా? చిన్నప్పుడు వీడితో ఇంతంత అల్లరి పడ్డానా? తిన్నగా జపమైనా చేసుకో నిచ్చే వాడు కాడు. అన్నమైనా తిన నిచ్చేవాడు కాడు. నావిస్తరిలోనే కలియ పడేవాడు. వాడినుండి బట్టలు ఒక్కనాడైనను తెల్లగా ఉండే వికావు. తెల్లబట్టలు కట్టుకొన్నాననే సరికి ఎక్కడనుండో మన్నులో ఆడుకుంటూ ఉన్నవాడు పరుగెత్తుకొనివచ్చి నెత్తిమీద సవారీ అయ్యేవాడు. ఆ చనువంతా ఏమైనదో? ఇప్పుడు నా దగ్గరకువస్తే చిన్నతనములో త్రాగిన పాలు గొంతుకలోనికి వచ్చేలాగు గూబలు సాగదీస్తాను.

తరువాత నిద్దరన్నదమ్ములు నింటిలోనికి వెళ్లిరి. జానికమ్మ పెర టిలో కూర్చుని ఆవులకు కుడితి పెట్టించుచుండెను. కోమా ర్తెలిద్దరు పువ్వులు కోసుకొనుచూ ఆడుకొనుచుండిరి. జానికమ్మ మరదిని జూచినతోడనే లేచి నిలువబడి, "పోని ఇన్నాళ్ళకైనా దర్శనమైనది. నాలుగడుగులలో నున్నారు. నెల కొకసారియైననువచ్చి ఇంటిలోనివా రేమైనారో కనుక్కోవద్దూ? అక్కడ అందరు క్షేమముగానున్నారా?

కృష్ణ—అఁ. మీ ఆశీర్వచనమువలన అంతా క్షేమమే. ఏమిటి వండుతూయున్నారో ముందుగా చెప్పండి. నాకు క్షీరాన్నము,

మిఠాయిలు పెట్టితే, మీకొక మంచి శుభవర్తమానం చెప్పుతాను. మీకు మనుమడు పుట్టినాడు.

జానికమ్మ ముఖము సంతోషముచే వికసించెను.

జాని—పదండి. మిమ్ములను పాలుమిఠాయిలతో ముంచివేస్తాను. ఎంత తినగలరో చూద్దాం.

గో. శా—(వికసించిన ముఖముతో) నువ్వు చాల చెడ్డకబురు చెప్పినావు. దేవుని దర్బారునందు కూడ న్యాయము తల్లక్రిందు లగునా? నా కొమారుని ఎడబాపుచెయ్యడం. వాడికి కొమారుని ఇవ్వడం. ఇప్పుడు ఒకడి కిద్దురైనారు. వాళ్ళతో నేను చాలగలనా? ఇక లొంగిపోవలసినదే. వాడిక ఏలాగున్నైనను నన్నక్కడకు ఈడ్చుకొనివెళ్ళకమానడు. నా అరికా లప్పుడే దురదవేయుచున్నది. నిజముగా దైవము దుష్టులకే మంచి కూర్చుతూ ఉంటాడు. ఇప్పుడు నాకు మరిపించితా లేదు. పోని ఏదోయొకవిధముగ దేవుని దయవలన మన వంశము నిలువబడినది. ప్రసవమై ఈ రోజున కెన్ని దినము లైనది?

కృష్ణ—ఈ రోజున కెనిమిది దినములైనది. ఇంతకంటె ముందుగానే వచ్చి, ఈ శుభవర్తమానము చెప్పవలెననుకున్నానుగాని వీలు పడినదికాదు.

గో. శా—ఐతే ఏమైనది? పదకొండవ రోజునకు వెళ్ళి గొప్పగా బారసాల చేసికొనవచ్చును. నువ్వు రేపు ప్రొద్దుటే బయలుదేరు.

జానికమ్మ సంతోషముతో ఉప్పొంగిపోవుచుండెను. బాజాభజంత్రీలతో పుత్రోత్సవము పంచిపెట్టవలెననియు, ఇంటివద్ద సందడి చేయవలెననియు ఆమె మనస్సులో సరదాపడుచుండెను. ప్రపంచములో మరి యెవ్వరికిని సంతానము లేనట్లును తానే పుత్రపౌత్రవంతురాలైనట్లును ఆమె గర్వపడుచుండెను. ఇంతలో నౌఖరు వచ్చి

వాకట్లో నొక సాధువు బిక్షకొరకు నిలువబడియున్నాడని చెప్పెను. ఆమె వెంటనే నలుగురికి సరిపోవు స్వయంపాక మిచ్చి పంపెను. రాత్రి భోజనములైన తరువాత అందరు కూర్చుని చాలసేపటివరకు మోహనుని సంగతులు సంతోషముతో చెప్పుకొనిరి.

౨౬

మనుష్యుడు లోభవశమున, ఒక వస్తువును దొంగలించి తన తప్పును తెలిసికొన్నతరువాత ఆ వస్తువువైపైనను జూచుటకు సిగ్గుపడునట్లు మోహనుడు కమలను జూచుటకు సిగ్గుపడుచు ఆమెను తప్పించుకొని తిరుగుచుండెను. ఆతడు పగలంతయు వ్యవహారపు పనులను జూచుకొనుచు సాయంత్రము సున్నపుబట్టీలవద్ద కూలీలచేత పనులు చేయించుచు తంటాలు పడుచుండెను. ఆతనికి వీసువుగానున్నప్పుడు "ఈ కమలనుండియే నేను ఇంటికి దూరమైతిని. ఈమెవలననే నాకీ చిక్కులు వచ్చినవి. లేనియెడల ఏచింతయు లేకుండ నింటివద్ద హాయిగా యుండియుందును. ఇష్టమువచ్చినది తిని, ఏ తాపత్రయమును లేకుండ కులాసగ తిరుగుచూయుండి యుందును. ఇప్పు డీమెయే ఈ చిక్కులన్నియూ నా నెత్తిని పులిమినది." అని విసుగుకొనుచుండును.

మొదట ప్రేమోన్మాదుడై నిస్సంకోచముగ ఆత డామె చేతి వంటను దినెను. కాని ఇప్పుడు తన తప్పనకు పశ్చాత్తాపమును పొందుచుండెను. ఆమె సంపర్కమును ఏలాగుననైనను తప్పించుకొనుటకు జూచుచుండెను. పూర్వము కమలయన్న ప్రాణమిచ్చుచు, ఆమె చిరునవ్వుకు, మధురవాక్కులకు, కృపాకటాక్షములను తన జీవితము

నైనను ధారపోయుటకు సిద్ధపడిన మోహనుడే యీతడు. ఇప్పుడా కమలయే ఆతని దృష్టియందు ఇంత నీచముగా కనబడుచున్నది. మానవప్రకృతి ఎంత చంచలమైనదో. ఆతడు స్వయముగ అనుభవించి నను ఇప్పుడు మరచిపోయెను.

మోహనుడు చాల దినములనుండి చదువుటయు, వ్రాయుటయు మానివేసెను. ఈ సున్నపుబట్టీలను పెట్టించుచున్నప్పటినుండియు ఆతనికి వార్తాపత్రికను చదువుటకు కూడ అవకాశము లేకుండెను. "ఏపని పాటులు లేకుండ రోజంతయు తీరుబడిగ యుండేవారికే యీ పుస్తకములు, పత్రికలుగాని నావంటివానికి కా"వని ఆతడు తలచుచుండెను. కాని హార్మోనియమ్ వాయించుటయు, శృంగారించుకొనుటయు మానలేదు. వాటికిమాత్రము ఆతనికి సమయము దొరకుచుండెను.

అత డప్పుడప్పుడు తన పూర్వపు సంగతులను తలచుకొని "నేనప్పు డెందుకంత మూర్ఖుడనై పోతిని ? ఈ కమలనుజూచి నేనప్పు డెందు కంత మోహపడితినో" అని తనలో ననుకొనుచుండెను.

ఇప్పుడాతడు తన సద్వర్తనమునకై చాల గర్వపడుచుండెను. ఆతడు ప్రతిదినము గోదావరియొడ్డున స్త్రీలను జూచుచున్నను, ఆతని మనస్సునందు చెడుతలంపులు పుట్టుచుండుటలేదు. అది యంతయు తన బలమే యని ఆతడు తలచుచుండెను.

సుశీలకు ప్రసవదినములు సమీపించుటవలన ఆమె తరచుగ పరుండియే యుండును. ఇప్పుడు మోహనుడు పనినుండి వచ్చుటతోడనె సుశీల మునుపటివలె చిరునవ్వుతో ఎదురుగావెళ్లి స్వాగతమిచ్చుటలేదు. ఆమె తరచు తలనొప్పివలనను జ్వరమువలనను బాధపడుచుండెను. ఆమె ముఖము నెత్తురు లేనట్లు పాలిపోయియుండెను. ఆమె స్థితిజూచి మోహనునకు చాల దుఃఖము కలుగుచుండెను. ఆతడు తరచు ఆమె వద్ద కూర్చుని ఆమెకు సంతోషముకలుగు సంగతులను చెప్పుచుండును.

కాని అక్కడ కూర్చొనుట ఇష్టము లేనట్లు ఆతని ముఖముపలన తెలియుచుండెను. కొంతసేపైనతరువాత ఏదియోవంక బెట్టి అక్కడ నుండి లేచివెళ్లిపోవుచుండును. ఆతని విలాసతృష్ణ తిరిగి ఆతని మన స్సును చలింపజేయసాగెను. నదికివచ్చు స్త్రీల నాతడు కామదృష్టితో జూడ మొదలుపెట్టెను. చివర కొకనా డీ చెడుతలంపులచే వికలుడై యాతడు సానివీధివైపు బయలుదేరెను. ఆతడు చాల నెలలై అటు వైపునకు వెళ్ళలేదు. అప్పుడు రాత్రి యెనిమిదిగంటలయ్యెను. కామ తృష్ణ ఆతనిని ముందునకు తీసుకొనిపోవుచుండెను. ఆతని జ్ఞానవివేక ములు ఇప్పు డీ యావేగముక్రింద అణగిపోయినవి. ఆతడు ముందునకు రెండడుగులు వైచి చటుక్కున ఆగి ఆలోచించుచుండును. తిరిగి ముందునకు బయలుదేరుచుండును. పత్యాపత్యములు విచారింపక తీపి పదార్థములను జూచి, తినవలెనని ఆతృతపడు రోగిస్థితివలె ఇప్పు డాతని స్థితి యుండెను.

ఆతడు సానివీధిని ప్రవేశించెను కాని ఇప్పు డది మునుపటివలె సంద డిగాలేదు. తమలపాకులదుకాణములు, చిల్లరదుకాణములు ఉన్నను మిఠాయిదుకాణములు, పువ్వులు అంగడులు మూసివేయబడియుండెను. మేడలపైనినుండి తొంగిచూచు వేశ్యలు కనబడుటలేదు. మధురమైన సంగీతధ్వనులు కాని వాయిద్యముల ధ్వనులుకాని మునుపటివలె విన వచ్చుటలేదు. అప్పు డాతనికి వేశ్య లక్కడనుండి వెళ్లిపోయిరను సంగతి జ్ఞాపకమునకువచ్చి చాల విచారము కలిగెను. కాని ఒక క్షణ ములోనే ఆతని కొక విచిత్రమైన ఆనందము కలిగెను. కఠినులైన పోలీసువారి చేతులనుండి విడువబడిన ట్లాతడు ఇప్పుడీ చెడుతలంపుల నుండి విముక్తుడయ్యెను. మోహను డిప్పుడు తన మనోదార్బల్యము నకు తనలో దానే సిగ్గుపడుచుండెను. ఇదివర కాతనికి తన మనోబల ముపైగల గర్వ మిప్పుడు సిథిలమయ్యెను. ఆత డింటికివెళ్లిపోవలెనని

తలచెను కాని నాల్గువెపుల నొక్కసారి షికారు తిరుగవలెనని బుద్ధి పుట్టుటవలన తిరిగి బయలుదేరెను.

కమల పూర్వము నివసించు ఇంటివద్ద కాతడు వచ్చుసరికి ఆయింటి నుండి ఒక మధురమైన సంగీతధ్వని ఆతనికి వినబడెను. ఆత డాశ్చర్య ముతో తలను పైకెత్తి చూడగా నొకబల్ల యాతనికి కనబడెను. దానిపై సంగీతపాఠశాల యని వ్రాయబడి యుండెను. మోహనుడు వెంటనే మేడపైకి పెళ్లెను. ఆత డదివరకు చాలసార్లు ఆమేడయందే కమలతో సరససల్లాపము లాడియుండెను. అతని మనస్సున కిప్పుడు పూర్వపుసంగతులన్నియు జ్ఞాపకమునకు వచ్చెను. ఆత డక్కడనున్న బల్లపై కూర్చుని సంగీతము వినుచుండెను. ఇరువదియైదుగురు విద్యా ర్థులు వాయిద్యములతో తమ స్వరములను కలిపి, అభ్యసము జేయు చుండిరి. ఒకడు చితారు, ఇంకొకడు తబలా, వేరొకడు వీణ, మరియొ కడు ఫిడేలు, ఈవిధముగ అంద రన్ని వాయిద్యముల వాయించుచుం డిరి. ఒక సంగీతాచార్యుడు వారికి వంతులప్రకారము పాఠము నేర్పు చుండెను. ఆతడు సంగీతవిద్యయందు మంచి నిపుణుడు. ఆ మధురగాన మును విని మోహనుడు తన్మయుడై అట్లే కొంతసేపక్కడ కూర్చుం డెను. తానుకూడ ప్రతిదినము అక్కడకువచ్చి సంగీతము నేర్చుకొన వలెనని ఆతనికి బుద్ధిపుట్టెను. కాని తమ యిల్లు అక్కడకు చాల దూరమగుటవలన అంతరాత్రివేళ అక్కడకు వచ్చుట కష్టమని ఆత నికి తోచెను. ఆతడు లేవబోవుచుండగా సంగీతాచార్యుడు వీణమీద నొక పాటను ప్రారంభించి పాడుచుండెను.

జయ ! జగదీశ్వరీ ! ఆజనని ! శక్తిస్వరూపిణి ! జయ !
భారతదేశము బాధలలోజిక్కి దానిబంధనములనుండి బాపిరక్షిం
పుమా ! ॥జయ॥
నీదువియోగముచే వ్యాకులపడుమమ్ము నీయొడినిజేర్చి కాచిరక్షిం

ఘుమా ! ॥జయ॥

మాయజాలములోబడి మతిలేకయున్న మాభారత జాతినిదయజూచి
గావుమా ! ॥జయ॥

దాస్యశృంఖములోజిక్కి కుందుచున్న నీప్రియసుతులను రక్షించి
బ్రోవుమా ! ॥జయ॥

ఈ గానము మోహానునియొక్క హృదయమునందు సద్భావముల నుదయింపజేసెను. దేశోపకారము, జాతీయసేవ, దేశగౌరవము మొదలగు పవిత్రభావము లాతని హృదయమునం దిప్పుడు ప్రతిధ్వనించుచుండెను. జగజ్జననియొక్క దయాస్వరూప మాతని హృదయక్షేత్రమునందు ప్రత్యక్షమై నట్లుండెను. దుఃఖితుడు, దరిద్రుడు శల్యావసిష్ఠుడు నగు నొక బాలకుడు దీనభావముతో దేవినివైపుజూచుచు తన రెండు చేతులనుపైకెత్తి సజలనేత్రములతో "దేవీ! భారతదేశమును రక్షింపుము" అని ప్రార్థించుచున్న ట్లాతనికి తోచెను. ఆకల్పనయందు తాను దరిద్రులగు కృషికుల సేవ జేయుచున్నట్లును, దీనులగు కృషికులను రక్షింపుమని జమీందారులను తాను వేడుచున్నట్లును, కృషికులు తన కాళ్ళపై బడుచున్నట్లును, వారి స్త్రీలు తన నాశీర్వదించుచున్నట్లును, ఆతడు భావించెను. మోహాను డీ కల్పిత వివాహమునందు పెండ్లికొడుకై, జాతిసేవను జేయవలెనని సంకల్పించుకొని అక్కడనుండి బయలు దేరెను. ఆతడు తన తలంపులయందు మగ్నుడై ఎవ్వరితోడను మాట్లాడకుండనె అక్కడనుండి కొంతదూరము వెళ్లి, సుందరీభాయి మేడయందు చాలమంది మనుష్యులు సమావేశమై యుండుటను జూచెను. వీరంద రక్కడ ఎందుకు సమావేశమైరని వారిలో నొకరి నాత డడిగెను. " రామదేవుగారు " రహితుల సహాయసంఘము " ను స్థాపింపబోవుచున్నారు." అని ఆతడు చెప్పెను. రహితులను జమీందారుల అత్యాచారములనుండి రక్షించుటయే ఆ సభయొక్క

ముఖ్యోద్దేశము. మోహనుని మనస్సునందు, అప్పుడప్పుడే ఉదయించిన సానుభూతి మందగించిపోయెను. మోహనుడు కూడ జమీందారుడే. కృషికులను దయగా చూడవలెనని ఆతడు కూడ కోరుచున్నను వారిని జమీందారులకు వ్యతిరిక్తముగా లేవనెత్తుట కాత డిష్టపడ, కుండెను. అతడు తనలో, "వీరు జమీందారుల హక్కులను తొడ గించవలెనని జూచుచున్నారు. ద్వేషభావముచే ప్రేరేపింపబడి వీల సంస్థను స్థాపింపజూచుచున్నారు. కనుక నేను కూడ బాగుగ నాలో చించి మమ్ములను మేము రక్షించుకొనవలెను." అని ఆలోచించు కొనుచుండెను. మానవప్రకృతి ఒకరిక్రింద అణగియుండుటయన్న ఎంత అసహ్యము? అప్పుడు పదిగంటలయ్యెను. అక్కడ ఆగుట వ్యర్థమని మోహను డింటికి బయలుదేరెను.

౨౭

సాయంసమయ మయ్యెను. ఆకాశమునం దంతటను ఎఱ్ఱని దుప్పటి పరచినట్లుండెను. పిల్లవాయువులు నదీ తరంగములపై ఆటలాడుచు, వాటిని మెల్లమెల్లగ కదలించుచుండెను. ఆకాశదేవత తన ఎఱ్ఱని నేత్రములతో జూచుచు అప్పు డప్పుడు పకపక నవ్వుచుండెను. నవ్వు నప్పుడు ఆణిముత్యములవంటి పండ్లు ధగధగ మెరయుచున్న ట్లుండెను. మోహనుని గృహము పువ్వులతోను, లతలతోను రమణీయముగ అలంకరింపబడి యుండెను. కళాసులు, సరంగులు వీథిలో మూగి యుండిరి. లోపల స్త్రీలందరు కూర్చొని పాటలు పాడుచుండిరి. ఈరోజున మోహనుని కుమారునియొక్క బారసాల ఉత్సవము.

ఆ రోజున మోహనుడు చాల విచారముగ కనబడు చుండెను.

ఆతడు వీధి యరుగుపై కూర్చొని, నదివైపు తదేక దృష్టితో జూచు చుండెను. ఆతని హృదయమునందు కూడ విచార తరంగములు లేచు చుండెను. "లేదులేదు వారు రారు. రావలచినచ్చిన ఈ పదకొండవ నాటికే వచ్చియుందురు. వారు రారని తెలసియుండిన బాబయ్యతో నీసంగతిని చెప్పకపోయి యుందును. నేను చచ్చిపోయినట్లు వారు భావించుచున్నారు కాబోలు? నాతో సంబంధమును వారు పూర్తిగ విడగొట్టు కున్నట్లున్నది. నేను బ్రతికియున్నను, చచ్చిపోయినను వారికి విచారము లేదు. ఎంత కఠినులైనను నిట్టువంటి సమయమందు తమ శత్రువుల ఇంటికైనను వెళ్లెదరు. ప్రేమచే రాకపోయినను నలు గురు ఏమనుకొనెదరో యని యైనను వచ్చెదరు. వ్యవహార రీత్యా యైనను వచ్చెదరు. ఏ ప్రకారముగా నైనను వచ్చిన ప్రపంచములో నావారు ఉన్నారు కదాయని సంతోషించు చుందును. పోనీ వారు రాకపోయినను, పని తెరపి చేసికొని ఒకసారి నేనే వెళ్ళి, ఏదో తెగు తెంపులు జేసికొని వచ్చెదను. పిల్లవాడు ఎంత అందముగా నున్నాడు? పెదవులు ఎఱ్ఱగా దొండపండువలె నున్నవి. అచ్చముగా నావలెనే ఉం డును. కళ్లు మాత్రము సుశీలవి. నావైపు ఎంత ధ్యానముతో జూచును. నాన్నగారి మాట జెప్పను గాని అమ్మ వాడిని జూచిన తప్పకుండ ఎత్తుకొని ముద్దులాడును." ఇట్లనుకొనుచుండగా మోహ నున కకస్మాత్తుగా మరియొక తలపు కలిగెను. "ఒకవేళ నేను చచ్చి పోయిన వీరిగతి యేమగును? ఈ పిల్లవానిని ఎవరు పోషించెదరు? ఈ ప్రపంచములో వాడి కెవ్వరును లేరా? లేదులేదు. నేను చచ్చి పోయిన నాన్నగారికి తప్పక వానిపై దయ కలుగును. ఆతడంత నిర్ద యుడు కాజాలడు. నేవింగు బ్యాంకీలో ఎన్ని రూపాయలున్నవి? వెయ్యి రూపాయలైనను పూర్తిగ లేవు. నెల కేబది రూపాయల చొప్పున కూడబెట్టిన సంవత్సరమునకు ఆరువందలగును. రెండువేలు

పూర్తి యైనతోడనె ఇల్లు కట్టుటకు ప్రారంభించెదను. ముందు రెండు గదులు, లోపున కైదుగదులు, వీధిలో కచేరీచావడి, మేడమీద మూడుగదులు ఉన్నయెడల ఇల్లు సదుపాయముగా నుండును. పునాదులు ఎత్తుగా వేయించిన ఇల్లు అందముగానుండి, గాలి బాగుగా వచ్చును. అధమము ఐదడుగులు ఎత్తుగా నైనను పునాదులు వేయించెదను." మోహనుడీ కల్పనలలో మునిగి ఆనందించు చుండెను. అప్పటికి బాగుగ చీకటి పడెను. ఇంతలో రోడ్డుమీదనుండి ఒకబండి వచ్చుచున్నట్లు కనబడెను. దాని రెండువైపుల నున్న దీపములు పిల్లికండ్ల వలె మెరయుచుండెను. ఎవరు వచ్చుచున్నారు? బాబయ్యయే యై ఉండును. ఆయన తప్ప మరి నా కున్నవా రెవ్వరు? అని మోహనుడనుకొను చుండగ బండి గుమ్మములో నాగెను. గోపాలశాస్త్రి కృష్ణశర్మ ఆ బండినుండి దిగిరి. దాని వెనుక నింకొక బండికూడ యుండెను. దానినుండి జానికమ్మ, సుభద్రమ్మ మోహనుని ఇద్దరు చెల్లెండ్రును దిగిరి. వెంకటస్వామి లాంతరు పట్టుకొని ముందు నడచుచు వారికి త్రోవ చూపించు చుండెను. ఇందరు వచ్చుచుండుట జూచి మోహనుడు తనవారే వచ్చుచున్నారని నిశ్చయించు కొనెను. కాని వారిని కలుసుకొనుట కాతడు వారి కెదురుగా పరుగెత్తలేదు. ఆతడు వారిని గౌరవించు సమయ మిప్పుడు పోయినది. ఇప్పుడు వారాతనిని గౌరవించు సమయము వచ్చినది. ఎవరినీ జూడనట్లు మోహనుడు అరుగుదిగి ఇంటిలోనికి వెళ్లిపోయెను. ఆతడు తనలో తాము లేని యెడల నేను దిక్కులేని వాడివలె ఉంటానుకున్నారు కాబోలు? వారు నన్ను ఏలాగు నిర్లక్ష్యముగా జూచిరో అవిధముగ నేను కూడ వారిని నిర్లక్ష్యముగా జూచెదను." అని అనుకొనుచు, మోహనుడు లోనికి పోయి వారేమి చేయుచున్నారో యని తలుపుచాటునుండి తొంగి చూచుచుండెను. ఇంతలో వెంకటస్వామి లోనికి వచ్చి

మోహనరావు బాబుగారు! అని గట్టిగా పిలువసాగెను. అప్పుడు మోహనుడు పైకివచ్చి దూరమునుండియే తల్లికినమస్కరించి ప్రక్కకు నిలువబడెను.

గో-శా—(మోహనుని జూచి) మమ్ములను పోలిక పట్టనట్లు ఆలాగున ప్రక్కకు నిలుపబడినావేమి? నాకు కాకపోయిన మీయమ్మ పాదముల కైనను నమస్కరించి, ఆశీర్వాదమును పొందుము.

మోహ—నేను తాకిన మీరు మైల పడిపోదురేమో?

గో-శా—(తమ్మునితో) వీడి పెడసరపు మాటలు విన్నావా? మమ్ములను వీడు మరచిపోయి యుండునని నేను మొదటనే చెప్పలేదా? నామాటలు వినక మమ్ముల నిక్కడ కీడ్చుకొని వచ్చితివి. తల్లిదండ్రులు గుమ్మములో నిలచియుండగా జూచి యైనను వీని మనస్సు కరిగినది కాదు.

జాని—(ముందునకువచ్చి) బాబూ? మోహనా! నాన్నగారి పాదములకు నమస్కరించు. నీవు బుద్ధిమంతుడవు కదా? ఇటువంటి మాటలాడెదవా?

మోహనుని బింకము సడలిపోయెను. కండ్లవెంట నీళ్లు కారుచుండగా నాతడు తండ్రికాళ్లపై బడెను. శాస్త్రికి కూడ కండ్లవెంట నీరు వచ్చెను. తర్వాత మోహనుడు తల్లికాళ్లపై బడెను. జానికమ్మ యాతనిని లేవనెత్తి కౌగలించుకొని ఆశీర్వదించెను.

ప్రేమ భక్తికుమలయొక్క దృశ్యమెంత మనోహరమైనది? ఎంత ఆనందమైనది? తల్లిదండ్రుల హృదయములు ప్రేమచే పులకితములగుచుండెను. పుత్రుని హృదయసాగరమునందు భక్తితరంగములు లేచుచుండెను. ఈభక్తి ప్రేమలయొక్క నిర్మలజ్యోతులవలన హృదయముల యందలి చీకటిగదులన్నియు ప్రకాశవంతములయ్యెను. మిథ్యాభిమానము, లోకనిందా యను భయంకరమైన కీటకములు ఆజ్యోతియం

దొక్కసారిగ నశించెను. ఇప్పుడక్కడ నిజమైన ప్రేమయు భక్తియు తమ నివాసముల నేర్పరచుకొనెను.

సంతోషమువలన మోహనుని కాళ్లు నేల నానుటలేదు. ఆతడు కళాసులకును సరంగులకును పనులు పురమాయించుచు తనకున్న పలుకుబడి నంతను కనబరచుచుండెను. ఒకడు మంచములువేసి పక్కలు పరచుచుండెను. ఇద్దరు గోదావరినుండి నీళ్లను తెచ్చుచుండిరి. సామానులను తెచ్చుటకొర కొకడు బజారునకు పరుగెత్తెను. ఇది యంతయు జూచి సంతోషమున పట్టజాలక గోపాలశాస్త్రి తమ్మునితో మెల్లగా, మోహనుడు చాల చతురుడైనాడే. ఇబ్బందిపడుచు ఏదో విధముగ సంసారమును గడపుకొనుచున్నాడని అనుకొంటిని. కాని ఇక్కడ సౌఖ్యపడుచు చాల గౌరవముగా నున్నాడు."

ఇంతలో తోటికోడండ్రిద్దరును లోపలకు వెళ్లిరి. జానికమ్మ నాల్గువైపుల నాశ్చర్యముతో జూచుచు "ఇల్లెంత శుభ్రముగానున్నది? ఎక్కడ ఉండవలసిన వస్తువు లక్కడ బాగుగ సర్దినారు. దీనియక్క చాల తెలివైన దానివలె కనబడుచున్నది."

వారు పురిటిగదిలోనికి వెళ్లుటతోడనె సుశీల లేచి అత్తగార్లిద్దరకు నమస్కరించెను. జానికమ్మ మనుమని ఒడిలో పెట్టుకొని ముద్దులాడ సాగెను. ఆపిల్లవా డామెకండ్లకు కృష్ణావతారమునలె కనబడుచుండెను. ఆమె సంతోషమును పట్టజాలక కండ్లవెంట ఆనందబాష్పములను కార్చెను.

కొంతసేపైన తరువాత ఆమె గోపాలశాస్త్రివద్దకు వెళ్లి సంతోషముతో "ఐనదేదో యైనది. కాని మీరు చాల అదృష్టవంతులు. మంచి అందమైన కోడలిని సంపాదించినారు. నిజముగా గులాబీపువ్వే. ఇక మనుమడు సాక్షాత్తు కృష్ణావతారమే!"

గో-శా—ఎంత తేజోవంతుడు కాకపోయిన, గోపాలశాస్త్రి

నిక్కడ కీడ్చుకొని రాగలడా ?

జాని—కోడలు చాల శీలవంతురాలుగ కనబడుచున్నది.

గో. శా—కనుకనే దానికొరకు వాడు తల్లిదండ్రులనుకూడ విడిచి పెట్టినాడు. అందరూకూడ నీవిధముగ నెవరిసందడిలోవారుండిరి. కాని వకరికినికూడ నిర్భాగ్యురాలగు కమల ఎక్కడనున్నదోయను చింతయేలేకపోయెను.

౨౮

స్నానముచేసి నీళ్లు తెచ్చుటకు చీకటిపడుచుండగా కమల నదికి వెళ్లెను. ఆమె తిరిగి వచ్చునరికి గుమ్మముముందు బండ్లు నిలువబడి యుండెను. అరుగుపై కొందరు కూర్చుని ఉండిరి. ఆమె కృష్ణశర్మను పోలికపట్టి, మోహనుని తల్లిదండ్రులు వచ్చియుందురని ఊహించెను. ఆమె మరిముందునకు వెళ్ళలేకపోయెను. ఆమె కాళ్ళకు సంకెళ్ళు తగిలించినట్లయ్యెను. అక్కడ తనకిక స్థానములేదనియు, వారితో తనకుగల సంబంధమువదలిపోయినదనియు, ఆమె తలచెను. ఆమె రాతిబొమ్మవలె నిలువబడిన వోటనే నిలువబడిపోయి, ఎక్కడకు పోవుదునాయని ఆలోచించసాగెను.

ఇప్పుడొక నెలనుండియు సుశీల కమలను చాల నిర్లక్ష్యముగ జూచుచుండెను. విధవాశ్రమమునందున్నప్పుడు దయాశాంతములు మూర్తీభవించినట్లున్న సుశీల ఇప్పుడు కమలను విసిగించుచు మాటి మాటికిని ఆమెపై చీదరపడి కేకలువేయుచు, ఆమెకు మిక్కిలి దుఃఖ మును కలిగించుచుండెను. ఒకరిపైని ఆధారపడియున్న దినములలో మనము ఎంత వినయవంతులముగను, కర్తవ్యపరాయణులముగను

ఉందుమో స్వతంత్రులమైన తరువాతకూడ అవిధముగనె ప్రవర్తించిన మనము దేవతుల్యులమే. సుశీలకప్పుడు సహానుభూతియొక్క అవసరముండెను. ప్రేమయొక్క కోరిక ఆమె చిత్తమును ఉదారవంతముగను, కోమలముగను, నమ్రతకలదిగను చేసివైచెను. కాని ఇప్పు డామె తన ప్రేమరత్నమును సంపాదించి, దరిద్రునకు ధనముదొరకినట్లామె హృదయము కఠోరమయ్యెను. మోహనుడు కమల మాయలలో నెక్కడ చిక్కుకొనునో యను భయమామెను దహించివేయుచుండెను. కమలయొక్క సర్దింధకాలక్షేపమునకును భక్తిశ్రద్ధలకును ధర్మనిష్టకును ఆమె దృష్టియందు కొంచమైనను విలువలేకుండెను. ఇదియంతయు వట్టి నటనయే యని సుశీల తలచుచుండెను. కమలకు చిన్నతనము నుండియుకూడ నుచిగాను, శుభ్రముగాను ఉండుట అలవాటు. ఇప్పు డామె తలను దువ్వుకొని సుభ్రమైన చీరను కట్టుకొన్న సుశీల మరి యొక విధముగ తలచుచుండెను. కమలయొక్క ఆచారవ్యవహారముల నామె తీవ్రదృష్టితో జూచుచుండెను. ఈ పరిస్థితులను జూచి కమల మోహనునితో ఏవిషయము చెప్పవలసివచ్చినను సుశీలతోనే జెప్పు చుండెను. సుశీల సుస్త్రీచే గదిలో పడుకొన్నప్పటికిని మోహనుని భోజనసమయమునందు ఏదోయొక వంకబెట్టుకొనివచ్చి అక్కడనే కూర్చొనుచుండును. తన పురిటిసమయమునకుముందే కమల నెక్కడకైనను పంపివేయవలెనని చూచుచుండెను. తాను పురిటిగదియందు కట్టుపడిఉండగా కమలను కనిపెట్టలేదుకదా ? ఆమె ఏకష్టమునైనను సహించుటకు సిద్ధముగానుండెనుగాని అనుమానమును మాత్రము సహించజాలకుండెను.

కమల ఇదియంతయు జూచుచున్నను జూడనట్లును, వినుచున్నను విననట్లును ఉండెను. నదియందుమునిగిపోవుచున్న మనుష్యునివలె ఆమె యీ ఆధారమును విడువజాలకుండెను. ఆమె తన జీవితమార్గ

మును ఏవిధముగను స్థిరపరచుకొనలేకుండెను. కాని ఇప్పుడు మోహనునియొక్క తల్లిదండ్రులను అక్కడ జూచిన తర్వాత ఆ యాధారమును వదలుకొనవలసివచ్చెను. ఇచ్ఛయు శక్తియు నెరవేర్చలేనిక్రియను అనస్థచేయించుచుండెను. కమల చివరకు నదియందు పడిపోవుటకే నిశ్చయించెను.

ఆమె నెమ్మదిగ నడుగులువేయుచు పెరటిగుమ్మమువైపువెళ్లి వారు తనగురించి ఏమనుకొనుచున్నారోయని వినసాగెను. ఆమె అరగంటవరకు అక్కడ నిలువబడియుండెను. జానికమ్మ సుభద్రమ్మ మాట్లాడుకొనుచుండిరి. చివరకు జానికమ్మ సుభద్రమ్మతో "దీనియక్క ఇప్పు డిక్కడ ఉండుటలేదా?"

సుభ—ఇక్కడ ఉండక మరి యెక్కడకు వెళ్లును?

జాని—ఎక్కడను కనబడుటలేదు?

సుభ—ఎక్కడకైనను పనిమీద వెళ్లినదేమో? ఆమెయేకదా ఇంటి పనియంతయు జూచుచున్నది.

జాని—అది వస్తే పైనే ఉండమని చెప్పవలెను. మోహనుడు దానిచేతివంటే తినుచున్నాడు కాబోలు?

సుశీ—(పురిటి గదిలో నుండియే) లేదు లేదు. మొన్నటివరకు నేనే వండుచుంటిని ఈ పదిరోజులై ఆయన చేతితో ఆయనే వండుకుంటూ ఉన్నారు.

జాని—ఐనా కాని కుండలు బిందెలు అదిముట్టుకోకుండా ఉన్నదా ఏమిటి? కుండలన్నియు అవతల పారేయించి, సామానులన్నీ తోమించి ఇల్లూ వాకిళ్లు కడిగి వేయించవలెను.

సుభ—పాప మామె పైనపడుకొనుటకు చోటెక్కడ ఉన్నది?

జాని—చోటు లేకపోయినా నేను దానిని లోపల పడుకోనియ్యను ఇటువంటి దానిని ఎవరు నమ్మమన్నారు.

సుభ—లేదక్కయ్యా! ఇప్పుడామె మునుపటి మనిషే కాదు. ఎల్ల ప్పుడు వ్రతోప వాసములు చేయుచు చాల నియమముగా నుండును.

జాని—చాలు, దాని నియమం నిష్టన్ను అన్ని వాయిద్యములు వాయించి ఇప్పుడు నిష్టాపరు రాలైనది కాబోలు? దేవతా విగ్రహ మున్నకైనను విరిగిన చెయ్యి అతుకునా? ఇప్పుడది దేవతా సమాను రాలైనను నేను దానిని నమ్మను.

కమల ఇక నామాటలను వినలేక పోయెను. ఆమెకు కాల్చినశూల ములతో గుండెలలో పొడుచు చున్నట్లుండెను. ఇక నొక నిముషమైన ఆమె అచ్చట నిలువలేక ఆచీకటిలో వచ్చిన త్రోవనే బయలుదేరెను.

చీకటి దట్టముగా నల్లుకొని యుండెను. త్రోవయైనను బాగుగ కనబడుటలేదు. కమల అల్లే పడుచు లేచుచు వెళ్లు చుండెను. ఎక్కడ నుండి ఎక్కడకు వెళ్లుచున్నదో ఆమెకే తెలియదు. ఆమెకిప్పుడు ఒడలిమీద స్పృహయేలేదు. దెబ్బలుతిని భయపడిన కుక్కవలె ఆమె మూర్ఛావస్థయందే వెళ్లిపోవుచుండెను. ఆమె తన మనస్సును స్థిర పరచుకొన వలెనని ఎంత ప్రయత్నించినను స్థిమితపడ కుండెను. ఇం తలో నొక పెద్ద ముల్లామె కాలిలో దిగపడిపోయెను. మరి నడచుటకు స్వాధీనము లేక కాలుపట్టుకొని ఆమె అచ్చటనే చతికిలపడిపోయెను.

మూర్ఛనుండి తెలివివచ్చిన మనుష్యునివలె కమల తులుక్కుపడి నిటునటు చూడసాగెను. నలువైపుల నిశ్శబ్దముగ నుండెను. చీకటి గాఢముగా నుండెను. నక్కలు మాత్ర మప్పుడప్పుడు భయంకరముగా నఱచుచుండెను. తానక్కడ వంటరిగా నుంటినని తలపునకు వచ్చినతో డనే ఆమె ఒడలుగడగడ వణకెను. ఒంటరితన మనిన నేమో ఇప్పుడా మెకు బాగుగ బోధపడెను. చుట్టుప్రక్కల నెవ్వరును లేరనియు తానక్కడ ఒంటరిగా నుంటిననియు ఆమెకు తెలిసి నప్పటికి నాలుగు వైపులను క్రిందను మీదను అనేక జీవులు పరుగెత్తు చున్నట్లామెకు

కనబడుచుండెను. ఆమె ఆదృశ్యమును చూడజాలక భయముచే రెండు కండ్లను గట్టిగా మూసికొనెను. ఒంటిరి తన మనేక విధములైన భయంకర కల్పనలను పుట్టించు చుండును. కమల తనలో "నేనెంత నిర్భాగ్యురాలను? ఇతరుల మాట యట్లుండగా నా స్వంత చెల్లెలే నాముఖమును జూచుటకు కూడ నిష్టపడకున్నది. ఆమెను నమ్ముకొన్నందుకు నాకు తగిన శాస్తిచేసినది. ఎంత ప్రయత్నించినను నాకు వచ్చిన కళంకమును నేను పోగొట్టుకొనజాలను. ఆమెను నిందించుట ఎందులకు? ఇది యంతయు నా పాప కర్మఫలమే. అయ్యో నా కాలెంత బాధ పెట్టుచున్నది? ఈ ముల్లెట్లు పైకివచ్చును? లోపల విరిగినట్లున్నది. ఎంత పోటుపెట్టుచున్నది? అయ్యో! నేనెవ్వరిని నిందింప జాలను. పాపమును జేసితిని దాని ఫల మెవ్వరనుభవించెదరు? భోగ తృష్ణ నాకీ దుర్గతిని తెచ్చిపెట్టినది. నేనెంత గ్రుడ్డిదాన నైపోతిని? కేవల మింద్రియ సౌఖ్యముల కొరకాత్మ నాశనమును జేసికొంటిని. నిజముగ నాకప్పుడు కష్టముగానే యుండెను. మంచి బట్టలకు నగలకు భోజనమునకు ప్రేమకు కూడ నేనప్పుడు వాచిపోతిని. అప్పుడు నా జీవితమే నాకు దుఃఖ మయముగా దోచుచుండెను. ఆయవస్థ కూడ నాపూర్వ జన్మ పాపఫలమే. ఇంతకంటె కష్టములు పడుచు తమ ఆత్మలను రక్షించుకొను స్త్రీలులేరా? దమయంతి కెన్నెన్ని మహా కష్టములు వచ్చినవి. సీతను రామచంద్రు డింటినుండి పంపివేసినప్పుడామె అడవి యందు సంవత్సరముల తరుబడిని ఎన్నెన్ని కష్టము లనుభవించినది? సావిత్రి ఎటువంటి దుఃఖములను సహించినది? కాని వీరందరును ధర్మ మునందు దృఢ మనస్కులై యుండిరి. అంతదూర మెందులకు? మా యిరుగు పొరుగుల నెంతమంది స్త్రీలు ఏడ్చుచు దినములు గడుపుట లేదు? రామవరమునందు పాపమా గొల్ల సుబ్బ ఎన్నెన్ని బాధలనుభవించు చుండెడిది? దాని మగడు రంగము వెళ్లి ఎన్ని సంవత్సరములో

యైనది. పాపమది ఉపవాసములు జేయుచునట్లే పడియుండెడిది. అయ్యో! ఈ సౌందర్యము నన్నెంత పాడుచేసినది? ఈ సౌందర్య గర్వమే నన్నీ స్థితికి దెచ్చినది.

హా! ఈశ్వరుడా? సౌందర్యము నిచ్చి మనస్సు నెందుకు చంచల మైన దానిగ జేసితివి? సుందర యువతులు సాధారణముగా చంచల స్వభావులే బహుశః ఈశ్వరుడీ యుక్తిచే మా యాత్మలను పరీక్షించు చున్నాడు కాబోలు? లేక జీవిత మార్గమునందీ యడ్డమునుపెట్ట ఆత్మలను బలకరములుగను, ధైర్య వంతములుగను జేయుచున్నాడో? సౌందర్య మను అగ్నియందు ఆత్మలను పడవేసి వాటికి ప్రకాశమును కలిగింప జూచుచున్నాడో? అయ్యో అజ్ఞాన వశమున మనమేమియు కనిపెట్టలే కున్నాము. ఈ యగ్ని మనలను కాల్చివేయుచున్నది. ఈ యాటంకము మనలను చలింప జేయుచున్నది.

ఈ బాధ ఎట్లుతగ్గును? ఈ ముల్లును ఎవరు తీయుదురు. ఇక్కడ నేనెంత ఏడ్చినను వినువారెవ్వరు? ఇది భోగ తృష్ణయొక్క దోషము కాదు. సౌందర్యముయొక్క దోషమును కాదు. ఇది యంతయు నా అజ్ఞాన దోషమే. మహాప్రభూ! నాకు జ్ఞానమును దయచేయుము. నీవే నన్నిప్పు డుద్ధరింపగలవాడవు. నేను విధవా శ్రమమునందు ప్రవేశించి చాల తప్పుచేసితిని, సుశీల వద్ద నుండుట కూడ చాల పొరబాటే. మనుష్య మాత్రులు నన్ను రక్షించెదరని ఆశపడుట వట్టి వెఱ్ఱితనము. వారుకూడ నావలెనే అజ్ఞానావస్థయందు పడియున్నారు. అటువంటి వారు నన్నెట్లు రక్షించగలరు? నేనా పరమేశ్వరునే శరణు జొచ్చెదను. కాని ఎట్లు పోవుదును? త్రోవయేది? రెండు సంవత్సరముల నుండి ధర్మ గ్రంథములను చదువుచున్నాను. కాని ఏమియు బోధ పడుటలేదు. భగవంతుడా నిన్నెట్లు చేరుకొందును? నన్నీ యంధకార మునుండి రక్షింపుము. నీవు దివ్యుడవు. జ్ఞానమయుడవు. నీ ప్రకాశము

నందీ యంధకారము విచ్చిన్నమైపోవును. ఈయాకులెట్లు గలగలలాడు చున్నవి? ఏదైనను క్రూర జంతువు వచ్చుట లేదుకదా? ఔను తప్పక ఏదో వచ్చుచున్నది." అని అనుచు కమల లేచి నిలువబడెను. ఆమె మనస్సిప్పుడు చాల దృఢముగాను, నిర్భయముగాను ఉండెను.

కమల చాల సేపటివరకీ తలంపుల యందే మగ్నురాలై యుండెను. ఈ తలంపులవలన ఆమె మనస్సునకు శాంతి కలుగుచుండెను. ఇప్పటి వరకీ విధముగ ఆమె యెన్నడును ఆత్మ విచారమును జేసి కొనలేదు. ఈ యాపదల వలన ఆమెయొక్క సద్విచారములు జాగ్రతములయ్యెను.

ఈ తలంపులతో చాల రాత్రి గడచిపోయినది. వసంతకాలపు చల్లనిగాలి వీవసాగెను. కమల బట్టను సర్దుకొని మోకాళ్లపై తల నిడుకొని కూర్చుండెను. ఈ ఋతువునందే, ఈ సమయమునందే తాను తన భర్త ద్వారమువద్ద కూర్చుని "ఎక్కడికి పోవుదును" అని యాలో చించిన సంగతి ఇప్పు డామెకు జ్ఞాపకమునకు వచ్చెను. ఆసమయమునం దామె భోగతృష్ణయందు మండిపోవుచుండెను. ఇప్పు డామెకు భక్తి యను చల్లనినీడ ఆశ్రయ మిచ్చెను.

ఇంతలో నొక్కసారి కమల కండ్లు మిరిమిట్లు గొల్పిన ట్లయ్యెను. సాధు రామానందస్వామి మృగచర్మమును ధరించి దయాపూర్ణనేత్ర ములతో జూచుచు తనయెదుట నిలువబడియుండుటను ఆమె జూచెను. కమల వెంటనే ఆతని కాళ్లపై బడి స్వామీ! నన్నుద్ధరింపుడని వేడు కొనెను. రామానందస్వామి దయతో ఆమె తలను నిమురుచు "భగ వంతు డందుకొరకే నన్ను నీవద్దకు పంపినాడు. నీ కేమి కావలెనో జెప్పు? ధనము కావలెనా?" యని ప్రశ్నించెను.

కమ—వద్దు స్వామి. ధనమునం దాశలేదు.

స్వామి—సన్మానము కావలెనా?

కమ—సన్మానమునందు కూడ నాకు కోరికలేదు.

స్వామి—భోగవిలాసమో?

కమ—స్వామి! దయచేసి ఆసంగతి మాత్రము జ్ఞాపకము చేయకుడు. నాకు జ్ఞానమును దయచేయుడు.

స్వామి—సరే. ఐతే విను. కృతయుగమునందు మనుష్యుని ముక్తి జ్ఞానమునందును, త్రేతాయుగమునందు సత్యమునందును, ద్వాపరయుగము నందుభక్తియందును ఉండెను. కాని యీకలియుగమునందు మనుష్యుని ముక్తి కేవలము సేవయందేయున్నది. ఈసేవామార్గమునే యనుసరించిన నీ వుద్ధరింపబడగలవు. ఈ ప్రపంచమునందు నీకంటె కూడ దీనులు దుఃఖితులు కలరు. వారి సేవ జేయుము. వారి యాశీర్వాదములే ని న్నుద్ధరింపగలవు. కలియుగమునందు భగవంతుడీ దుఃఖసాగరమునందే నివశించును.

కమల కండ్లు విప్పి యిటు నటు జూచెను. తాను మేలుకొంటిననియే ఆమె నమ్మకుండెను. కాని స్వామి ఇంత త్వరలో నెట్లదృశ్యుడయ్యెనో యని ఆమె ఆశ్చర్యపడుచుండెను. ఇంతలో నకస్మాత్తుగ నతడు లాంతరును చేత నిడుకొని ఎదురుగా నున్న వృక్షములక్రింద నిలువబడియున్న ట్లామెకు కనబడెను. ఆమె వెంటనే లేచి కుంటుచు ఆతని వైపునకు బయలుదేరెను. ఆ చెట్లసమూహము తనకు నూరు గజముల దూరములలో నున్న ట్లామె తలచెను కాని నూరుగజములకు బదులు మూడు నాలుగువందల గజముల దూరము కూడ నామె వెళ్లెను. ఆమె యట్లెంత దూరము వెళ్లినను, ఆ వృక్షముల సమూహము, వాటిక్రింద లాంతరు చేత నిడుకొనిన స్వామియు నూరుగజముల దూరములోనే కనబడుచుండెను.

కమలకు భ్రమ కలిగిన ట్లయ్యెను. "నేను నిదురపోవుచుండుటలేదు కదా? ఇది స్వప్నమా? నే నెంతదూరము వెళ్లినను ఆయన అంత

దూరములోనే కనబడుచున్నారు." అని యనుకొనుచు "స్వామీ! నేను వచ్చుచున్నాను. మీరు కొంచ మాగుడు." యని గట్టిగా నరచెను.

"వేగముగా రా. నేను నిలువబడియే యున్నాను. అను మాట లామె చెవుల బడెను. కమల తిరిగి బయలుదేరెను. కాని రెండువందల గజముల దూరము వెళ్లిన తరువాత ఆమె అలసిపోయి మరి నడువలేక క్రింద చతికిలబడిపోయెను. ఆ వృక్షముల సమూహము వాటిక్రింద స్వామియు పూర్వమువలె నూరుగజముల దూరములోనే కనబడు చుండెను.

భయముచే కమల ఒడలు కొయ్యబారెను. గుండెలు దడదడ కొట్టుకొనసాగెను. కాళ్లు వణకుచుండెను. ఆమె గట్టిగా కేకలువేయ దలచెను గాని గొంతుక లేచినది కాదు.

కమల సావధానముతో నీ రహస్య మేమి యని ఆలోచించుటకు కోరుచుండెను. ఇవి యన్నియు పిశాచములయొక్క చేష్ట లేమో యని ఆమె శంకించుచుండెను. కాని ఏదియో అజ్ఞాతశక్తి ఆమెను ముందునకే తీసికొని పోవుచుండెను. ఇచ్ఛాశక్తి మనస్సును వదలి ఈ రహస్యము వెనుకనే పరుగెత్తుచున్నట్లుండెను.

కమల తిరిగి బయలుదేరెను. ఇప్పు డామె పట్టణమునకు దగ్గరగా వచ్చెను. స్వామి ఒక చిన్న కుటీరములోనికి వెళ్లిపోయినట్లును, వృక్ష సమూహము మాయమైనట్లును ఆమెకు కనబడెను. ఇదియే ఆయన కుటీరమని కమల తలచెను. తాను స్వామిని కలిసికొనగలననియు, ఆయనవలన నీ రహస్య మంతయు తెలియగలదనియు ఆమెకు ధైర్యము కలిగెను. కమల కుటీరద్వారమువద్దకు పోయి, "స్వామీ! నేను కమలను" అని మెల్లగా ననెను.

ఆ కుటీరము రామానందస్వామిదే. కాని ఆయన లోపల నిద్రించు

చుండెను. కనుక కమల మాట కేమియు ప్రత్యుత్తరము రాలేదు. కమల సాహసించి లోపలకు తొంగిచూచెను. అగ్నిహోత్రము మండు చుండెను. రామానందస్వామి కంబళి కప్పుకొని నిద్రించుచుండెను. "ఈయన ఇప్పుడే కదా కుటీరములోనికి పోయిరి. ఇంత త్వరలో నెట్లు నిద్రపట్టినది? లాంతరేమైనది?" అని ఆశ్చర్యపడుచు "స్వామి!" యని మరియొకసారి గట్టిగా పిలచెను.

రామానందస్వామి నిద్రనుండి మేల్కాంచి లేచి కూర్చొని కమలవై పాశ్చర్యముతో జూడసాగెను. అత డక్షణ మొక నిముషము ధ్యాన ముతో జూచి "ఎవరు వారు కమలా?" యని ప్రశ్నించెను.

కమ—ఔను. స్వామీ నేనే.

రా-స్వా—నే నిప్పు డిప్పుడే నిన్ను కలలో జూచినాను.

కమ—(ఆశ్చర్యముతో) మీరు రిప్పు డిప్పుడే కదా కుటీరములోనికి వెళ్లిరి?

రా-స్వా—లేదు. నేను కుటీరములో పరుండి చాలసేపైనది. నే నింతకుముం దెక్కడకును వెళ్లలేదు. కలలో మాత్రము నిన్ను జూచినాను.

కమ—నేనిప్పుడే కదా నదియొడ్డునుండి మీవెనుకవెనుక వచ్చినాను. మీరింతవరకు లాంతరు పట్టుకొని నాముందునే కదా నడచినారు?

రా-స్వా—(చిరునవ్వుతో) నువ్వు చాల మోసపోయినావు.

కమ—మోసమైన నేను వినని చూడని ఈ స్థలమున కెట్లు రా గలుగుదును? నేను నదియొడ్డున కూర్చొని ఎట్లు ముక్తిని పొందగలు గుదునా యని ఆలోచించుచు, నన్ను దయజూచి రక్షింపుమని దేవుని ప్రార్థించుచుంటిని. ఇంతలో మీరు రక్కడకు వచ్చి నాకు సేవాధర్మ మును ఉపదేశించితిరి. ఇంకను మి మ్మెన్నియో సంగతుల నడుగవలె నని అనుకొనుచుండగా మీరు రకస్మాత్తుగ మాయమైరి. కాని ఒక్క-

క్షణమైన తరువాత మీరు లాంతరును పట్టుకొని దూరముగా నగు పడిరి. అప్పుడు నేను మీవెంట బడితిని. ఈ రహస్య మేమో నాకు బోధపడుటలేదు. దయచేసి దీని యర్థ మేమో శెలవీయుడు.

రా-స్వా—అలాగే ఐ ఉండవచ్చును. కాని దాని యర్థము నీ కిప్పుడు బోధపడదు.

కమ—ఏదేవత యైనను మీ వేషమును ధరించి నన్ను మీ ఆశ్ర మమునకు చేర్చినదేమో?

రా. స్వా—అదికూడనసంభవమే. నీవు చెప్పినదంతయు నేను కలలో జూచితిని. నీకప్పుడు నేవాధర్మమునుకూడ నుపదేశించితిని. కమలా! నీవు నన్ను బాగుగ నెరుగుదువు. నావలన నీవు చాల దుఃఖముల ననుభవించితివి. చాల కష్టములను సహించితివి. నేనెంత నీచుడనో, ఎంత అధముడనో నీవెరుగుదువు. నా నీచత్వమును తలచుకొన్న నాకే మిక్కిలి దుఃఖము కలుగుచుండును. నీవాదరింపబడుటకు తగినదాన వైనను నిన్ను నేను తిరస్కరించితిని. ఇదియే మన దురవస్థలయొక్కయు, దుఃఖములయొక్కయు మూలకారణము. మన దేశ స్త్రీలు గౌరవింప బడుకాలము దైవ మెన్నడు దయచేయునో? మన స్త్రీలు మాసి చినిగినబట్టలను కట్టుకొనుచు నగలునాణెములులేక, ఒకపూట పస్టి డన్నమును తినియైనను కొంపలోపడియుండి, ఇంటిచాకిరీనంతను జేయుచు, కష్టములనన్నియు సహించుచుకూడ నానందముతో జీవిత మును గడపగలరు. కేవలము ప్రేమాదరములే వారికున్నచాలు. అట్టి ప్రేమాదరములు లేనియెడల రాజాంతఃపురములందు నివశించు చున్నను సౌఖ్యముగా నుండజాలరు. అజ్ఞానము, విద్యావిహీనత, యను అంధకారములలోపడియుంటిని. ముక్తిపొందుసాధనములేవియు నావద్దలేకుండెను. జ్ఞానములేదు. విద్యలేదు. భక్తిలేదు. పనిచేయు సామర్థ్యములేదు. కనుక నేను నాబందుగులకు సేవజేయుటకు నిశ్చ

యించుకొంటిని. ఈ మార్గమే నాకన్నిటికంటె సులభముగా కనబడినది. అప్పటినుండి నా శక్త్యానుసారము ఈమార్గమునే అనుసరించుచున్నాను. ఆత్మోద్ధరణయొక్క మార్గమునందు నామాంతరములే భేదములని అనుభవమువలన నాకిప్పుడు బోధపడినది. ఈ మార్గమునుసరించుటవలన నామనస్సున కిప్పుడు శాంతి కలుగుచున్నది. అందువలన నీమార్గమే అన్నిటికంటె ఉత్తమమైనదని నీకుకూడ నుపదేశించుచున్నాను. నేను నిన్ను విధవాశ్రమమునందు జూచితిని. మోహనరావింటియందు జూచితిని. నీవప్పుడు సేవావ్రతమునందు మగ్నురాలవైయుంటివి. నేను నీకొరకు దీనినిగురించి యేదేవుని నెల్లప్పుడును ప్రార్థించుచుంటిని. నీహృదయమునందు దయయున్నది. ప్రేమయున్నది. సహానుభూతియున్నది. ఇవియే సేవాధర్మముయొక్క ముఖ్యసాధనములు. సేవాద్వారము నీకొరకు తెరువబడియే యున్నది. అది నిన్ను తనవైపునకు పిలచుచున్నది. దానియందు ప్రవేశింపుము. దైవము నీకెల్లప్పుడును తోడ్పడుగాక."

కమలకు రామానందుని ముఖమునందు విమలజ్యోతియొక్క ప్రకాశ మగుపడుచుండెను. ఆమె యంతఃకరణయందాతనియెడల అద్భుతమైన శ్రద్ధాభక్తులుదయించెను. ఆమె తనలో "వీరి యాత్మయందెంత దయాప్రేమలున్నవి ! అయ్యో నేనిటువంటి నరరత్నమును నాబుద్ధిహీనతవలన తిరస్కరించితిని. వీరిసేవజేయుచుండిన నాజీవితము సఫలతనొందగలదు." అని యనుకొనుచు రామానందస్వామితో మహానుభావా ! మీరు నాకు దైవస్వరూపులు. మీవలననే నేను ముక్తిని పొందగలుగుదును. గనుకనాశరీరమును, ఆత్మను మీసేవయందే యర్పించుచున్నాను. ఈ ప్రతిజ్ఞ నేనే నొకసారి చేసియుంటిని. కాని అజ్ఞానవశమున నేను దానిని పాలించలేకపోతిని. ఆ ప్రతిజ్ఞ నాహృదయమునుండిపోలేదు. ఈ దినమున నిజమైన మనస్సుతోనే నీప్రతిజ్ఞను

తిరిగిచేయుచున్నాను. మీరు నాపాణిగ్రహణమునుజేసితిరి. కనుక నేను పతితురాలనైనప్పటికిని ఉదారస్వభావులగు మీరు నాకు తుమాదాన మును దయచేయుడు. నన్ను సన్మార్గమునకు తీసికొనిపొండు."

రామానందస్వామి కిప్పుడు కమల ముఖమునందు ప్రేమపవిత్రతల యొక్క తేజము కనబడుచుండెను. అది జూచి ఆతడు వ్యాకులు డయ్యెను. సంవత్సరములతరుబడిని ఆతడణచియుంచినభావములు జాగ్రతములుకాజొచ్చెను. సౌఖ్యానందములయొక్క నవీనభావము లుత్పన్నముకాసాగెను. ఆతనికి తన జీవితము సుష్కముగను, సారహీ నముగను, ఆనందరహితముగనుదోచెను. ఈ కల్పనలవలన నాతడు భీతుడయ్యెను. తన మనస్సునందేభావములు నిలిచిపోయిన తన వైరాగ్యము, నియమనిష్టలు, సేవావ్రతము ఈ ప్రవాహమునందు తృణప్రాయములుగ కొట్టుకొనిపోగలవని యాతనికి భయముకలిగెను.

రా. స్వా—ఇక్కడ ఒక అనాథాలయము స్థాపింపబడియున్నదని నీవెరుగుదువా ?

కమ—ఆఁ. దానినిగురించి కొంచెము వినియుంటిని.

రా. స్వా—ఈ అనాథాలయమునందు చాలవరకు వేశ్యలు మాకు వప్పజెప్పిన బాలికలే యుందురు. అక్కడ నిప్పుడు రమారమి యాబదిమంది కన్యకలుగలరు.

కమ—ఇదియంతయు మీ యుపదేశముయొక్క ఫలమే.

రా. సా—కాదదికాదు. దీని శ్రేయమునకు ముఖ్యులు వకీలు కృష్ణశర్మగారే. నేను కేవలమా యన సేవకుడను. ఈ అనాథాల యమున కిప్పుడొక పవిత్ర వంతురాలైన యువతి ఆవశ్యకమైయున్నది నీవే దానికి తగినదానవు. నేను చాల వెతకితిని కాని ఈ పనిని సేవా ప్రేమ భావములతో నెరవేర్చుచు, బాలికలను కన్న తల్లివలె సం రక్షించి, తన ప్రేమవలన ఇంతమంది బాలికలయొక్క మాతృ స్థాన

మును పూ ర్తి చేయగల యువతి నా కెక్కడను కనబడలేదు. వారికి వ్యాధులు వచ్చిన సంరక్షణ చేయవలెను. వారి మల మూత్రములకు చిడుము చీడలకు అసహ్య పడకూడదు. తన నడవడివలన వారి యందు పవిత్ర భావముల నుదయింపజేసి, వారి జీవితములు సుఖ ప్రదములగునట్లు జేయనలెను. ప్రేమ లేనియెడల నీ యుద్దేశములు పూ ర్తి కావులవు. ఈశ్వరుడు నీకు జ్ఞాన వివేకములను దయచేసినాడు. నీ హృదయమునందు, దయా శాంత ధర్మము లున్నవి. కనుక నీవే ఈ కర్తవ్య భారమును వహింపగలవు. నా ప్రార్థన నంగీకరింపవా?

కమల కండ్లు అశ్రు పూరితములయ్యెను. తన విషయమై, ఒక జ్ఞాన వంతుడైన మహాత్ముని కిట్టి మంచి యుద్దేశము కలదని తెలిసి కొని ఆమె హృదయము అనంద పరవశమయ్యెను. తానింత విశ్వాస పాత్రురాలగుదు ననియు, నిటువంటి మహా సేవ జేయు గౌరవము తనకు ప్రాప్తించుననియు, ఆమె స్వప్నము నందైనను దలచ లేదు. దైవమే రామానందస్వామి నిట్లు ప్రేరేపించెనని యామె భావించెను. ఇంతకు పూర్వమామె, పిల్లలు మట్టిలోదొర్లి ఒడలు కుళ్ళుచేసికొనిన, అస హ్యించుకొనుచుండెడిది. కాని రామానంద స్వామి ఆమెపై విశ్వా సముజూపి, ఆమె అసహ్యమును జయించెను. ఆమెయందు ప్రేమ భావ ముదయమయ్యెను. మనము మన యందు విశ్వాస ముంచువారిని నిరాశ పరచుట కిష్టపడక, అసాధ్యమని తలచిన ఇటువంటి మహా భారములనుకూడ వహించుటకు సిద్ధపడుదుము. విశ్వాసము వలననే విశ్వాసము వృద్ధి పొందును. కమల అత్యంత వినయ భావముతో "మీరు నన్నింత యోగ్యురాలినిగ భావించుట మహాభాగ్యము. ఒకరి సేవజేయ గలుగుటయే, ఒకరియవసరములను దీర్చగలుగుటయే, నా పరమ ధర్మమని నేనిప్పుడు భావించుచున్నాను. మీరు సెలవిచ్చిన అధర్మములను నేను జేరజాలక పోవుదునేమో కాని నాశక్తి వంచన

లేక మీయాజ్ఞను పరిపాలించెదను." ఇట్లు చెప్పుచు కమల నిస్తబ్ధురాలయ్యెను. ఆమె తలను వంచుకొనెను. కండ్లవెంట జొట జొట నీరు కారజొచ్చెను. ఆమె నోటినుండి చెప్పజాలని మాటలామె ముఖ భావములవలన ప్రకటితములగు చుండెను.

"మీరు నాపై నింత విశ్వాసముంచుట మీ యనుగ్రహమే, నావంటి నీచురాలెక్కడ? ఇటువంటి మహాపదవి యెక్కడ? కాని భగవంతుడు దయదలచిన, మీ విశ్వాసమునకు పశ్చాత్తాప పడవలసిన అవసరముండదు." అని చెప్పునట్లుండెను.

రా-స్వా——నాకు నీయందిట్టి యాశయున్నది. దైవము నీకు శుభమును చేకూర్చుగాక.

ఇట్లు చెప్పుచు రామానందస్వామి లేచి నిలువబడెను. అప్పుడే అరుణోదయ మగుచుండెను. పక్షుల కలకల రావములు మనోహరముగ వినబడుచుండెను. ఆతడు కమండలమును దీసికొని నదిలో స్నానము చేయుటకు వెడలిపోయెను.

మనము నిద్రనుండి మేల్కాంచి జూచునట్లు కమల కుటీరము బయటికి వచ్చిజూచెను. సమయమెంత సుఖప్రదముగను, ఎంత శాంతిమయముగను, ఎంత ఉత్సాహ పూర్ణముగను నున్నది? ఆమెభవిష్యత్తు కూడ నిట్లే యుండునా! ఆమె భవిష్యత్ జీవితమునొక్క ప్రభాతము కూడనగునా? దానియందు కూడ నిటువంటి యుషఃకాంతులు ప్రకాశించునా? ఆ జీవితము నందెన్నడైనను సూర్యుడు ప్రకాశించునా? ఆఁ ప్రకాశించును. ఈ సుఖప్రదమైన, శాంతిమయమైన ప్రభాతము ఆ రాబోవు దిన రూపమైన జీవితమునొక్క ప్రభాతమే.

ఒక సంవత్సరము గడచెను. మోహానుడింటికి వచ్చినతోడనే తానొక్కదినమైన నక్కడ నాగక తీర్థయాత్రకు బయలుదేరవలెనని మొదట గోపాలశాస్త్రి స్థిరపరచుకొనెను. కాని మోహాను డింటికి వచ్చినతరువాత మరచియైనను ఆతడు తీర్థయాత్రల ఊబుసెత్తుట మానివేసెను. ఆతడెల్లప్పుడును మనుమని వడిలో కూర్చుండబెట్టుకొని ఇరుతులతో మాటలాడుచు, వ్యవహారములను జూచుకొనుచుండెను. ఇట్లాతడు తిరిగి సంసారమోహములో మునిగిపోయెను. జానికమ్మ ఇప్పుడే తాపత్రయమును లేక నిశ్చింతగా నుండెను. సంసారభారమంతయు సుశీల వహించి జరపుచుండెను. జానికమ్మ మనుమని చంకబెట్టుకొని ఇరుగు పొరుగిండ్లకు పోయి పెత్తనములు జేయుచు, సౌఖ్యముగ కాలమును గడుపుచుండెను.

కృష్ణశర్మ వకీలువృత్తిని మానివేసెను. పురపాలకసంఘమున కిప్పుడు ఆయనయే అధ్యక్షుడు. ఈ పనియందాయనకు మిక్కిలి అభిరుచికలదు. ఆతడు చాలకష్టపడి పట్టణమును అభివృద్ధిలోనికి దెచ్చుచుండెను. ఒక సంవత్సరములో నెన్నియో క్రొత్తరోడ్లను వేయించెను. పట్టణమధ్య స్థలములందు రెండుమూడు అందమైన పార్కులను గట్టించెను. కుళ్ళునీళ్ళుపోవు కాలువలనన్నిటిని బాగుగ మరమ్మత్తుచేయించెను. మార్గస్థులకొక ధర్మశాలను కట్టించవలెనని ఇప్పుడు ప్రయత్నించుచుండెను. శర్మకిప్పుడు పూర్వపుమిత్రులు శత్రువులైరి. పూర్వపు శత్రువులు మిత్రులైరి. కాని నారాయణదాసు యందు మాత్రమాతనికి శ్రద్ధాభక్తులు దినదినాభివృద్ధి నొందుచుండెను. దాసునకు పురపాలకసంఘము నందొక ఉద్యోగమిప్పించవలెనని ఆతనికి చాలకోరికగా

నుండెను. కాని దాసండుల కొప్పుకొనలేదు. స్వార్థరహితముగ సేవ చేయవలెనని తాను చేసికొనిన ప్రతిజ్ఞకు తప్పిపోవుట కాతడిష్టపడకుం డెను. విడిగా నున్నప్పుడు చేయగలిగినంతసేవ ఉద్యోగములోనుండి చేయజాలమని ఆతనియుద్దేశ్యము. ఆతడు నిర్వహించుచున్న వితంతు శరణాలయ మిప్పుడు చాలవృద్ధిలో నున్నది. పురపాలకసంఘమువారు దానికి చాలసహాయమును జేయుచుండిరి. వ్యవసాయదారుల సహా యార్థమాత డొక సహకారసంఘమును స్థాపించుటకు ప్రయత్నించు చుండెను. విత్తనములను, సొమ్మును నామమాత్రపు వడ్డీతో బదు లిచ్చిన, వారు వృద్ధిపొంది, తద్వారా దేశము బాగుపడగలదని యాతని ఉద్దేశ్యము. ఈ కార్యమునందు నారాయణదాసునకు మోహనరావు కుడిభుజమువలె నుండెను.


మోహనరావునకు విష్ణువర్ధనములో నుండుట చాలచీదరగా నుం డెను. ఆతడు సుశీలను మొమారుని తల్లిదండ్రుల వద్దనుంచి తాను కళ్యాణపురములో గోదావరియొడ్డున ఉన్న ఇంటియందుండి పడవల వ్యాపారమును వృద్ధిపొందించు చుండెను. ఆతడు తరచుగ వారమున కొకసారియైనను విష్ణువర్ధన గ్రామమునకు వెళ్ళుచుండును. ఇప్పుడాతనికీ వ్యాపారమునందు నెలకు వందలకొలది లాభము వచ్చుచుండెను. ఆత డిప్పుడొక స్త్రీమరునుకూడ కొనవలెనని ఆలోచించు చుండెను.

రామానందస్వామి ఇప్పుడు తరుచుగా గ్రామములయందే నివ శించుచుండెను. నిరుపేదలగు కన్యలను రక్షించుటయందే యాతడు తనజీవితము నంతను అర్పించివేసెను. పట్టణమునకు వచ్చినను ఆత డక్కడ రెండుమూడు దినములకన్నను ఎక్కువ యుండుటలేదు.

అది కార్తికమాసమగుట వలన కృష్ణశర్మయు, సుభద్రమ్మయు గోదావరిస్నానమునకు వెళ్లిరి. వారు తిరిగివచ్చునప్పుడు కృష్ణాపు రము వైపుబండిని తోలించిరి. సుభద్రమ్మ కిటికీలోనుండి పైకితొంగి

చూచుచు నీనిశ్శబ్దమైన స్థలము నందీవేశ్య లెట్లు నివసించుచున్నారో యనియు, వీరికెట్లుబుసుపోవుచున్నదో యనియు యోచించుచుండెను.

ఇంతలో ఆమెకొక అందమైన భవనము కనబడెను. దాని ముఖద్వారమునందు పెద్ద పెద్ద అక్షరములతో నిట్లు వ్రాయబడియుండెను.



"ఇదియే నాకమలాబాయి సేవాశ్రమము?" అని సుభద్రమ్మ కృష్ణశర్మ నడిగెను. శర్మయుపేక్షతో ఆఁ అని జవాబుచెప్పెను. ఈ వైపెందుకు వచ్చితిమా యని యాతఁడు పశ్చాత్తాపపడుచు తనలో, ఈమె ఆశ్రమమును చూడకమానదు. నన్నుకూడ తనతో రమ్మని బలవంతము పెట్టు. ఇప్పుడు చాల చిక్కువచ్చినదే" యని అనుకొనుచుండెను. శర్మ ఇంతవర కొక్కసారియైనను ఆశ్రమమునకు వెళ్లియుండలేదు. రామానందస్వామి ఆతని నక్కడకు తీసుకొని వెళ్ళవలెనని ఎన్నియోసార్లు ప్రయత్నించెను. కాని శర్మ ఎప్పటికప్పుడు ఏదోయొక వంకజెప్పి తప్పించుకొనుచుండెను. ఆతడు ఏపనినైనను జేయగలుగుచుండెనుగాని కమలయెదుట మాత్రము పడజాలకుండెను. ఆమె పార్కునందు హారము నిచ్చుచు ఆడిన మాటలాయన కెన్నటికిని మరపునకు రాకుండెను. ఇంత సాధ్వీమతల్లియుఁ సచ్చరిత్రురాలును అగు స్త్రీ కేవలము లోకులేమను కొందురో యను తన పిరికితనమువలన పతితురాలైనదనియు, ఆమె ఈ నరకకూపములో పడుటకు తానే కారకుడననియు, ఆతడెప్పుడును విచారించుచుండెను.

సుభ—ఒక్కసారి బండి నాపించండి. నాకాశ్రమమును జూడవలె ననియున్నది.

కృష్ణ—ఇప్పుడు చాల ప్రొద్దెక్కినది. కనుక మరియొకసారివచ్చి చూడవచ్చును.

సుభ—ఇప్పటికిది స్థాపించి సంవత్సరమైనది. ఇంతవరకు ఒక్కసారి యైననువచ్చి చూడలేకపోతిమి. ఇప్పుడు కాకపోయిన తిరిగి మనకెన్ని రోజులకు తీరుబడియగునో?

కృష్ణ—మరియొకసారి నువ్వు ఒక్కరితేవు వచ్చి చూడరాదా? నిన్నడ్డుపెట్టువారెవ్వరు? ఇదివరకు నువ్వే రాలేదు.

సుభ—బాగానే ఉన్నది. సరే ఇదివరకు రాలేకపోయాము కనుక రాలేదు. ఇప్పుడేలాగో వచ్చినాము కనుక ఎందుకు వెళ్ళకూడదు?

కృష్ణ—వెళ్ళుటకు నా కేమియు అభ్యంతరములేదు. కాని ప్రొద్దెక్కపోవుననియే నా భయము. ఇప్పటికే తొమ్మిదిగంటలవేళ దాటిపోయినది.

సుభ—ఇక్కడెందుకు ఆలస్యమగును? పదినిముషలలో చూచి వచ్చివేయుదము.

కృష్ణ—నీకు పట్టుబట్టుట చాల పాడలవాటు. నా కాలస్యమయిపోవునని ఎంతచెప్పినను వినవు.

సుభ—ఫరవాలేదు. త్వరగా కారుమీద యింటికివెళ్లి పోవచ్చును.

కృష్ణ—ఐతేసరే. నువ్వు వెళ్ళు. సాయంత్రములోగా నీ యిష్టము వచ్చినప్పుడు రావచ్చును. నేను త్రోవలో అద్దెబండిని చేయించుకొని వెళ్లిపోదెదను.

సుభ—అద్దెబండి చేయించుకొని వెళ్లడమెందుకు? మీకు లోపలకు వచ్చుటకు ఇష్టము లేకపోయిన కారులోనే కూర్చొనుడు. నేను

నిముషములో ఆశ్రమమును జూచి వచ్చివేయుదును.

కృష్ణ—(కారుదిగి) నేను వెళ్ళిపోవుచున్నాను. నీ ఇష్టమువచ్చినప్పుడురా.

ఈ విధముగ కృష్ణశర్మ వంకలుజెప్పి తప్పించుకొనుటకు కారణమును సుభద్రమ్మ గ్రహించెను. ఆమె పత్రికలయందు సేవాశ్రమమును గురించిన ప్రశంసలను ఎన్నియోసార్లు చదివియుండెను. ప్రభాకరరావునకు సేవాశ్రమము నందిప్పుడు పరిపూర్ణానురాగము కలిగినది. సుభద్రమ్మ ఆశ్రమప్రఖ్యాతిని పత్రికలలో చదువుచుండుట వలనను, పైగా వినుచుండుట వలనను, ఆమెకు దానియందు ప్రేమయు కమలయందు గౌరవమును కలిగెను. ఈ యవస్థయందు కమలను జూచుటకామె మిక్కిలి కుతూహలపడుచుండెను. కమల పతితురాలైనప్పటికిని తిరిగి జ్ఞానవంతురాలయి, మానవసేన జేయుచు, పత్రికలచే కొనియాడబడుచు, ఉండుటవిని యామెకు మిక్కిలి యాశ్చర్యము కలుగుచుండెను. తనభర్తను బాగుగ ముదలకింపవలెనని సుభద్రమ్మకు బుద్ధి పుట్టెనుగాని, మోటారు తోలువాడు దగ్గర నిలువబడి యుండుటవలన ఏమియు అనలేక పోయెను.

ఆమె కారుదిగి ఆశ్రమద్వారములోనికి వెళ్ళుసరికి ఒకస్త్రీ లోపలకు వెళ్లి, ఆమె వచ్చుచున్నట్లు కమలతో జెప్పెను. వెంటనే కమల ఆమెను ఎదురుకొనుటకు వచ్చెను. నగలేమియులేక, తెల్లనిబట్టను కట్టుకొని యోగినివలె నున్న కమలనుజూచి సుభద్రమ్మ చాల ఆశ్చర్యపడెను. ఆమెయందు మునుపటి కోమలత్వములేదు. చపలత్వము లేదు. ముఖమునందా చిరునవ్వులేదు. రూపలావణ్యములకు బదులు పవిత్రత యామె ముఖమునందు వెలుగుచుండెను. కమల సుభద్రమ్మకు నమస్కరించి కన్నీళ్ళు కార్చుచు, "మీరిక్కడకు దయచేయుట మాసౌభాగ్యము" అని మెల్లగా ననెను. సుభద్రమ్మ కండ్లుకూడ నీళ్ళతో

నిండిపోయెను. ఆమె కమలను కౌగలించుకొని గద్గదస్వరముతో "సోదరీ! నే నెన్నిరోజులనుండియో ఇక్కడకు రావలెనని అభిలాష పడుచుంటిని. కాని తీరుబడిలేకను, అశ్రద్ధవలనను, ఇంతవరకు ఆలస్యమైనది." అని అనెను.

కమ—కృష్ణశర్మగారు కూడ వచ్చిరా? లేక మీరొక్కరే వచ్చితిరా?

సుభ—ఆయన నాతోకూడనే వచ్చిరి. కాని ఆలస్యమగుటవలన మరియొక బండిమీద నింటికి వెళ్ళిపోయిరి.

కమ—(విచారముతో) ఆలస్యమేమిటి? ఇక్కడకు వచ్చుటకాయన కిష్టములేదు కాబోలు? ఇదియంతయు నాదురదృష్టము. ఆయనయే ఈ యాశ్రమస్థాపకులై యుండియు, నా నలన ఆయన కాశ్రమమున్పై నింత అసహ్యము కలుగుట నాకు చాలదుఃఖముగా నున్నది. మీ రిద్దరుకలసి, ఇక్కడకు వచ్చుటయే నా ముఖ్యాభిలాషగా నుండెను. ఈ రోజున ఆ యభిలాష సగముపూర్తియైనది. మిగిలినదికూడ నెప్పుడో యొకప్పుడు పూర్తికావచ్చును. అదియే నా ఉద్ధారణదినముకాగలదు.

తరువాత కమల సుభద్రమ్మకు ఆశ్రమమును జూపుట ప్రారంభించెను. ఆ భవనమునందు ఐదుపెద్దగదులు కలవు. మొదటిగదియందు సుమారు ముప్పదిమంది బాలికలు, పాఠములను చదువుకొనుచుండిరి. వారివయస్సు పండ్రెండునుండి పదియేను సంవత్సరముల వరకు నుండెను. సుభద్రమ్మను జూచిన తోడనే ఉపాధ్యాయురాలు లేచి, ఆమెకు నమస్కరించెను. అప్పుడు కమల వారిద్దరకు పరిచయమును కలిగించెను. ఆ యువతి బారిష్టర్ సివరామ్‌గారి సతీమణి యని తెలియగనె సుభద్రమ్మకు చాల, ఆశ్చర్యముకలిగెను. బారిష్టరుగారి భార్య ప్రతిదినమును రెండుగంటలు ఆశ్రమములోని బాలికలకు చదువు చెప్పుచుండును.

రెండవతరగతి యందుకూడ నంతమంది బాలికలే యుండిరి. వారి వయస్సు ఎనిమిదినుండి పండ్రెండువర కుండెను. వారిలో కొందరు బట్టలు కత్తిరించుటను నేర్చుకొనుచుండిరి. కొందరు కుట్టుచుండిరి. మరి కొందరు అల్లికపనులను, చమ్కీపనులను జేయుచుండిరి. నిక్కడ నుపాధ్యాయురాలు లేదు. ఒకముసలిదర్జీవారికి కుట్టుపనిని నేర్పుచుం డెను. కమల సుభద్రమ్మకు ఆ పిల్లలు తయారుచేసిన చొక్కాలను, జాకెట్లను, లేసులను, రకరకముల చమ్కీలను జూపించెను. మూడవ తరగతియందు ఇరువదిమంది బాలికలు ఉండిరి. వారిలో కొందరు ఐదుసంవత్సరములకు లోపువారుకూడ నుండిరి. వారిలో కొందరు బొమ్మలతో నాడుకొనుచుండిరి. కొందరు బొమ్మల పుస్తకములను జూచుకొనుచుండిరి. ఈ భాగమునకు కమలయే ఉపాధ్యాయురాలు.

అక్కడనుండి వారు తోటలోనికి వెళ్ళి పిల్లలు వేసిన పూల మొక్కలను తదితర మొక్కలను జూచుచుండిరి. కొంతమంది బాలికలు వంగమళ్ళికి కూర పాదులకును నీళ్ళు పోయుచుండిరి. వీరిని జూచి ఆ బాలికలు సొగసుగా నొక గులాబీ గుత్తిని కట్టి సుభద్రమ్మకు బహుమతిగా నిచ్చిరి.

భోజనశాలయందు కొందరు బాలికలు భోజనములను చేయు చుం డిరి. వారు తయారుచేసిన వంటకములను సుభద్రమ్మకు జూపెను. సుభద్రమ్మ కిక్కడ ఏర్పాటులను, శాంతి మయ జీవనమును, కన్యకల యొక్క శీల స్వభావమును జూచిన మిక్కిలి యానందము కలిగెను. ఆమె తనలో "కమల ఇంత పెద్ద ఆశ్రమము యొక్క భారమును వహించి నడపుచుండుట జూడ ఆశ్చర్యము కలుగుచున్నది. నావంటి దాని కిది యసంభవము ఒక బాలికయైనను అపరి శుభ్రముగ గాని, విచారముగ గాని కనబడుటలేదు." అని యనుకొను చుండెను.

కమ—నేనీ భారమేమో నాపైని బెట్టుకొంటిని గాని దీనిని నిర్వ

హించు శక్తి నాయందులేదు. మహానీయులిచ్చు సలహాలే నాకాధారములు. మీకీ ఆశ్రమము నందేమైన లోపములు కనుబడిన వానిని, దయచేసి చెప్పగోరు చున్నాను. దాని వలన నాకెంతో యుపకారమగును.

సుభ—(నవ్వుచు) సోదరీ! నన్ను సిగ్గు పరచకు. నేనీ యేర్పాటులను జూచి చాల నాశ్చర్యపడు చున్నాను. నేను నీకేమిసలహా నియ్యగలను? వితంతు శరణాలయము నందలి యేర్పాటులకంటె నిక్కడి ఏర్పాటులు చాల బాగున్నవని మాత్రము చెప్పగలను.

కమ—మీరు చెప్పుటకు సంకోచించు చున్నట్లున్నది?

సుభ—లేదు. నిజముగానే జెప్పుచున్నాను. నేను వినిన దాని కంటె నీ యాశ్రమ మెన్ని యోరెట్లు వృద్ధిలో నున్నది. కాని ఒక్క సంగతి. ఈ బాలికల తల్లులు వీరిని జూచుటకు, ఎప్పుడైన నిక్కడకు వచ్చుచుందురా?

కమ—వచ్చుచుందురు కాని సాధ్యమైనంతవరకు వారి కలయిక నడ్డుపెట్టుచుందును.

సుభ—సరే వీరికి వివాహము లెట్లగును?

కమ—అది చాలకష్టము. ఈ బాలికలను సచ్చరిత్రు రాండ్రుగను మంచి గృహిణు లగుటకు యోగ్యులుగను, స్వతంత్రముగ జీవించుట కర్హు రాండ్రుగను జేయుట మన కర్తవ్యముకాని వీరిని సంఘ మాదరించునో యాదరింపదో ఆ సంగతిని మాత్రము చెప్పజాలను.

సుధ—బారిష్టరు గారి భార్యకీ పనియందు చాల యభిలాష కాబోలు?

కమ—ఆశ్రమాభి వృద్ధికి ముఖ్యులలో నామె యొకతె యని చెప్పవచ్చు. సాధారణముగ నేనామె సలహాల ననుసరించియే పని చేయుచుందును.

సుభ——నాకేమియు చేతకాదు. లేనియెడల నేను కూడ నేదో విధముగ నీయాశ్రమమునకు సాయము జేసియుందును.

కమ——అనగా అనగా ఇన్నిరోజులకు తమ రిక్కడకు వచ్చినారు. అదియైనను శర్మగారి యనమ్మతిపైననే. ఆయన ఇక్కడకు వచ్చు వరకు నే నొప్పుకొనను.

సుభ——లేదులేదు. ఈ యాదివారమునాడు, ఆయనను బలవంత ముగానైనను నిచ్చటకు తీసికొని వచ్చెదను. సరే నేనుకూడ ప్రతి దినము నిక్కడకు వచ్చి బాలికలకు వంటవండుట, అందముగా పూల దండలు కట్టుట, జాజి బద్దలతో బుట్టలల్లుట మొదలైన పనులను నేర్పెదను.

కమ——(నవ్వుచు) ఈ పనులయందు మీరెంతమంది బాలికలను మీకంటె నిపుణురాండ్రుగ జేయగలరో ఇంతలో మంచి దుస్తులను ధరించిన పదిమంది బాలికలు సుభద్రమ్మకెదురుగ నిలువబడి, చేతులు జోడించి మధుర స్వరముతో నిట్లు పాడిరి.

పరమేశ్వరా! పరమపురుష! భక్తవత్సల!
కరుణజూపి! మమ్ముకృపను! గావు మీశ్వరా॥పర॥
మాదు పాపములను బాపి! మమ్ముగావుమా!
నీదు సుతుల ప్రేమజూపి చేరదీయుమా ॥పర॥
శాంతిభక్తితోడ మమ్ము వర్ధిలం జేయుమా
సేవయందు మాకు ప్రీతి వృద్ధిజేయుమా ॥పర॥

సుభద్రమ్మ ఆపాటను విని మిక్కిలి ఆనందించి బాలికల కెదురూ పాయలను బహుమతిగా నిచ్చెను. ఆమె ఇంటికి వెళ్ళిపోవుదునని చెప్పగా కమల దీన స్వరముతో నేనీ యాదివారమున మీరొర కెదు రుచూచు చుందును.

సుభ——మేము తప్పక ఈ ఆదివారము వచ్చెదము.

కమ—సుశీలా పిల్లవాడు క్షేమముగా నున్నారా!

సుభ—ఈ రోజుననే ఉత్తరము వచ్చినది. అందరు క్షేమముగాను న్నారు. మోహనరా వికృడకొక సారియైనను రాలేదా?

కమ—లేదు. కాని నెలకు రెండు రూపాయిల చందాను మా త్రము పంపుచున్నారు.

సుభ—కమలా! నీ వుండుము. చాల వేళయైనది. నేను వెళ్ళి వచ్చెదను.

కమ—మీరు దయచేయుటవలన నేను కృతార్థురాలనైతిని.

సుభ—ఆశ్రమ సందర్శనమువలన నేను పవిత్రురాలనైతిని. నీ ప్రేమ, భక్తి, కార్యకుశలత ఎంత వినుతించినను చాలదు. నిజముగ నీవు స్త్రీ సమాజమునకు అలంకారమువంటి దానవు.

కమ—(కన్నీటితో) నన్ను నేను మీ పూర్వపు దాసినిగానే భా వించుకొను చున్నాను. నేను జీవించి యున్నంతకాలము మీ శ్రేయ మునె కోరుచుందును. కులిగి పోవుచున్న నన్నుమీరే రక్షించిరి. దైవమెల్లప్పుడును మీకు కళ్యాణ మొనగూర్చుగాక యని ప్రార్థించు చుందును.

సంపూర్ణము